దూర తీరాలలో...

అశ్వినీకుమార్





వల్లభనేని అశ్వినికుమార్

ఒకప్పటి వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఈస్ట్ టవర్ పైన -
వెనుక ఈస్ట్ రివర్ - మన్‌హట్టన్.
న్యూయార్కు మహానగరం.



దూరతీరాలలో...

యాత్రా కథనాలు...



వల్లభనేని అశ్వినీకుమార్

దూరతీరాలలో...

Ugaadi: 2021

Cover Design: **V.A.K.**
4th Cover photo shot by Jaya

Copies : **1000**

Price : ₹ **199/-**

AK PublicationS
Cell : 939-343-6969

For Copies :
Misimi Monthly Office
at Kala Jyothi Process Private Limited,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
HYDERABAD-500020.
Ph : 040 - 27645536, 994 951 6567.

Printed at :
Mudrika Quality Offset Printers
H.No. 26-13-64/A, Sanyasi Raju Street,
Gandhinagar, Vijayawada - 520 003.
Ph : 944 015 9456.

ఆహ్లాద యాత్రల అపూర్వ కథనం

ఇంకొక్క ఇరవై రోజులలో వేసవి సెలవలు రాబోతున్నాయన్న సంతోషం ఒకప్రక్క తన్నుకు వస్తుంటే, మరోవైపు ఈసారి వేసవి సెలవలు విదేశీ పర్యటనలో గడపబోతున్నామంటూ యాత్రాప్రియులైన నా జీవిత భాగస్వామి మూర్తిగారు నాలో కొత్త ఆశలు చిగురింపచేసి, విదేశీ పర్యటనకై ప్రణాళికలు సిద్ధం చేస్తున్న తరుణమది. ఇంతలోనే ఆనంద నందనంలోకి ఆశించని అంధకారంలా భారతదేశంలోకి రంగప్రవేశం చేసిన కరోనా మహమ్మారి కారణంగా, యాత్రాప్రియులందరి ఆశలూ అడియాశలై గృహనిర్బంధానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రతికూల పరిస్థితి యొక్క అనివార్యతను అడ్డగించనూలేక, అంగీకరించనూ లేక సతమతమవుతున్న తరుణంలో 'చిమ్మ చీకటిలో చిరుదివ్వె'మాదిరిగా యాదృచ్ఛికంగా నాకు విభిన్న దేశాలలో విహరించిన అనుభూతిని సొంతం చేసుకునే అవకాశం, ఆ సుదూర తీరాల సౌందర్య రసానందం పొందే అదృష్టం లభించాయంటే అతిశయోక్తి కానేరదు. ఇదేమిటి ఈకఠినమైన లాక్‌డౌన్‌లో, ఏరకమైన రవాణా సాధనాలూ లేని సమయంలో ఇదెలా సాధ్యం అయ్యింది అని ఆశ్చర్య పోతున్నారా? అది ఎలా జరిగిందో, ఆ వైనం చెప్పటానికే ఉపక్రమిస్తున్నాను–

కరోనా భయంతో ఇహ చేసేది ఏమీ లేక, పనిమనిషికి దీర్ఘ సెలవు ప్రకటించి, నీరుగారిన హృదయంతో నీరసించిన ఉత్సాహంతో యాంత్రికంగా గృహ పారిశుధ్యం చేస్తుంటే, పుస్తకాల రాక్‌లో నుంచి హఠాత్తుగా జారిపడింది 'దూర తీరాలలో..' అన్న పుస్తకం. శీర్షిక ఆకర్షణీయంగా ఉండటంతో లోపలి పుటలలో ఏమున్నదో తెలుసుకోవాలన్న కుతూహలం బయలుదేరింది. కొద్దిసేపటి కోసం కరోనా వ్యాప్తికి సంబంధించిన ఆలోచనలు పక్కనపెట్టి, నీరుగారిన ఉత్సాహాన్ని నెమ్మదిగా కూడదీసుకుని, వడివడిగా పని ముగించుకుని పుస్తకం తెరిచాను. అది ప్రఖ్యాత రచయిత శ్రీ వల్లభనేని అశ్వనికుమార్ విదేశీ పర్యటనకు వెళ్ళి దాదాపుగా 30 దేశాలలోని ప్రఖ్యాత దర్శనీయ స్థలాలలో ఉల్లాసంగా విహరిస్తూ, ఘడియ ఘడియకూ తనకు అనుభూతమవుతున్న అనుభవాలను పూసగుచ్చి చెప్పిన కథనం. కథైనా, కవితైనా, వ్యాసమైనా, జీవిత గాథలైనా లేక ఇంకే సాహితీ ప్రక్రియకైనా

దానికి వైవిధ్యభరితమైన శైలిని రంగరించి పాఠక లోకానికి అందించటం రచయతకి ఉన్న ఆనవాయితీ అన్న సంగతి జగద్విదితం. అయితే ఆ ఆచారానికి ఏమాత్రం విఘాతం కలిగించకుండా, తనదైన బాణీలో తాను పర్యటించిన విభిన్న దేశాల విశేషాలకు తన భావాల రంగులద్ది, జ్ఞాన రత్నాలు పొదిగి, అనుభూతులను అక్షరబద్ధం చేసి సాహిత్య లోకానికి కానుకగా అందించారు.

తొలి మజిలీగా లండన్ చేరుకున్నాక, అక్కడి విశేషాలు ముచ్చటించే సందర్భంలో ఎక్కడా తాను రచయిత, మనం పాఠకులం అన్న భావం కలగనివ్వకుండా ప్రతి పాఠకునితోనూ ఆప్తమిత్రునిలా వ్యవహరిస్తూ ఇలా అంటారు – "ముఖ్యంగా భారతీయులకు లండన్ క్రొత్త అనిపించదు. కానీ తరచి చూసిన కొలదీ – అన్నీ వింతలే– అన్నీ విశేషాలే" అని అంటూ అంతటితో ఆపకుండా, చూద్దాం రండి అంటూ ఆత్మీయంగా సంబోధించి వారితో మమేకమై, ఇంతటి మహానగరంలో ఎలా తిరగటం? అని భయపడకండి అంటూ వారిని తన భావనా ప్రపంచంలోకి విలీనం చేసుకుని పాఠకులను కాస్తా సందర్శకులుగా మార్చేస్తారు. తన సంభాషణా నైపుణ్యంతో తనతో పాటుగా మనమూ ఆ ప్రదేశంలో విహరిస్తున్నామేమో అన్న భ్రమను కలుగజేస్తారు. అదిమాత్రమే సరిపోతుందా? ఆ లండన్ నగరపు సొగసులను ఆస్వాదించి ఆనందించే ఆకాంక్ష కలగాలంటే, మున్ముందర ఆ నగరంతో పాఠక లోకానికి ఒక భావనాత్మక సంబంధం రాగాత్మక అనుబంధం ఏర్పరచవలసిన అవసరం ఉందని భావించి ఉంటారు. అందుకై భూగోళ శాస్త్రం, చరిత్రలలో తనకు ఉన్న జ్ఞానబాహుళ్యం, అపార లోకజ్ఞతలను కూడా జోడించి లండన్ నగరపు ఘన చరిత్ర, ఆ గడ్డ మీద ఊపిరి పోసుకున్న మహనీయుల తాలూకు ఘనతను చెప్పకనే చెబుతూ వినూత్న శైలిలో విషయ ప్రవేశం చేస్తారు. ఆ ప్రస్తావనతోనే లండన్ నగరపు భౌగోళిక, చారిత్రాత్మక, సాంస్కృతిక, ఆర్థిక, రాజనైతిక వైభవం అవగతపరచి ఆ ప్రదేశం పట్ల ఆత్మీయతా భావం ఏర్పరచటంలో రచయిత సఫలీకృతులవుతారు. ఆ ప్రాంతంపట్ల మమకారం కలిగిన తరువాత దానిని దర్శించాలనుకోవటం సహజం. అలా దర్శించేవారికి గైడ్‌తో అవసరమే లేకుండా అక్కడ ప్రతి ఒక్క అంగుళం తాలూకు విశేషాలు, అక్కడి ఆచార వ్యవహారాలు, సౌకర్యాలు– అసౌకర్యాలు అక్కడి జీవన శైలి పట్ల పూర్తి అవగాహన కల్పించటం ఒక ఎత్తైతే, అలా దర్శించే అవకాశం లేనివారికి తన యాత్రావృత్తాంతాన్ని జిరాక్స్

మిషన్‌గా మలచి సంపూర్ణ లండన్నగరాన్ని అందులో పొందుపరచి ఆ ఛాయాచిత్రాలు వారి హృదయ ఫలకాల పైన ముద్రించటం మరో ఎత్తు!

నిజానికి ఆ మహా నగరంలో సౌకర్యవంతంగా తిరగాలంటే అపరిచిత సందర్శకులకు తప్పనిసరిగా ఒక ప్రణాళిక అవసరం అవుతుంది. నూతన సందర్శకులు ఆ ప్రణాళిక సిద్ధం చేసుకోవటం కోసం తలమునకలై సమయం వృథా చేసుకోకుండా అక్కడ చేరింది మొదలు ఎలా ముందుకు సాగాలో ఎటువైపుకు సాగాలో ఏఏ వసతులను ఉపయోగించుకోవచ్చో, ఎక్కడెక్కడ ఏఏ వస్తువులు ఉత్పత్తి అవుతాయో, ఏఏ స్థానాలకు ఏఏ ప్రత్యేకత ఉన్నదో, చారిత్రక నేపథ్యాలు ఏమిటో ఏది చెయ్యవచ్చో, ఏది చెయ్యరాదో పూర్తి ప్రణాళిక రచయిత కథనం ద్వారానే సిద్ధమైపోతుంది. అయితే ఇక్కడ రచయితకి పర్యటనా ప్రియత్వానికి తోడుగా సునిసిత పరిశీలనాత్మక దృష్టి ఉండటంవల్ల సాధారణ వ్యక్తుల దృష్టికి గోచరమవ్వని ఎన్నో విశేషాలను ప్రస్తావిస్తూ పాఠకులను మంత్ర ముగ్ధులను కావిస్తారు. వాస్తవానికి అక్కడ నివసించేవారికి సహితం ఆయా ప్రదేశాలపట్ల ఇంత అవగాహన ఉందో లేదో అన్న భావం జనిస్తుంది. ఆయా దేశాలలో కాలగర్భంలో కలసిపోయిన రాజులు, రచయితలు, నియంతలు, చరిత్రకారులు, దేశభక్తులు, దార్శనికులు, రాజప్రాసాదాలు, కట్టడాలు చరిత్రలు, వర్తమాన పాలకుల తాలూకు విశేషాలు అంతటితో ఆగక దీర్ఘనిద్రలో మునిగి సమాధులలో విశ్రాంతి తీసుకుంటున్నవారిని కూడా వదలకుండా పూర్తి సమాచారాన్ని కదలీపాకం చేసి అందించిన తీరు కాస్తంత అభిరుచి ఉన్న పాఠకులనెవరినైనా మానసికంగా దూరతీరాలలో విహరించేలా చేస్తుంది. అందుకు నేను కూడా మినహాయింపు కాకపోవటంతో లాక్‌డౌన్‌లో రోజుకో దేశం తిరిగిరాగలిగాను!

రచయితకు భగవత్ సృజన పట్ల ఎంత ఆసక్తి, అనురక్తి ఉన్నాయో అంతే స్థాయిలో మానవ సృజన పట్ల కూడా మక్కువ ఉండటంతో అటు సహజ ప్రకృతి అంశాలైన సెలయేళ్ళు, కొండలు గుట్టలు చెట్లు చేమల సౌజన్యాన్ని ఎంతగా అర్థం చేసుకుని సన్నుతిస్తారో, అంతే స్థాయిలో మానవ నిర్మితాలైన భవంతులు, కట్టడాల తాలూకు విశిష్టతను కూడా సౌందర్యాత్మక దృష్టితో తిలకించి, వాటి ఉదాత్తత పట్ల లోకానికి రుచి పుట్టిస్తారు. అలా చేయటానికి ట్రావెలోగ్‌లోని శీర్షికలు కూడా ముఖ్యపాత్ర వహించాయనటంలో సందేహమే లేదు.

'రోమ్ ఒక రోజులో కట్టబడలేదు' అనే అర్థవంతంగా ఉన్న చారిత్రక సత్యాన్ని శీర్షికగా ఎంపిక చేయటం ఒక వినూత్న ప్రయోగమే. శీర్షిక ద్వారానే రోమ్ నగరంపట్ల ఒక అవగాహన ఏర్పడి తద్వారా ఆ నగరాన్ని పర్యటించటంలో ఆసక్తి కనబరచనివారు ఎవరు ఉంటారు చెప్పండి. అక్కడి శిల్పకళ, చిత్రకళ, రాతి కట్టడాల సౌందర్య వర్ణన, ముఖ్యంగా ముగ్ధతగొలిపే 'బాసిలిక' చిత్రీకరణ, అందుకోసమై ఉత్ప్రేక్షాలంకారాల ప్రయోగం రోమ్ పట్ల ప్రేమ పుట్టటానికి ఉత్ప్రేరకాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా అక్కడి రాతి కట్టడాలు, విగ్రహాలు, చిత్రాల తాలూకు నగిషీలను చూసి రచయిత హృదయాంతరాళాలలో కలిగిన స్పందన భగవంతుని ఉనికిని అతి సాధారణమైనవారికి కూడా అవగతపరచేదిగా ఉంటుంది. అసలు భగవంతుడు ఉన్నాడా, లేడా? ఉంటే ఎక్కడ ఉన్నాడు? అన్న ప్రశ్నలు ఏదో ఒక సందర్భంలో ప్రతి మానిషిలోనూ జనిస్తూనే ఉంటాయి. అయితే ఈ ప్రశ్నలకు వేదాలలోనో, భగవద్గీతలోనో, లేక ఇతర పవిత్ర మత గ్రంథాలలోనో సమాధానం దొరకటం సహజమే. కానీ అందుకు భిన్నంగా భౌతిక దృష్టితో జీవనాన్ని కొనసాగించే ఒక సంచార ప్రియుని విజ్ఞతకు భగవంతుని అస్తిత్వం అవగతం అవ్వటం విశేషంగా అనిపిస్తుంది. రోమ్‌లోని 'బసిలికా'ని వర్ణిస్తూ అంటారు – "తైలవర్ణ చిత్రాలు – డేవిడ్, మైకేలెంజలో, రాఫెల్ చిత్రాలు, శిల్పాలు, ఎక్కడి కళాకారులు? ఎక్కడి శిల్పకారులు? ఏమి పాల రాతి విగ్రహాలు?– నిజంగా మనిషిలోని దేవుణ్ణి బయిటకు తెచ్చే మహానుభావులు అలంకరించిన ఈ 'బాసిలికా' చూడకపోతే జీవితానికి పరిపూర్ణత లేనట్లే అనిపిస్తుంది". రచయిత చేసిన ఈ వర్ణనలోని ఆంతర్యాన్ని అవగత పరచుకుంటే – దేవుడు మనిషి లోపలే విభిన్న కళల రూపంలో కొలువై ఉంటాడు, సృజన శక్తి రూపంలో ఉన్నది. ఆయనే, తద్వారా రూపొందిన ఆకృతి కూడా భగవంతుడే అని అభివర్ణించి విడమరచి చెప్పినట్టుగా అనిపిస్తుంది. అంతేకాక పర్యటన వ్యక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని కూడా జాగృతం చేయకలుగుతుందన్న భావం కలుగుతుంది. నిశ్శబ్దంగా ఉండాలి. ఎందుకు? శిల్పుల ఉలి చప్పుళ్లు, చిత్రకారుల కుంచె రాపిడి విన్పించాలి కదా! అందుకు!

వెనిస్ నగర శోభను అక్కడక్కడా స్వభావోక్తి అలంకారంలో అత్యద్భుతంగా వర్ణించి పాఠకులలో ఎప్పుడెప్పుడు ఆ శోభను ఆస్వాదించాలా అన్న తహతహ బయలుదేరదీయటం చూస్తుంటే రచయిత హిస్టరీ ఉపన్యాసకులా? తెలుగు భాషా

శిరోమణా? లేక భూగోళశాస్త్ర అధ్యయనపరులా లేక, ప్రసిద్ధ ఆంగ్ల రచయితల ప్రస్తావన లేకుండా ఏ దేశ వర్ణనకూ పూనుకోరు కాబట్టి ఆంగ్ల సాహిత్యారాధకులా అన్న విషయం బోధపడక తికమకపడవలసిందే మరి.

సహజంగా ఏకరసంగా సాగుతున్న జీవిత గమనంలో కొత్తదనాన్ని వెతుక్కుంటూ, కొందరు యాత్రలు చేస్తే, నిత్యం తినే ఇంటి పట్టు భోజనంతో విసుగు చెంది కొందరు, ఇలా యాత్రికులు యాత్రలు విభిన్న కారణాలకు చేస్తూ ఉంటారు. అయితే అభిరుచిలో రాచరికం, దృష్టిలో సౌందర్యం, హృదయంలో స్పందనలు నింపుకున్న లోక సంచారులు అరుదుగా ఉంటారు. పూర్తి వెనిస్ నగరాన్నే ఒక మ్యూజియంగా అభివర్ణిస్తూ, ఆ మ్యూజియమ్ అంతర్గత విశేషాలైన చర్చి వైభవం, అందులో పొందుపరచబడిన రత్న ఖచిత కనకపు క్రాస్, గండోల ప్రేమ జంట పడవ ముచ్చట్లను చెప్పే బాణీ రచయితని ఒక అరుదైన యాత్రికుల కోవకు చేర్చుతుంది.

విభిన్న ప్రదేశాలలో వికసించే పువ్వుల పరిమళం, స్వభావం, ఆ పూలలో జనించే మకరందపు రుచి తాలూకు భిన్నత్వాలు, ప్రత్యేకతలు, అర్థం చేసుకోవటంలో అన్ని ప్రదేశాల పూవులనీ ఆఘ్రాణించి మకరందం గ్రోలి వర్ణమయమైన సీతాకోకలకే సాధ్యం అవుతుంది. రచయిత విభిన్న ప్రదేశాల భౌగోళిక పరిసరాల పరిశీలనకు మాత్రమే పరిమితం కాకుండా, పారిస్ నగరవాసుల సుగుణ పుష్పాలను వర్ణన చేస్తున్న ఘట్టం చదువుతుంటే భ్రమణంవల్ల ఈయన భ్రమరంగా మారి అక్కడి వ్యక్తులలోని ఆదర్శవంతమైన స్వభావాల తాలూకు మధువును తన మదిలో దాచుకువచ్చి అందరికీ పంచుతున్నారనిపిస్తుంది.

అలంకారాల ప్రయోగాలు కథనానికి రమ్యత చేకూర్చి వర్ణ్య సన్నివేశంతో సమాగమం చేస్తాయి. చికాగో నగర దీప కాంతులను వర్ణిస్తూ – విలాసవంతమైన ఖరీదైన భవనాలు కళ్ళు మిరుమిట్లుగొలిపే దీప కాంతులీనుతుంటే ఒక భారీ నల్లజాతి యువతి మెడలో రత్నాలహారంలా అనిపిస్తుంది అని పోల్చినప్పుడు, నిత్య యౌవని నయాగరా అన్నప్పుడు అశ్వని కుమార్‌గారు గత జన్మలో ఉపమానాలంకార సామ్రాట్టు కాళిదాసు అనుజులు కాదు కదా! అన్న ఊహ కలుగుతుంది. దర్శనీయ ప్రదేశాలపట్ల కొందరు యాత్రికులకు తటస్థభావం ఉంటే, కొందరు చాలా బాగుందని ఆనందించే భావం కలిగి ఉంటారు. కొందరు

మాత్రం ఆ ప్రదేశపు సోయగంతో తాదాత్మ్యత చెంది, దానిపట్ల ఆత్మీయతా భావాన్ని ఏర్పరచుకుంటారు. అలాంటి ఆత్మీయ సందర్శకుల భావం అక్షర బద్ధమైతే ఆ అక్షరాలు స్థిరంగా ఉండే వ్యక్తులలో కూడా ఆ క్షణంలో ఆ ప్రదేశానికి పయనమయ్యేలా చేస్తాయి.

నయాగరా జలపాతం గురించి చెబుతూ – నయాగరా సోయగాలను వీక్షించితే, కొండా కొనల నుంచి నది ఆసాంతం దూకటం... . అదీ అర్ధ చంద్రాకారంలా ఉండటంతో జలప్రళయం జరుగుతున్నట్టు, గగన గంగ ఆకాశాన్ని వీడి ధరాతలం మీదుగా పాతాళానికి పయనమవుతున్నట్లు, అదీ మన ముందు జరుగుతున్నట్లు, ఆ అద్భుతాన్ని చూడటానికే మనం బ్రతికి ఉన్నట్లు అనిపిస్తుంది" అంటారు. నిజానికి రచయిత ఆ జలపాత దృశ్యం కాంచటం తన జీవితానికి అర్థం పరమార్థం, చరమ సాఫల్యత అన్నంత ఆత్మీయతా భావం వ్యక్తం చేస్తే, మరి చదివేవారికి అది చూసేందుకు మనసు ఉవ్విళ్లూరక ఏమవుతుంది? అద్భుతమైన నయాగరా వర్ణన చదివి ఆనందించవలసిందే. ఆసాంతం ప్రతి ప్రదేశం పట్లా రచయిత కనబరిచిన ఈ ఆత్మీయతా భావమే ఈ ట్రావెలోగ్‌ని సజీవ దృశ్య కావ్యంగా మలచింది. అన్యధా అది యాత్రా మార్గదర్శినిగా మిగిలిపోయేది.

ఇలాంటి ప్రభావవంతమైన యాత్రా వృత్తాంతాలు సాధారణ మానవుడిని మహా మానవులుగా తీర్చిదిద్దుతాయి. అందుకు రచయితే ప్రత్యక్ష సాక్ష్యం, తన విద్యార్థి దశలో ఉన్నప్పుడు మొదటిసారిగా విజయవాడ నుంచి మద్రాసుకు ప్రయాణం చేయవలసి వస్తే పాసింజర్ రైలు టిక్కెట్టు కొని మెయిల్‌లో ప్రయాణించి మొదటిసారిగా రైళ్ళు ఎన్ని రకాలో తెలుసుకుంటారు. అలా మొదలైన తన ప్రయాణాల పరంపర నిరాటంకంగా కొనసాగటంతోనే నేడు సమాజం ముందర విజ్ఞాన సర్వస్వంలా ముద్రను వేసుకోగలిగారు. అందుకే ప్రస్తుత సమాజంలో పిల్లల పట్ల ఆయనకు ఒక జాలి. వారి అభిరుచి సినిమాలకు పరిమితమై, తల్లితండ్రుల ఆకాంక్షలు తీర్చేందుకు వారు ఎంపిక చేసిన మార్కుల ఆధారిత విద్యావిధానానికి వారు బలైపోతున్న స్థితిలో, వారు యాత్రలపట్ల మక్కువ పెంచుకునేది ఎప్పుడు? వారిలో సృజన వెలుగులోకి వచ్చేది ఏనాడు? అని వాపోతారు. యాత్ర జీవితంలో అన్ని అనుభూతులనూ అనుభవంలోకి తెస్తుంది, కొన్ని సందర్భాలలో ప్రాణం పోతుందేమోనన్న భయం అంచులవరకూ వెళ్ళిరావటం, కడుపులో దేవటం, తల

తిరిగిపోవటంలాంటి అనుభూతులు కూడా ఒక రకమైన వింత పులకరింతను కలుగ చేస్తాయి. జీవితంలో ప్రతి అనుభూతినీ రుచి చూసినప్పుడు కలిగే పరిపూర్ణత హృదయ ధారుఢ్యాన్నిపెంచుతుంది. అందుకు తార్కాణం దుబాయి డిజర్ట్ సఫారీ కథనం. ఇలా చెప్పుకుంటూ వెళుతుంటే సాగిపోతూనే ఉంటాయి ఈ విశేషాలు.

వాస్తవంగా తెలుగు సాహిత్యం యాత్రా వృత్తాంతంతోనే ఆరంభం అయ్యింది అని కొందరు సాహిత్య విశేషజ్ఞుల అభిప్రాయం. 1838లో ఏనుగు వీరస్వామి రచించిన కాశీ యాత్ర చరిత్ర మొదలుకుని నేటివరకూ దాదాపు రెండు దశాబ్దాల కాలంలో రెండువందలకు పైబడి యాత్రా గ్రంధాలు వచ్చినట్లుగా సాహితీవేత్తల అంచనా. వీటిలో కొన్ని సాహిత్య స్వరూపం సంతరించుకున్నవి అయితే, కొన్ని సాహిత్య ప్రక్రియలతో సహపంక్తి స్థాయి కలిగినవి. కొన్ని అనువాదాలు కాగా, వేళ్ళతో లెక్కించగలిగినన్ని యాత్రా వృత్తాంతాలు మాత్రం తెలుగు సాహిత్యంలో క్లాస్సిక్స్‌గా మిగిలిపోయినాయి. అయితే అశ్వనీకుమార్ గారి గుండె గొంతుకలో నుంచి వెలువడ్డ దూరతీరాలలో... యాత్రా సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని సొంతం చేసుకునేందుకు సర్వ యోగ్యతలూ కలిగి ఉన్నదని నొక్కి వక్కాణించవచ్చు. యాత్రలు పుణ్యక్షేత్ర సందర్శనార్థం, జ్ఞాన సముపార్జనార్థం, వినోదోల్లాస లక్ష్యంగానూ, ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ఉద్దేశ్యంతో చేయబడతాయి. రచయత ఈ ఉద్దేశ్యాలన్నిటినీ మూటకట్టుకుని ఆ మూటలోనే ప్రపంచాన్ని గట్టిగా గుండెలకు హత్తుక్కునేటంత ప్రేమను ఆత్మీయతనూ కూడా భద్రపరచి దేశాలన్నిటినీ చుట్టబెట్టి వచ్చారు. అందుకే ఇందులోని ప్రతి అక్షరం విభిన్న తరహాల అభిరుచులు ఉన్న పాఠకులందరినీ ఆకర్షిస్తుంది బోలెడంత విశాల హృదయాన్ని, విజ్ఞానాన్ని ఇస్తుంది ప్రపంచాన్ని చుట్టిరమ్మని ప్రేరేపిస్తుంది.

– ***డాక్టర్ భాగవతుల హేమలత,*** *విజయవాడ*

ఎందుకు?

నువ్వెవరు? అని ఎవ్వరూ అడుగరు.

నీ పేరు? నీ ఊరు? అనే అడుగుతారు కదా...

అంటే నీవు తెలియాలి అంటే – నీ ఊరు కూడా తెలియాలి. అక్కడి కట్టూ – బొట్టూ, ఆ వూరి కట్టుబాట్లు, నీ భాష – నీ యాస తెలిసినపుడే – నువ్వెవరివో, ఎక్కడివాడివో గుర్తించేది. 'దేశమంటే మట్టికాదోయ్ – దేశమంటే మనుషులోయ్' అని ఏ సందర్భంలో చెప్పారో కాని, మనిషికి –మట్టికి గల అవినాభావ సంబంధం ఆ పెద్దాయనకు తెలియక కాదు. అలాగే – ఒక నగరం – ఒక దేశం సందర్శించినపుడు, అక్కడి మేడలు – మిద్దెలు వెనుక వున్న మనుషుల్ని, మనుగడనూ వారి తరతరాల సంస్కృతీ సౌరభాలను తెలుసుకోకుండా ఆ ప్రదేశం అవగాహనకు రాదు కదా.

ఎక్కడో – ఏదో నగరం నీకోసం, నీరాకకోసం ఎదురుచూస్తోంది. ఎంతటి ఉదాత్తమైన భావన. నీకాతిథ్యమివ్వడానికి, నీకు పరిచయం కావటానికి ఎదురు చూస్తోందన్న భావం – మనకు ఒక బాధ్యతను కూడా అప్పగిస్తున్నది. "ఏదో ఊరికే మా ఊరికి రాకు, వచ్చినప్పుడు మాత్రం ఊరికే పోకు" అని కదూ.

'నడకదారులంటూ లేవు – నడిస్తేనే దారులవుతాయి' అన్న సూక్తి అక్షరాల నిజం కదా – 'రోడ్లంటూ ఉండవు – వేస్తేనే రోడ్లు – హైవేలు – ఫ్రీవేలు' అని అమెరికాలో అడుగుపెట్టగానే గుర్తిస్తాం.

మనిషి, అడవిని వదిలినప్పటి నుంచి – దాదాపు పదివేల సంవత్సరాల నుంచీ – ఏదో విధంగా ప్రయాణం చేస్తూనే వున్నాడు. ఇప్పటి ప్రయాణ సాధనాలను – సౌకర్యాలనూ చూస్తుంటే – ఆదిమానవుని జిగీషమీద గౌరవం పెరుగుతుంది, ఎక్కడి వాడు ఎక్కడికి చేరాడు అని.

భారతదేశంలో అయిదువేల సంవత్సరాల నుంచీ కేవలం కాలినడకనే, దేశ వైశాల్యాన్ని చుట్టి కొండలు, నదులు, అడవులు దాటి, ఎన్నో చిన్నా పెద్దా గ్రామాలు, నగరాలను దర్శించి, ప్రజలను పలకరించి పరిధిని పెంచుకొని, జనులను చైతన్యవంతుల్ని చేసిన పండితులు, కవులు, ఋషులు, దార్శనికులు

ఎన్నివేల మంది లేరు? రెండు వేల అయిదువందల సంవత్సరాల నాటి బుద్ధుడు తను చూసిన వెలుగుతో, జనుల జీవితాలలోని చీకటిని పోగొట్టడానికి, కాలినడకనే కదా యాభై సంవత్సరాలు అవిశ్రాంతంగా పయనించాడు.

మనకు పన్నెండు సంవత్సరాల వయసు వరకూ బాల్యం వదలదు. పద్దెనిమిదేళ్ళ వరకూ యౌవన ప్రాంగణంలోని గందరగోళం, సినిమాలు చూపే మిథ్యాలోకపు అయోమయంలో కొట్టుమిట్టాడుతాం. పాతికేళ్ళకు గాని ఒక దారి, ఒక బ్రతుకు ఏర్పడవు. అప్పటికైనా ఒక ధ్యేయం, ఒక గమ్యం ఎందరికుంటుంది? తల్లిదండ్రుల తీరని కోర్కెలకు 'బలి' అవుతున్న ఈనాటి యువతకు తమ తమ సృజనాత్మక శక్తిని (కల్పనా శక్తిని) వెలికి తెచ్చే అవకాశాలు మృగ్యమవుతున్నాయి. జీవన ప్రవాహంలో కొట్టుకుపోవడంతప్ప చేయగలిగింది లేదు. కాని ఎప్పుడో – ఎక్కడో మీ మనస్సులో ఏదో బలీయమైన కోరిక అంకురించి, అది ఒక ధ్యేయంగా మారి, ఒక గమ్యాన్ని చూపితే ఆశ్చర్యం లేదు. అది గుర్తించి, అటుగా పయనించే తీరిక అందుకవసరమైన వనరులు దొరికితే అదృష్టవంతులమే.

ఈ నేపథ్యంలో పన్నెండేళ్ళ వయసులో పరిచయమైన కొద్దిపాటి ఆంగ్ల సాహిత్యం ప్రభావమో, మా ఊరు రెండు రోజులకు టపాలో చేరే "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" దినపత్రికలో "మాండ్రేక్, బ్రింగింగ్ అప్ ఫాదర్" బొమ్మల ప్రభావమో తెలియదు. నాన్నగారు రోజూ చదివించి, వివరించి చెప్పిన పెరల్‌బక్ "గుడ్‌ఎర్త్"లో చైనా పొలాల వెంట మట్టివాసనలో, పీచోతో కలిసి నడిచాను. అతని దారిలో దేవతకు వెలిగించిన అగరొత్తుల సువాసన పీల్చాను.

సోమర్సెట్ మామ్ సాహిత్యంలో కథానాయకుల వెంట గడ్డివాముల వెచ్చదనం, సముద్రయానంలో కమ్మదనం అనుభవించాను. ఇర్వింగ్ వాలెస్ ప్రవేట్‌జెట్‌లో ప్రయాణించాను. గాడ్‌ఫాదర్‌లో మేరియో పూజో వెంట 'సిసిలి' కూడా వెళ్ళాను. హెమింగ్ వే మహాశయుని 'ఓల్డ్‌మాన్ ఎండ్ ది సీ, ముసలాయనతో మూడు పగళ్ళు మూడు రాత్రులు అతని పడవలోనే గడిపాను.

అడవి బాపిరాజు 'తుఫాను'లో చిక్కుకున్నాను. అచంట జానకిరాం "స్మృతి పథంలో" అలుపెరగకుండా తిరిగాను. ఆల్‌బర్ట్ కామూ ఓట్‌సైడర్‌తో తాదాత్మ్యం చెందాను. ఇలా చెప్పుకుంటూ పోయి మిమ్మల్ని విసిగించటం నా ఉద్దేశ్యం కాదు. కాని ఇదంతా నాలోలోన ఈ ట్రావెల్ బగ్ ఎప్పుడూ ప్రవేశించిందో

తెలుసుకునే ప్రయత్నమే సుమా. ఇక్కడే నా మొదటి దూర ప్రయాణం ఒక్కటి ప్రస్తావించాలి. 'బెజవాడ' అయిదో నెంబరు ప్లాట్‌ఫారం మీద అప్పుడు తొమ్మిది రూపాయలు మద్రాసు టిక్కెట్టు – మెయిల్‌లో సాదా డబ్బా ఎక్కి మద్రాసు చేరాను. టి.సి పట్టుకుని ఇది పాసింజరు టికెట్టు – మెయిల్ ఎక్కకూడదు – జరిమానా కట్టు – అన్నప్పుడు మొదటిసారిగా టికెట్లు ఎన్ని తరగతులో – రైళ్ళు ఎన్ని రకాలో తెలుసుకున్నాను. "అయ్యా నేను విద్యార్థిని, ఇది తెలియక జరిగింది" అని నిజం చెప్పి తప్పించుకోవడం కూడా నేర్చుకున్నాను. సెంట్రల్ బైట అరవ అయోమయంలో ఒక ఎద్దుబండి లాంటి రిక్షాలో, వెనకనే నడిచి ఎక్కితే పడిపోతానని భయంతో – మనిషిలాగే రిక్షాకదా, గమ్యం సురక్షితంగా చేరినపుడే నా మీద నాకు నమ్మకం కలిగింది. అప్పటినుంచి ప్రయాణమంటే, క్రొత్త ప్రదేశాలంటే బెదురుపోయింది.

ఒకరోజు అన్ని వ్యాపారాలను ప్రక్కన పెట్టి, ప్రయాణమే వ్యాపకంగా, అదే వ్యాపారంగా మలచుకుని, ఇప్పుడు రెండింటికి తేడా చెరిపేసి, ప్రపంచంలోని ముఖ్యమైన ప్రదేశాలన్నీ అవకాశం దొరికినవి, కల్పించుకున్న అవకాశాలతో రెండు మూడు నాలుగు పర్యాయాలు పర్యటించాను.

కేవలం అదొక ప్యాషన్ గానే, అన్వేషణగానే – ఎన్ని జాతులు, ఎన్ని ప్రదేశాలు – ఎన్ని అనుభవాలు. ఎంతటి ఆప్యాయత, ఆతిథ్యం! ఎన్ని వింత సన్నివేశాలు! అందులో గుర్తున్నవి ఎన్ని! జ్ఞాపకాల అగాధాలలో కొన్ని.

ఇక్కడే ఒక్క విషయం చెప్పాలి – ఒకసారి న్యూయార్క్ కెన్నెడీ ఎయిర్‌పోర్టులో "రమదా ఇన్" హొటల్‌లో తెల్లవారుఝామున రేడియో పెడితే – ఈ వంద సంవత్సరాలలో ఆ రోజు పుట్టిన ప్రముఖుల పేర్లు చెప్తున్నారు. 'గాంధీ' అన్నపుడే తెలిసింది– అక్టోబరు 2 అని.

అపుడే – ఆ రోజే అట్లాంటా చేరటం, రమేష్‌గారితో మార్టిన్ లూథర్ సెంటర్‌కి వెళ్ళి గాంధీ జయంతి జరుపుకోవటం, మార్టిన్ కింగ్ భార్యను కలవటం, తర్వాత అవన్నీ ఉత్తరంలో పొందుపరిచి, డా.రమేష్‌బాబుగార్కి, కృష్ణారావుగారికి పంపటం జరిగింది. తర్వాత మరో రెండు ఉత్తరాలతో ఆ విషయం మరిచిపోయాను. ఇండియా వచ్చిన తర్వాత, 'నడుస్తున్న చరిత్ర'లో నా ఉత్తరాలు వ్యాసాలుగా చూసి ఆనందించాను. కాని డా.రమేష్‌గారు ఈ విషయాన్ని అంతటితో వదిలిపెట్టలేదు.

నేను అంతకుముందు ఆ తర్వాత దర్శించిన దేశాలు, నగరాల గురించి, నాతో పోట్లాడి, ప్రోత్సహించి వ్రాయించారు.

నేను వ్రాసిన "వెనిస్" వ్యాసం చదివి, ప్రఖ్యాత రచయిత పోలవరపు కోటేశ్వరరావు "యు హేవ్ వండరఫుల్ స్టైల్, రాస్తుండండి." అని అన్నప్పుడు నా వళ్ళు పులకరించింది. ఆల్ ఇండియా రేడియో ప్రసాద్‌గారు, సరోజగారు, నరసింహారావుగారు – ఈ నెల ఏ దేశం తీసుకువెళ్తున్నారు? అని నిలదీస్తూ నా అనుభవాలు అక్షరరూపం దాల్చటానికి ఎంతో ప్రోత్సహించారు. పి.ఎస్.రావుగారు, మూర్తిగారు అవకాశం దొరికినప్పుడు ఈ ట్రావెలోగ్‌ను ఆదరించారు. ఆత్మీయులు రంగనాథ్‌గారు సూచనలిచ్చి ముందుకు నడిపారు.

ఇంకా నేను దర్శించిన ప్రదేశాల సమగ్ర స్వరూపాల అవగాహనకు – నా యాత్రలతోపాటు, ఆ నగరాల గురించి, ఆ దేశాల గురించి నేను చదివిన గ్రంథాలు, రిఫర్ చేసిన 'ట్రావెల్' పుస్తకాలు కూడా గణాంక వివరాలకు ఎంతో ఉపకరించాయి. ఈ వ్యాసాలు రాస్తున్నప్పుడు మళ్ళీ నాకు ఆ ప్రదేశాలను అడుగడుగునా తడిమి చూసిన అనుభూతి కలిగేది. ఈ అనుభూతి నేను ఆ ప్రదేశంలో తిరుగాడిన అనుభవం కన్నా మధురంగా ఉండేది.

నా ఈ అనుభవాలను మీతో కొంతయినా పంచుకోగలిగితే నా ఆనందాన్ని కొద్దిగానైనా మీకు అందించగలిగితే, ఈ రచనలకు సార్థకత చేకూరినట్లే.

ఏ తీరాలు...



ఇంగ్లాండ్

లండన్

ఆధునిక ప్రపంచానికి సముద్ర జలాలపై వ్యాపార రహదారులు వేసి తద్వారా వలస రాజ్యాలు ఏర్పరచి, ఒక మహాసామ్రాజ్యాన్నే సాధించటం ఒక ఎత్తు. ప్రజాస్వామ్య మహావృక్షానికి మొదటి పాదుచేసి, బహిరంగంగా ఒక రాజు తల తీయించి ప్రజల హక్కులేమిటో ప్రపంచానికి చాటి చెప్పిన ఆలివర్ క్రాంవెల్ లాంటి మేధావులకు, షేక్స్పియర్, మిల్టన్ లాంటి కవులకు, రస్సెల్‌లాంటి మేధావి వర్గానికి జన్మభూమి అయిన ఘనత ఒక ఎత్తు. ఒక ప్రక్క ప్రజాస్వామ్య పాలన సాగిస్తూనే రాచరికపు వంశమర్యాదలు పాటించటం ఆధునిక సామాజిక క్రమశిక్షణకు ప్రమాణాలు రూపొందించటం, రెండు ప్రపంచ యుద్ధాలలో కీలకపాత్ర వహించటం, నాటో కూటమికి నాయకత్వంతో పాటు – యూరప్ దేశాలను ఒక త్రాటిపైన నడపటం (రష్యాకి ఎదురుగా) ఒక ఎత్తు. ఇంత ఘన చరిత్ర గలిగిన ఒక ద్వీప దేశానికి రాజధాని లండన్ మహానగరం గాత్విక్ ఎయిర్‌పోర్టులో దిగాము.

ముఖ్యంగా భారతీయులకు లండన్ చూస్తుండగానే క్రొత్త అనిపించదు. కాని తరచి చూసిన కొలది – అన్నీ వింతలే – అన్నీ విశేషాలే. చూద్దాం రండి. ఇంత మహానగరంలో ఎలా తిరగటం? అని మీరు భయపడకండి. లండన్‌లో తిరగాలంటే మీకు ఎంతో వీలుగా – చౌకగా – అన్ని ప్రాంతాలకు చేరటానికి అనువుగా – భూగర్భ రైలు (ట్యూబ్ అంటారు) ఎర్రబస్సులు ఎప్పుడూ తిరుగుతూంటాయి. రోజువారీ, వారానికి గాని టికెట్లు కొనవచ్చు. అన్నిటికి ఒకే టికెట్ – మిమ్మల్ని ఆపేవారే వుండరు. మీరు తాత్కాలికంగా ఒక ఫోను కొనుక్కోవచ్చు నంబరుతో సహా. మీరు ఏమి చూడాలో ఎలా అక్కడికి చేరాలో అన్ని పర్యాటక శాఖ వారు అరటిపండు ఒలిచినట్లు కరపత్రాలు వేస్తారు.

'ట్యూబ్' ఎంతో అనుకూలంగా – రోజులో రెండు గంటలు తప్ప (రాత్రి 2–4 మధ్యలో) ఎప్పుడూ పదినిమిషాలకు ఒకటి, అన్ని మార్గాలలో తిరుగుతుంటాయి. కాలుష్యంగాని, చీకటిగాని, భయంగాని లేకుండా ప్రధాన

రహదారుల క్రింద (15 మీటర్లు) ఈ ట్యూబ్ దారులు ఉంటాయి. ఎక్కువ మంది లండన్ వాసుల ట్యూబ్‌నే వాడతారు. ఇక్కడ ఓవర్ బ్రిడ్జ్‌లు వుండవు. అందుకని ట్రాఫిక్ కదలదు. అందుకే ట్యూబ్ వీళ్ళ దైనందిన జీవితంలోనే కాక – వీరి సాహిత్యంలో – సినిమాలో కూడా ఒక భాగమైపోయింది.

ఇక ఎస్కలేటర్‌లో ట్యూబ్ స్టేషన్‌లో దిగుదాం. ఒక్కో స్టేషన్‌లో ఒక్కో విశేషం. నలుగురు కూర్చుని ఆర్కెస్ట్రా వాయిస్తుంటారు. ప్రేమికులు ప్రేమ కలాపాలు సాగిస్తుంటారు. అక్కడక్కడా భిక్షగాళ్ళ తారసపడతారు. అయినా ఎవరూ ఆగరు. కాలప్రవాహంలో కదిలిపోతుంటారు. అదిగో తళతళలాడతూ రైలు వచ్చింది. లోపలికి వెడితే సమశీతల వాతావరణంలో ప్రయాణం హాయిగా ఉంటుంది. చూడండి ఎన్నో రకాల మనుషులు – అన్నిరకాల ఫాషన్లు. ఎవరు మాట్లాడరు. అది "ట్యూబ్" కల్చర్. వాక్‌మన్ వినేవాళ్ళు. పత్రికలు చదివేవాళ్ళు – నిద్రపోయేవాళ్ళు – డ్రగ్స్‌తో అయోమయంలో ఊగేవాళ్ళు అంతా నిశ్శబ్దమైన సందడి – మేళం లేని పెళ్ళి యాత్రలా సాగిపోతుంది. మీరు దిగాల్సిన స్టేషన్‌లో దిగి, ఎస్కలేటర్‌పై బయట ప్రపంచంలో అడుగుపెట్టండి. ఎన్నో సెంటర్లు (కూడలి) లేక సర్కిల్స్ (వృత్తాకారం) ఉంటాయి పికాడిల్లీ సెంటర్, ట్రఫాల్గర్ స్క్వేర్, ట్రావ్‌స్టాక్ సెంటర్ – ఇలా ఒక్కో సెంటర్ ఒక్కో ప్రత్యేకత కలది. అలాగే వీధులు కూడా ఎంతో ప్రాముఖ్యం కలవి. బాండ్‌స్ట్రీట్, విక్టోరియా, క్రాంవెల్ రోడ్, ఆక్స్‌ఫర్డ్ రోడ్ – అన్నీ విన్న పేరులే కదూ. డిపార్టుమెంట్ స్టోర్లు కూడా ఎంతో ప్రఖ్యాతి చెందినవి – హర్రడ్స్, హార్వేనికాల్స్, లిబర్టీ, డిబెన్ హామ్స్ – చెప్పుకుంటూపోతే అంతే వుండదు. తివాచీ వ్యాపారం ఎంతో పెద్దది. అలాగే సూట్‌లు కుట్టేవారు ప్రపంచ ప్రసిద్ధి పొందారు. ఏ పని అయినా తీర్చిదిద్దినట్లు చేస్తారు. ఫాయిల్స్ ప్రపంచంలో అతి పెద్దపుస్తకాల దుకాణం. కోవెంటు గార్డెన్‌కి వెళ్తే ఎన్నో రకాల వస్తువులు నాణ్యమైన గాజు సామాను, పింగాణి పాత్రలు, బట్టలు, నగలు ఎంతో వైవిధ్యం కలవి – అమ్మకాలు జరుగుతుంటాయి. లండన్ నగరం అంతా దుకాణాల మయం. ఒక సూపర్ బజారు అన్నా అతిశయోక్తి కాదు. ఇక హోటళ్ళు – సాంప్రదాయమైనవి ప్రసిద్ధం. సవాయి, రిట్జ్, క్లారిడ్జ్, స్టాఫర్డ్ ఎంతో బాగా నడపబడుతున్న చరిత్రగల హోటళ్ళు – చైన్ హోటళ్ళు – ఇంటర్ కాంటినెంటల్, మెరిడియన్ ఇంకా ఉన్నాయి. నేను ట్రావ్‌స్టాక్

స్క్వేర్‌లో ట్రావ్‌స్టాక్ హోటల్లో ఉన్నాను. ఎదురుగా తోట ఉన్నది. అందులో గాంధీ విగ్రహం ఉన్నది. ఫోటోలు తీద్దామని వెళ్ళాను. అది వేసవి కాలం– గాంధీగారి చుట్టుప్రక్కల అర్ధ నగ్నంగా ఎండ కాగుతున్నారు చాలామంది. లండన్‌లో ఎన్నో మ్యూజియంలు ఉన్నాయి. (నార్లగారు ఎంతో అధ్యయనం చేశారు – లండన్, యూరప్ మ్యూజియంలపై) నేషనల్ మ్యూజియం, బ్రిటిష్ మ్యూజియం, వాక్స్ మ్యూజియం, ఎన్నైనా చూడవచ్చు. మీ ఓపిక. బంకింగ్‌హోమ్ రాజప్రసాదం తప్పక చూడాలి. రాణిగారికి ఆదాయం చాలక కొంత భాగం ప్రజలకు చూపుతున్నారు. టిక్కెట్టు పెట్టి– ఎదురుగా హైడ్ పార్క్. నేను వెళ్ళిన రోజున వాటర్‌లూ యుద్ధం జరుగుతోంది. ఫిరంగులు – కత్తి యుద్ధాలు, గాయపడిన వారికి చికిత్స – అన్నీ జరుగుతున్నాయి. ప్రతిరోజు ఏదో విశేషం సందర్శకుల కోసం ఉంటుంది.

ఇంకా హైడ్‌పార్క్‌లో ముఖ్యమైనది. స్పీకర్స్ కార్నర్. ఎవరైనా ఏ విషయం మీదైనా నిర్భయంగా మాట్లాడవచ్చు – చిన్న పెట్టె ఎక్కి (ఎవరి పెట్టె వాళ్ళు తెచ్చుకుంటారు) వినేవాళ్ళు ఎంతైనా గేలిచేయొచ్చు. వాళ్ళు సమాధానం చెప్తారు. రష్దీని తిట్టడం – రాణీని విమర్శించడం– ఇస్లాంని సమర్థించడం– ఖోమెనీని ఎత్తిపొడవటం, ఎవరి అభిప్రాయాలు వారు వేదిక మీద చెప్పవచ్చు. హేళనకు, విమర్శలకు సిద్ధంగా ఉండాలి కాని వినేవాళ్ళకు, చూసేవాళ్లకు, ఈ భావ ప్రకటనలు, వాక్స్వాతంత్ర్యం తప్పనిసరిగా ఆశ్చర్యం కలిగిస్తాయి. నేను దాదాపు



థేమ్స్ నది మీద టవర్ బ్రిడ్జి

రెండు గంటలు ఈ తంతు చూస్తూ ఆనందించాను. లండన్ మహానగరం అంతా తిరిగి వివరంగా చూడాలంటే పది సంవత్సరాలు పడుతుంది. ఆర్ట్ గాలరీలు, మ్యూజియంలు, వివరంగా చూడాలంటే చాలా సమయం కావాలి. మనకు అంత సమయం లేదు కాబట్టి ఏమి చూడాలో నిర్ణయించుకుందాం.

టవర్ ఆఫ్ లండన్:

ఇక్కడ మీరు రాజరికపు రత్నాలు, కిరీటాలు చూడవచ్చు. అంతేకాదు. ఎంతో రక్తసిక్తమైన ఆసక్తిదాయకమైన బ్రిటిష్ చరిత్ర కళ్ళారా దర్శించవచ్చు. మీకు వళ్ళు జలదరించే విధంగా దర్శింపచేస్తారు. వాల్టర్ రాలీని 12 సంవత్సరాలుగా కారాగారంలో పెట్టిన రాతి కట్టడం చూస్తే వణుకు పుడుతుంది– ఎంతమంది – రాణులు – రాజకుమారులు బలిపీఠం ఎక్కారో కళ్ళకు కట్టినట్లు చూపుతారు. రాజులు ధరించిన యుద్ధ కవచాలు, డాలులు, కత్తులు – చివరికి కింగ్‌హెన్రీ –3 ఎక్కిన శ్వేతాశ్వం కూడా. వీటన్నిటికీ డబ్బు వసూలూ చేసినా తర్వాత కలిగే అనుభూతి డబ్బు విలువను మించిందే.

బ్రిటిష్ మ్యూజియం:

రస్సెల్ వీధిలో వున్న ఈ మ్యూజియంలో మాగ్నా కార్టా నుంచి – షేక్స్‌పియర్ డీడ్ వరకు ఎన్నో ముఖ్యమైన పత్రాలు సందర్శనార్థం ఉంచుతారు– ఎడ్మిరల్ నెల్సన్ లాంగ్‌బుక్, అతని ఉత్తరాలు – శామ్యూల్ కోలరిడ్జ్ వ్రాసిన కుబ్లాఖాన్ (అతను కలగని రాసినది) ఇవన్నీ చదువుతుంటే మీ వెన్నులో వణుకుపుడుతుంది. ఇక్కడ ప్రవేశం ఉచితం.

పార్లమెంట్:

మీరు లండన్ వెళ్తే పార్లమెంటు దర్శించకుండా రాకండి. సందర్శకులు కూర్చోటానికి గాలరీ ఉంటుంది. ఒక అరగంట ఓపిక పడితే లోపలికి ప్రవేశం దొరుకుతుంది. మీరు ప్రజాస్వామ్యవాదులయితే కామన్స్‌సభ, లార్డ్స్ సభ తప్పనిసరిగా చూడాలి. ముఖ్యంగా లార్డ్స్ సభలో నడిచే, గ్రామీణ ఆంగ్ల భాషా చాతుర్యం తప్పక విని తీరాలి. ఇంకా ట్రఫాల్గర్ స్క్వేర్, బకింగ్‌హాం రాజభవనం, మాల్, విక్టోరియా, ఆల్‌బర్ట్, సెయింట్‌పాల్స్‌చర్చి తప్పనిసరిగా చూడదగినవి. లండన్ ఎర్రబస్సులు –మిమ్మల్ని 20 మైళ్ళ యాత్రలో చక్కగా అన్ని త్రిప్పి తీసుకువస్తాయి. అయిదు పౌండ్లు కంటే ఎక్కువ వుండదు టిక్కెట్టు. ఇంక మీరు

థేమ్స్ నది అందాలు చూడాలంటే రాత్రి బోటు షికారు చెయ్యాల్సిందే. లండన్ బ్రిడ్జ్ క్రిందనుంచి, బిగ్‌బెన్ గడియారం, పార్లమెంట్ భవనం, ఇవన్నీ దీపాల కాంతిలో మెరిసిపోతూ దర్శనమిస్తాయి. వెస్ట్ మినిస్టర్ అబ్బే చర్చి తప్పనిసరిగా చూడాలి. పురాతన గోతిక్ వాస్తు శిల్పకళా నైపుణ్యంతో ఎంతో వైభవంగా ఉంటుంది. పేరున్న పెద్దలంతా ఇక్కడే విశ్రాంతి తీసుకుంటున్నారు. రాణులు, రాజులు, 1066 సంవత్సరాల నుండీ ఇక్కడే నిద్రపోతున్నారు. చాసర్ దగ్గర్నుండి చర్చిల్ వరకూ ఇక్కడే సమాధి చెయ్యబడ్డారు. అంతేకాదు – ఎందరో రాజులకు, రాణులకు ఇక్కడే పట్టాభిషేకం జరిగింది. ఈ చర్చి కట్టి ఇప్పటికి 932 సంవత్సరాలైంది. డయానా సమాధి కూడా ఇక్కడే ఉంది! ఎలిజిబెత్ రాణి –1 సమాధి అద్భుతంగా ఉంటుంది. వైట్‌హాల్ ప్రక్కనే నడిచి, రాజ ప్రసాదం దగ్గరకు రండి, అక్కడ నుంచి ఎడమవైపునకు నడిస్తే, 10– డౌనింగ్ వీధి ఉంటుంది. అదే ప్రధానమంత్రి నివాసం. మీరు చక్కగా ఫోటోలు దిగవచ్చు. ఇది మూడంతస్తుల ఇటుకరాతి కట్టడం. ఏమాత్రం డాబు దర్పం లేకుండా సామాన్యంగా ఉంటుంది. ఎప్పుడూ పచ్చతోరణాలు కట్టి, పూలహారాలు పెట్టి మీకు ఆహ్వానం పలికే నగరం లండన్, ఎంతో ఆదరంగా – మీ పాదాల క్రింద తివాచీలా ఎంతో అణకువగా మీకు సేవలందించే నగరం లండన్. ఒక్కరోజు ఉందామని వచ్చినవాళ్ళు మరి రెండు రోజులు ఉండేటట్లు చేసే మంచి హోస్ట్ (Host) లండన్. ఎవరైనా లండన్ విసుగుపుడుతోంది (బోర్ కొడుతుంది) అని అన్నారంటే వాళ్ళకు జీవితమే విసుగుపుడుతున్నదన్నమాట.



సౌతాల్ లండన్ (ఇండియన్ మార్కెట్)



స్కాట్‌లాండ్

స్కాట్‌లాండ్

లండన్ నగరంలో మనకు ప్రకృతి అందాలు పెద్దగా కనపడకపోయినా, నగర పరిసరాలు దాటగానే పచ్చనిబయళ్ళు – చక్కని సెలయేళ్ళు, చిక్కని చిట్టడవులూ, గుట్టలూ కొండలూ ఎంతో రమణీయంగా ఉంటాయి. అక్కడక్కడా రాజప్రసాదాలు – కోట బురుజులు ఎంతో హుందాగా నిలబడి ఉంటాయి.

మనం ప్రయాణం చేసే రహదారి చిన్న ఊళ్ళ మధ్య నుంచి వంకర్లు పోతూ పరుగెడుతుంటుంది. ప్రతి ఊరూ ఒక ప్రత్యేకతగలదే. ఇంకా ఉత్తరంగా పయనిస్తే హైలాండ్ అంటారు. ఇక్కడ నివసించే వారిని హైలాండర్స్ అని లండన్ వాసులంటారు. మాట్లాడేది ఆంగ్లమే అయినా ఎన్నో రకాల 'యాస'లుంటాయి. వ్యవసాయం, తోటలు, పశువుల పెంపకంపై ఎక్కువగా ఆధారపడి జీవనం సాగుతుంటుంది. లండన్ నగర జీవితానికి విరుద్ధంగా – ఎంతో ప్రశాంతంగా, కాలుష్య రహితంగా – ప్రకృతి ఒడిలో బ్రతుకు నడిచిపోతుంటుంది. హైలాండర్స్ వేషధారణ వింతగా ఉంటుంది. గళ్ళ 'స్కర్ట్', సగం కోటు – మగవాళ్ళు ధరిస్తారు. ఆడవాళ్ళు జడలు వేస్తారు. ఇక్కడ తోలుతిత్తితో గాలి ఊది అయిదారు రకాల సన్నాయి బూరలు ఊదే 'బాగ్ పైపర్' అనే వాద్యం ప్రాచుర్యంలో ఉంది. ఒక రకంగా 'హైలాండర్స్'కి ఇది ఒక గుర్తులాంటిది.

గ్లాస్‌గో – ఎడిన్‌బరో:

ప్రకృతిసిద్ధంగా, చారిత్రకపరంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ రెండు నగరాలు ఇంగ్లాండుకే రెండు రత్నాలు వంటివి. గ్లాస్గో ప్రకృతి అందాలతో, సాంస్కృతిక సంపదతో వెలిగిపోతుంటే, ఎడిన్‌బరో పురాతన రాజప్రసాదాలు, ఎత్తైన కోటగోడలు – కొండల మీది కోటలు, చరిత్ర – మాయా మర్మాల దయ్యాల కథలతో అంతు చిక్కని రహస్యాలతో ఎప్పుడూ మనకు ఉత్సుకత కల్గిస్తుంటుంది. ఎన్ని రాజరికాలు ఇక్కడ వెలిగినాయి? ఎన్ని రాజవంశాలు పాలించి ఎగసిపడినాయి? సర్ వాల్టర్ స్కాట్ పుట్టిల్లు ఇది. సెయింట్ ఆండ్రూస్ గోల్ఫ్ ఆట ఇక్కడే ప్రారంభమైనది. గ్లాస్గో నగరం ఎప్పుడూ కళలు, నాటకాలు, వసంతోత్సవాలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా

కళకళలాడుతుంది. రాబర్ట్ బర్న్స్ కవి ఇక్కడివాడే – హైలాండ్ ఉత్సవాలకు రాజ కుటుంబం తరలివస్తుంది. శతాబ్దాల చరిత్ర గల్గిన గ్లామిన్, కాడర్ కోటలు – మెక్‌బెత్ ప్రేతాత్మల ఘోషతో మార్మోగుతుంటాయి.

స్టెర్లింగ్ కోట:

ఈ మధ్య వచ్చిన 'బ్రేవ్ హార్ట్' సినిమాలో విలియమ్ వాలెస్ 'స్కాట్స్'ని యుద్ధసన్నద్ధులను చేసింది ఇక్కడే.

సర్ ఆర్థర్ కానన్ డాయిల్ పేరు విన్నారు కదా. 'షెర్లాక్ హోమ్స్' సృష్టికర్త. ఆయన జన్మస్థలం ఎడిన్‌బరో నగరమే. ఇంత చెప్పి అసలు విషయం దాస్తే ఎలా? బోర్డర్స్ వుల్లెన్ ట్రయిల్ మీదుగా – స్పేవాలీకి వెళ్ళండి. ఇక్కడే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'స్కాచ్ విస్కీ' తయారీదారుల కుటుంబాలు ఉంటాయి.

తప్పనిసరిగా స్కాచ్ తయారీని తెలుసుకోవలసిందే. ఇక్కడే పండే గోధుమలు, గలగల పారే సెలయేరులు – ఈ స్కాచ్ తయారీకి మూలాధారం. తరతరాలుగా వస్తున్న తయారీ మర్మాలు, రహస్యాలు – ఆ కుటుంబాలకే సొంతం.

12 సంవత్సరాల నుంచి 27 సంవత్సరాల వరకు నేలమాళిగలలో నిల్వవుంచి చెక్క పీపాలలో – తర్వాత్తరాలవారికి అందిస్తారు. అప్పుడు సంవత్సరాలవారీగా బయటకు తీసి, ఎన్నో రకాల కలపోతలతో స్కాచ్ తయారు చేస్తారు.

నిర్మలమైన గాజుగ్లాసులో, ఇంత స్కాచ్ పోసి, వెనుక దీపాన్ని పెట్టి చూడండి – సూర్యుడు అస్తమిస్తున్న బంగారు రంగు కనపడుతుంది.

మేలిమి బంగారాన్ని కరిగించి శీతల గంగాజలాన్ని జోడించి గ్లాసులో పోసి ఒక మంచుకళిక వేయండి.

ఇక రుచి?

ఇక్కడ ఒక తమాషా ఉన్నది. ఈ తయారీదార్ల చుట్టుప్రక్కల మధుపానం నిషిద్ధం – ఎవరూ కూడా ముట్టుకోరాదు. కాని మనలాంటి యాత్రికులకు – అదీ మీ వరుస నచ్చితేనే – కాస్త ఇస్తారు– టీ మగ్గులో పోసి, బయటకు కనపడకుండా.

ఇప్పుడు చూడండి – దాని రుచి, తరతరాల అనుభవం, సెలయేళ్ళ మాధుర్యం – దొంగచాటుగా – బెదురుచూపులతో సేవిస్తున్నామన్న వింత అనుభూతి – ఇవన్నీ కలిపి మీ గొంతులో అలా జారిపోయేది, అమృతమే. ఆపైన నీలాంబరపుటంచులు తాకినట్లే. ఇక్కడ 'వీడ్రామ్' అని అంటారు, ఇలా ఇచ్చే

మధువుని. 'విస్కీ ఫెస్టివ్'లో వాసన ఎలా చూడాలి – రుచి ఎలా తెలుసుకోవాలి, విస్కీతో వంటలు ఎలా చెయ్యాలి – ఇలా ఎన్నో ఎన్నో ప్రదర్శిస్తారు.

అబర్డీన్:

గ్రానైట్ నగరమని అంటారు అంతా తళతళమెరిసే గ్రానైట్ రాళ్ళతో అతకబడిన కట్టడాలే దర్శనమిస్తాయి. రాజకుటుంబం ఎక్కువగా గడిపేది అబర్డీన్ నగరంలోనే.

నాటింగ్‌హామ్:

రాబిన్‌హుడ్ సాహసాలకు నాటింగ్‌హామ్ నగరానికి అవినాభావ సంబంధం ఉన్నది. షెర్‌వుడ్ చరిత్రలో ప్రతి పుటలో రాబిన్‌హుడ్ పేరు చెక్కబడి ఉంటుంది. నాటింగ్‌హామ్ నగరంలో – వీధి వీధికి రాబిన్‌హుడ్ గుర్తులు ఉంటాయి. ఎప్పుడూ ఏదో పండగ జరుపుతుంటారు. ఇక్కడ వనితలు 'లేసు' తయారీలో ఆరితేరినవారు. డి. హెచ్. లారెన్స్, లార్డ్ బైరన్ ఇక్కడికి దగ్గర్లో నివసించినవారే.

వేల్స్:

బ్రిటన్‌లో ఎత్తైన పర్వతాలకు, పురాతన భాషా ప్రక్రియకు, సనాతన సంస్కృతికి, ఏమాత్రం మరకలు పడని ప్రకృతికి, రాజప్రాసాదాలకు, కోటలకు, లోతైన లోయలకు వేల్స్ ప్రఖ్యాతిగాంచినది. అంతేకాదు ఇక్కడి ప్రజలు స్కాట్ పౌరుల వలెనే ఎంతో ఆదరంగా, ఎంతో ఆనందంగా, మీకు స్వాగతం పలుకుతారు. మిమ్మల్ని తమ అతిథిలాగానే భావిస్తారు. మీకు ఏ సాయం కావాలన్నా చేయటానికి సిద్ధంగా




స్కాట్‌లాండ్



స్కాచ్ విస్కీ

ఉంటారు. ఆడవాళ్ళు ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఎంతో చైతన్యంతో కళకళలాడుతుంటారు. మగవారు, ఎంతో మర్యాదగా, చక్కని బట్టలు వేసుకుని – ఏ చీకుచింతా లేకుండా తిరుగుతుంటారు. వీరిని చూస్తుంటే నిజంగానే మనకు ఒక రకమైన అసూయ కలుగుతుంది. వీరి జీవనంలోనికి యాంత్రిక ప్రభావాలు అంతగా రానీకుండా, సాంకేతిక ప్రమాదాలకు కాస్తంత దూరంగా, ప్రకృతి ఒడిలో, ప్రశాంతంగా బ్రతుకుతున్నారు. చేపలు పట్టడం, వ్యవసాయం, పశుపోషణ వీరికి ప్రధాన వ్యాపకాలు. యాత్రికుల కోసం ఏడాది పొడవునా ఏదో పండగ జరుపుతుంటారు. మీరు స్కాట్‌లాండ్ వదలి వచ్చినా స్కాట్ పౌరుల మర్యాదలు, మర్మగర్భితమైన పురాతన ప్రాసాదాలు, కోటలు, స్వచ్ఛమైన సెలయేళ్ళు, దిగంతాలకు పరచుకున్న పచ్చికబయళ్ళ పచ్చదనం, స్కాట్ విస్కీ వెచ్చదనం మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి. మళ్ళీ రమ్మని పిలుస్తుంటాయి.


The High Court of Justiciary building, Edinburgh, the supreme criminal court in Scotland


NHS Scotland's Queen Elizabeth University Hospital, Glasgow. It is the largest hospital campus in Europe



రోమ్

"రోమ్ నగరంలోని గాలి అంతా క్లియోపాత్రాని చూడ్డానికి వెళ్లిందా? ఇంత ఉక్కపోస్తోంది.." అన్న షేక్స్పియర్ మాటలు గుర్తుచేసుకుంటూ రోమ్ మహానగరం ప్రవేశించాం. రోమ్ నిజంగా మహానగరమే. రోమ్‌లో తిరుగుతుంటే చరిత్రలో నడుస్తున్నట్లే. చరిత్రలోని వ్యక్తులు మీకు ఎదురవుతున్నట్లు, అడ్డు తగులుతున్నట్లు కూడా అనిపిస్తుంది.

రోమన్లు – సొగసుతో తిరుగాడుతుంటారు – ప్రపంచంలో రోమ్‌కుగల ప్రత్యేక స్థానమేమిటో – చరిత్రలో వారి పూర్వీకుల ఔన్నత్యం ఏమిటో ప్రతి పౌరునికి తెలిసినట్లు తలెత్తి నడుస్తుంటారు. పురుషులు, స్త్రీలు కూడా ఎంతో అందంగా ఉండటమే కాదు – వారి అందాన్ని గర్వంగా ప్రదర్శిస్తారు కూడా.

సెంట్రల్ రోమ్‌లో ప్లాజా హోటల్ దిగాము. సిబ్బంది ఎంతో స్నేహపూర్వకంగా సేవలందించారు. మేనేజర్ నాకో సలహా ఇచ్చాడు– "రోమ్ చూడదలచుకుంటే, వీలయినంతగా నడిచి చూడండి – సిటీబస్‌లో తిరగండి" అని. మా నడక యాత్రలో (నాతో నలుగురే వచ్చారు) అద్భుతమైన రాతి కట్టడాలు చూశాము.



రోమ్ నగరం

గుండ్రని స్తంభాలతో ఎత్తైన వరండాలు దాటుకుంటూ మైళ్ళ తరబడి తిరిగాము – ఫుట్‌బాల్ పోటీలు జరిగిన స్టేడియం లోపలికి వెళ్లి చూశాం. ఇంకా, ఎన్నో శతాబ్దాల పూర్వం నుండి సంతరించుకున్న నాగరకతా వాసనలు– ఇప్పటి ఆధునిక జీవన విధానానికి అనుకూలమైన పరిసరాలు – వీటి మధ్య సున్నితమైన సమతుల్యాన్ని కాపాడటానికి రోమన్లు పడే శ్రమను మీరు కొనియాడక తప్పదు.

2వ శతాబ్దంలో కట్టిన పాంథియన్ (Pantheon) ఇప్పటికి చెక్కు చెదరలేదు. సిటీబస్‌లో ఎక్కి ఎక్కడ దిగాలో తెలియక ఎన్నోసార్లు దారి తప్పాము. పోలీసులనడిగి గమ్యానికి చేరాము. మళ్ళీ నడకతో ఆ ప్రాంతం అంతా తిరిగాము. ఎంతటి అద్భుతమైన కట్టడాలు – ఎంతటి శిల్ప నైపుణ్యం– తిరగటానికి కాళ్ళు – చూడటానికి రెండు కళ్ళు చాలవు. కట్టడాల ప్రత్యేకత– వాటి పరిమాణం – తర్వాత వాటి నగిషీ – ప్రతి అడుగు – ఎంతో విలువైన కళాఖండాలతో నింపబడి ఉంటుంది. “రోమ్ ఒక రోజులో కట్టబడలేదు...” అనే నానుడి అక్షరాలా నిజం. ఎన్నో తరాలు – ఎందరో కళాకారులు తమ నైపుణ్యాన్ని మీ కళ్ళ ముందుంచారు. అది చూడటం ఒక అదృష్టం. ఇలా రోమ్‌లో మూడు రోజులు తిరిగాము. ఎన్నిసార్లు దారులు తప్పినా, అందమైన ఆడదొంగలు మా జేబులు కొట్టడానికి ప్రయత్నించినా, బట్టల షాపుల్లో లైవ్ మ్యూజిక్ వింటూ కూర్చున్నా, స్పానిష్ స్టెప్స్ ఎక్కి నగర సౌందర్యాన్ని, పౌరుల ఫ్యాషన్ ప్రదర్శనల్ని, పూల దొంతర్లని, దీపాల కాంతుల్లో వెలిగే యువతీ యువకుల ఆనందాన్ని తిలకించాము – అలసట అనిపించలేదు (రాత్రికి కాళ్ల నొప్పి తప్పలేదు) రోమ్‌లో ముఖ్యమైన ప్రదేశాలు – పార్లమెంటు Palace Colossium, పురాతనమైన నీటిపారుదల విధానం, అంతులేని చర్చిలు, టైబర్ నదీ ప్రవాహం, Cine Citta (టైబర్ – Hollywood) ప్రపంచానికి సోఫియా లారెన్స్‌ని అందించిన ప్రదేశం. 1942లో ముస్సోలిని WORLD FAIR పెట్టాలని పథకం కాని – యుద్ధ కారణంగా విరమించాడు.

ఇటలీ గతమెంతో ఘనకీర్తి గలిగినా – పారిశ్రామికపరంగా – పర్యాటక దేశంగా ఎంతో ముందు ఉన్నది. కార్లు కుప్పలు కుప్పలుగా ఉంటాయి. స్కూటర్లని రూపొందించిన నగరం. వెస్పా 75 ఏళ్ళుగా వాడుతున్నారు. ఇక్కడ, వంతెనల్ని కూడా కళాఖండాలతో అలంకరించారు. వీధి దీపాలు కూడా సాదా సీదాగా వుండవు. నగిషీలతో నిగనిగలాడుతుంటాయి.

వాటికన్:

ప్రపంచంలో రోమ్‌కు ఎంతటి ప్రత్యేక స్థానముందో – రోమ్‌లో వాటికన్ సిటీకి అంత ప్రత్యేకత ఉంది. ఒక మహానగరంలో – ఒక చిన్న దేశ ప్రతిపత్తి గల ప్రదేశం వాటికన్. ప్రపంచాన్ని తరతరాలుగా ప్రభావితం చేసిన ఒక మతానికి ప్రధాన కేంద్రంగా – ఆ మత పీఠాధిపతికి రాజధానిగా వర్ధిల్లుతున్న వాటికన్ ప్రత్యేకత అద్భుతం. అక్కడి బాసిలికా ఒక మహాద్భుతం. మైఖేల్ ఎంజిలో శిల్పాలు అంగుళం – అంగుళం ఈ పురాతన చర్చిలో అలంకరించారు. చర్చిలో అడుగుపెట్టగానే అంతా నిశ్శబ్దంగానే ఉండాలి. నిశ్శబ్దంగా తిరుగుతూ శిల్పాలు తిలకించాలి. 1452లో మొదలుపెట్టబడి దాదాపు 200 సంవత్సరాల తర్వాత పూర్తయిన బాసిలికా డిసాన్‌పెట్రో (St.Peter's Basillica) లక్షమంది నిలబడి ప్రార్థన చేయటానికి వీలుగా ఉంటుంది – డోమ్ పూర్తవటానికి 24 సం॥ పట్టింది.

తైలవర్ణ చిత్రాలు – డా.విన్సీ, మైకెలేంజలో, రాఫెల్ చిత్రాలు, శిల్పాలు, ఎక్కడి కళాకారులు? ఎక్కడి శిల్పకారులు – ఏమి పాలరాతి విగ్రహాలు – నిజంగా మనిషిలోని దేవుణ్ణి బైటకి తెచ్చే మహానుభావులు అలంకరించిన ఈ బాసిలికా చూడకపోతే జీవితానికి పరిపూర్ణత లేనట్టే అనిపిస్తుంది. 'బాసిలికా' లోపల నిశ్శబ్దంగా ఉండాలి – ఎందుకు? ఆ ఉలి చప్పుళ్ళు – ఆ కుంచె రాపిళ్ళు – ఆ కళాకారుల విషాద వినోద (Agony & Ecstacy) భరితమైన



వాటికన్ – సెయింట్ బాస్లికా

నిట్టూర్పులు వింటానికే. గుండ్రని మెట్లపైకి వెళుతున్నా – వీళ్ళు అలంకరించకుండా వదిలిన ఒక్క అంగుళం కూడా కనపడలేదు. ఒక చీకటి నీడలో ముద్దులాడుకుంటున్న ప్రేమజంటను చూసి – అవి కూడా శిల్పాలేమో అని భ్రమపడ్డాను.

నాకు గైడ్ అన్న మాటలు గుర్తు వచ్చాయి. బాసిలికా చూడటానికి ఒక రోజు చాలు – ఒక వారం చాలు – కాని ఒక సంవత్సరం చాలదు... మా అదృష్టం – ఆ రోజు (బుధవారం) జాన్ పోప్ పాల్–2 దర్శనమిచ్చే రోజు – మూడో అంతస్తులో ఒక కిటికీ దగ్గరకు వచ్చి కనపడతారు – అభివాదం చేస్తారు– చూపరుల ఆనందానికి అవధులే లేవు.



రోమ్ స్టేడియం

ప్రపంచ వ్యాప్తంగా – పేరు గడించిన ఇటాలియన్ పీజా' వాటికన్‌లోనే తిన్నాము. వాటికన్ పోలీస్ వేరు – పాస్‌పోర్ట్ వేరు – వాటికన్ పౌరసత్వం వేరు – పర్యాటకులను ఇబ్బంది పెట్టే ఆంక్షలు ఏమీ లేవు నగరం మధ్యలోని ఈ దేశంలో. వాటికన్ రక్షణ – స్విస్ పోలీసు నిర్వహిస్తుంది!

ఆ రాత్రి హోటల్‌కు వచ్చి – ఇండియా ఫోన్ చేశాము – లక్షలీరాలు ఖర్చు. ఒక స్నేహితుడు ఇక్కడి అలవాటు ప్రకారం – ఫోనులో కేకలు పెడుతున్నాడు. 5 నిమిషాల తర్వాత – హోటల్ గెస్టులు – హోటలు పోలీసులు అందరూ ఆ రూము బైట చేరి – లోపల ఏదో జరిగిపోతోందని కంగారు పడ్డారు. మర్నాడు లక్ష ఖర్చు పెట్టి ఇంటికి ఫోన్ చేశాము అని గొప్పలు చెప్పుకున్నాము. "వెనిస్" వెళ్ళటానికి ప్రొద్దున్నే సిద్ధమైనాము.

వెనిస్ నగరం

నాలుగు మైళ్ళ రాతి వంతెన దాటి వెనిస్ నగరంలో అడుగుపెట్టినది మొదలు నాకు సాక్షాత్కరించినది – ఏ దేవతలో కలలు కని, ఆ కలల స్వరూపాన్ని మనముందుంచి – "చూడండి! మీ ప్రపంచంలో ఇటువంటి ప్రదేశం వుందా? లేదు. అందుకే మీరు చూడటానికి ఈ స్వప్నాన్ని 'నిజంగా' మీకు వదిలి వెళుతున్నాం అని అడుగడుగునా అనిపిస్తుంది. మరి అటువంటి 'వినీజియా' గురించి నేను 'చూసింది' కొంతవరకూ తెలియజేయగలనేమో గాని, నా అనుభూతిని మీకు వివరించగల భాషా సంపత్తి నాకు లేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఇదేమి నగరం? నగరమంటే రహదారులు వుండాలి కదా. మరి ఈ కాలువ లేమిటి? వాహనాలో, కారులో, బస్సులో కనీసం సైకిళ్ళయినా కావాలికదా తిరగటానికి? మళ్ళీ వీటికి ట్రాఫిక్ సిగ్నల్స్ కూడానా? భవనాలు ఎక్కడ కడతారు? అవి ఎలా నిలబడతాయి? ఇంట్లోంచి రాగానే మీరు బయటకు ఎలా వెళ్తారు, మీ చుట్టూ వరదనీరు నిండుగా వుంటే? మరీ ఈ నగరవాసులు ఈ నీటి మధ్యలో ఎలా జీవిస్తున్నారు. ఈ నీటి అంచున ఇన్ని ప్రార్థనా మందిరాలు ఎందుకు? ఈ దీపాల కాంతులు నీటి అలలపై



బెల్ టవర్స్

తేలుతున్నాయేమిటి – ఎక్కడ ఉన్నాయి ఈ దీపాలు నీటిపైనా – నీళ్ళలోనా? ఆ దూరాన ఆ ఎత్తైన టవర్ ఏమిటి? నీలికాంతుల్లో ఆకాశం నుండి వ్రేలాడుతుందా? ఈ నీటిలో నుంచి పైకి వచ్చిందా? అబ్బే... ఇది నిజం కాదు – నిజంగా ఇది నగరం కాదు. This is unreal City!

ఆడ్రియాటిక్ సముద్ర(తీర)పు 'లగూన్'లో ఈ పట్నం కట్టబడింది. ఎంతో శక్తివంతమైన సామ్రాజ్యానికి 15వ శతాబ్దంలో రాజధానిగా వెలుగొందింది. తూర్పు దేశాలతో ఎన్నో శతాబ్దాలుగా నౌకావ్యాపార సంబంధాలు కలిగి – తూర్పు పడమరలకు ముఖద్వారంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న నగరమిది. తర్వాతి కాలంలో రోమన్లు ఆక్రమించుకుని రోమ్ సామ్రాజ్యంలో భాగంగా చేసుకున్నారు. ఈ స్వప్నాన్ని వాళ్ళు దోచుకున్నారు చారిత్రకపరంగా.

లక్షల 'పైన్‌వుడ్' చెట్లను నిలువునా దింపి, వాటిపైన చెక్క ప్లాట్‌ఫారాలు ఏర్పరిచి, ఆపైన ఇటుకలతో, రాళ్ళతో కట్టిన భవనాలు, ఒకటి కాదు, రెండు కాదు మొత్తం నగరమంతా అదేవిధంగా ఎలా కట్టారు – ఎందుకు కట్టారు అని అడిగితే సమాధానం లేదు – రాదు. ఇది ఖచ్చితంగా దేవతల పనే.

వెనిస్ నగరాన్ని చూద్దాం రండి. ఇక్కడ నడకదారులే తప్ప ఇంకో దారి లేదుమరి. రెండు రోజులు పడుతుంది. ఈ ఊరే ఒక పెద్ద మ్యూజియం. అందులో మళ్ళీ అక్కడో చిన్న మ్యూజియం, ఇక్కడ మ్యూజియం, చరిత్ర పుటలు విప్పే ప్రదేశాలు. 'గ్రాండ్ కానాల్' ఊరి మధ్యలో 'మౌంట్ రోడ్‌లా' వెళ్తుంది. దాన్నుంచి చిన్ని కాలవలు ఊరంతా కలుపుతూ తిరుగుతూంటాయి. ఇక్కడ చిన్ని పడవలే టాక్సీలు. 'వేపొరొట్టి'లే బస్సులు. 'వేపొరొట్టి' (Veporetti) అంటే ఒక లాంచిలాంటిది. ఇందులో 300 మంది ప్రయాణం చెయ్యవచ్చు. వెయ్యిమంది ప్రయాణం చేయగల నౌకలు కూడా తిరుగుతుంటాయి.

రైల్వే స్టేషన్ నుంచి (ఈ రైలు మార్గమే ఐరోపాతో బంధం) 'లిడో' వరకూ గ్రాండ్ కానాల్ నడుస్తుంది. 'వేపొరొట్టి'లో ఒక గంటపైన పడుతుంది ప్రయాణం. ఈ దారిలో ఎన్ని కళారూపాలో ఎన్ని 'కలల' స్వరూపాలో అందులో కొన్ని– 1. పాలెస్ ఆఫ్ డోజెస్ – ఇది తూర్పు దేశాల వాస్తు కళతో నిర్మింపబడింది. స్తంభాల అలంకారాలు చూసి తీరవలసిందే. 2. ఆయుధాగారం పురాతనమైనది. ఇక్కడ Chastity Belt చూడవచ్చు. వేరోనీస్, టైషియన్ చిత్రకారుల అద్భుత చిత్రాలు

ఉన్నాయి. 3. ఇంకా ఇలా వరుసగా 200 రాజప్రసాదాలు బారులు తీరి ఈ నీటి మీద తేలుతుంటాయి ఎన్నని వర్ణించను? ఆ చివర వున్నది 'లీడో'. 4. **లిడో :** ఆ దూరాన మైదానం ఏమిటి? అరె? ఈ నీళ్ళలో బీచ్ కూడానా? ఆ తెల్లటి ఇసుక తిన్నెలకు ఆ నల్లటి నీళ్ళకీ నడుమ వాళ్ళెవరు? మత్స్యకన్యల్లా బూడిద రంగు వెలుతురులో అందాలు ఆరబోసుకున్నారు ఎవరికోసం? ఇది నిజమా...?

St. Marks Square:

వెనిస్ నగరానికి ఇది పెద్ద కూడలిలాంటిది. ఈ స్క్వేర్‌లో ఒక బెల్ టవర్. ఎంత ఎత్తు. (160 అడుగుల పైన) పైకి ఎక్కుదాం రండి. ఇంతపై నుంచి చూస్తే – ఈ నగరం అంతా ఒక పెద్ద నావలాగా నీళ్ళలో తేలుతున్నట్లు ఉంటుంది. మీరు సెయిల్ మాస్ట్ మీద ఉన్నట్లు ఉంటారు. ఈ బెల్ స్క్వేర్‌లో పెద్ద మొనాస్టరీ వున్నది. ఎన్నో వేలమంది నివసించవచ్చు. ప్రతి రోజూ వేలమంది వచ్చి చూసి వెళ్తుంటారు.

చర్చి వైభవం:

ఇక్కడి చర్చి ఒక అద్భుతం. దీనికి ఒక కథ కూడా ఉన్నది. 828 సంవత్సరంలో నలుగురు వెనిస్ వాసులు (ఒక సన్యాసి, ఒక మత గురువు, ఇద్దరు వ్యాపారులు) 'కుట్ర' చేసి సెయింట్ మార్క్స్ అవశేషాలను అలెగ్జాండ్రియా చర్చి నుంచి దొంగిలించి వెనిస్ తీసుకువచ్చారు. ప్రాణాలకు తెగించి ఆ అవశేషాలను హై అల్టార్ క్రింద ఉంచి, పౌరులు ఇచ్చిన విరాళాలతో ఆ బాసిలికా నిర్మించారు. ఈ ప్రార్థనా మందిరాన్ని మెరిసిపోయే మొజాయిక్‌తో, లోపలి భాగమంతా ఇంద్రధనస్సు రంగుల



వెనీస్ గ్రాండ్ కెనాల్

గాజుతో నింపివేశారు. బంగారు పూతతో మెరిపింపజేశారు. మీరు నమ్మరు. 700 సంవత్సరాలు పట్టింది. ఇది పూర్తిగా అలంకరించటానికి. అందుకే దీన్ని చర్చ్ ఆఫ్ గోల్డ్ అని అంటారు. లోపల బాల్కనీలో ఎక్కి క్రింద కలయచూస్తే ఈ ఫ్లోరింగ్ సరళి (Pattern) మీకు అద్భుతంగా సాక్షాత్కరిస్తుంది. ఇంకా 13వ శతాబ్ది కాలంనాటి నాలుగు ఇత్తడి గుర్రాలు కాన్‌స్టాంటినోపుల్ నుంచి తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. అంతేకాదు, ఇక్కడ ఆల్టర్ పీస్ చూడాలి. రత్నఖచితమై ధగధగ మెరిసే బంగారు క్రాస్ చూసి తీరాలి. దాదాపు 2500 జ్యూవెల్స్ పొదిగి 13వ శతాబ్దంలో చేసిన దీనిలో ఎన్నో పవిత్రమైన అవశేషాలు ఉన్నాయి. ఇలా ఎన్నని చెప్పను?

అందుకే... ఇది చర్చ్ ఆఫ్ గాడ్ అంటారు. అవును దేవుడే దిగి వచ్చి ప్రార్థన చేసి వెళ్ళేవాడు. మరి ఇది దేవతల నగరం కదా!

అమ్మకానికి ఆక్టోపస్‌లు :

మీరు నడుస్తుంటే చేతులు చాపండి ప్రక్కలకు. రెండు ప్రక్కల భవనాలు అంటుకోవచ్చు! అంత సన్నని దారులు. ఆ అద్దాలలోంచి చూడండీ. 'ఆక్టోపస్'లు అమ్ముతున్నారేమిటి! మామూలు నగరాల్లో బట్టలు అమ్ముతారు కదా – మరి ఇక్కడ అవి కనపడవు. వింత చేపలు వింత కర్రలు – వింత వింత కొమ్ములు – సొర చేప 'దంతాల'తో చేసిన వస్తువులు – మహాద్భుతమైన 'గ్లాసు'లు – ఇంకా ముందుకువెళితే ఒక పొడుగాటి దారి – మెట్లదారి. మధ్యలో చిన్న ఫౌంటెన్. ఇదేమిటి ఈ ప్రదేశమెందుకు? ఇక్కడే పెళ్ళికాని అమ్మాయిలు అబ్బాయిలు కలుస్తారు. 'Boy meets girl' వాళ్ళు పలకరిస్తారు, పూలిస్తారు. వీళ్ళు నవ్వులు రాలుస్తారు. ఏదో ఒక జంట ఒకటవుతుంది ఆరోజు!

ఇంకా ముందుకు వెళితే ఇక్కడో బ్రిడ్జి – దీని పేరు 'రియల్టీ బ్రిడ్జి' ఇక్కడే నాకు హైదరాబాదు ఇంజనీరు ఒకాయన కలిశాను (అప్పుడనిపించింది ఇది నిజమని) ఆయన ఆ బ్రిడ్జి కట్టిన విధానం చెప్పారు. మళ్ళీ నాకనిపించింది ఇది మనుషుల పని కాదని! ఇప్పుడే స్క్వేర్ సెంటర్‌కు వచ్చాం. ఎన్ని వేల పావురాలు. అడుగులు చూసి వెయ్యాలి. అవి తప్పుకోవు. మనమే జాగ్రత్తగా నడవాలి. జొన్నలు పట్టుకొని చేయిచాపండి. తర్వాత మీరు కనపడరు. మీమీద అన్ని పావురాలు వచ్చి వాలతాయి. ఏదైనా కొంటిది వుంటే మీ నెత్తిమీద రెట్ట కూడా వెయ్యవచ్చు!

రెస్టారెంట్లు:

అపుడే చీకటిపడింది. ఈ స్క్వేరంతా రెస్టారెంట్లు పెట్టేస్తున్నారు. కుర్చీలు సర్ది బల్లలు వేసి, పైన తెల్లని గుడ్డవేసి డైనింగ్‌కి సిద్ధం చేస్తున్నారు. ప్రతి రెస్టారెంట్‌కి ఒక ప్లాట్‌ఫాం ఉన్నది. అక్కడ ఒక పియానో దాని ముందు పియానిస్ట్. ఒక రెస్టారెంట్‌కు వెళ్ళి టీ ఆర్డరిచ్చి ప్లాట్‌ఫాం ఎక్కి పియానిస్ట్ దగ్గరకు వెళ్ళాను. నా కోసం ఒక బెతోవెన్ (సి.5) వాయించగలరా? అని అడిగాను. అతను నన్ను చూసి వెళ్ళి కూర్చోండి అని సైగ చేశాడు. (ఇతను కూడా బెతోవెన్ లాగా చెవిటివాడా?) కూర్చున్నాము. టీ కూడా వచ్చింది. అప్పుడు మొదలుపెట్టాడు. ఖచ్చితంగా నేను అడిగిన నంబర్. ఆ సాయంత్రం సముద్ర గాలిలో ఆ స్వరాలు తేలివస్తుంటే ఈ ఓపెన్ ఎయిర్ రెస్టారెంట్‌లో ఈ పొగలు క్రక్కే టీ సేవిస్తూ చుట్టూ పావురాల సందడిలో దీపాలో, నక్షత్రాలో తెలియని కాంతిలో ఇది నిజమో! కలయో! తెలియని అయోమయంలో.... అవును ఇది నిజం కాదు - ఇది మిథ్యా నగరం! జనాన్ని ఆకర్షించటానికి డిస్నీలాండ్ కట్టారు అమెరికాలో. ఈ వెనిస్ ఎందుకు కట్టారు! ఇన్ని లక్షల మందిని ఆకర్షించటానికి మాత్రం కాదు. కాని ఎంతమంది పర్యాటకులు ఎన్ని జాతులవారు ఎక్కడెక్కడి నుండి వచ్చి చూసి, అద్వితీయమైన అనుభూతితో తిరిగి వెళ్తున్నారు. ముఖ్యంగా ఐరోపా వాసులు ఇక్కడికి హనీమూన్‌కి వస్తారు. ఈ బెల్ స్క్వేర్‌లోనే హోటల్స్ ఉంటాయి. పగలంతా నడిచి తిరిగి అద్భుతాలన్నీ చూస్తారు. రాత్రవగానే 'గండోలా' ఎక్కుతారు. ఆ నీటి అలలపై, ఆ గండోలాలో మెల్లిగా తేలియాడుతూ, ఆ గండోలాకి ఒక నక్షత్రంలాంటి లాంతరు కడతారు - రాత్రంతా తిరుగుతారు. ముద్దుల్లో, మబ్బుల్లో తేలుతున్నట్లు ఊహాలోకంలో విహరిస్తున్నట్లు.



వెనీస్‌లోని ఒక రెస్టారెంట్

'గండోలా' ప్రేమ జంట పడవ:

సన్నగా, పొడవుగా ముందు బాగా ఎత్తుగా యిరుకు వుండి వెనుక ఇద్దరు కూర్చుండటానికి వీలుగా వెడల్పుగా నిగనిగలాడుతూ వుంటుంది. గండోలా నడిపేవాడు ప్రత్యేకమైన దుస్తుల్లో పెళపెళలాడుతూ ఉంటాడు. దానికి చుట్టూ బంగారు రంగు అంచు ఉంటుంది. ముందు కొన పైకి వంగి ఆర్చిలాగా వుంటుంది. అక్కడ ఎత్తులో ఒక ఇత్తడి లాంతరు కడతారు. 15 అడుగుల పైనే పొడవు ఉంటుంది. ఇది ఇక్కడ ముగ్గురే తయారుచేస్తారు. ఒక్కోటి 3, 4 నెలలు పడుతుంది. మూడు రకాల చెక్క వాడతారు. 60 ఏళ్ళుగా తయారు చేస్తున్న వృద్ధుడు గలియాని గుపోని అనే ఆయన్ని కలిశాను. ఆయన అన్నాడు 'నా ప్రతి పడవ ప్రేమ జంట కోసమే తయారుచేస్తాను. నాలో ప్రేమకు కొదవ లేదు' అని. ఒక గండోలా ఖరీదు 10 వేల డాలర్లు ఎప్పుడూ 500 గండోలాలు వెనీస్ నగర 'వీధుల్లో' విహరిస్తుంటాయి ప్రేమికుల్ని కడుపులో దాచుకుని.

గ్లాస్:

'వెనిస్ గ్లాస్ చాలా ప్రాచుర్యంకలది. గ్లాస్ ఫ్యాక్టరీకి వెళ్ళాము. అది ఫ్యాక్టరీ కాదు. ఎన్నో ఏళ్లుగా ఆ వృత్తిలో పండిపోయిన కళాకారులు తీర్చిదిద్దే కళారూపాలు ఈ గ్లాసులు, కప్పులు, సాసర్లు, వైన్ సెట్టులూ, టీ సెట్టులు. ఇసుక కరిగించి నోటితో గాలి వూది ఎన్నో స్వరూపాలను సృష్టించి బంగారు నగిషీలు దిద్ది ప్రపంచానికి అందిస్తున్న ఈ వృత్తి కళాకారులు, ఇక్కడి ప్రార్థనా మందిరాల్ని గాజు పలకతో, వివిధ వింత రంగులు వేసి కళారూపాలు సృష్టించారు. ధగధగలాడే ఈ గాజు బంగారాన్ని కొనటానికి మీరు ఎంతో సంపన్నులయి వుండాలి. అందుకని ఇది కూడా ఒక కలలాగే మిగిలిపోతుంది. మనకి!

తిరిగి...

తిరిగి 'వేపరొట్టి' ఎక్కి గ్రాండ్ కానల్ దాటి అడ్రియాటిక్ సముద్రపాయల మీదుగా వెనిస్ నగరాన్ని వదిలి కదిలాము. ఈ కల మెలమెల్లగా దూరంగా కరిగిపోతున్నది. నీళ్లలో తేలియాడుతూ దీపాల ప్రతిరూపాలతో నీటికి నగరానికి మధ్య ఏమీలేదని నీటిలో ఊగేది పడవకాదు ఆ నగరమని, వెళ్ళిపోయేది నీవు కాదు ఆ స్వప్నమేనని ఈ దూరతీరాలలో చీకటిలో కలిసిపోయేది కలయేనని తెలుసుకొని తేరుకోవటానికి చాలా కాలం పడుతుంది. నన్ను నమ్మండి! ఇది నిజం!

పారిస్

పారిస్! ఫ్రాన్స్‌కు రాజధాని! /ఐరోపాకు సంస్కృతీ రాజధాని!!
ఫాషన్‌కు ప్రపంచ రాజధాని !

పారిస్ అంటే ఫ్రాన్స్ దేశానికి రాజధాని కాదు. ఒక ఖండానికి, ఐరోపా ఖండానికి రాజధాని, ఫాషన్ ప్రపంచానికి రాజధాని! ఈ మహానగరానికి, ఈ సుందర మహానగరానికి, నిత్య యౌవ్వనం – ఈ సౌందర్యం వన్నె తగ్గనిది – వయసు లేనిది! ఇంత అందమైన నగరం, ఇన్ని అలంకారాలతో, ఇన్ని ధగధగలతో ఈ ధరాతలంపై వెలిగిపోతున్నదంటే – మనిషిలోని సౌందర్య పిపాస, కళాతృష్ణ, నిత్యాన్వేషణే కారణం! అందం ఉన్నచోట తెలివి అంతగా ఉండదని అంటారు. కాని పారిస్ ఎంత సౌందర్యవంతమో, అంత మేధాసంపత్తి గల నగరం. పారిస్ పౌరుల బుద్ధికుశలత ఇక్కడి వాతావరణంలోనే తేలి వస్తూంటుంది. మీరు ఇక్కడి అందాలను ఎంతగా ఆస్వాదించగలరో – అంతగానూ వీరి మేధాపరమైన వాతావరణం మీ మనసు దోచుకోగలదు!

పారిస్ పౌరులు సౌందర్యారాధకులు, వివేకవంతులు, రాజకీయ వితరుణులు, సాహసవంతులు, ప్రగతిపథగాములు, కళాకారులు, కవులు,



ఈఫిల్ టవర్

ప్రేమోపాసకులు, ఐరోపాలో, ప్రపంచంలో వారి స్థానమేమిటో ఖచ్చితంగా తెలిసి మసలుకుంటారు! తత్వవేత్తల, తార్కికుల, ఆలోచనాపరుల దేశం కాబట్టే – నెపోలియన్, పాంపిడో, డిగాల్, మిట్టరాండ్ లాంటి నాయకులు అధికారంలోనికి వచ్చారు. ఎప్పుడూ నవ్యతకోసం తహతహలాడే వీరి అన్వేషణ. ఈ నగరంలో ఎక్కడ ఏదో జరగబోతోంది అని ఎదురు చూసే వీరి ఆదుర్దా, అది తెలుసుకోవాలనే ఉత్సాహం, ఏదో ఏదో చెయ్యాలనే సాహసం, అందుకు కావలసిన వనరులను సమీకరించుకోగల సామర్థ్యం, మనోనిబ్బరం, జీవితం పట్ల ఎంతో మక్కువ, సత్యాన్వేషణ, ఆత్మపరిశీలన – వీటన్నింటితో వీరు కళకళలాడుతుంటారు. ఇక్కడి పౌరులు రాజకీయాలంటే ఎంతో ఉత్సాహం చూపుతారు. ప్రాముఖ్యం ఇస్తారు. చిన్న చిన్న వీధి తగాదాలు కూడా ప్రభుత్వాన్ని పడదోసిన సందర్భాలున్నాయంటే అతిశయోక్తి కాదు.

రాజకీయ నాయకులు ప్రచారం కోసం ఏమైనా చేస్తారు. ఎక్కడైనా ప్రజలు ప్రదర్శన జరుపుతున్నారు, ఆగ్రహంగా ఉన్నారంటే వెంటనే నాయకులు అక్కడకు వెళ్తారు. ప్రదర్శకులు నారింజపళ్ళు, గుడ్లు వాళ్ళపైకి విసురుతారు. నాయకులు ఆ మరకలతో గర్వంగా ఫొటోలు తీయించుకుని పత్రికలకు పంపుతారు– ప్రచారం కోసం. అంత చైతన్యం గల ప్రజలు కాబట్టే రెండు వందల సంవత్సరాల క్రితమే పాలకులపై తిరుగుబాటు చేశారు. (ఫ్రెంచ్ రివల్యూషన్), ప్రజల పాలన సాధించుకున్నారు. తర్వాత రినాయిసాన్స్ పేరుతో సాంస్కృతిక విప్లవానికి కూడా నాంది పలికారు.

ఇక్కడ ఒక తమాషా. ఎవరైనా దేశ నాయకుడు పారిస్ అధికార పర్యటనకు వస్తే – కార్పొరేషన్ వారు ఘనంగా సన్మానిస్తారు. అంతేకాక, పారిస్ ముఖ్య కూడలికి అల్లంత దూరంలో ఒక వీధికి ఆ నాయకుణ్ణి తీసుకువస్తారు. ఆ వీధికి ఆ నాయకుడి పేరో, లేక ఆయన దేశం పేరో పెడతారు. ఆయనతోనే ప్రారంభోత్సవం జరిపిస్తారు. చైనానాయకుడైతే "రూయికాతే" అని పేరు పెడతారన్న మాట. ఈ నాయకుడు ఎంతో సంతోషంతో పొంగిపోతాడు. ఈ కార్యక్రమం అయిపోగానే, ఆ నాయకుడు ఆ వీధి మలుపు తిరగ్గానే ఆ వీధికి పాత పేరు వుంచుతారు. మళ్ళీ మరో దేశనాయకుడు వస్తే ఇదే తంతు నడవాలి కదా.

పారిస్ చూద్దాం రండి:

పారిస్ మధ్యగా చీల్చుకుంటూ శీన్ నది ప్రవహిస్తుంటుంది నిరంతరం. ఎడమవైపు మధ్య తరగతి ప్రజలకు, కళాకారులకు విద్యార్థులకు ప్రసిద్ధి. కుడివైపు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రిష్టియన్ డయిర్, గివించీలాంటి విలాసమూ, ఖరీదైన కుటుంబ వ్యాపారులకు నిలయం. బౌలివార్డ్ అంటే విశాలమైన రహదారి – రూయి అంటే వీధి అని అర్థం. పారిస్ అంతా బౌలివార్డ్, రూయిల పేర్లతో వివరంగా వుంటుంది. టాక్సీ చాలా ఖరీదు. బస్సులు కూడా అంత వీలుగా వుండవు మనకు. కాని ఎంతో చౌకగా, వీలుగా, మనల్ని ఈ మహానగరంలో ఎక్కడికైనా ఏ సమయంలోనైనా చేరవేసేది 'మెట్రో' భూగర్భ రైలు. మొత్తం పధ్నాలుగు రూటులున్నాయి. ఏదైనా స్టేషన్‌కి వెళ్దాం. అదిగో అక్కడ ప్రధాన కూడలి తెలిపే మాప్ వున్నది. మీరు వెళ్ళవలసిన స్టేషన్ గుర్తించి అక్కడ నొక్కండి. అంతే మీరు ఏ రూటులో ఎంతవరకు వెళ్ళి – ఏ స్టేషన్‌లో మారాలో తెలియజేస్తూ రూట్ మాప్ వెలుగుతుంది. మీరు హాయిగా పదిహేను రూపాయలతో ఎక్కడ నుండి ఎక్కడికైనా వెళ్ళవచ్చు.

పగటిపూట పారిస్‌లో:

పారిస్‌లో తిరగాలంటే ఒకరకంగా శ్రమతో కూడిన – అలవి కాని పని. అందుకనే 'సిటిరమా' అనే కంపెనీ రెండతస్తుల బస్సులు ప్రత్యేకంగా సిటీ టూర్ కోసం నడుపుతారు. రెండో అంతస్తులో చక్కగా కూర్చోవచ్చు – చుట్టూ కనపడే అద్దాలు వుంటాయి. ఇయర్ ఫోన్స్ ఇస్తారు. ఏడు భాషల్లో మీరు చూసే ప్రదేశాల వివరాలు వినబడుతుంటాయి. మూడు గంటల పాటు మిమ్మల్ని పారిస్ ప్రధాన వీధులు వెంట, ఎన్నో ముఖ్యమైన ప్రదేశాలు చూపుతూ తిప్పుతుంది. విజయ చిహ్నం, ఛాంప్స్ ఎలిసిన్, నోట్రోడామ్, సెయింట్ చాపెల్, పాలెస్ రాయల్, నెపోలియన్ సమాధి, సైనిక మ్యూజియం, ఈఫిల్ టవర్, బోనపార్టి రోడ్, పాంథియన్, లాటిన్ క్వార్టర్, ఈ విధంగా ప్రధాన దర్శనీయ స్థలాలు చూడవచ్చు. మనలాంటి యాత్రికులకు ఇదొక్కటే మార్గం కూడా చూడటానికి. ఎక్కువ కాలం వుండగలిగితే 'మెట్రో'లో తిరిగి ఎంతో ఆహ్లాదకరంగా, అన్ని ప్రదేశాలు చూడవచ్చు. తప్పనిసరిగా శీన్ నదిలో పడవ షికారు చెయ్యవలసిందే. అదొక అద్భుతమైన అనుభవం. పారిస్ నగరం శీన్ నదికి ఇరువైపులా పరుచుకుని

వున్నది. నదిలో ప్రయాణం చేస్తుంటే మీ ముందు పారిస్ ఒక్కొక్క వీధి తెరిచినట్లు వుంటుంది. ఈఫిల్ టవర్ కట్టి వంద సంవత్సరాలు దాటింది. తప్పనిసరిగా టవర్‌పై నుంచి పారిస్ అందాలు తిలకించవలసిందే. ఆరో అంతస్థులో కాఫీ తాగవలసిందే.

నోత్రోడామ్:

శీన్ నది మధ్యలో 'ఇలెడి లాసిటి' అనే చిన్న పురాతన గ్రామం, తర్వాత తరతరాలుగా వృద్ధిచెంది పారిస్ మహానగరమైంది. ప్రస్తుతం 'నోత్రోడామ్' 'లాసిటి' స్థానంలోనే నిలబడి వుంటుంది. 'నోత్రోడామ్'ను ('సోల్ ఆఫ్ పారిస్') పారిస్ ఆత్మగా అభివర్ణిస్తారు. ఈ గోతిక్ రాతికట్టడం (చర్చి) 1163లో మొదలు పెట్టారు. అప్పటి పారిస్ బిషప్ మారిస్ సల్లీ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగింది. కాని, ఈ అద్భుతమైన నిర్మాణానికి వాస్తు శిల్పి ఎవరో తెలియకుండానే వుండిపోయింది. ఏ ప్రక్క నుంచి చూసినా ఆశ్చర్యం కలిగించే విధంగా ఈ 'నోత్రోడామ్' మీకు సాక్షాత్కరిస్తుంది. దీనిలో 'గులాబి కిటికి' 'చివరి తీర్పు', 'మేరిమాత' ఎంతో నైపుణ్యంతో మలచబడిన శిల్పాలు. అప్పుడు పెట్టిన అద్దాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు.



పారిస్ నోత్రోడామ్

విక్టర్ హ్యూగో:

విక్టర్ హ్యూగో మ్యూజియం తప్పనిసరిగా చూడవలసినది. ఈ మేధావి రాసిన నవలలు, వేసిన చిత్రాలు, ఆయన ఇంటిలో వెల కట్టలేని వస్తువులు అన్నీ చూడాలి. ఆపైన మూడో అంతస్తుకు వెళితే అక్కడ హ్యూగో నివసించిన గదులున్నాయి. 1832 నుండి 1848 వరకు, ఈ గదుల్లో తిరుగుతుంటే హ్యూగో మీ వెన్నంటే వుంటాడు. ఇంటిలోని ప్రతి వస్తువు అతనే మలిచాడు. ఎంతో కష్టపడి అమర్చుకున్నాడు. 'చైనీస్' భోజనాల బల్ల ఎంత చక్కగా చెక్కాడు! ఆయన రాసుకున్న బల్ల, కుర్చీ ఎంత నైపుణ్యంతో అమర్చాడు. ఆరని అతని కళాజ్యోతి ఆ గదిలో మీకు వెచ్చగా తగులుతూనే వుంటుంది.

జోడిపామ్:

జోడిపామ్ ప్రసిద్ధ చిత్రకారులు రినయిర్, వాన్‌గోగ్, మోనెట్. వీరి చిత్రాలు చూసి తీరవలసిందే – తరించవలసిందే. ముఖ్యంగా "ది పిక్‌నిక్", "లి నిఫియాస్' ఎంతసేపయినా చూడవచ్చు. వీటిలో ఎక్కువగా 19వ శతాబ్దానికి చెందిన ఘనమైన దివ్యమైన చిత్రాలున్నాయి. 'లోవరి'లో 'వీనస్' డవన్సి అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు 'మోనాలిజా'తోపాటు వందకు పైగా 'మాస్టర్ పీస్'ల నదగు చిత్రాలున్నాయి. ఇక్కడే నెపోలియన్ కిరీటం, 'లూయీ 15' వజ్రకిరీటం –



స్ట్రీట్ సైడ్ బార్

రత్నాలు పొదిగినవి, చక్రవర్తుల తలలు తన్ని, ఇప్పుడు గర్వంగా నిద్రపోతున్నాయి.

ఫోరమ్ హాల్స్:

అధునాతన షాపింగ్ మాల్, రెండు వందల దుకాణాలు, ఎన్నో హోటళ్ళు, మ్యూజియంలు, ఇలా ఒకటేమిటి ఇక్కడ లేనివి లేవు. పాలరాళ్ళ తెల్లదనం, నియోన్ దీపాల కాంతులతో మెరిసిపోయే ఈ మాల్‌కు ప్రతివారం రెండు లక్షలమంది వస్తుంటారు. కాని ఇక్కడ ఖరీదులు చూసి అందులో ఏదైనా కొనేది కొద్దిమందే.

పారిస్ రాత్రులు:

దీపాల నగరం అని పారిస్‌కి పేరు (సిటీ ఆఫ్ లైట్స్). పారిస్ అందాలు రాత్రులు మరీ మెరిసిపోతుంటాయి. నగరవాసులు రాత్రి అంటే ఒక పవిత్ర యజ్ఞంగా గడుపుతారు. ఒపేరాలు, నాటకాలు, సంగీత కచేరీలు, డిస్కోలు, జాజ్ జాయింటులు ఇలా ఎన్నో, 'లిడో' తప్పనిసరిగా చూడాలి– ఎంతపెద్ద స్టేజి అయినా తిరిగిపోతుంటుంది – వందల సుందరాంగులు కోరస్ డాన్సులు కనులపండుగగా చేస్తారు. ఒక షాంపేన్ సీసా ఉచితంగా ఇస్తారు, 'షో'కి వెళితే. ఇలా మీరు నిద్ర కాయాల్సిందే కాని పారిసియన్లు ఇళ్ళకి వెళ్ళరు. అన్ని వేల దీపాల వెలుగులు ఉదయ కాంతిలో మరుగయితే కాని వీళ్ళ కనురెప్పలు వాలిపోవు. వీరికి అంత చైతన్యం – అంత ఓపిక మరి. ఇంత అందం, కొంచెం తెలివి, కొంత ప్రేమ, కొద్దిగా రాజకీయం, కాస్త ద్రాక్ష మధువు ఇవన్నీ కలిపి మరిగించి ఛాప్స్ ఇలిసిస్ దగ్గర్లో ఒక వరండా రెస్టారెంటులో కాఫీ కప్పులో పోసి మీకందిస్తుంది పారిస్. ఆస్వాదించగలిగినవారే అదృష్టవంతులు. ఎందుకంటే, అంతకుముందే ఆ కుర్చీలో జీన్‌పాల్ సాత్రే కూర్చుని ఉండవచ్చు. ఆ ప్రక్కనే ఆల్బర్ట్ కామూస్ కాఫీ త్రాగి వెళ్ళి వుండవచ్చు.



ఈఫిల్ టవర్ పైనుంచి

తీరాలకు దూరంగా

అట్లాంటిక్ దాటి న్యూయార్క్‌కు...

"లేడీస్ యండ్ జెంటిల్‌మెన్, వెల్‌కం ఎబోర్డ్! దిస్ ఈజ్ యువర్ కెప్టెన్ స్పీకింగ్... లండన్ హీత్రో నుండి టేకాఫ్ చేయబోతున్నాం. బయట ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్. ఇపుడు సమయం పదిగంటల ఇరవయి తొమ్మిది నిమిషాలు. న్యూయార్క్‌కి ఫ్లైయింగ్ టైం తొమ్మిది గంటల ఎనిమిది నిమిషాలు... విమాన సిబ్బంది – సేఫ్టీ ప్రికాషన్స్ చూపిస్తారు. ఎంజాయ్ యువర్ ఫ్లైట్..."

బోయింగ్ 747/400 సరికొత్త విమానం హీత్రో టర్మినల్ ఫోర్ – రన్‌వే టూ నుండి టేకాఫ్‌కి సిద్ధంగా ఉన్నది. దాదాపు 400 వందల మంది ప్రయాణీకులు సేఫ్టీ బెల్ట్‌లు బిగించి బైటకు చూస్తున్నారు. సీటు నెం. 34ఎ కిటికీ ప్రక్క సీటు నుండి చూశాను – ఎండలేని వెలుతురు. లండన్ ఎప్పుడూ ఇలా మసకమసకగానే ఉంటుంది. ఎటుచూసినా విమానాలు. టర్మినల్ బిల్డింగ్ అంతదూరంలో కూలింగ్ గ్లాస్‌లలో మెరిసిపోతున్నది. విమానం నాలుగు రోల్సు రాయిస్ జెట్ ఇంజన్ల హోరు ఒక్కసారిగా పెరిగిపోయింది. నిలిచివున్న అయిదు అంతస్తుల భవనం కదులుస్తున్నట్లు – బోయింగ్ 747/400 రన్‌వే మీద వేగం అందుకున్నది. దూరంగా వున్నవన్నీ – వెనక్కి వెళ్ళిపోతున్నాయి. దాదాపు గం॥ 200 కి.మీ వేగం అందుకుని,



మేఘాలకు పైగా

రెక్కలు క్రిందకి వంచి, ఒక్కో ఇంజన్ 25,000 పౌండ్ల థ్రస్ట్‌తో భారంగా పైకి లేచింది. మెల్లగా టెర్మినల్ బిల్డింగ్, క్రింద విమానాలు కనుమరుగు అయిపోయాయి. పచ్చని చెట్ల మధ్య ఎర్రని ఇళ్లు కనపడుతున్నాయి. ఇంతలో ల్యాండిగ్ గేర్ ముడుచుకున్న శబ్దం వినపడింది. సేఫ్టీలైట్లన్ని ఆరిపోయాయి. ఒక్కసారిగా విమానం అంతా వెలుతురుతో నిండిపోయింది. విమానవతులు – జంప్ సీట్ల నుంచి లేచారు. గాలీలకు వెళ్ళి చకచకా – ప్రయాణీకులకు సాఫ్ట్ డ్రింక్స్ – బీర్ అందించటం మొదలుపెట్టారు. ప్రయాణీకులు రిలాక్స్ అయి కబుర్లు – నవ్వుల్లో వున్నారు – 12 ఛానెల్లో సంగీతం వినబడుతోంది. మంచి సింఫనీ పెట్టుకుని ఇయర్ ఫోన్స్ తగిలించుకుని, చల్లని పానీయాన్ని సిప్ చేస్తూ – అంతకు కొద్ది గంటల క్రితం జరిగిన విషయాలు నెమరువేసుకున్నాను.

సెంట్రల్ లండన్ నేషనల్ హోటల్ – ఏజంటుతో పేచీ, నా ప్రియ మిత్రులు కృష్ణమూర్తిగారు వాణ్ణి తిట్టి – కాలరు పట్టుకుని, పోలీసుకి రిపోర్టు చేస్తానని బెదిరించి – వాడితో సెటిల్ చేసుకుని, మమ్మల్ని ఎయిర్‌పోర్టుకి పంపించి టాటా చెప్పారు. లండన్‌లో ఎక్కడా ఫ్లైఓవర్లు వుండవు. అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ దాటి హీత్రో వచ్చే సరికి 45 నిమిషాలు పట్టింది. టాక్సీకి 25 డాలర్లు ఇవ్వడానికి చిల్లర లేక మనీ ఛేంజర్ దగ్గరకు వెళ్తే 10% కమీషన్‌తో ఎక్చేంజి ఇచ్చి పంపాడు. సరే బోర్డింగ్ పాస్ తీసుకుని ఇమిగ్రేషన్‌లో హడావుడి పడుతుంటే – కౌంటర్లో ఆఫీసరు అనుమానంగా చూశాడు. అక్కడ నుంచి సెక్యూరిటీ అయిన తర్వాత – అమెరికాలో నా ఫ్రెండ్ కోసం ఏమి కొనాలో అర్థంకాక అయోమయంలో పడి – ఇంకా, హడావిడిగా వెస్టిబ్యూల్‌లో నుంచి ఫ్లైట్ డోర్ దగ్గరకు చేరి లోపలికి అడుగుపెట్టాను. 'వెల్‌కం' అని బోర్డింగ్ పాస్ మీద సీట్ నెంబరు చూసి, 34లో 'ఎ' సీట్ ప్లీజ్ అని దారి చూపింది. నా వెనకే డోర్ మూసుకున్నది. అప్పుడే ఐర్లెండ్ దాటుతున్నాం. బెల్‌ఫాస్ట్ నగరం మీదుగా జెట్ ఇంకా పైకి వెళ్తోంది. పూర్తి ఆల్టిట్యూడు చేరితే భూమికి 35,000 వేల అడుగుల ఎత్తులో వుంటాము – కొన్ని రూట్లలో 37,000 వేల అడుగులు కూడా చేరతాము. కాబిన్ అంతా చల్లగా అయిపోయింది. 'కాబిన్ ప్రెజర్' 7,000 వేల అడుగులు ఎత్తులో వున్న సాధారణ వాతావరణ పీడనానికి సరికాదు. అంత వ్యత్యాసాన్ని మన శరీరం తట్టుకోవాలి. ఇక్కడే కొన్ని చిక్కులు వస్తాయి. విమానంలో అన్నీ ఉచితంగా, మనం కదలకుండా, పైగా మొహమాట

పెట్టి మరి అందిస్తారు– వైన్, బీర్, చక్కటి భోజనం, ఒకటేమిటి – అన్ని. ఇవి తీసుకోవడంలో మన విజ్ఞతను ఉపయోగించాలి. అందుకు కావలసిన వివరాలిస్తాను.

మొదటిది: విమానం కాబిన్‌లో, తక్కువ ప్రాణవాయువు అందుబాటులో వుంటుంది. మీరు ఆల్కహాల్ తీసుకున్నా, సిగిరెట్ పీల్చినా మీ శరీరానికి ఎక్కువ ఆక్సిజన్ కావాలి. అందుకని తక్కువ ఆక్సిజన్ అందుబాటులో వున్నపుడు – ఎక్కువ అవసరం మనం కల్గిస్తే – ఆల్కహాలు తీసుకోవడం ద్వారా, శరీరానికి ఇబ్బంది – వెంటనే మీకు తలనొప్పి మొదలవుతుంది. అందుకని – ఈ విషయంలో జాగ్రత్తగా, మితంగా వ్యవహరించి ఒకటి రెండు పెగ్గులు హుషారు కల్గించినా, మితిమీరితే నేల మీదకు దిగేసరికి – అడుగు నేలమీద వేయలేరు.

రెండవది: విమానం కాబిన్‌లో హ్యూమిడిటి – నీటి ఆవిరి, చాలా తక్కువ అంటే 2% వుంటుంది. మనం మామూలుగా 30%కు అలవాటుపడి వుంటాము. అందుకని మీకు విపరీతంగా దాహం వేస్తుంది. ఈ దాహం, బీర్‌తో, విస్కీతో ఇంకా ఎక్కువ అవుతుంది. తప్పనిసరిగా చల్లని నీళ్ళు లేక పళ్ళరసం తీసుకోవాలి. ఎంత కావాలంటే అంతా నవ్వుతూ ఇస్తారు. ఇప్పుడు కాళ్ళు చాపుకుని రిలాక్స్ అవ్వండి! మధ్యలో లేచి విమానం వెనుక వరకూ నడిస్తే హాయిగా వుంటుంది.

మూడవది: ఇక ఆహారం. విమానంలో చక్కటి విందు భోజనం – అదీ వేడి వేడిగా ముందుంచుతారు. అందులో ఆకలి కూడా ఎక్కువగానే వుంటుంది. పైగా నవ్వుతూ



ల్యాండింగ్

అందిస్తారు. ఇక కాదనలేము కదా! కాని ఎక్కువగా కాకపోయినా కడుపు నిండా తిన్నా ఇబ్బందే. ఎందుకో చెప్తాను.

ముఖ్య కారణం – మన శరీరానికి కాలజ్ఞానం పోతుంది. ఇండియా నుంచి అమెరికా వెళ్ళేలోపు – భూమి చుట్టు కొలతలో – సగం ప్రయాణం చేస్తాము. 12 గంటలు వెనుకకు వెళ్తాము. ఇక్కడే మీ శరీరం అయోమయంలో పడి – పగలేదో – రాత్రేదో – ఎప్పుడు తినాలో ఎలా అరిగించుకోవాలో తెలియక ఇబ్బంది కలుగుతుంది. గ్యాస్‌కు దోహదం చేసే పదార్థాలు వదిలి వేయండి. మీ పొట్టలో అంతకుముందే గ్యాస్ పెరిగి వుంటుంది. కాబిన్ ప్రెజర్ మూలంగా, మిగతా ఈ ప్రక్రియ, మీ ఉదరకోశాన్ని, జీర్ణ మండలాన్ని అయోమయంగా చేస్తుంది – అంటే అజీర్తికి నాంది పలుకుతుంది. కాబట్టి– తలనొప్పి రాకుండా పొట్ట చెడకుండా విమానం దిగటానికి జాగ్రత్త పడండి. ఈ కాస్త జాగ్రత్తలతో హాయిగా, ఆనందంగా విమాన ప్రయాణం సాగించండి.

ఇప్పుడు లోపల ఏమి జరుగుతుందో చూద్దాం. ట్రాలీలు చకచకా త్రిప్పడంలో కాబిన్ సిబ్బంది – ఎంతో నేర్పు ప్రదర్శిస్తారు. మీకు కావలసినది వీలయినంతవరకు లేదని చెప్పకుండా అందిస్తారు. అసలు మీతో అడిగించుకోరు, తలనొప్పి మాత్రలు –తల త్రిప్పుడుకు విరుగుడు మాత్రలు కూడా ఇస్తారు. ఈ తతంగం అంతా ఒక గంట పైనే పడుతుంది. మళ్ళీ అరగటానికి రెడ్‌వైన్ – వైట్‌వైన్, ఎంతో మంచి ఫ్రెంచ్ వైనులు అందిస్తారు. ఆస్వాదించండి. ఈ సద్దుమణిగిన తర్వాత క్రొత్త



న్యూయార్క్ సెంట్రల్ పార్క్

సినిమాలు ఎక్కువగా హాలీవుడ్ చిత్రాలు – ప్రదర్శిస్తారు. ఇయర్ ఫోనులో వినవచ్చు. మ్యూజిక్ వింటూ చక్కని మ్యాగజైన్ చదువుకోవచ్చు.

ఇప్పటికే మూడు గంటలైంది విమానం బయలుదేరి. 11 కిలోమీటర్ల ఎత్తులో – అట్లాంటిక్ లోతు నాలుగు కిలోమీటర్లు కలిపితే 15 కిలోమీటర్లు – జెట్ అవలీలగా సాగిపోతున్నది. గ్లాస్ కిటికీల నుంచి బైటకు చూశాను. సూర్యుడు నడినెత్తిన ఉన్నట్లున్నాడు. క్రింద ఎటు చూసినా తెల్లని మబ్బులు, ఎండలో ఇంకా తెల్లగా కనబడుతున్నాయి. విమానం క్రిందగా – దూదిపరుపు పరిచినట్లు– మా విమానం పడిపోకుండా అడ్డంగా మెత్తగా పరచుకున్నట్లు ఎంతో ఆహ్లాదకరంగా వుంది, ఎటు చూసినా దిగంతాలలో ఆకాశం వంగి, మబ్బుల్ని అందుకోవాలని ఆశపడుతుంది. ఈ మబ్బుల మీద నడిస్తే... ఆ క్షణంలోనే నాకు గుర్తు వచ్చింది. పది కిలోమీటర్ల క్రింద అనంతంగా పరచుకుని ఉన్న అట్లాంటిక్ మహాసాగరాన్ని మొట్టమొదటిసారిగా నాటు పడవతో దాటిన సాహసి, కొలంబస్, అయిదు వందల ఏళ్ళ క్రిందట ఎన్ని అవరోధాలు అధిగమించి తన లక్ష్యాన్ని సాధించాడో...

అదే అట్లాంటిక్‌ను, చార్లెస్ లిండ్ బర్గ్ 'సోలో ఫ్లైట్' (1927 మే 20) న్యూయార్క్ నుంచి బయలుదేరి ఎన్ని ఇబ్బందులను కాదని, పారిస్ చేరాడో...

లిండ్‌కు 33 1/2 గంటలు పట్టిన ప్రయాణం – ఇప్పుడు 8 1/2 గంటల్లో చేయగలుగుతున్నాం. అదీ ఎంతో సౌఖ్యంగా, నిర్భయంగా, నాలుగు వందల మంది తోడుగా.... అదీ కంకార్డ్‌లో అయితే 3 1/2 గం॥లే. ఇదంతా 60–70 సంవత్సరాల వైజ్ఞానిక ప్రగతికి సాక్షి కాదా. ఈ ఆలోచనలన్నీ నా ముందున్న గ్లాసులో స్పార్కిలింగ్ వైన్‌లోని బుడగల్లా పైకి చింది, చిందరవందర అయిపోతున్నాయి. అలా ఎప్పుడు నిద్రపట్టిందో – ఇంత ఎత్తులో కలలురావా? మళ్ళీ మెలకువ వచ్చేసరికి...

సూర్యుడు ఎర్రబారాడు. తన బంగారు కిరణాల వెలుగులను ఆ మబ్బులపైన అలది వినోదం చూస్తున్నాడు. ఆహా ఎంతటి మనోహర దృశ్యం. తరకలు తరకలుగా మబ్బులు గట్టిపడి, పెళ్ళినడకతో పేరంటానికి బయలుదేరినట్లు – కదలకు కదలక కదులుతున్నాయి. ఇక్కడ ఎంత ప్రశాంతంగా, నిశ్శబ్దంగా నిర్మలంగా వున్నది. ఇక్కడేనా దేవతలు వుంటారు? నాకిప్పుడు గుర్తుకు వస్తోంది. కౌలాలంపూర్ నుండి వస్తుంటే కాక్‌పిట్ లోంచి, పైలట్ శ్రీలంక చూపాడు –



న్యూయార్క్ మన్‌హాటన్

ఎమరాల్డ్ స్టోన్‌లా హిందూసాగర జలాల మధ్య స్నానం చేస్తున్న ఆ దృశ్యాన్ని చూసి ఎంత ఆనందించాను.

జెనీవా పైగా ప్రయాణిస్తున్నప్పుడు అప్పుడే సూర్యుని మొదటి కిరణాలు ఆల్ఫ్ మంచు శిఖరాల మీదపడి జారిపోతుంటే చూసి పరవశించాను.

కువైట్ నుంచి వస్తూ – ఎడారి ఎల్లలు తెలియక తికమకపడ్డాను. ఎక్కడా ఒక మబ్బు తునకలేని వాతావరణం మొదటిసారిగా చూశాను.

ఇంగ్లీష్ ఛానెల్ తక్కువ ఎత్తులో దాటుతూ, క్రింద నీటిపై తేలుతున్న నౌకలు చూసి ఈ నౌకలతోనే కాదా వీరు ప్రపంచాన్ని జయించారు అనుకున్నాను. ఇప్పుడు ఈ మేఘాలపై దేవతల కోసం వెతుకుతున్నాను.

విమానం ఎప్పుడూ నేలకు అందుబాటులో అనుసంధానమై ఎగురుతుంటుంది. అందుకని దూరమైనా క్రింద భూమి ఉండేట్లుగా రూట్ వుంటుంది. ఉత్తర అమెరికా ఉత్తర ప్రాంతం పైగా విమానం ప్రవేశించింది. క్రింద ఏ నగరం ఎంత దూరంలో ఉంది. ఎంత వేగంతో వెళ్తున్నాము. ఎంత ఎత్తులో ఎగురుతున్నాము – అన్నీ మానిటర్ మీద కనపడుతుంటాయి.

బోస్టన్ దాటి న్యూయార్క్ రాష్ట్రంలో ప్రయాణం. ఎయిర్ హోస్టెస్‌లు మరొకసారి డ్రింక్స్, స్నాక్స్ ఆఫర్ చేశారు.

జీవితాన్ని ప్రతిక్షణం అనుభవించే

అమెరికన్లు!

అమెరికాలో అక్టోబరు 1 రాత్రి అడుగు పెట్టాను. రామడా ప్లాజా హోటల్ (న్యూయార్క్)లో మర్నాడు ఉదయం 5 గంటలకు రేడియో వార్తలు విన్నాను. వంద సంవత్సరాలుగా అక్టోబరు 2న జరిగిన చరిత్ర – ముఖ్య ఘట్టాలు, విశేషాలు చెబుతూ, గాంధీ 127వ జయంతి అని ప్రముఖంగా చెప్పారు. అలా ప్రారంభమైంది. ఇక్కడి విశేషాల యాత్ర. ఇదేరోజు మధ్యాహ్నం అట్లాంటా (జార్జియా రాష్ట్రం) చేరాను.

అట్లాంటాలోని హార్ట్స్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఇంకా ఒలింపిక్ వాసనలను వెదజల్లుతున్నదనిపించింది. నాకోసం ఇద్దరు మిత్రులు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. దారిలో, లూథర్‌కింగ్ సెంటర్‌కు వెళ్దామని అన్నాను.

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ గురించి తెలియనివారు లేరు. ఒక శ్వేత జాతీయుని జాత్యహంకారానికి, తుపాకి గుళ్ళకు బలైపోయిన తర్వాత అట్లాంటా సిటీలో ఆయన ఇంటికి సమీపంలో 'ఫ్రీడంహాల్ ఆడిటోరియం' పేరుతో కింగ్ సెంటర్‌ను నెలకొల్పారు. దీని ప్రక్కనే అమెరికన్ నేషనల్ పార్క్‌వారు 'లూథర్ కింగ్ జూనియర్ సెంటర్'లో లైబ్రరీ, స్విమ్మింగ్ పూల్, ఒక స్కూల్, ఒక చర్చి నడుపుతున్నారు. హత్యానంతరం కింగ్ మృత కళేబరాన్ని ఇక్కడికి మార్చారట. కింగ్ సెంటర్‌కు దాదాపు 4 గంటలకు చేరాము. గొప్ప విశేషం. ఆరోజునే ఏడు గంటలకు లూథర్‌కింగ్‌ను ఎంతో ప్రభావితం చేసిన గాంధీ గారి 127వ జయంతి ఉత్సవ సభ జరగనున్నది. వెంటనే ఇంటికి వెళ్ళి, రిఫ్రెష్ అయి ఏడుగంటలకు ముందే మళ్ళీ తిరిగి వచ్చాం. 'గాంధీ హాలు' పేరుతో ఒక ప్రత్యేక హాలును నెలకొల్పారు. అందులో గాంధీ సూక్తుల బోర్డులు, ఆయన చరఖా, కళ్ళజోడు, చెప్పులు మొదలైనవాటి అన్ని మోడల్స్ ప్రదర్శించారు – మూడు కోతుల ప్రతిమను కూడా సుమండీ. సరిగ్గా ఏడు గంటలకు సభ ప్రారంభమైంది. లూథర్‌కింగ్ భార్య శ్రీమతి కొరెట్టా స్కాట్ కింగ్ స్వాగతం పలికారు. స్వాగతోపన్యాసంలో ఆమె తన భర్తను గాంధీ రచనలు – జీవితం,

ఉద్యమాలు ఎంతగానో ప్రభావితం చేసినాయని, ఉద్యమాలను నడుపుతున్న రోజులలో కింగ్ – గాంధీ జీవిత చరిత్రలోని ప్రతి పేజీ, ప్రతి సంఘటనను రిఫర్ చేసేవారని, ఆయా సందర్భాలలో గాంధీ ఏ తీరులో ఎలా స్పందించేవారో అందరితో చర్చించేవారని, అహింసావాదంలో వున్న బలాన్ని, అవసరాన్ని సమగ్రంగా అవగాహన చేసుకుని, అమలుపరిచారని వివరించారు. ఆయన భార్యగా, ఉద్యమాలలో అంతర్వాహినిగా కృషి చేసి తన జీవితాన్ని ధన్యపరుచుకున్నానని, కింగ్ స్వప్నాలను సాఫల్యం చేయడానికి ఈ సెంటర్‌ను స్థాపించామని ఆమె వివరించారు.

'ఇండియా అమెరికన్ కల్చరల్ అసోసియేషన్' (ఐఎసిఎ) అధ్యక్షులు పూర్ణగారు స్వాగత వచనాలు పలికారు. తర్వాత 'సాంగ్ ఆఫ్ ఫ్రీడమ్', వైష్ణవ జనత గీతాలను హరీష్ బక్షిగారు ఆలపించారు. సాంగ్ ఆఫ్ ఫ్రీడమ్ ఆలాపన సాగుతున్నంతసేపు అందరం వలాయాకారంలో ఒకరి చేతులు ఒకరం పట్టుకొని ఊగుతూ స్వరంలో స్వరం కలుపుతూ బృందగానం చేశాము.

సభానంతరం శ్రీమతి కొరెట్టాతో అయిదు నిమిషాలు సంభాషించాను. ఫోన్ చేసి, ఇంటికి వస్తే ఇంటర్వ్యూ ఇస్తానని చెప్పారు. ఈ సభలో వాషింగ్టన్‌లోని ఇండియన్ ఎంబెసీ సాంస్కృతిక వ్యవహారాల మంత్రి డాక్టర్ హబిబుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యసించారు. కాశ్మీర్ ఎన్నికల గూర్చి, ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడాను. వాషింగ్టన్ వచ్చినప్పుడు తనను కలుసుకోవలసినదిగా ఆహ్వానించారు.

గార్బా నృత్యం:

ఇక్కడ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంలో ముఖ్యంగా గమనించవలసిన విషయం ఒకటుంది. ఏ పండుగ అయినా, ఉత్సవమయినా శని, ఆదివారాల్లోనే జరుపుకోవాలి. ఆఖరుకు ఆగస్టు 15 అయినా సరే. 4వ తేదీన గుజరాతీ, ఇండియన్ అసోసిషన్లు సంయుక్తంగా కాజిల్ గేట్



హోటల్ ఆవరణలో భారీ స్థాయిలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈరోజు రాత్రిని 'దందియా రాస్ నైట్' అంటారు. రెండు భాగాలలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. మొదటిది దుర్గాదేవిని స్తుతిస్తూ 300 మంది యువతులు గాగ్ర వస్త్రాలంకరణతో విశాలమైన హాలులో 50వేల వాట్స్ విద్యుత్ కాంతిపుంజాల నడుమ, సంగీతానికి అనుగుణంగా వర్తులాకారంలో గార్బా నృత్యం చేస్తారు. ఈ సుమనోహర నృత్యవిన్యాసాలను వర్ణించడం కవులకే అసాధ్యమని భావించాను. ఏకబిగిన గంటన్నరసేపు నృత్యం చేశారు. 'కసుంబి రంగ్' గ్రూప్ వారు సంగీత ఝరిని ప్రవహింపజేశారు. గానం చేసిన పాటలన్నీ దుర్గాదేవి స్తోత్రాలే.

రెండవ ఘట్టం:

కోలాటం కర్రలతో రాసలీల పాటలకు అనుగుణంగా రెండు గంటల సేపు నృత్యం జరిగింది. తెల్లవారుజామున మూడు గంటల వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. చివరలో 'కసుంబి రంగ్' గ్రూప్ వారిని ఇంటర్వ్యూ చేశాను. గ్రూప్ నాయకుడు శేఖర్ దేశ్‌పాండే, ఆయన సతీమణి ప్రణీత. బాగా పాడతారామె. ఆమె బెంగాలీ, గుజరాతీ పాటలను అద్భుతంగా ఆలాపన చేస్తారు. గ్రూప్‌లోని మిగిలిన సభ్యులందరూ, దిలీప్ (గాయకుడు), నరేంద్ర (గిటార్), విజయ్ రాణడే (కీ బోర్డ్), శ్యామ్ (డ్రమ్స్) అందరూ బ్రహ్మాండంగా ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. వీరంతా మహారాష్ట్రులు. కాని, గుజరాతీ పాటలను సుమధురంగా పాడారు. రాసలీల గానమాధురిలో వీరి పాటలు వింటుంటే కృష్ణుడే వచ్చి, చాటుగా విని వెళ్ళి వుంటాడనిపించింది.

ఇక, 5వ తేదీ రానే వచ్చింది. రాత్రి నిద్రలేకపోయినా తెల్లవారుఝామున టాంపా ఫ్లోరిడాకు ప్రయాణమయ్యాను. శీతగాలులు ప్రారంభమయ్యాయి. టాంపా ఫ్లోరిడాలో అన్ని బీచ్‌లే వున్నాయి. ఇది ఒక పెద్ద హాలిడే సెంటర్. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో టాంపా సముద్రం వుంది. గాలి నులివెచ్చగా వుంటుంది. తేమ దాదాపుగా లేదు. తెలతెల్లటి బీచ్‌లు దాదాపు 25 వున్నాయి. వీటిలో క్లియర్ వాటర్‌బీచ్, ఇండియన్ రాక్ బీచ్‌లు పెద్దవి.

'ట్రెజర్ ఐలాండ్' అనే ఒక వాణిజ్య కేంద్రం వుంది. ఇక్కడి నుంచి అనేకానేక నౌకలు బయలుదేరుతుంటాయి. ప్రయాణ నౌకల ద్వారా కారబ్బీన్

దీవులకు, జమైకా, నాసా, పోర్టరికో మొదలైన ప్రాంతాలకు వెళ్ళవచ్చు. మూడు నాలుగు రాత్రులు – షిప్‌లోనే గడుపుతూ సెలవు దినాలను అనుభవిస్తుంటారు. ఈ ప్రాంతంలో క్రైమ్ రేట్ అతి స్వల్పం కావడంతో రిటైర్ అయినవారు చాలామంది ఇక్కడకు వచ్చి స్థిరపడుతుంటారు. వాటర్ స్పోర్ట్స్, పారాచూటింగ్ తరహా క్రీడా వినోదాలకు అవకాశాలు ఎన్నో వున్నాయి. మనం విమానాల్ని స్వయంగా నడపటానికి అనుమతిస్తారు కూడా. ఈ ప్రాంతానికి దక్షిణ దిశలో క్యూబా దేశం వుంది. కాస్ట్రో మహాశయుడు దర్శనమిస్తాడేమోనని మెడ సారించి చూశా! ఇక్కడి ప్రజలు జీవితాన్ని, రోజుల్ని, ప్రతిక్షణం 'అనుభవిస్తారు'. తరచి తరచి చూస్తే – ఏ జాతి జీవనం అయినా, వారి మత విశ్వాసాన్ని బట్టి రూపుదిద్దుకుంటుందని తేలుతుంది. ఆచారాలు – అలవాట్లు జీవనసరళి అన్నింటిని మత విశ్వాసాలే ప్రభావితం చేస్తాయి. ఇక్కడి వారు క్రిష్టియన్లు. తెగలున్నాయి. వేరే విషయం. క్రిష్టియన్లకు 'పునర్జన్మ' లేదు కదా. అందుకని, అన్ని ఆశలూ, కోర్కెలు అన్నీ ఈ జన్మలోనే తీర్చుకోవాలి. ఒక రోజు గడిచిందంటే తిరిగి రాదు. క్షణం జారిపోయిందంటే, వృథా అవుతుంది. పని వేరు, హాలిడే వేరు. అమెరికన్లకు ఫ్లోరిడా రాష్ట్రం ఒక పెద్ద ఆటవిడుపు కేంద్రం. ఇక్కడే డిస్నీలాండ్ (ఓర్లెండో)ను ప్రత్యేక విశిష్ట తరహాలో నెలకొల్పారు.

సెలవు దినాన్ని వ్యాపారాత్మకంగా విక్రయించడం; ప్రజలు వినోదాన్ని కొనుగోలు చేయడం – మనకు ఇక్కడి వింతగా కన్పిస్తుంది. వేసవిలో అయితే కుటుంబాలకు కుటుంబాలు మొత్తం పిల్లలూ, పెద్దలూ అంతా ఇక్కడకు వచ్చి ఒకే వయసువారిలా ఈ కాలక్షేపం మాయాలోకంలో నిండా మునిగి తేలుతుంటారు.



రేడియో సిటీ సెంటర్

న్యూయార్క్ - 1

విమానవతుల వీడ్కోలు వందనాలు, చిరునవ్వు వందనాలు వదలి - బాగ్ భుజాన వేసుకుని ఇమిగ్రేషన్ క్యూలో నిలబడి చుట్టూ కలియజూశాను.

ఎన్నో ఇమిగ్రేషన్ కౌంటర్లు ఉన్నాయి. అన్ని చోట్లా పొడవాటి క్యూలూ ఉన్నాయి. ఎందుకని ఇంత రద్దీ? న్యూయార్క్ కెన్నడీ ఎయిర్‌పోర్టులో దాదాపు 32 రన్‌వేలున్నాయి. ప్రతి మూడు నిమిషాలకు ఒక విమానం వాలటమో, ఎగరటమో జరిగిపోతుంటుంది. అన్నీ అంతర్జాతీయ విమానాలే. ఎన్నో దేశాల ప్రజలను ఎన్నో ఆశల బరువుతో మోసుకొస్తుంటాయి.

వీరందరికీ వీసాలున్నాయా? సరైన పత్రాలతో ప్రయాణం చేస్తున్నారా? ఇవన్నీ 'చెక్' చెయ్యవలసిన బాధ్యత ఇమిగ్రేషన్ శాఖ వారిది. ప్రతి ప్రయాణీకునికీ కనీసం అయిదు నిమిషాలు సమయం పడుతుంది. వీసా నంబరు కంప్యూటర్లో సరిచూడటానికి, ఆ తర్వాత, మీరు సంతృప్తికరంగా సమాధానం చెప్పలేకపోతే– మీరు ఆ కౌంటరు దాటరు - కంగారుపడినా - అబద్ధాలు చెప్పినా - మీ ప్రయాణ పత్రాలు అన్నీ సరిగా ఉన్నా - మిమ్మల్ని అక్కడే నిలిపి వేసే ప్రమాదం



మన్‌హటన్ స్కై లైన్

ఎప్పుడూ వున్నది. నిర్భయంగా, అడిగినంత వరకూ, నిజం చెప్పి బయటపడడం అవసరం. అక్కడ నుండి కస్టమ్స్; మీ సూట్‌కేసు వచ్చే చోట బెల్ట్ నెంబరు డిస్ప్లే కనపడుతుంటుంది. అక్కడ పెట్టెలు పట్టుకుని కస్టమ్స్ దాటి బైటకు న్యూయార్క్ నగర వాసనలు వీచే – ఎయిర్ పోర్ట్ పార్కింగ్ ఏరియాకి వచ్చాను. గాలిలో ఏదో తెలియని హోరు! అది అట్లాంటిక్ సముద్రపు ఘోష, న్యూయార్క్ ట్రాఫిక్ భాష. మొదటిసారి న్యూయార్క్ నగరాన్ని మన్‌హటన్‌లో ఉండి నాలుగు రోజులు మాత్రం చూసి ఇండియా తిరిగి వచ్చేశాను. నా స్నేహితుడు మద్రాసులో కలిసి అడిగాడు – న్యూయార్క్ నగరం పై మీ అభిప్రాయం ఏమిటి? అని, ఆయన అంతుకు కొద్దికాలం క్రితం న్యూయార్క్ వెళ్ళివచ్చారు.

It baffles you, bangs you and it throws you out అన్నాను. ఆయన అభిప్రాయాన్ని నేనడగలేదు.

ఆ తర్వాత సంవత్సరాలలో – మరి నాలుగైదు సార్లు అమెరికా వెళ్ళి వచ్చే అవకాశం కలిగింది. కాని న్యూయార్క్ మహానగరం మొదటిసారిగా వెళ్ళినవారికి ఎలా వుంటుందో గాని, నా అనుభూతిని మీ ముందుంచుతాను.

మొదటిసారిగా మన్ హటన్‌లో అడుగుపెడితే – అక్కడి ఆకాశ హర్మ్యాలు వాటి పరిమాణంతో, అద్దాల మెరుపులతో మిమ్మల్ని పురుగుని – చిన్ని పురుగుని చూసినట్లు చూస్తాయి.

విపరీతమైన వేగంతో పరుగులు తీసే న్యూయార్క్ వ్యాపార వ్యవహారాలు, జీవనశైలి మిమ్మల్ని అశక్తుల్ని చేసి ఒక పార్కింగ్ లాట్‌లోనో, లేక ఒక పార్క్ బెంచ్ మీదో పడవేస్తాయి. దీపాల వెలుగుల్లో అద్దాల వెనక నుంచి కనపడే ఖరీదయిన ఫాషన్‌వేర్, బ్రాండ్‌నేమ్స్ మిమ్మల్ని చూసి వెక్కిరిస్తాయి. వెకిలిగా నవ్వుతాయి. మిలమిల మెరిసే విలువైన కారులు బారులుగా పరుగులు తీస్తూ మిమ్మల్ని వాటి మీద పడిన పల్చని ధూళి పొరలాగా కూడా ఖాతరుచెయ్యవు.

ఎప్పుడూ చెవులు చిల్లుపడే విధంగా అరుస్తూ శరవేగంతో దూసుకుపోయే అంబులెన్సు, ఫైర్ ఇంజన్లు, పోలీసు కారులు – మిమ్మల్ని పిచ్చివాళ్ళను చేస్తాయి.

ఎటు పోవాలో, ఎట్లా పోవాలో, ఏమి చెయ్యటం, ఎవరి సహాయం అడగాలో తెలుసుకునే లోపు మీకున్న కాస్త సమయం కరిగిపోతుంది. సాయంత్రం అవకముందే, చీకట్లు ముసరక మునుపే న్యూయార్క్ నగర నలుపు దొంగలు,

నేరగాళ్ళు మీకోసం సిద్ధంగా వుంటారు. మెట్రో మెట్లచాటునో సైడ్‌వాక్ షాడోలోనో, ఆగివున్న టాక్సీ ఆవలివైపునో –కాచుకుని, ఈజీమాన్, ఈజీ అంటూ ఈజీగా పనికానిస్తారు. ఏమరుపాటున వుంటే – ఇంతే సంగతులు. ఇక్కడి సంపదకు – పేదరికానికి వున్న వ్యత్యాసం వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్ కంటే ఎత్తు. హడ్సన్ నది – ఈస్ట్ రివర్ అట్లాంటిక్ ముఖద్వారం కంటే కూడా లోతు.

ఎంతో వెడల్పు లోయలు – నదుల్ని దాటిస్తున్న పొడవైన న్యూయార్క్ బ్రిడ్జిలన్నీ కూడా దాటించలేని అగాధం అది.

ఈ కన్పించే వ్యత్యాసం – కనపడని ఘర్షణని రేకెత్తించి, ఎప్పుడు మంటలుగా మారుతాయోననే ఆందోళన – టెన్షన్ – వీరి జీవితంలో ఒక భాగం.

కదిలి వెళ్ళిపోతున్న రైలెక్కాలంటే మీరు కూడా రైలు వేగంతో సమానంగా పరుగెత్తి అందుకోవలసిందే కదా.

న్యూయార్క్ నగరంలో ఏ పని చెయ్యాలన్నా – ఇక్కడి వేగం అందుకోలేకపోతే– సైడ్‌వాక్ పై నిస్సహాయంగా నిలబడి చూడాల్సిందే?

ఈ మహానగరం ఒక అద్భుతం. ఈ అలవికాని అద్భుతాన్ని అందుకునేదెలా? మిమ్మల్ని ఆశ్చర్యంతోపాటు భయభ్రాంతుల్ని చేసే ఈ సాంకేతిక మృగాన్ని లొంగదీసుకునే మార్గమేమిటి? ఈ భూతానికి హృదయం వుందా? అది ఎలా తెలుస్తుంది? ఈ రోడ్లన్నీ ఎక్కడికి దారి తీస్తున్నాయి? ఆకాశాన్నంటే ఈ అద్దాల మేడల్లో ఎవరుంటున్నారు? ఎప్పుడయినా క్రిందికి దిగుతారా. ఎన్ని సందేహాలు. వీటిని ఎవరు తీరుస్తారు?

న్యూయార్క్ నగరాన్ని చూడబోవటమే పెద్ద సాహసం. ఈ సాహసం చెయ్యక తప్పదు – ఇంత దూరం వచ్చిన తర్వాత నాకంటే అడుగు ఎత్తున్న హిస్పానిక్ అమ్మాయి 'హే! డిడ్ యు స్టార్ట్ యువర్ ఎడ్వంచర్?' అని అడిగింది. "యస్! యస్!" అని నీతో మాట్లాడడమే ఒక సాహసం అనుకున్నాను.



న్యూయార్క్ - 2

న్యూయార్క్ మహానగరానికి ప్రతీక "స్టాట్యూ ఆఫ్ లిబర్టీ". ఒక క్రొత్త ప్రపంచం. స్వేచ్ఛా ప్రపంచంగా రూపుదిద్దుకున్న కొలంబస్ అమెరికాకు అట్లాంటిక్ ముఖద్వారం న్యూయార్క్ నగరం. న్యూయార్క్ నగరానికి ఫ్రెంచ్ పౌరులు 1884–86 మధ్యలో రూపొందించి, కానుకగా పంపినపుడు 'లేడీ లిబర్టీ' ఉజ్జ్వల భవిష్యత్తును ఊహించి వుండరు. సంవత్సరంలో రెండు కోట్ల మంది సందర్శకులు న్యూయార్క్ నగరానికి వస్తే అందులో కనీసం కోటిమంది ఈ 'లేడీ'ని దర్శించకుండా వెళ్ళరు.

లిబర్టీ ద్వీపంలో – సముద్రమట్టానికి – 305 అడుగుల ఎత్తులో – 151 అడుగుల ఈ విగ్రహం – అద్భుతమైనది. అపురూపమైనది. సృజనాత్మకత, సాంకేతిక కౌశలం రెండూ కలగలసి స్వేచ్ఛాప్రియుల ఊపిరులతో ప్రాణం పోసుకున్న ఈ 'లేడీ' మిమ్మల్ని తన రూపురేఖలతో అలరిస్తుంది. తన చరిత్రతో ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక చిత్రకారుని 'ఆలోచన', ఒక సాంకేతిక నిపుణుని అద్భుత నైపుణ్యం – ఫ్రెంచి ప్రజల స్వేచ్ఛా చైతన్యం, ఈ అపురూపమైన కానుకని



స్టాట్యూ ఆఫ్ లిబర్టీ

అందుకోవటానికి అమెరికా పౌరుల అపారమైన ఆసక్తి – ఇవన్నీ కలగలసి 'లేడీ'ని ఒక మహానగరానికే కాక, ఒక నూతన ప్రపంచానికే చిహ్నంగా నిలబెట్టాయి.

ఈ ఆలోచన వచ్చిన చిత్రకారుడు – ఎడ్వర్డ్ డీ లెబోల్ అయితే – విగ్రహ నిర్మాణ కౌశలాన్ని సాకారంగా నిలిపింది – అగస్తీ బోర్తల్ డీ. అందుకు అయిన ఖర్చు మొత్తం ఫ్రెంచి ప్రజల చైతన్యం సమకూరిస్తే – ఈ అపురూపమైన కానుకను అప్పుడు అమెరికా కష్టజీవులు ఒక్కో డాలరు పోగుచేసి – ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి – లిబర్టీ దీవిలో 150 అడుగుల స్థూపం నిర్మించి – ఆపైన 151 అడుగుల అందమైన 'లేడీ'ని నిలబెట్టుకున్నారు. 1886 అక్టోబర్ ఇరవయి ఎనిమిదో తేదీన – అధ్యక్షుడు క్లీవ్‌లాండ్ చేతులమీదుగా, అప్పటినుంచి – ఆధునిక ప్రపంచ చరిత్ర ఎన్ని ఒడిదుడుకులకు లోనయిందో – అట్లాంటిక్ మహా సముద్రంలో చెలరేగిన తుఫానులకు, మంచుగాలులకు తట్టుకుని, ఈ 'లేడీ లిబర్టీ' అన్నింటికీ సాక్షిగా నిలబడింది. ప్రపంచం నలుమూలల నుంచి ఎన్నెన్నో ఆశలతో వలసవచ్చే ప్రజలకు – ఈ స్వేచ్ఛాజగతికి – చెయ్యెత్తి స్వాగతం చెపుతుంది. 350 మెట్లున్న ఈ విగ్రహం అంతర్భాగం చూడటానికి వెళ్తే – అది ఎంత 'ఇంజనీరింగ్ ఫీటో' తెలుస్తుంది.

మన్ హటన్ – తూర్పు దక్షిణ దిశగా వున్న 'బ్యాటరీ పార్క్' అట్లాంటిక్ అంచున – లిబర్టీ ఫెర్రీలో ఎక్కాలి. అదీ డెక్‌మీద కూర్చోవాలి. చుట్టూ పచ్చని సముద్రం. అంతదూరాన 'వెరజాన్' బ్రిడ్జి కనపడుతుంటుంది. అంతలో న్యూయార్క్ జలాలు దాటి న్యూజెర్సీ జలాల్లో ప్రవేశిస్తారు. ఒక ప్రక్కగా గవర్నర్ దీవి జరిగిపోతుంటుంది. ఇరవయి నిముషాల్లో లిబర్టీ దీవి చేరతారు. ఫెర్రీలో నుంచి దిగి, దీవిలో – ఒక చక్కని ఉద్యానవనంలో కాలుపెడతారు. కొద్దిగా తలెత్తి చూడండి ఒక అద్భుతం మీకళ్ళముందు ఉంటుంది.

మీరు దగ్గరకు వెళ్ళిన కొలదీ – పెద్దదిగా అయిపోతుంటుంది. 'పెడస్టల్' చుట్టూ తిరిగి చూడండి. ఆ నిర్మాణానికి రాళ్ళెత్తిన తాపీ మేస్త్రీల పేర్లన్నీ ఇక్కడుంటాయి. ఈ స్వేచ్ఛామాత పాదాలచెంత నిర్మించిన చిన్న మ్యూజియంలో ఆ నిర్మాణానికి సంబంధించిన వివరాలన్నీ – జాగ్రత్త చేసి ఉంచారు. మొదటిసారిగా హెలికాప్టర్‌లో ఎన్నో కోణాల నుండి తీసిన ఛాయచిత్రాలు

చూసి ఆశ్చర్యపోవలసిందే. ఇంకా ముందుకు వెళితే – అక్కడ ఒక హెచ్చరిక ఉంటుంది పైవరకు ఎక్కదలిస్తే – 350 మెట్లు ఉన్నాయి. ఇంకోసారి ఆలోచించి ముందుకు వెళ్ళండి అని. లేదా – లిఫ్ట్‌లో వెళ్ళి ఆమె పాదాలను తాకి రావచ్చు అని. ఎలాగూ ఆమె కిరీటాన్ని తాకటానికి నిర్ణయించుకున్నాం కదా. ముందుగా బాగా వెడల్పుగా వుండి – పోను పోను అంతర్భాగం, తగ్గి తరిగి పోతుంటుంది. మెడ ప్రాంతం వచ్చేసరికి కేవలం ఒకరి వెనక ఒకరు ఎక్కవలసిందే. దారిలోనే చాలామంది అలసిసొలసి ఆగిపోతుంటారు.

లోపల ఏముంది. అన్నీ స్టీలు ముక్కలు – నట్లు, బోల్టులు. వీటితోనే అంతపరిమాణంగల – ఆకారాన్ని ఊహించి – నిజం చేశారు. పైన కప్పిన చర్మం? అంతా రాగిరేకులు – వాటిని కూడా నట్లు, బోల్టులతోనే బిగించారు. ఈ మొత్తం విగ్రహాన్ని 'ఊడతీస్తే 1885 ముక్కలుగా విడిపోతుంది. ఆ రాగి చర్మం – అట్లాంటిక్ ఉప్పు గాలులకు ఒక రకమైన లేత ఆకుపచ్చగా మారి, చక్కని వస్త్రం చుట్టుకున్నట్లు గోచరిస్తుంది. కిరీటంలో నుండి – న్యూయార్క్ నగరాన్ని – అట్లాంటిక్ సముద్రాన్ని తనివితీరా చూడవచ్చు. అక్కడ ఆ యెత్తులో తిరుగాడే హెలికాప్టర్లూ మీకు చేయి చాపితే అందుతాయేమోనని భ్రమ కలిగిస్తాయి. అక్కడ నుంచి – కుడి చేయి లోపల నుంచి – స్వేచ్ఛాజ్యోతికి కూడా మెట్లున్నాయి. మళ్ళీ అన్ని మెట్లూ దిగిరావలసిందే. క్రిందికి దిగిన తర్వాత సావనీర్లు అమ్మే ప్రదేశాలలో – ఎంతో చక్కని 'లేడీ లిబర్టీ' నమూనాలు, ఫొటోలు, టి–షర్టులు ఒక్కటేమిటి ఎన్నో రకాల జ్ఞాపికలు లభిస్తాయి. తర్వాత ఫెర్రీ ఎక్కి– బ్యాటరీ పార్కుకు రావచ్చు. స్వేచ్ఛా యాత్ర ఖరీదు యాభై డాలర్ల వరకు అవుతుంది. సాయంత్రానికి కాళ్లు నొప్పులు కాకుండా ఇంతశ్రమ ఎందుకనుకుంటే ఒక వందడాలర్లతో హెలికాప్టర్ టూర్ చెయ్యండి. 'లేడీ' తల చుట్టూ త్రిప్పి తీసుకువస్తాయి. అదొక వింత అనుభవం.

ట్విన్ టవర్స్:

మన్‌హటన్ దక్షిణ ప్రాంతంలోనే లిబర్టీ స్ట్రీట్ ఉంది. లిబర్టీ స్ట్రీట్‌ని ఆనుకుని – వరల్డ్ ట్రేడ్ సెంటర్ కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్ 'ట్విన్ టవర్స్'కి ప్రసిద్ధి. నూటపది అంతస్తుల ఎత్తులో ఈ ఆకాశ హర్మ్యాలు అపూర్వ సహోదరులవలె నిలబడి ఉదయ కాంతిలో మెరిసిపోతుంటాయి. ప్రతిరోజు యాభైవేల మంది

పనిచేసే ఈ వ్యాపార కూడలిని రోజూ లక్షల మంది దర్శిస్తారు. ఒక ఎకరం స్థలంలో కట్టబడిన ఈ 'టవర్స్'కి మధ్యలో ఎక్కడా స్థంభాలు లేవు. ఒక కోటి ఇరవయి లక్షల చదరపు అడుగుల వ్యాపారస్థలంగల ఈ భవనాలు స్టీల్, గ్లాస్ స్థంభాలే కనపడతాయి. మొత్తం 95 లిఫ్టులు ఎప్పుడూ పైకీ క్రిందకూ పరుగులు పెడుతుంటాయి. ఇంకా పెద్ద సామానులు చేరవేసే నాలుగు లిఫ్టులు కూడా హడావిడిగా వుంటాయి.

107 అంతస్తులు మీరు ఒక నిముషం లోపునే హైస్పీడ్ లిఫ్టులో చేరవచ్చు.

43,600 కిటికీలు. ఆరులక్షల చ॥ అడుగుల ఎంతో బలమైన గ్లాసులతో నిండి వున్నాయి. 2000 కార్లు నిలుపుకోవటానికి సెల్లార్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ సెల్లార్ పార్కింగ్‌లోనే పాకిస్తానీ టెర్రరిస్ట్ పెద్ద బాంబు పేల్చాడు. దాదాపు 200 వందల మంది చనిపోయారు. ట్విన్‌టవర్స్‌కి మధ్య విశాల స్థలం ఉంది. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక పండగ జరుగుతుంటుంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్–2; దీనిపైనే న్యూయార్క్ నగరం అద్భుతమైన అందాలు చూడటానికి 'డెక్' ఉంది. క్రిందనుంచి – 107వ అంతస్తుకి ఎక్స్‌ప్రెస్ లిఫ్టులో 58 క్షణాల్లో పైకి తేలవచ్చు. అక్కడ డెక్‌మీదికి ఎస్కలేటర్‌లో వెళ్ళాలి. అంతే. మిమ్మల్ని మీరు మర్చిపోయే దృశ్యం మీ కళ్లముందుంటుంది. ఒకప్రక్క అట్లాంటిక్ మహాసముద్రం ఆకుపచ్చని కదిలే తివాచీవలె మంత్రముగ్ధుల్ని చేస్తుంది. మరో ప్రక్క 55 మైళ్ళ మన్‌హటన్ అద్భుతమైన ఆకాశ హర్మ్యాలు మీకు తమ శిఖరాలతో శుభాకాంక్షలు చెపుతాయి. మరో ప్రక్క తూర్పునదిపై వున్న మూడు వంతెనలూ తోరణాలు కట్టినట్లు స్వాగతం చెప్తాయి. అంతదూరంలో – ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పోటీపడి మిమ్మల్ని దగ్గకు రమ్మంటుంది. క్రింద నడిచే మనుష్యులు చీమలకంటే చిన్నగా కనపడతారు. ఆ పైనుంచి మా అమ్మాయికి – విజయవాడ ఫోన్ చేశాను.

'డాడీ ఎక్కడనుంచి' అని అడిగింది.

"ఫ్రంమ్ ది టాప్ ఆఫ్ ది వరల్డ్' అన్నాను.

న్యూయార్క్ - 3

***మూ**డు వందల చదరపు మైళ్ళు విస్తీర్ణం, 18 మైళ్ళు తీరప్రాంతం పొడవు ఉన్న 'న్యూయార్క్' నగరాన్ని ప్రతి సంవత్సరం 2 కోట్ల మంది సందర్శిస్తుంటారు. పారిశ్రామికంగా, నాగరిక పరంగా ఎంతో అభివృద్ధి చెంది ప్రపంచంలోనే, అరుదైన స్థానం సంపాదించుకున్న ఈ మహానగరం, ఇప్పటి ఆధునిక సమాజానికి ప్రతీక అయినప్పటికీ ఇక్కడి మనుషుల మధ్య దూరం మనం కొలవలేనంతగా పెరిగిపోయింది.*

ఒకప్పుడు ఉరుకులు పరుగులతో ఊపిరి ఆడని మహానగరం ఇప్పుడు ఊపిరందక (వాతావరణ కాలుష్యంతోనా?) కాస్త వేగం తగ్గించి నడక సాగిస్తోంది. అంటే జాగింగ్ బూట్ల బదులు వాకింగ్ షూస్ వాడుకలోకి వచ్చాయి. అన్ని రంగాలలో – రాజకీయంగా, సాంఘికంగా, సంగీతపరంగా, ముఖ్యంగా వైద్య రంగంలో వచ్చిన పలు మార్పులు గమనించదగినవి. ఒకప్పుడు చెవులు చిల్లుల



రాక్ ఫెల్లర్ సెంటర్ – ప్రొమిథియస్

పడే రాక్ సంగీతం ఇప్పుడు మెల్లగా మృదువుగా మారింది. నగరం మధ్యలోని పొగ గొట్టాలు మూతబడ్డాయి. నగర శివార్లలోకి యంత్రాల మోతలు తరలి వెళ్ళిపోయాయి. ఉత్పత్తి నిలయాలు వెలవెలపోతున్నాయి. మబ్బుల్ని తాకే ఆకాశ హర్మ్యాలు ఆగిపోయాయి. గత 10–15 సం॥లుగా వచ్చిన మార్పులను గమనిస్తే న్యూయార్క్ "పొంగు" తగ్గిపోయిందా అనే అనుమానం రాకమానదు. కాని అలా అనుకుంటే కొంతవరకు పొరపాటే. ఇదివరకటి డిస్కోలు ఇప్పుడు ఎంతో వ్యత్యాసంతో కళకళలాడుతున్నాయి. అవి ఇప్పుడు పిచ్చిగంతులు, అరుపులకు బదులు సరళమైన సంభాషణలకు, భావ సాంగత్యానికి నెలవులయినాయి. హిప్పీలు కనుమరుగైనారు. నల్లజాతివారు చదువు సంధ్యలు నేర్చి ఎంతో ముఖ్యమైన ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నారు. చీకటి వ్యాపారాలు చేస్తున్నవారు చేస్తున్నా, ఎక్కువ శాతం జాతి ప్రధాన జీవన స్రవంతిలో కలిసిపోవడానికే మొగ్గు చూపుతారు. ఫ్యాషన్లు కేవలం మార్పు లేక వైవిధ్యం కోసమే మారిపోతుంటాయి. న్యూయార్క్‌లో ఫ్యాషన్ ఎవెన్యూలో పారిస్‌కి ధీటుగా ఫ్యాషన్ షోలు, పెరేడ్‌లు నడుస్తుంటాయి.

తమ పూర్వీకుల – బ్రిటీష్, ఐరోపా – బంధాలను తెంచుకోవటానికి ఒక రకమైన తిరుగుబాటు చేసిన అమెరికన్లు, నాగరికత పరంగా, సంగీతపరంగా, చివరికి జుట్టు కత్తిరించుకోవడంలో, బట్టలు వేసుకోవడం, తీసివేయడంలో కూడా తిరుగుబాటు చేసిన అమెరికన్లు, ఇప్పుడు మళ్ళీ మంచి బట్టలు వేసుకుని నీటుగా ఉండటంలో ఉన్న హాయిని, గౌరవాన్ని గుర్తించినట్లున్నారు. మన్‌హటన్‌లో మీకు గౌరవంగా సూట్‌లో తిరిగే మగవారు, పూలగౌనులో మాచింగ్ హాట్‌తో ప్రౌఢలు, ఆఫీస్ డ్రస్‌లో సెక్రటరీలు ఎదురవుతారు. హోమోల ఉధృతి తగ్గినా, ఎయిడ్స్‌తో శృంగార వ్యాపారం చల్లబడినా రేడియో సిటి సెంటర్‌కి దగ్గరలో సెక్స్ షాపులకు కొదవలేదు. అయితే సేఫ్‌సెక్స్ అంటున్నారు. ఇప్పటికీ చీకటిపడిన తర్వాత చీకటి సందుల్లో దొంగలకు మీరు దొరికిపోవచ్చు లేదా ఏ పిచ్చివాడి చేతిలో పిస్తోల్ మిమ్మల్ని కాల్చినా ఆశ్చర్యం లేదు. అందుకని అటుపోకండి. వెలుతురు ఉండగానే గూటికి, హోటల్‌కు చేరండి. ఇక ఆర్థికపరంగా కూడా న్యూయార్క్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ముందుగా పరిశ్రమలన్నీ తరలిపోయాయి. అంటే ఉద్యోగాలు కూడా తగ్గిపోయాయి. తర్వాత


జె.సి. పెన్నీలాంటి గొలుసు స్టోర్స్, ఎన్నో ఆయిల్ కంపెనీలు ఆస్తులు అమ్ముకుని వేరే చోటికి తమతో పాటు ఎన్నో వేల ఉద్యోగాలు తీసుకుపోతున్నాయి. ఇప్పుడు పన్నులు తగ్గిస్తామని, ఇంకా సౌకర్యాలు కల్పిస్తామని న్యూయార్క్ మేయర్లు కొత్తవారికి ఎరవేయవలసి వస్తోంది. న్యూయార్క్ ఎన్నో ఆశలతో వచ్చే కొత్తవారితో పాటు నగర పాలకులకు కూడా ఎన్నో ఖరీదైన ఆశలు ఉన్నాయి. 150 అంతస్తుల మేడ కట్టాలని, 7,500 అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ నిర్మించాలని పథకాలు తయారుచేశారు. ఇవన్నీ ఎప్పటికి నిజమవుతాయో వేచి చూడాలి. కాని ఇప్పటికే ఎన్నో ప్రదేశాలు మనల్ని న్యూయార్క్ నగరంలోకి పిలుస్తున్నాయి. చూద్దాం రండి.

1. మన్‌హటన్‌లో 1 నుంచి 9 ఎవెన్యూలు, 36 నుంచి 47 వీధులు కాలినడకతో తిరిగాను. చాలాసార్లు ఈ మాటే నా స్నేహితులతో చెపితే 20 ఏళ్ళ నుంచి న్యూయార్క్‌లో ఉంటున్న మాకు కుదురలేదు. మేయర్‌తో చెప్పి నీకు సన్మానం చేయిస్తాం అని నవ్వారు. ఇక బస్సులో, సబ్‌వే రైలులో ఎన్నిమైళ్ళు తిరిగానో లెక్కలేదు. కాని ఒక తృప్తి ఏమిటంటే నాలాంటి సందర్శకుడు ఈ యంత్ర మృగాన్ని, సాంకేతిక భూతాన్ని లొంగదీయగలిగాను అని అనుకోవడమే.

2. త్వరగా దగ్గర ఉన్న ప్రదేశాలు చూడాలంటే రేడియో సిటీ సెంటర్ నుంచి బయలుదేరే బస్‌టూర్ తీసుకోవాలి. పదిహేను డాలర్లతో మీ చేతికొక పసుపుపచ్చ బ్యాడ్జి కడతారు. తప్పిపోకుండా. 3 గంటలు అద్దాల బస్సులో ముఖ్యమైన ప్రదేశాలు రికార్డెడ్ కామెంటరీతో, అవసరమైనచోట ఆపుతూ చూపుతారు. ఇందులో 42 స్ట్రీట్, రాక్ ఫెల్లర్ సెంటర్, వాల్ స్ట్రీట్, ఐక్యరాజ్యసమితి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, సెంట్రల్ పార్క్, సెంట్రల్ లైబ్రరీ, ఫ్యాషన్ ఎవన్యూ, బ్రాడ్‌వే ఇలా ఎన్నో తిరగవచ్చు. ఈ బస్‌టూర్ మీకు పైపైన చూడడానికే పనికివస్తుంది. అయితే మీరు మళ్ళీ వచ్చినపుడు తెలిసిన ప్రదేశంలా అనిపిస్తుంది. అందుకే తప్పనిసరిగా ఈ బస్‌టూర్ చేయవలసిందే.

3. ఇప్పుడు బస్‌టూర్‌లో చూసిన ప్రదేశాల్ని ఒక్కొక్కటి పరిశీలనగా చూడాలి కదా. ఇవేకాక లిబర్టీ స్టాట్యూ, ట్విన్ టవర్స్, ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ మొదలైన ఎన్నో ప్రదేశాల్ని మనం వివరంగా చూడవలసి ఉంది. అంతకు ముందుగా న్యూయార్క్ నైసర్గిక స్వరూపం పరిశీలిద్దాం.

న్యూయార్క్ కూడా ఒక దీవిలాంటిది. ఇది కొద్దిగా ఉత్తరంగా వంగి, పశ్చిమ దిశగా పరుచుకుని తూర్పు దక్షిణాలకు హడ్సన్ – తూర్పు నదుల మధ్యగా తరిగిపోయి, అట్లాంటిక్ ముఖద్వారం వద్ద బ్యాటరీ పార్క్ ప్రక్కగా ఆగిపోతుంది. తూర్పు పశ్చిమాలకు విశాలంగా వుండే రహదారులను "ఎవెన్యూ" అని, ఉత్తర దక్షిణాలకు పరుగులెత్తే వీధులను "స్ట్రీట్"లని అంటారు. ఈ "బిగ్ ఆపిల్"ని ఉత్తరంగా క్వీన్స్ దీవిని పశ్చిమ దక్షిణంగా న్యూజెర్సీని కలుపుతూ ఎన్నో సస్పెన్షన్ వంతెనలు ఉన్నాయి. వీటిలో కొన్ని 2 అంతస్తుల వంతెనలు కూడా ఉన్నాయి. ఇంకా రెండు సొరంగాలు కూడా ఉన్నాయి. వీటి పరిమాణం, ఉపయోగం చూసి తీరాల్సిందే. న్యూయార్క్ నగరంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ భూగర్భ రైలు, మెట్రోబస్సులు చాలా చక్కగా ఎంతో వేగంగా నగరవాసులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తుంటాయి. భూగర్భ రైలు చార్జీలు చాల తక్కువ. ఒకసారి క్రిందికి వెళ్ళి రైలు ఎక్కడానికి 11/4 డాలర్. మీరు ఎంత దూరమైనా ప్రయాణించవచ్చు. బయటికి వస్తే ఆ చార్జీ అయిపోయినట్లే. 4 టోకెన్లు కొని జేబులో వేసుకోండి. రోజంతా తిరిగేయండి. చల్లటి వాతావరణంలో, తెలియని వారితో కలుపుగోలుగా ఉండకండి. రూట్ మ్యాప్ రైలులో ఉంటుంది. ఎవ్వరినీ అడగవలసిన పనిలేదు. లేదా టిక్కెట్‌తో పాటు తీసుకోవచ్చు. ఎక్కడికి వెళ్ళాలో ముందుగా నిర్ణయించుకుని రైలెక్కండి. అందులో కూడా చాలా రూట్లు ఉంటాయి. అందుకని కొద్దిగా హోమ్‌వర్క్ చేసి బయలుదేరితే న్యూయార్క్‌ను



Butler Library at Columbia University, described as one of the most beautiful college libraries in the United States.

జయించడం తేలిక. ఈ సబ్‌వేలలో రోజూ 40 లక్షలమంది తిరుగుతూ ఉంటారు. అంటే న్యూయార్క్ జనాభాలో సగం మంది సబ్‌వేలు వాడుకుంటారు.

చరిత్ర:

కొలంబస్ తర్వాత 1524వ సం॥లో జి.డి.వెరజానో అనే ఫ్రెంచి నావికుడు స్టాటన్ దీవిలో అడుగుపెట్టాడు. అక్కడి "మన్‌హటన్" అనే రెడ్ ఇండియన్ తెగవారు అతనికి సాదరంగా స్వాగతం పలికారు. వెరజానో పేరు న్యూయార్క్ బే వంతెనకు ఆ తర్వాత కాలంలో పెట్టారు. 1609లో హెన్రీ హడ్సన్ అనే హాలెండ్ నావికుడు దారితప్పి న్యూయార్క్‌కి, న్యూజెర్సీకి మధ్యలో ఉన్న అగాధం లాంటి నదిలో ప్రవేశించారు. నౌకతో, అది నౌకా వ్యాపారికి ఎంతో అనువుగా వుందని ఆ రేవుని ఎంతో అభివృద్ధి చేశారు తర్వాత. దానినే హడ్సన్ నది అని పిలుస్తుంటారు. ఆ తర్వాత అన్ని ఐరోపా జాతులవారు తండోప తండాలుగా వలసవచ్చి న్యూయార్క్‌ని ఉక్కిరిబిక్కిరి చేశారు. వీరంతా అక్కడి రెడ్ ఇండియన్ల దగ్గర స్థలాలను సెంట్‌కో, డాలర్‌కో అద్దెకు తీసుకొని స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

మొదట్లో డచ్చివారు న్యూ "ఆమ్‌స్టర్‌డామ్"గా వ్యవహరించిన ఊరు బ్రిటిష్‌వారి చేతిలోకి చేరి న్యూయార్క్‌గా మారింది. బ్రిటిష్ ప్రతినిధిని పెట్టి పాలన సాగించారు. పాతికవేల జనాభాతో మొదలైన మన్‌హటన్ జీవనం కొత్త నాగరికతకు నాంది పలికింది. 1783లో స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్



ఇండియన్ మార్కెట్

సైన్యం వెళ్ళిపోయిన తరువాత – స్వేచ్ఛా జీవనంతో, స్వాతంత్ర్యోత్సాహంతో, బ్రాంక్స్, క్వీన్స్ అయిలెండ్, లాంగ్ అయిలెండ్ సెంట్రల్ పార్క్ రూపుచెందాయి. తర్వాత 200 సంవత్సరాల పాటు పరిశ్రమలు, వాణిజ్యం, సంస్కృతిపరంగా ఎంతో అభివృద్ధి చెంది ప్రపంచంలోనే అరుదైన స్థానం సంపాదించుకున్న మహానగరం న్యూయార్క్. ఇక్కడ ప్రపంచంలోనే ఘనత చెందిన వ్యాపారవేత్తలు, కళాకారులు, సైంటిస్ట్‌లు నివసిస్తుంటారు. ఇప్పటి జనాభా కోటి పైనే. ఇప్పటి అత్యంత ఆధునిక సమాజానికి ప్రతీక అయిన న్యూయార్క్ నగరంలో ఎన్ని లక్షల జనాభా ఉన్నా మనుషుల మధ్య దూరం మనం కొలవలేనంతగా పెరిగిపోయింది. కాని ఇలాంటి మహానగరంలో – ఇన్ని లక్షల జనారణ్యంలో రోజూ తెల్లవారుతుంటుంది. సాఫీగా జన జీవనం సాగిపోతుంటుంది. మళ్ళీ ప్రొద్దువాలిపోతుంది సవ్యంగా అంటే అది తరతరాలుగా మనిషి చట్టాల పరిధిలో జీవించటానికి అలవాటుపడటం, మనిషిలోని మంచితనం కారణాలు అనుకోవాలి. న్యూయార్క్ నగరం ఎంతో పెద్దది.

300 చదరపుమైళ్ళ విస్తీర్ణం 18 మైళ్ళ తీరప్రాంతం పొడవునా ఎన్నో రేవులున్నాయి. 37 ఎకరాల ఉద్యానవనాలు, ఎన్నో క్రీడా ప్రాంగణాలు, 400 ఆర్ట్ గ్యాలరీలు, 400 థియేటర్లు, వందకు పైగా ఆకాశహర్మ్యాలు ఉన్నాయి. 3000లకు పైగా చర్చిలు, పాతిక వేలకు పైగా రెస్టారెంట్‌లు ఉన్నాయి. 12000



జె.ఎఫ్.కె. ఎయిర్‌పోర్ట్ న్యూయార్క్



న్యూయార్క్‌లోని బ్రాడ్‌వే

టాక్సీలు ఎప్పుడూ తిరుగుతుంటాయి. సుమారు 2 కోట్ల మంది ప్రతి సంవత్సరం ఈ నగరాన్ని సందర్శిస్తుంటారు. అందులో 25 లక్షల మంది విదేశీ యాత్రికులే. ఇక్కడ ఉన్నంతమంది యూదు జాతి ప్రజలు ప్రపంచంలో మరెక్కడా లేరు. అలెగ్జాండర్ గ్రహంబెల్ 1877 మేలో న్యూయార్క్‌లో టెలిఫోన్ ప్రదర్శించాడు. అది వ్యాపారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని మొదటిసారిగా న్యూయార్క్ టెలిఫోన్ వ్యవస్థ ఏర్పడింది. బేస్ బాల్ న్యూయార్క్ నగర క్రీడగా ఎదిగింది. 1966 – 77 పది సంవత్సరాలు న్యూయార్క్ నగరం ఎంతో విద్యుచ్ఛక్తి కొరతను ఎదుర్కొంది. బ్లాకౌట్ సమయంలో ఎన్నో దొంగతనాలు, మానభంగాలు జరిగాయి. 1908 ప్రాంతంలో మొదటి సినిమాహాలు న్యూయార్క్‌లో మొదలైంది.

న్యూయార్క్ 'గవర్నర్' దీవిని క్లింటన్‌గారు ఒక డాలర్‌కు అమ్ముతానన్నా ఎవరూ కొనలేదు. కారణం ఆ దీవిని, అందులోని చారిత్రక కట్టడాలను కాపాడాలంటే సంవత్సరానికి 3 కోట్ల డాలర్లు ఖర్చు అవుతుంది.

న్యూయార్క్ - 4

న్యూయార్క్ అనగానే 'బ్రాడ్వే' గురించి ఆలోచనలు రాకమానవు. ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన 'హాలివుడ్' తారలందరు 'బ్రాడ్వే'లో స్టేజి నాటకాలు వేసినవారే. 'బ్రాడ్వే'లో తమ నటన, నైపుణ్యాన్ని ప్రదర్శించలేని నటీనటులు – ఎంత గొప్పవారయినా, 'గుర్తింపు'లేని వారిగానే మిగిలిపోతారు.

'బ్రాడ్వే' ఒక వీధి పేరు కాదు. మన్హటన్ దీవిలో ఇది ఒక 'డిస్ట్రిక్ట్' లేక ప్రాంతం అనుకోవచ్చు. ఈ బ్రాడ్వేలో దాదాపు చిన్నా పెద్దా కలసి మూడువందలకుపైగా థియేటర్లు ఉన్నాయి. స్టేజీలన్నీ 'ఎలక్ట్రానిక్ ఎఫెక్ట్లు' సినిమాలను మించి వుంటాయి. ఒక్కో 'షో' ప్రొడ్యూస్ చెయ్యాలంటే ఒక మిలియన్ డాలర్ల వరకూ ఖర్చు అవుతుంది. నోబుల్ బహుమతులు పొందిన రచయితలు, ఎంతో డిమాండ్ వున్న స్క్రిప్టు రాసేవాళ్లు, డైరక్టర్లు, నటీ నటులు, సినిమాలకంటే ఎక్కువ పారితోషికం తీసుకుంటారు. మీరు షో చూడాలంటే ఎంతో ముందుగా 'బుక్' చేసుకోవాలి. కనీసం 50 నుంచి 70 డాలర్ల వరకూ ఖరీదు వుంటుంది. మిగతా ఖర్చులు టాక్సీకి, లేదా పార్కింగ్కి తప్పవు. కాని మంచి 'షో' చూసిన తర్వాత ఈ ఖర్చు వృధా అనిపించదు. అదొక అద్భుతమైన ప్రపంచం. అరుదైన అనుభవం. ఇతివృత్తాలు – ఎంతో వైవిధ్యంతో ఉంటాయి. ఈ 'బ్రాడ్వే'లోనే 'మ్యూజిక్ హాల్స్' 'జాజ్ నైట్స్' ఎంతో హుందాగా రాత్రంతా నడుస్తుంటాయి. ఇక్కడున్నంత 'వెరైటీ ఎంటర్టైన్మెంట్' – వివిధ రకాల వినోద కార్యక్రమాలు ప్రపంచంలో మరెక్కడా మీకు కానరావు. 'మాజిక్ షో'లు కూడా ఎంతో ఆదరణ పొందుతుంటాయి. మీరు బ్రాడ్వేలో ప్రవేశించిన తర్వాత మళ్ళీ మామూలు ప్రపంచంలో అడుగుపెట్టాలంటే – ఉదయం 'బ్రేక్ఫాస్ట్ టేబుల్' దగ్గరే – అదీ నిద్ర కళ్లతోనే. ఒక్క రాత్రయినా మిమ్మల్ని మీరు మర్చిపోండి.

ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ : ఒక వెయ్యి నాలుగు వందల డెభై రెండు అడుగుల ఎత్తు, 102 అంతస్తులు, 73 లిఫ్ట్లు 60,000 టన్నుల స్టీలు, 3,500 మైళ్ళ టెలిఫోన్ వైర్లు, 60 మైళ్ళ నీటి గొట్టాలు ఓహ్! ఇది ఒక చిన్న ఊరా? లేక కేవలం మేడా? 86వ అంతస్తులో ఉన్న 'అబ్జర్వేటరీ' నుంచి న్యూయార్కంతా

తిలకించవచ్చు. న్యూయార్క్ రాష్ట్రాన్ని 'ఎంపైర్ స్టేట్' అంటారు. రాక్‌ఫెల్లర్ అనే ఆయన, ఒకప్పుడు మామూలు సివిల్ కాంట్రాక్టరు. ఆయన కష్టం – కలిసివచ్చిన కాలం – కలిసి ఒక ఆర్థిక సామ్రాజ్యాన్ని రూపొందించాడు. మన్‌హటన్ నడిబొడ్డున 'రాక్ ఫెల్లర్ సెంటర్' పేరుతో ఒక అద్భుతమైన భవన సముదాయాన్ని, చిన్న పార్క్‌ని, 'స్కేటింగ్' రింగ్‌ని సమకూర్చాడు. ఆకాశాన్ని తాకే నాలుగు హార్మ్యాలు– మధ్యలో పార్క్ – స్కేటింగ్ రింగ్ ఇదంతా ఒక కలలాంటి సెట్టింగ్. ప్రపంచం నాలుగు దిక్కులనుంచి అక్కడకు చేరే యాత్రికులతో ఎప్పుడూ సందడిగా కళకళలాడుతుంటుంది. రింగ్‌కి పైన, బంగారు రంగుతో 'క్యూపిడ్' చిన్నారి రెక్కలతో అలవోకగా వారి వినోదం చూస్తుంటాడు. అక్కడికి రాగానే గాలిలో ప్రేమ పుడుతుంది. రకరకాల రంగు రంగుల పూలతో ఆర్చిలూ, తోరణాలు ప్రతిరోజూ అలంకరిస్తారు. కెమెరాల క్లిక్ క్లిక్‌లు, ప్రేమికుల ముద్దు మురిపాలు – కనువిందు చేస్తుంటాయి. దగ్గర్లోనే వున్న "రేడియోసిటీ" థియేటర్‌లో ఎప్పుడూ వినోదానికి లోటు వుండదు.

'టైమ్ స్క్వేర్' పైన ఒక "ఎలక్ట్రానిక్ రన్నింగ్" బోర్డు మీద వార్తలు కనపడుతుంటాయి – అమెరికాలో రోజూ ఎన్ని వందల తూటా మరణాలు జరుగుతున్నాయి – ఒక్కో అమెరికా పౌరుని నెత్తిన ఎంత అప్పు వుంది – ప్రపంచ జనాభా సెకనుకు ఎంత మంది చొప్పున పెరుగుతున్నదిలాంటివి. న్యూయార్క్ వాతావరణం ఎంతో వైవిధ్యం కలది. చలికాలంలో ప్రతి రాత్రి మంచు కురుస్తుంది. ఉదయం లేచి చూస్తే మూడు అడుగుల ఎత్తున తెల్లటి మంచుతో రోడ్లన్నీ నిండి ఉంటాయి. అదంతా ఉప్పుపోసి, కరిగించి, ప్రక్కకు తోయడం కార్పొరేషన్‌కి పెద్దపని. తెల్లని మంచు – టి.వి.లో, సినిమాల్లో, లేక బొమ్మల్లో చూడటానికి తెల్లగా ముచ్చటగా వున్నా అక్కడి చలి భరించటం ఎంతో కష్టం ఎక్కువ మంది – క్రిస్‌మస్ సెలవులకు – ఫ్లోరిడా, టంపా, న్యూ ఆర్లిన్స్ ప్రదేశాలకు వెళ్ళి ఈ శీతల వాతావరణం – మంచు రాత్రులు, చలిగాలుల నుండి దూరంగా గడిపి వస్తారు. వేసవి కూడా – న్యూయార్క్‌లో వేడిగానే వుంటుంది. చుట్టూ నీళ్ళు మూలంగా ఎక్కువగా గాలిలో తేమ ఉండి – చెమటలు పడుతుంటాయి – కాని వేసవిలోనే ఇక్కడకు ఎక్కువ యాత్రికులు వస్తుంటారు. వేసవి రాత్రులు మన్‌హటన్‌లో సైడ్‌వాక్ రెస్టారెంట్లు – 'బ్రాడ్వే

షో'లు – 'మేసీ' స్టోర్లు – NBC టి.వి. సెంటర్ రింగ్‌లో సందడి, పోలీస్ సైరన్లు, అంబులెన్సు అరుపులు – వెరసి ఈ మహానగరం ఏ రాత్రయినా నిద్రపోతుందా అనే అనుమానం రాక మానదు.

న్యూయార్క్ మినీ ఇండియా!

అండర్ గ్రౌండ్ రైలులో 'జాక్సన్ హైట్స్'కి వెళ్లాం. ఇది ఒక చిన్న ఇండియా. భూగర్భంలో నుంచి బైటకు రాగానే మనకు కనిపించేది – అందరూ భారతీయులే. చీరల షాపులు, టి.వి., విసిఆర్, కంప్యూటర్‌లు ఇండియన్స్‌కు పనికివచ్చేవి అమ్మే షాపులు. ఇండియాకు తిరిగి వెళ్లే ప్రయాణీకులకు సూట్‌కేసులు, బంగారపు బిస్కట్లు, వాచీలు – ఇక్కడున్న మూడు బజార్లు మన అబిడ్స్‌లాగా వుంటాయి. పాన్‌షాప్‌లు, అన్ని రకాల మన రెస్టారెంట్లు, వరండాలో అమ్మే కూరగాయలు, బియ్యం, పప్పు, అన్ని ఊరగాయ పచ్చళ్ళు – అప్పడాలు – అడ్డదిడ్డంగా పార్క్ చేసిన కార్లు – హడావిడిగా తిరిగే భారత పౌరులు – చివరికి పోలీసు కూడా భారతీయుడే – మీరు ఇండియాకు 10 వేలమైళ్ళ దూరంలో న్యూయార్క్ మహానగరంలో ఉన్నారన్న సంగతి పూర్తిగా మర్చిపోతారు. ఇక్కడకు ఒక్కసారి వచ్చారంటే, మీరు న్యూయార్క్‌లో ఎన్ని రోజులుంటారో – ప్రతిరోజు వచ్చి ఒకటి రెండు గంటలు గడపకుండా వుండలేరు – ఆ విధంగా మీ ఇంటి బెంగ తీరిపోతుంటుంది. 'జాక్సన్ హైట్స్'లో ఎక్కువగా పటేల్ బాబులున్నా (గుజరాతీలు) అన్ని రాష్ట్రాలవారు తారసపడతారు. చివరికి పేరు కూడా, "జైకిషన్ హైట్స్"గా మార్చి వాడుకలోనికి తెస్తున్నారు. ఇక్కడి బ్యాంక్‌లు, బంగారు నగల షాపులు, ఎంతో విలువైన, రత్నాల వ్యాపారం – అంతా జోరుగా సాగిపోతుంటుంది.



న్యూయార్క్ మినీ ఇండియా


సియర్స్ టవర్స్ చికాగో డౌన్ టౌన్

అమెరికా హృదయం:
చికాగో నగరం

"పొటావాటోమి ఇండియన్స్" దగ్గర నుండి ఇప్పటి చికాగో నగరం నిలిచిన నేలను అప్పటి అమెరికా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు – ఎవరనుకున్నారు– అది ఒక మహానగరంగా – అదీ అమెరికా దేశానికి హృదయ స్పందనగా రూపు చెందుతుందని?

తూర్పున ఒక మంచి నీటి సముద్రంలా – మిచిగాన్ మహాసరస్సు. ఉత్తరాన, పశ్చిమాన అంతులేని ఖాళీ ప్రదేశం, మూడు నాలుగు తరాలుగా తరలివచ్చి– కష్టించి ఈ మహానగరాన్ని సృష్టించిన వలస జాతీయులు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు – వర్షాలు, వరదలవలన పేరుకున్న బురదలో నుంచి – నగరాన్ని – ఒక్కొక్క భవనాన్ని – పైకి లేపిన – ఒక దశాబ్దం కాలపు ప్రణాళిక, (1850లో) అంతలోనే నగరాన్ని బూడిద చేసిన ఘోర అగ్ని ప్రమాదం (1871), ఆ తర్వాత – అమెరికాలో ప్రయోగాత్మకంగా తలపెట్టిన మద్య నిషేధపు విపరీత పరిణామాలు – కాపుసారా, దొంగరవాణా, సంఘ వ్యతిరేక శక్తుల విజృంభణ, ఆ తర్వాత – 'సాంప్రదాయ' భారీ పరిశ్రమల 'మరణం' – ఇన్ని ఒడిదుడుకులకు ఎదురీది, ఒక మహానగరంగా, అమెరికా దేశానికే గుండె కాయగా నిలిచింది చికాగో. అందుకు కారణాలు ఎన్ని ఉన్నా – ముఖ్యంగా అక్కడి ప్రకృతి వనరులు – ప్రదేశ సమృద్ధి – ప్రజల స్వయం కృషి, వలస జాతుల అహరహ శ్రమ.

చికాగో పరిమాణం ఊహించడం చాలా కష్టం. ఒక్కో రహదారి పగలయితే, ఈ రహదారు లేమిటి – ఎవరు ఎందుకు ఈ విధంగా వేసుకుంటూపోయారు? అనిపిస్తుంది. రాత్రయితే – ఈ దీపాల తోరణాలు ఎవరి పెళ్ళికి కట్టారు. ఈ దారులన్నీ పసుపు పారాణితో నింపారేమిటి అనిపిస్తుంది. చికాగో – పరిమాణం – ఒక మహాకాయుని కండల్లా అనిపిస్తుంది. చికాగో వాసులు

కూడా, "మేము చేతల (కండల) వాళ్ళమే. మాటలు తర్వాత" అంటారు. ఇందుకు కారణభూతులయిన ఇద్దరు "మగ" వాళ్ళను మనం గుర్తుచేసుకోవాలి.

ఒకరు : "డేనియల్ బర్న్‌హం" అనే ఇంజనీరు. ఈయన (1909) ఎప్పుడూ చిన్నాచితకా ఆలోచనలు చేయలేదు. విశాల దృష్టి – ఇంకా విశాలమైన రహదారులతో 'సిటీప్లాన్' రూపొందించి – 6000 ఎకరాల ఉద్యానవనాలు ప్రత్యేకించి మహానగరానికి ఏర్పరిచి – చికాగో రూపశిల్పి అయ్యాడు. ఈయన గారి ప్రణాళిక ప్రకారం జరిగి ఉంటే నగరంలో 17 అంతస్తులకు మించి భవనాలు నిర్మింపబడేవి కావు. కాని సరిగ్గా ఇక్కడే ఈ ఆధునిక నగరాన్ని మరో రూపశిల్పి మలుపు తిప్పాడు. ఆయనే నగర మేయర్ "రిచర్డ్ దాలీ". ఆయన ఎటు నడిస్తే అటు ఆకాశహర్మ్యాలు నిలబెట్టాడు. ఆయన ఎటు చూస్తే అటు "ఎక్స్‌ప్రెస్ వే"లు పరుగులు పెట్టాయి. ఆయన ఎక్కడ ఆగితే అక్కడ – ఒక పికాసో శిల్పం, ఛాగాల్, గాల్డర్ భారీ ఆధునిక శిల్పాలు – నిలబడ్డాయి. అంతటి ఘనుడు – 'బాస్' దాలీ. ఇంతటి మహానగర నిర్మాణం ఒక వంద సంవత్సరాలలో జరిగిందంటే ఆశ్చర్యం. అంతకంటే ఈ సంపద, ఈ రహదారులు, ఈ ఆకాశ హర్మ్యాలు – మనకు, ముఖ్యంగా నాలాంటి దేశదిమ్మరులకు – ఎంత ఆశ్చర్యం ఆనందం కలిగిస్తాయో, ఈ సంపద మాటున పేదరికం, ఈ రహదారుల ప్రక్క చీకటి సందుల్లో రక్తపు మరకలు, ఈ ఆకాశహర్మ్యాలు ఉన్మత్తత, మరింత విచారం కలిగించక మానవు.

తూర్పున మిషిగాన్ సరస్సు అర్థచంద్రాకారంగా, చికాగో నగరాన్ని 'లూప్'లో నుంచి మొదలయి ఎంత దూరం వెళ్తుందో – అంతు వుండదు – చుట్టుకుని వుంటుంది. ఎంతో విలాసవంతమైన ఖరీదయిన భవనాలు – కళ్ళు మిరమిట్లు గొలిపే దీపాలు కాంతు లీనుతుంటే, ఒక భారీ నల్ల జాతి యువతి మెడలో రత్నాలహారంలా అనిపిస్తుంది. ఈ సంపన్నత, ఒక అయిదారు బ్లాక్‌లు దాటేవరకే. అక్కడ నుంచి నగర దారిద్ర్యం, చీకటి కాఠిన్యం, నేరగాళ్ళ రాజ్యం, ఇలా పొరలు పొరలుగా విడిపోతుంటుంది. మొదట్లో చెప్పినట్లు చికాగో – పరిమాణానికి పేరు. అంటే "సైజ్ మాటర్స్" అన్నమాట. అది అన్ని విషయాలలో అక్షరాలా నిజం. సియర్స్ టవర్స్ ప్రపంచంలో ఎత్తైన నిర్మాణం. ఆ ప్రక్కనే కూలిపోతున్న చర్చి. అలాగే, 'బిగ్' థాంప్సన్ – ఇలినాయిస్ రాష్ట్రానికి

నాలుగోసారి గవర్నరు. ఆయన బంగళాలో బ్రేక్‌ఫాస్ట్‌కు కూర్చుంటారు. అక్కడికి మూడు బ్లాక్‌ల దూరంలోనే, కాగితాలు ఏరుకునే పేదవాళ్ళు – చెత్త కుండీలను తిరగ వేస్తుంటారు.

"లాసల్" చికాగోలో ధనికులు నివాసం ఉండే డిస్ట్రిక్ట్. సరిగ్గా అక్కడికి మైలు దూరంలోపే, 'క్రాబిని' కాలని వుంది. అది చికాగో 'గాంగ్ వార్'లకు, నేరగాళ్ళ యుద్ధాలకు కర్మభూమి. ఇది – ఈ నగరం – ధనికుల, దరిద్రుల నివాసం. అమెరికా అంతటికీ ధనికులు నివాసం ఉండే ప్రదేశాలు ఉన్న నగరం. అమెరికాలో ఉన్న అతి దరిద్రపు 16 కాలనీలలో 10 కాలనీలు ఇక్కడే ఉన్నాయంటే ఆశ్చర్యం లేదు.

విండీ సిటీ:

చికాగోని 'విండీ సిటి' అంటారు. అందుకు కారణం మిషిగాన్ సరస్సు పై నుండి వచ్చే ఈదురు గాలులు – అందుకు తలలూపే ఒడ్డున నిలబడిన ఆకాశహర్మ్యాలు (కొన్ని భవనాల తలలు కొన్ని అడుగులు ఊగుతాయి.) కాని అసలు కారణం – ఈ నగర రాజకీయం. వీరు ఎప్పుడు ఏ పార్టీకి తమ మద్దతు తెలుపుతారో – గాలివాటమే. అందుకే విండీ సిటీ అని, విండీ స్టేట్ (ఇలినాయిస్‌ని) అని అంటారు. డెమాక్రాట్స్‌కి పెట్టని కోట. (అబ్రహం లింకన్ ఇలినాయిస్ వాసి). ఇంకా


Steam Rising from Chicago River

చెప్పుకోవాలంటే 'ప్లేబాయ్'లో రాత్రి సరదాలు కూడా తక్కువేమీ కాదు. అసలు చికాగో సిటీ అంతా ఈ ఒక మైలు చతురస్రం 'మిషిగన్ ఎవెన్యూ' మిమ్మల్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తి, నిశ్చేష్టులను చేస్తుంది. ఈ నిర్మాణాలు, అద్దాలు, గ్రానైట్‌లు, ఎంతో పెద్ద శిల్పాలు – ఆధునిక కళారూపాలు – ఇవన్నీ నడచి తిరుగుతుంటే – అదీ వేసవి సంధ్యా సమయంలో – సరస్సు గాలులు సరసమాడుతుంటే, ఖరీదయిన కార్లు బారులుగా నడుస్తుంటే, వింత వింత దుస్తుల్లో డిన్నర్ పార్టీలకు 'సిటి లేడీస్' 'లిమోజన్'లో దిగుతుంటే, మనం అలా నోరు తెరచి చూస్తుండాల్సిందే. మరో విషయం చెప్పనా. ప్రపంచంలోనే ఎత్తైన భవనం, ప్రపంచంలోనే అతి పెద్ద పాలరాతి భవనం, ప్రపంచంలోనే ఎంతో పెద్ద బ్యాంకు బిల్డింగ్, ఎంతో పెద్ద ఉప్పు నీటి ఎక్వేరియంలు, ఇలా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు – కాని ఇప్పుడు కోటిపైగా జనాభా ఉన్న ఈ నగరంలో 1830లో కేవలం 50 మంది మాత్రమే ఉండేవారంటే నమ్ముతారా.

గాంధీ మార్గ్:

ఇక వలసజాతుల విషయం – చైనా టౌన్ ఎప్పుడూ సందడిగా హడావుడిగా గలగలలాడుతూ వుంటుంది. ఇక్కడ చైనా జాతివారు, బాగా సంపన్నులు – కాని ఎవ్వరితో కలవరు. ఇండియన్లు, చాలా పెద్ద సంఖ్యలో వున్నారు. దేవాన్ స్ట్రీట్ అని 'లూప్'కి ఉత్తరంగా 3–4 కిలో మీటర్ల పొడవునా ఉంటుంది. అన్నీ భారతీయులకు కావలసిన – నగలు, చీరలు, రెస్టారెంట్లు, సరుకులు, పచ్చళ్ళు – చివరకు ఒకటి రెండు బ్యాంకులు కూడా యీ వీధిలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ విశాలమైన వీధిని 'గాంధీ మార్గ్' అని నామకరణం చేసుకున్నారు. నా అదృష్టం కొలదీ 'స్వాతంత్ర్య దినోత్సవం' వేడుకల్లో పాల్గొన్నాను. అయితే హిందువులు, ముస్లింలు కలిసి చేసుకున్న పండుగ – చికాగోలో నన్నెంతో ఆనందపరచింది. అమెరికాలో ఏ పండుగ అయినా ఆదివారాల్లో జరుపుకోవాలి. చికాగోలో హిందువుల గుళ్ళు చాలానే ఉన్నాయి. నా స్నేహితుడు శ్రీనివాసరావు ఆయన బెంజికారులో అన్ని గుళ్ళకూ తీసుకువెళ్ళారు. పగలు, రాత్రిళ్ళు, చికాగో విశాలమైన వీధులన్నీ కొలిచాం – ఆయన కారులో రోజూ దేవన్ వీధి వెళ్లి రెండు మూడు గంటలు గడిపే వాళ్ళం – ఇంటి బెంగ తీరేది. గుళ్ళలో పూజారులు ఎక్కువగా, గుడివాడ, విజయవాడ, తిరుపతి నగరాల నుండి వెళ్లినవారే.

శ్రీరామచంద్రరావుగారు (రాంగోపాల్ థియేటర్ యజమాని) అరోరా తీసుకువెళ్లారు. అక్కడ చక్కటి గుడి ఉన్నది. తెలుగువాళ్ళు – ఎంతో శ్రమకు, ఖర్చుకు ఓర్చి ఈ దేవాలయాలను నిర్మిస్తున్నారు. అయితే వారి పిల్లలు ఆ ప్రాంతాలకు వస్తున్నట్లు లేదు.

మిత్రులు సురేష్‌గారు గోల్ఫ్‌కోర్స్‌లో ఎంతో ఖరీదయిన భవనం కట్టించారు. దాదాపు 11/2 కోట్ల రూపాయిలుంటుంది. ఆ యింటి వెనక వైపు – చెక్క బాల్కనీలో మసక ఎండలో లైమ్ సిప్ చేస్తూ, గోల్ఫ్ ఆడేవాళ్ళను చూస్తూ అనుకున్నాను, "జీవితం ఎన్నిరకాలుగా అనుభవించవచ్చో" అని... చికాగోలో జరిగిన తానా సదస్సులు – ఎంతో సంరంభంగా, సందడిగా ముగిశాయి. దాదాపు ఎనిమిది వేలమంది తెలుగు వారు ఇక్కడ పండుగలు జరుపుకున్నారు. తెలుగువారు, తెలుగు పాటలు, తెలుగు భోజనం, అంతా తెలుగు తనమే, అద్భుతంగా నిర్వహించారు. నిర్వాహకవర్గం – ముఖ్యంగా యువతకు పెద్ద పీట వేశారు. అరోరాలో జరిగిన కార్యనిర్వాహక సభకు వెళ్ళాను. నాకు ఏ ప్రత్యేకత లేకపోయినా – ఇంత దూరం నుంచి వెళ్ళినందుకు సాదరంగా ఆహ్వానించి మర్యాద చేశారు. అద్భుతంగా బాపుగారు రూపొందించిన సావనీరు అందించారు. తెలుగు వంటలతో భోజనం పెట్టారు – రావెళ్ళ రమేష్, రామరాజ భూషణ్‌గారు, చంద్రశేఖరం గారు, సురేష్‌గారు, ఇంకా ఎందరో తెలుగు బిడ్డలు, అందరికీ శతాధిక వందనాలు. చికాగో మిడ్‌వే ఎయిర్ పోర్టు నుంచి ఉదయ కిరణాలతో పాటు నేనెక్కిన విమానం నీలాకాశపు మార్గాన తేలింది. మిషిగాన్ సరస్సు, మిషిగాన్ ఎవెన్యూ ఆకాశహర్మ్యాలు అద్దాలు, ఉదయ కాంతిలో తళతళమెరుస్తూ రాత్రి పడిన మంచును ఆరబెట్టుకుంటున్నాయి. ఆ దృశ్యం చూసి ఆనందించవలసిందే. ఎయిర్‌పోర్టు బార్‌లో – కోస్టారికా పొట్టి బార్ అటెండర్‌తో బాతాఖానీ – అతనికి జయంతి ధర్మతేజ ఎవరో తెలుసు. అంతలో ఒక అమెరికా అందగత్తె వచ్చి – బార్ రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని అరగంటలో నేను ఒక గ్లాస్ పూర్తి చేసే లోపు – మూడు గ్లాసుల మిల్లర్ బీరు, నాలుగయిదు సిగరెట్లు ఊది – వెళ్లిపోయింది.

ఆహా 'ఉమెన్ లిబ్' అనుకుని – గేట్ వైపు నడిచాను.

చికాగో వాతావరణంలో అన్నీ అధికమే. శీతాకాలం 4, 5 అడుగుల



పొగమంచులో బంగారు వారధి

మంచు కురుస్తుంది. ముఖ్యంగా క్రిస్టమస్. వైట్ క్రిస్టమస్ అంటారు. ఎటు చూసినా తెల్లగా మంచు కప్పివుంటుంది.

వేసవి కాలంలో ఎండ, గాలిలో తేమ అధికం. 100 డిగ్రీల ఫారిన్‌హీట్ వస్తేచాలు – చాలామంది – ముఖ్యంగా వయసు మళ్ళినవాళ్ళు రాలిపోతుంటారు. వీధుల్లో "హీట్ ఎమర్జన్సీ" పెట్టి బైటకు వచ్చిన వాళ్ళను కాలుస్తామని బెదిరిస్తారు. ఫైర్ ఇంజన్లతో నీళ్ళు జల్లుకుంటూ వీధులన్నీ తడుపుతారు. ప్రజలు, సాయంత్రానికి గోచీలు పెట్టుకొని, మెట్లమీద, సరస్సు ఒడ్డున పడి వుంటారు. పిల్లలు కేరింతలు కొడుతూ నీళ్లలో తడుస్తుంటారు. పగటి వేడి చీకటి చల్లదనంతో కలిసే వరకు – జన సంచారం కానరాదు.

రాక్ ఎన్‌రోల్, హంబర్గర్‌లు, జాజ్ సంగీతం ఇక్కడి నుంచే మొదలయినాయి.

శాన్‌ఫ్రాన్సిస్కో

'హేవ్ ఎ నైస్ డే' ఇది అక్షరాల 'శాన్ ఫ్రాన్సిస్కో'లోనే సరిపోతుంది. అమెరికా, మిగతా నగరాలలో, ఎక్కువగా, పార్కింగ్ టిక్కెట్టో, స్పీడింగ్ టిక్కెట్టో ఒక వంద డాలర్లు వడ్డించి 'కాప్' 'హేవ్ ఎ నైస్ డే' అంటే ఒక రకంగా ఎగతాళిగా వుంటుంది – వడ్డన జరిగిన వాళ్ళకు వళ్ళు మండిపోతుంటే ఇంకా "నైస్ డే" ఏమిటని. కాని – ఎప్పుడూ చల్లని ఎండ, చక్కని వెలుతురు – మేఘానికి మరెక్కడా పనిలేనట్లు – గోల్డెన్ గేట్ బ్రిడ్జికి అంటుకుని "ట్విన్ పీక్స్" చుట్టూ చేరి బర్కిలీహిల్స్‌ను కప్పుకుని అప్పుడప్పుడూ ఊరంతా ఒక తడి జల్లు పూలవానలా కురిసి, ఇంకా బద్ధకంగా ఉన్నప్పుడూ – పసిఫిక్ జలాలతో సరసమాడి, ఆగి వున్న ఓడలను పొగ మంచుతో కడిగి ఈ సుందర నగరానికే గొడుగు పడుతుంటే, పెద్దగా హడావుడి పడని, 'అంతా సవ్యంగానే జరిగి పోతుంటుంది' అనుకునే ఈ నగర వాసులకు 'హేవ్ ఎ నైస్ డే' అని పరస్పరం అనుకుంటే, లేకపోతే మీతో ఎవరైనా సెలూన్‌లోనో, షాపింగ్ సందర్భంగానో, లేక హయ్యత్ రీజన్సీ ఫాయిర్‌లోనో అంటే అది అక్షరాల నిజం. ఇక్కడ తిరిగినన్ని రోజులూ, గడిపిన రాత్రులూ అందుకు సరిజోడుగానే వుంటాయి. అందుకేనేమో – ఎంతోమంది రచయితలు ఇక్కడ స్ఫూర్తి పొందారు. ఎంతోమంది కవులు – పాటలు రాసి అమరులయ్యారు. ఎన్నో రచనలు మరెన్నో సామెతలు, ఎన్నో సినిమాలు – ఇక్కడే మొదలయ్యాయి.

ఇంకా నయం. ఇక్కడ ఎప్పుడూ మంచు కురవదు – చికాగో, న్యూయార్క్ నగరాల వలె. ఆ తెల్లని మంచు ఇక్కడ కూడా కురిసి వుంటే సంవత్సరంలో ఎప్పుడైనా – ఆ రచయితలు, కవుల సంఖ్య ఎన్ని రెట్లు పెరిగి వుండేదో. ఈ నగర పరిసరాల సహజ సౌందర్యం, పసిఫిక్ జలాల ప్రశాంత వాతావరణం, గుట్టలు, కొండల వంపు సొంపులు, డౌన్‌టౌన్ అద్దాల మేడల తళుకుబెళుకులు ఇవన్నీ జనాన్ని ఆకర్షించి కట్టిపడేశాయి. అందుకే ఇక్కడ ఇళ్ళ అద్దెలు – ఆకాశన్నంటుతాయి – జన జీవితం ఖరీదైన కార్లలోనే పరుగెడుతుంటుంది. పెద్ద కంపెనీలు తమ ప్రధాన కార్యాలయాలన్నీ ఇక్కడే నిర్మించుకున్నాయి.

గోల్డ్ రష్:

గోల్డెన్ స్టేట్‌గా ప్రసిద్ధి పొందిన కాలిఫోర్నియా రాష్ట్రానికి 'గోల్డెన్ గేట్'గా పేరు గాంచిన శాన్‌ఫ్రాన్సిస్కో నగరం పునాదులు 1848 ప్రాంతంలో పడ్డాయి. ఆ ప్రాంతంలో గల బంగారు గనుల త్రవ్వకాలతో "గోల్డ్ రష్"గా ప్రపంచమంతా మారుమ్రోగి ఆ తర్వాత "సిల్వర్ రష్"తో ఇంకా సంపన్నమైన నౌకాశ్రయం, లోతైన ఓడరేవు అండదండలతో ఒకటి రెండు భూకంపాలను భరించి, 1906లో పెద్ద అగ్నిప్రమాదాన్ని కూడా అధిగమించి ఒక వంద సంవత్సరాలలో అతి సంపన్నంగా, సుందరాతి సుందరంగా రూపు చెందింది ఈ నగరం. పసిఫిక్ మహాసముద్రానికి అభిముఖంగా గోల్డెన్‌గేట్ 'బే' గుమ్మంగా నిలబడి వున్న ఈ చిన్న నగరం, అంతా కలిసి 47 కొండలు – గుట్టలు మీరు లెక్కించవచ్చు. కాని అక్కడ రోజూ తిరుగాడే నాలుగు లక్షలమందిని లెక్కించలేరు కదా.

జాతులు:

సుమారు ఏడున్నర లక్షల జనాభా గల ఈ నగరంలో అందులో మూడో వంతు కూడా ఇంగ్లీషు మాట్లాడరు. మిగతావారిలో చైనా వారు ఎక్కువ భాగం ఉన్నారు. రైలు, రోడ్ కాంట్రాక్టులు చేసి వీరు ఎంతో సంపన్నులయ్యారు. ఈ మధ్యన హాంగ్‌కాంగ్ నుంచి వలస వచ్చిన ధనికులు మరో చైనా టౌన్



శాన్‌ఫ్రాన్సిస్కోలోని స్ట్రీట్ కారు

నిర్మించుకున్నారు. ప్రక్కనే ఇంకా జపాన్ దేశీయులు ఇక్కడ ఫైనాన్స్ మార్కెట్, ఆర్థిక వాణిజ్య పరిశ్రమల విభాగాలలో ముందున్నారు. ఇటాలియన్‌లు హోటల్, రెస్టారెంట్ల వ్యాపారంలో స్థిరపడి ధనికులయ్యారు. మరో విషయం ఏమిటంటే – ఇన్ని విభిన్న జాతుల వారు – తమ తమ సంస్కృతి వేషభాషలతో సహా శాన్‌ఫ్రాన్సిస్కో వీధులలో దర్శనమిస్తారు. చివరికి ఇటాలియన్ పియాగియో స్కూటర్ కూడా. అందరికీ చోటిచ్చి ఆదరిస్తుంది – ఫ్రిస్కో నగరం. న్యూయార్కుకి – ఇక్కడికి 5 గంటల కాలం వ్యత్యాసం వున్నది. 5 వేల కిలోమీటర్ల దూరం వున్నది. న్యూయార్క్ విమానాశ్రయంలో కాంటినెంటల్ ఫ్లైటు 747 బోయింగ్ ఎక్కి విండోసీటులో కూర్చున్నప్పుడు ఇక్కడికి పశ్చిమ తీరాన ఉన్న శాన్‌ఫ్రాన్సిస్కో ఎన్ని గంటలకు చేరేది స్పష్టంగా అవగాహన లేదు అప్పటికి.

"ఈజ్ ఇట్ ఎల్ తర్టీ" నాలిక బైటపెట్టి అడిగింది.

ప్రక్క సీటులోకి మారి – విండో సీటు అమ్మాయికి ఇచ్చాను.

'హి!' అని పళ్ళు బైటపెట్టింది.

తర్వాత అయిదు గంటల ప్రయాణంలో – మాటల మధ్యలో తెలిసిన విషయాలు : న్యూయార్క్‌లో ఆర్కిటెక్చర్ డిప్లమా చేస్తోందని, అక్క పుట్టిన రోజుకు ఫ్రిస్కో వెళ్తున్నదని. తర్వాత మన్‌హాటన్ లైఫ్ ఎంత కఠినమో వివరించింది. శాన్‌ఫ్రాన్సిస్కో చేరే సమయం – తను పుట్టిపెరిగిన నగరం తనకెంత ఇష్టమో చెప్పి – 'ఐ లవ్ ఫ్రిస్కో' అంది మళ్ళీ నాలుక బయట పెట్టి. విమానం దిగే సమయంలో – చీకటి సంద్రంలో దీపాల చుక్కలు మెరుస్తుండగా, ఏ ప్రాంతం – ఏమిటో అక్కడ ఏమేమి చూడాలో చెప్పి– మోయలేని బరువు ఈడ్చుకుంటూ వెళ్ళిపోయింది. అరె. కనీసం పేరు కూడా అడగలేదే అనుకున్నాను, అప్పుడు – నాలుక నొక్కుకుంటూ. ఆ రకంగా ముందుగా ఆ నగరం నాకు పరిచయమైంది.

సూర్యోదయం:

రండి – గోల్డెన్ గేట్ బ్రిడ్జి మధ్యలో నిలబడి సూర్యోదయం చూద్దాం. మన్ముందుగా 'బే'లో పొగమంచు పొరల చాటున ఉన్న అల్కట్రాజ్ జైలు ఉదయ కాంతిలో బైటపడుతుంది. ఆ తర్వాత లేత కిరణాలు ఆకాశ హర్మ్యాలు అద్దాలను ముద్దాడి చెదిరిపోతుంటాయి. అంతలో హార్బరు అంచులను తాకి పసిఫిక్ జలాల అలలపై తళతళ మెరుస్తాయి. ఒక్కసారిగా, ప్రకృతిలో

ఒదిగిపోయిన ఈ మనుష్యకృత నగర సౌందర్యం– మీ మనస్సులో గతరాత్రి తాలూకు మాలిన్యం ఏమయినా వుంటే కడిగి వేస్తుంది.

"హేవ్ ఎ నైస్ డే" అంటుంది. ఉదయం ఎనిమిది గంటలకే 81/2 మైళ్ళు పొడుగు – రెండంతస్తుల 'బే' బ్రిడ్జిపై కార్లు బారులుగా పరుగెడుతుంటాయి. బ్రిడ్జి దాటితే ఓక్ లాండ్ డౌన్ టౌన్‌లో ఆఫీసులకు వెళ్ళే నగర వాసులతో... ఇంకా 'బే' భూగర్భంలో నుంచి 'బార్ట్' రైలు (బే ఏరియా రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్) ఎన్నో వేల మందిని కార్యాలయాలకు చేరవేస్తుంటుంది. పది గంటలకు బెర్కెలీ కొండలకు చేరాం – ఇక్కడే ముఖ్యమైన షాపింగ్ చేయవచ్చు. ఫైనాన్స్ డిస్ట్రిక్ట్. రియల్ ఎస్టేట్ ఓనర్సు – ఇక్కడ ఆఫీసుల నుంచే వ్యాపారం చేస్తుంటారు. ఇక్కడకు దగ్గర్లోనే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (యు.సి) ఉన్నది – కాంపస్ అంతా విద్యార్థుల చైతన్యంతో వెలిగిపోతుంది. ప్రపంచం నాలుగు చెరగుల నుంచి వచ్చిన విభిన్న జాతుల యువతీ యువకులు – ప్రతిభావంతులకు మాత్రమే ప్రవేశం – ఇక్కడ తమ తమ కలల సాఫల్యానికి దారులు వేసుకుంటారు. చెంతనే సైన్సు మ్యూజియం వున్నది. కొంతసేపు మీరు విద్యార్థి దశలో అక్కడి వింతల మధ్య గడపవచ్చు. ఇంకా కొద్ది దూరం నడిచి – కొండ అంచుకు



హయత్ రీజెన్సీ శాన్‌ఫ్రాన్సిస్కో

రండి. అక్కడినుంచి చూస్తే – ఒక అద్భుతమైన దృశ్యం మీ కళ్ళ ముందుంటుంది. దూరంగా మబ్బుల మధ్య నుండి పైకి లేచి రెండు గోల్డెన్ బ్రిడ్జి టవర్స్ స్వర్గానికి నిచ్చెనల్లా నిలబడి వుంటాయి. బ్రిడ్జి అంతా మబ్బుల్లో తేలుతున్నట్లు అనిపిస్తుంది – ఆ ప్రక్కనే 'ట్విన్ పీక్స్' జంట కొండలు డ్యూయట్ పాడుతున్నట్లు నీలిమేఘాలపై కీలుగుఱ్ఱాల్లా వుంటాయి.

ఈ 'ట్విన్ పీక్స్' పైకి రమేష్ గారి వ్యాన్‌లో వెళ్ళాం – పైకి చేరే సమయానికి చల్లని మబ్బులు వచ్చి పలకరించిపోయాయి. అక్కడినుంచి చుట్టూ కలయ చూస్తే – కొండ చరియల్లో గుట్టల మధ్య గుట్టుగా ఒదిగిపోయిన ఇళ్ళు – ఉదయపు టెండల్లో వళ్ళార బెట్టుకుంటాయి. దగ్గరగా టీషర్టులు అమ్ముతున్నారు. 'కాలిఫోర్నియా' 'శాన్ ఫ్రాన్సిస్కో' గుర్తుగా కొన్నాము – అపుడే – ఆ గోడ ప్రక్కగా గార్బేజి ఏరుతున్న యువకుల్ని చూశాను. ఎవరని అడిగితే రమేష్ చెప్పారు "వీరంతా ఏదో జైలు శిక్ష అనుభవిస్తున్నారు– రోజూ ఏదో చోట – ఏదో పని వీరితో చేయిస్తుంటారు" అని. గార్బేజి వేసే వాళ్ళది నేరం – శిక్ష వీళ్ళు అనుభవిస్తుంటారు. ఆ తర్వాత 'గే' బజారు చూడవచ్చు – 'గే' హిప్పీ సంస్కృతి ఇక్కడ నుంచే పుట్టింది. వాళ్ళకి గౌరవమైన స్థానం ఈ నగరంలోనే సాధ్యం. ఇప్పుడిప్పుడే ఈ సంస్కృతి కూడా సరిహద్దులు దాటుతోంది.

"...ఫ్రిస్కో" గురించి ప్రముఖులేమన్నారు?

1. అమెరికాలో అన్ని నగరాల నుండీ ఎప్పుడు పారిపోదామా అని అనిపిస్తుంది. కాని ఆ నగరాన్ని వదిలి వెళ్ళాలంటే, ఎంతో బాధగా వుంది.

– ప్రఖ్యాత రచయిత గ్రహం గ్రీన్.

2. "అమెరికాలోనే ఎంతో సంస్కారవంతమైన నగరం"... **– కృశ్చేవ్**

3. "ప్రతి మనిషి రెండు నగరాలను ప్రేమించగలడు. ఒకటి తను పుట్టి పెరిగిన ఊరు. రెండోది – శాన్‌ఫ్రాన్సిస్కో".... ***– జీన్ ఫౌలర్***

ఎంత చక్కగా చెప్పారు – అనిపిస్తుంది ఈ నగరాన్ని దర్శించిన తర్వాత... అమెరికా ప్రభుత్వం ఆహ్వానంపై ఈ నగరాన్ని కూడా దర్శించిన మిత్రులు పురాణపండ రంగనాథ్‌గారు "మన బెంగుళూరు వాతావరణం, విశాఖ నగరం రూపం కలిపితే ఫ్రిస్కో" అన్నారు.

ఫ్రిస్కో పరిసర నగరాలు – విశేషాలు:

సాక్రిమెంటో సాన్ ఓజె, సిలికాన్‌వాలీ, రెడ్‌వుడ్ సిటి ఇలా ఎన్నో చిన్న పెద్ద టౌన్‌లు ఫ్రిస్కో చుట్టూ ఉన్నాయి. ప్రభాకర్ సాక్రిమెంటోలో ఇల్లు కొన్నాడు క్రొత్తగా – అక్కడ వున్న రెండు రోజులు – నిమిషం తీరిక లేకుండా తిరిగాం. ముఖ్యంగా రైలు మ్యూజియం దగ్గర్లో – అక్కడ 1857లో కట్టిన ఒక బజారు – అన్నీ అలాగే వుంచారు – సినిమా సెట్టింగ్‌లా; అప్పటి లాయరుగారి ఆఫీసు – మేయరు, మంగలి షాపుతో సహా – ఇదొక వింత దృశ్యం. ప్రక్కనే ఒక నది వుంది– ఇక్కడ బోటు ఎక్కితే ఫ్రిస్కో వరకూ వెళ్ళవచ్చు. సాక్రిమెంటో నుంచి ఫ్రిస్కోకు కారులోనే మూడు గంటలు పడుతుంది.


ప్రభాకర్, నేనూ ప్రొద్దున్నే క్రొత్త డాడ్జి కారులో 'లేక్ టాహో'కి బయలుదేరాం. ఆరువేల అడుగుల ఎత్తున కొండల మధ్య ఉన్న ఈ మంచి నీళ్ళ చెరువు లోతు 1500 అడుగులు. చుట్టుకొలత 60 మైళ్ళపైనే. అన్ని మంచు కొండలు కరిగి ఈ చెరువు నిండిపోతుంటుంది. ఇందులో నీరు 99.9% స్వచ్ఛంగా వుంటాయి. కాలిఫోర్నియా రాష్ట్రానికి నెవెడా రాష్ట్రానికి మధ్యగల "స్టేట్ లైన్" ఈ చెరువు మధ్యలో నుండి గీశారు. ఇక్కడ ఇంకో విశేషం – నెవెడా రాష్ట్రంలో కాసినోలకు అంతులేదు. ఈ రాష్ట్రం అంతా ఎడారులతో నిండి వుంది. అందుకు వీరికి రాబడి కోసం కాసినోలు అనుమతించారు. హోటల్సు అన్నీ కాలిఫోర్నియా రాష్ట్రంలో వుంటాయి. గీత దాటితే నెవెడా రాష్ట్రం. కాసినోలన్నీ నిత్య కళ్యాణం పచ్చతోరణంగా వెలిగిపోతుంటాయి. ముఖ్యంగా శని ఆదివారాల్లో – చిన్న పెద్దా అంతా అందరూ – ఉన్న డబ్బు – లేని డబ్బు (క్రెడిట్ కార్డులు) వదిలించుకొని 'ఎంజాయ్' చేసి అలసి ఆదివారం రాత్రికి మళ్లీ కారుల్లో పడి కొండదారుల్లో ఇళ్ళకు చేరుతారు – 'డౌన్‌హిల్' రోడ్ చాలా ప్రమాదకరంగా వుంటుంది. రోడ్ ప్రక్క ఇసుక గుట్టలు వుంచుతారు. ఎవర్కైనా బ్రేకులు పని చెయ్యకపోతే వెంటనే ఇసుకలోకి త్రిప్పి ఆపుకోవటానికి, ప్రభాకర్ భద్రంగా రాత్రికి ఇల్లు చేర్చాడు. రాత్రంతా చెవుల్లో 'కాష్‌మిషన్' డబ్బులగలగలే వినపడుతోంది.

దేవతలే దిగివచ్చిన....
లాస్ ఏంజిలిస్

ప్రపంచమంతా ఆశతో అసూయతో దృష్టిసారించే లాస్ ఏంజిలిస్ వైశాల్యం అసమానం. నాలుగు వందల అరవయ్యేడు చదరపు మైళ్ళు.

పరిభాష నిరుమానం. ఎంతో దూరదూరంగా పరుచుకుని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నట్లు, తొందర పనులేమీ లేనట్లు, ఒకరకమైన స్వప్నావస్థలోనే కదులుతున్నట్లు, శాపగ్రస్తులయిన గంధర్వ కన్యలు – అప్పుడప్పుడూ మీకు అడ్డువస్తున్నట్లు, ఏది నిజమో – ఏది అసత్యమో తెలియని, కళ్ళు మిరుమిట్లుగొలిపే భవనాలు, ఎప్పుడూ వెచ్చగా ఎండ కాస్తున్న సూర్యుడూ – చల్లని గాలులు – మెల్లగా అలలు లేపుతుంటే తెల్లని జరీ అంచులా, మైళ్ళ పొడవునా ఇసుక రాసులను ముద్దాడే పసిఫిక్ జలాలు... మోటారు కారు వేగంతో, సెల్యులాయిడ్ మాయతో పెనవేసుకుపోయిన లాస్ ఏంజిలిస్ మహానగరాన్ని అవగాహన చేసుకోవాలంటే... ఓర్పు, నేర్పు కావాలి. ఎంతో సమయం కూడా అవసరం.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి తొలిముద్దు బిడ్డ ఈ నగరం. మోటారు కారుతో పాటే ఈ నగరం పుట్టి పెరిగింది. అందుకే దీని పరిమాణం అన్ని వందల చదరపు మైళ్ళలో వుంది. ఇక్కడ పుట్టిన వాళ్ళు – "ఏంజిలనోస్ అంటారు.



లాస్ ఏంజిలిస్

వీరు కాళ్లతో నడిచే – జీవరాశుల్లోకి రారు. వీళ్లకి కారే – ఊపిరి, కారే కదలిక – కారే దూరం. కారే కాలం. కారే జీవితం. అందుకనే జడల మర్రిలా అన్ని వైపులకూ విస్తరించుకున్నది. పసిఫిక్ సముద్రాన్ని అంటుకుని ఉత్తరం – దక్షిణం – తూర్పుగా... అమెరికా దేశానికి పశ్చిమ దిక్కున సింహద్వారంగా మారింది.

లాటిన్ అమెరికా సంస్కృతి:

అమెరికా చివరిగా ఆక్రమించి, మెక్సికో నుండి విడగొట్టుకున్న ఈ కాలిఫోర్నియా ప్రదేశంలో ఇప్పుడు కూడా లాటిన్ అమెరికా చిహ్నాలు ప్రస్ఫుటంగా కనపడతాయి. ముఖ్యంగా – స్పానిష్, మెక్సికన్ జాతుల జన సంఖ్య, వారితో పాటు వచ్చిన ఎర్రటి పెంకుటిళ్ళు – 'రాంచ్' కట్టడాలే కాకుండా రోజువారీ జన జీవితంలో కూడా, 'కాహువింగా', 'లాబ్రా' 'మెరినా డెలిరే' ఇవన్నీ లాటిన్ అమెరికా పేర్లే – ఇక్కడ రోజూ వినపడతాయి. ఇటువంటి నేపథ్యంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి మారుపేరయిన మోటారు కారు వేగంతో పాటు, సినిమా మాయతో ముడివేసుకుని – ఈ మహానగరం వృద్ధి చెందింది. కార్ల ప్రపంచానికే రాజధాని అయిన డెట్రాయిట్‌లో కంటే ఇక్కడ ఎక్కువ కార్లున్నాయి.

మీరు కూడా ఈ నగర దర్శనం కారులోనే చెయ్యాలి. అప్పుడే తెలుస్తుంది – రహదారులు ఎంత పెద్దవో. ఈ మహానగరాన్ని కలపటానికి రెండు "ఇంటర్ స్టేట్ హైవే"లున్నాయి – ఎనిమిది వరసల్లో కారులు బారులుగా



యూనివర్సల్ స్టూడియో

పరుగెడుతుంటాయి. ఒకచోట నుండి మరోచోటకి, ఈ నగరంలోనే – దాదాపు రెండు గంటలు పడుతుంది. మనం కొంతసేపు కారులో తిరిగిన తర్వాత – మనకు ఒక సందేహం వస్తుంది – ఎవ్వరూ నడవని చోట అంత విశాలమైన 'సైడ్‌వాక్' (ఫుట్‌పాత్)లు ఎందుకు వేశారా అని. మీకు జనసంచారం కావాలంటే – అదే కాస్త కళాపోషణ చెయ్యాలంటే "వెనీస్ బీచ్"కి వెళ్ళాల్సిందే – అక్కడే 'బికినీలు' – 'చిక్స్' 'రోలర్ స్కేట్' మొదలయ్యింది.

మరి ఇప్పుడే మనం రెండు విషయాలు ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఒకటి లాస్ ఏంజిల్స్ "నిత్య వసంతం"తో కళకళలాడుతుంది – అందుకు కారణాలు – ఇక్కడ వాతావరణం – ఎప్పుడూ వెచ్చని ఎండ – పచ్చని చెట్లు సంవత్సరం పొడవునా విరబూసే రంగు పూలు ఒకటి; రెండోది సినిమా ప్రపంచంతో – తారలతో – షూటింగ్‌లతో ఎప్పుడూ సందడిగా – హడావుడిగా పరుగులెత్తే పౌర జీవితం – తళతళలాడే 72 మైళ్ళ పసిఫిక్ బీచ్.

ఇక్కడి వాతావరణంతో పాటు జనజీవితం కూడా "నిత్య వసంతంలా" అనిపిస్తుంది.

మనకు తెలిసిన పారమౌంట్, కొలంబస్, వార్నర్ స్టూడియోలు ఇప్పుడు కళ తప్పినా – 'యూనివర్సల్ స్టూడియోస్' ఇప్పటికీ పచ్చతోరణంలానే నడుస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పుడు జపాన్ కంపెనీల స్వాధీనంలోకి వెళ్ళిపోయాయి. ఇక్కడ జపనీస్ – ఆస్తులు, కంపెనీలు – అన్ని కొనేస్తున్నారు. "మేము మీలాగా జెండాలు ఎగరవేస్తే లాస్ ఏంజిలిస్ అంతా మా జెండాలే వుంటాయి" అన్నాడొక జపాన్ కంపెనీ ఆసామి.

ఒకప్పటి లాటిన్ అమెరికా సంస్కృతి. తర్వాత మోటారు కార్ల ప్రగతి, సినిమాలు, ఇప్పుడు 'జపనీస్' వ్యాపారపరమైన ఆక్రమణ – ఇవన్నీ కలగలసి LAలో ఒక 'వింత' సంస్కృతి – అది LAకి ప్రత్యేకం – ఉద్భవించింది. మున్ముందుగా – 72 మైళ్ళ బీచ్ కేవలం వినోదానికీ విశ్రాంతికే ఉపయోగించినా ఇప్పుడు నౌకా వ్యాపారానికి ఎగుమతి – దిగుమతులకు అనువుగా కొంత మార్చారు.

అది కూడా క్రొత్త కెమెరాలు – లెన్సులు ఇంకా అనేక సాంకేతిక కారణాల వలన – సినిమా వ్యాపారం – స్టూడియోలను వదిలి నగరాల వెంటబడి వెళ్ళిపోయిన తర్వాత.

లాస్ ఏంజిలిస్ – విమానాలకు, కంప్యూటర్లకు – సిలికాన్ చిప్స్‌కు వ్యాపారం విస్తరించింది. వింత ఏమంటే ఇన్ని కార్లు వాడే నగరంలో ఒక్క కారు కంపెనీ కూడా లేదు. తయారు చేయటానికి.

సినిమా వాళ్లకు సిగ్గు తక్కువ కదా. ఇక్కడ పేర్లు కూడా అందుకు తగ్గట్లుగానే ఉంటాయి.

"ఎవెన్యూ ఆఫ్ స్టార్స్" అని.

మొట్టమొదటి హాలివుడ్ సినిమా – "సన్‌సెట్"; "గోవర్" కలిసే కార్నర్‌లో ఒక రేకుల షెడ్డులో తీశారు – అప్పటినుండి ఇక్కడ సినిమా వ్యాపారం మొదలయ్యింది. సినిమాలతో పాటే 'స్టార్స్'ను కూడా తయారుచేస్తుంది కదా – వాళ్లనే దిగివచ్చిన దేవతలు అనుకుంటారు.

ఈ నగరానికి, తారలనిచ్చినా, తళుకులిచ్చినా, అంతులేని సంపదలిచ్చినా, అధునాతనమైన ఫాషన్ సంస్కృతి నిచ్చినా – అది హాలివుడ్ సినిమా పుణ్యమే.

"బెవర్లీ హిల్స్" చుట్టూ నగరం. విస్తరించిన ఒక దీవిలాంటిది. హాలివుడ్ తారలకు – వారి వింత జీవితాలకు – వింత వింత కథలకు నిలయం – బెవర్లీ.

అంతులేని సంపదకు – దాన్ని ప్రదర్శించేందుకు కూడా ప్రధాన స్థానం బెవర్లీ హిల్స్.

మనం 'హాలివుడ్' అనే ప్రాంతంలో – ఇప్పుడు సినిమాలు తప్ప అన్నీ వున్నాయి.

యూనివర్సల్ స్టూడియోస్:

బర్‌బాంక్ ప్రాంతంలో వుంది. యూనివర్సల్ స్టూడియోస్. చూడాలంటే ఒకరోజు పడుతుంది. వంద డాలర్ల టికెట్టు తీసుకుంటే ఒక ఓపెన్ ట్రామ్‌లో ఎక్కిస్తారు. అక్కడి నుండి – మీ టూరు మొదలవుతుంది. కొంత రికార్డెడ్ – మరికొంత అందమైన కాబోయే తార – వ్యాఖ్యానంతో అడుగడునా ఆశ్చర్యంతో సాగిపోతుంది. ముఖ్యంగా– ఒక ప్రాంతంలోకి వెళ్ళగానే మీరెక్కిన ట్రాం – భూకంపంలో చిక్కుకుంటుంది. చుట్టుప్రక్కల వున్న కరెంటు స్థంభాలు భవనాలు, ప్రక్కన వెళుతున్న రైలు– అన్ని ఒక్కసారిగా మీమీద పడటానికి వస్తాయి – మీ ట్రాము పెద్ద గోతిలో ఒరిగిపోతుంటుంది. ఇదంతా పెద్ద శబ్దాలతో కరెంటు

వైర్ల మంటలతో సహా... ఈ భూకంపంలో నుండి తేరుకోవాలంటే ఒక అరగంట పడుతుంది. ఆ తర్వాత ఒక పెద్ద డాం పగిలి కొన్ని లక్షల గాలన్ల నీరు మీ మీదకు వరదలా వస్తుంది – మీకు పారిపోవటానికి కూడా అవకాశం లేదు. హాహాకారాలతో – కళ్ళు మూసుకోవాలి. అందులో నుండి తేరుకునేలోపు మీ ట్రాము పడవలా నీళ్లలో దిగుతుంది – ప్రక్కవున్న చెక్క వంతెన పెళపెళవిరిగి మీ మీదపడుతుంది– దిగి పారిపోదామంటే – మరో ప్రక్క 'జాస్' షార్క్ మ్రింగటానికి వస్తుంటుంది. కళ్ళు మూసుకోవటం తప్ప చెయ్యగలిగింది లేదు. ఆ తర్వాత ఒక మంచు సొరంగంలో ప్రవేశిస్తుంది. అంతలో "అవలాంచ్'' వచ్చి మీరు తలక్రిందులై తిరిగిపోతుంటారు – మీకేమయిందో ఎక్కడున్నారో తెలుసుకోవాలంటే సమయం కావాలి. జీవితంలో సినిమా చూపి – ఒకరకమైన అయోమయంలో పడవేసి ఇంటికి పంపుతారు. ఒకరిద్దరు ప్రఖ్యాత నటులను కలిసే అవకాశం కూడా వుంటుంది.

లాస్ ఏంజిలిస్‌లో నా ప్రవేశం, మియామి నుండి అయిదు గంటల ప్రయాణం తర్వాత ఎయిర్ పోర్టులో దిగాము. కోచ్‌లో 'మేఫెయిర్' హోటల్ హార్బర్ ఫ్రీవే వంతెన దగ్గర్లో ముఖ్యమైన వ్యాపార ప్రాంతంలో వుంది. సాయంత్రం ఇంకా వెలుగు వుండగానే – హోటల్ బైటకు వచ్చి – కుడి ప్రక్కకు తిరిగి నడక సాగించాను – ప్రక్కనే చైనా షాపు ఒకటి వుంది. ఆ తర్వాత ఒక చిన్న గ్రోసరి షాపు – రోడ్డుకు అవతలివైపు ఎండలో మెరుస్తున్నాయి. "ఫ్రీవే" బ్రిడ్జివైపుగా నడుస్తుండగా – ఒక పొడవాటి నల్లాయన 'గిమ్మి ఏ డాలర్' అన్నాడు – ఈ అనుకోని అగంతకుడు – సన్నగా పొడవుగా, పాతకోటు వేసుకుని – కళ్ళల్లో చీకటితో – "హే – గిమ్మి యే డాలర్" అంటే జేబులో చిల్లర తీసి – అతని చేతిలో పెట్టాను 'థాంక్స్‌మాన్' అంటూ నేను వచ్చిన దారినే వెళ్ళాడు. కాస్త ముందుకు వచ్చి – ఫ్రీవే బ్రిడ్జి గోడను ఆనుకొని క్రిందకు చూశాను. అమెరికా సంపదంతా క్రింద ఎనిమిది వరసల్లో కారుల్లో పరుగెడుతోంది. మరి పేదరికాన్ని ఎవరు సృష్టిస్తున్నారు. అమెరికా రాజకీయంలో లాస్ ఏంజిలిస్ ప్రత్యక్ష జోక్యం రీగన్‌తోనే మొదలయ్యింది. రాజకీయ నాయకులు అప్పటివరకూ – కెన్నడీ, ముఖ్యంగా – హాలివుడ్ తారలను తమ ప్రచారం కోసమే 'వాడు'కున్నారు. ఇప్పటికీ ఎంత గొప్ప నాయకులైనా – ఎన్నికల ముందు 'హాలివుడ్'ను

పలకరించకుండా వెళ్ళరు. ఇక్కడ ప్రతి సంవత్సరం – 'ఆస్కార్' అవార్డులు 'సినిమా' లలో విభిన్న విభాగాలకు ఇస్తారు కదా – ఆ కార్యక్రమం ఎక్కువగా జరిగే "హాలివుడ్ బౌల్"కి వెళ్లాను.

ఒక చిన్న కొండను త్రవ్వి "ఓపెన్ ఎయిర్" బౌల్ తయారుచేశారు. నేను వెళ్ళినపుడు అంతా రంగులు వేసినట్లు సరిచేస్తున్నారు. ముందు కుర్చీల్లో – తర్వాత స్టేజి మీద – ఇలా అన్ని చోట్లా కూర్చుని అన్ని కోణాలు రికార్డు చేసుకున్నాను. ఇప్పుడు ఆస్కార్ బహుమతులు ఇస్తున్న టి.వి. ప్రోగ్రాం వస్తుంటే

– నేను అక్కడ వున్నట్లే – అనుభూతి కలుగుతుంది.


అవును సినిమా మాయ కదా.

ఇక్కడకు దగ్గర్లోనే

'డిస్నీ' కలల ప్రపంచం ఉంది. 'డిస్నీలాండ్' ఒక అద్భుతమైన అనుభవం.

మీ జ్ఞాపకాల బాల్యం మీకిక్కడే సంభవం.





హాలీవుడ్ బౌల్

నిత్య యౌవని! నయాగరా!

న్యూయార్కులో తప్పనిసరిగా దర్శించవలసినవి – సెంట్రల్ లైబ్రరి, మెట్రోస్టేషన్, జీవశాస్త్ర మ్యూజియం, ప్రకృతి మ్యూజియం, సెంట్రల్ పార్కు సందడి, బ్రాంక్స్, క్వీన్స్, స్టేటన్ దీవి, ఇంకా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు – ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకత కలిగిన, సాంకేతిక, వాస్తుకళా నైపుణ్యంతో, తాపీమేస్త్రీల స్వేదంతో కట్టబడినాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన తర్వాత ఆకాశహర్మ్యాలు – అద్భుతమైన వంతెనలు, భూగర్భ రైళ్ళ సొరంగాలు నిర్మాణం జరిగాయి. ఒక వంద సంవత్సరాలలో – పాతక్రొత్త మేలు కలయికతో క్రొత్త యంత్రాల బృహత్తర శక్తితో ఈ మహానగరం దిన దిన ప్రవర్ధమానమై – ప్రపంచ వ్యాపారానికి, ప్రజల నివాసానికి – యాత్రికుల దర్శనానికి ఒక కూడలిగా అభివృద్ధి చెందింది. ప్రపంచ మహానగరాలకు తలమానికంగా నిలబడింది.

యుఎన్ఓ : మొదటి ఎవెన్యూ (ఈస్ట్‌నది) తూర్పునది అట్లాంటిక్ అంచుల్లో ఎంతో హుందాగా, ఎన్నో రకాల రంగు రంగుల జెండాల రెపరెపలతో... మీకు ఆహ్వానం పలికే ఒక ఆకాశహర్మ్యం నిలబడి ఉంటుంది. అదే ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం. గేటు దాటి లోపలకు అడుగుపెడితే – పచ్చిక బయలు మధ్యలో – ఒక అద్భుతమైన లోహపు తుపాకి ఒక పెద్ద దిమ్మ మీద ఒక విగ్రహంలా ఉంటుంది. శాంతికి మారుపేరుగా రూపొందిన ఈ ఐక్యరాజ్య సమితిలో తుపాకి ఆహ్వానం ఏమిటి అని ఆశ్చర్యపోతున్నంతలో – మనం గుర్తిస్తాం, దానిలో ఉన్న మెలిక. అవును నిజంగా చరిత్రతో ముడిపడిన తుపాకి గొట్టం. చెప్పకుండా – చూపిన ఈ శిల్పం ఎన్నో సంగ్రామాల పర్యవసానం – ప్రపంచ యుద్ధాలకు చెంపపెట్టు. మళ్ళీ యుద్ధం కోరే ఉన్మాదులకు మానవాళి మనుగడను గుర్తుచేసే సంకేతం.

అక్కడనుంచి – లోపలకు అడుగుపెడితే – లాబీలో అన్ని దేశాల సంస్కృతి విశేషాలతో ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటుంది. ఐక్యరాజ్యసమితి భవనం మొత్తం తిరిగి రావటానికి ఒకపూట పడుతుంది– అదీ, గైడ్‌తో వెళ్ళితే. ప్రతి

మూడు గంటలకు ఒక 'టూర్' వుంటుంది... ఎన్నో దేశాలు ఐక్యరాజ్య సమితి భవనానికి, వారి వారి సంస్కృతిని తెలిపే విలువైన భారీ బహుమతులు పంపాయి. వాటిని ఎంతో హుందాగా ప్రదర్శించారు. కాసేపు హాలులో కూర్చుని – క్రింద జరిగే ప్రొసీడింగ్స్ తిలకించి అక్కడ చీరలో ఒక భారత మహిళా డెలిగేట్ కూడా ఉండటం గమనించాం. సంతోషపడ్డాం. ఈ సమితి మనది – మన సమిష్టిది – అనే భావనతో బైటపడ్డాం.

నయగరా:

న్యూయార్కు నుండి – అద్దె విమానంలో – నయాగరా టూరు ఏర్పాటు చేసుకున్నాం. ఉదయం 7.20 గంటలకు 47 మందితో – మేము 41 మంది ఆరుగురు జపాన్‌వాళ్ళు – ఒక పైలెట్, ఒక కోపైలట్, ఒకే ఒక ఏర్‌హోస్టెస్ ఈ అందరితో ఆ చిన్న విమానం గాలిలోకి లేచింది. బైట వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది. అట్లాంటిక్‌లో నుంచి పైకి వచ్చిన సూర్యుడు. నీరెండలో అలల నురగలతో నవ్వుతున్న సముద్రుడు. ఒక ప్రక్క పైన్ చెట్లు – అక్కడక్కడ నీలంపు చెరువులు – కొండలు – ఇలా ప్రయాణం సాగిపోతుంది. అమెరికా అమ్మాయి నవ్వుతూ బ్రెడ్‌జామ్, కాఫీ ఎంతో ఓపిగ్గా అందిస్తోంది. మన వాళ్ళు అందరూ గట్టిగా మాట్లాడుతుంటారుగదా – జపాన్ యాత్రికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇంతలో బాత్‌రూం నుంచి కేకలు వినబడినాయి. అమెరికా అమ్మాయి పరుగున వెళ్ళి – అంతే వేగంగా తిరిగి వచ్చింది. "యువర్ మాన్ ఇన్‌సైడ్..." అంటూ. మా బంగారయ్య స్థూలకాయుడు. లోపల వున్నాడు. బైటకు రావాలంటే తలుపు లోపలకు తెరుచుకుంటుంది. ఆ తలుపు ఖాళీలో ఆయన బైటకు రావటానికి వీలుపడటం లేదు. ముగ్గురం కలిసి – ఆయన పొట్ట వెనక్కు పెట్టి – బయటకు లాగాం అంతే. వెనకాల చప్పట్లు మోగాయి. అందరూ నిలబడి – జపాన్ వాళ్ళు –చప్పట్లు కొట్టారు. అంత సమస్య నవ్వుతూ తేలిపోయింది. మళ్ళీ దిగేవరకు లోపలకు వెళ్ళవద్దని చెప్పి కూర్చోబెట్టాం. కెంటకీ రాష్ట్రం దాటి మళ్ళీ న్యూయార్క్ రాష్ట్రంలోనే ఉన్న బఫెలో దగ్గర్లోకి వస్తున్నాం. ఒక పదిమైళ్ళ దూరాన – ఏదో తెల్లని మంచు తెర ఒక లోయలో నుండి ఆకాశానికి పరచుకుంటున్నది నిలువునా. పైలట్ వివరణతో అదేమిటో అర్థమైంది. నయాగరా నది మొత్తం కొండ మీద నుండి 850 అడుగుల లోతు

లోయలో పడుతుంది – కొండచరియ వదిలినప్పటి నుండి లోయ క్రిందకు చేరేలోపుగా ఎంతో నీరు అయొనైజ్ అవుతుంటుంది. గాలిలో తుంపర్లుగా – నీహార తుషారపు తెరలుగా పైపైకి లేచి నిలబడిన మంచు తెరలుగా పదిమైళ్ళ దూరం కనపడుతోంది. ఈ అద్భుత దృశ్యంతో మొదలైన మా నయాగరా యాత్ర ఇంకా ఎన్నో ఆశ్చర్యాలతో నిండిపోయింది.

పైలట్ ఎంతో ఉత్సాహంగా నయాగరా జలపాతపు కీలక దృశ్యాన్ని – కొండపై నుండి లోయలో నీరు పడే దృశ్యాన్ని పైన చుట్టూ త్రిప్పి చూపాడు. ఆ అద్భుతాన్ని తనివితీరా చూడాలి. అందుకు మనకున్న రెండు కళ్లు చాలవు. అంతేకాక – విమానం పరుగుల్లో దృశ్యాలు కదిలిపోతుంటాయి. ఓహో! జీవితంలో ఈ అనుభూతి ఒక థ్రిల్ – పైలట్‌కి, ఎయిర్ హోస్టెస్‌కి మరీ మరీ అభివాదాలు తెలిపి బఫెలోలో దిగి, మళ్ళీ ఇదే విమానం నాలుగు రోజుల తర్వాత మమ్మల్ని తీసుకువెళ్ళే ఏర్పాటు చేసుకున్నాం. ఇక్కడ ఒక సంఘటనతో చికాకు పడాల్సి వచ్చింది. మా గ్రూపులో ఇద్దరు బఫెలో విమానాశ్రయంలో తమ చేతి సంచులు పోగొట్టుకున్నారు. వాటిలో పాస్‌పోర్టులు, టికెట్లు, డాలర్లు ఉన్నాయి. మాకోసం వచ్చిన బస్ ఆపి ప్రక్కనే ఉన్న పోలీస్ షరీఫ్ ఆఫీసుకు వెళ్ళి కంప్లయింట్ ఇచ్చి రసీదు తీసుకుని బస్ ఎక్కి నయాగరా నది ప్రక్కనే



నయగారా సోయగం!

ఉన్న 'రెడ్‌జాకెట్ ఇన్ హోటల్'లో దిగాం. ఆపూట ఆలస్యం అయింది కదా. అయినా మేనేజర్ ఏంజలికా ఎదురు చూస్తోంది మాకోసం. కేకులు, పండ్ల రసం – సిద్ధంగా పెట్టారు. అవి మనవాళ్ళు ఆరగించే లోపు రూమ్స్ అన్నీ ఎలాట్ చేసి తాళాలు అందించారు. బఫెలో నయాగరాకు న్యూయార్క్ రాష్ట్రంలో ఒకవైపు వుంటుంది. రెండోవైపు కెనడా వుంటుంది. ఇక్కడ విపరీతంగా చలి. భోజనం తర్వాత టూర్ వుందని చెప్పి గదుల్లో చేరాం. మధ్యాహ్నం 1 గంటకు బస్ సిద్ధంగా వుంది. అది లగ్జరీ బస్ కాదు. స్కూల్‌కు పిల్లల్ని తీసుకువెళ్ళే వాన్. డ్రైవర్ కూడా స్పెషల్. 65 ఏళ్ళ పెద్దావిడ. కాసేపు మాట్లాడితే ఎన్నో విషయాలు చెప్పింది. ఉద్యోగ విరమణ తర్వాత కొన్నాళ్ళు ఏమి చేయాలో పాలుపోలేదని, ఒక లైసెన్స్ తీసుకుని, టూరిస్ట్‌లు విపరీతంగా వచ్చే బఫెలోలో "గైడ్‌గా వుండాలనుకున్నాను. ప్రస్తుతం ఎంతో ఉత్సాహంతో ఈ పని చేస్తున్నాను" అని చెప్పింది. "ఏం దేశంరా ఇది." అనుకున్నాం.

నిత్యయవ్వని, నయాగరా!:

నదులన్నీ కొండల్లోనే పుడతాయి – ఎక్కువగా తూర్పు దిక్కుగానే ప్రవహించి సముద్రంలో కలుస్తాయి – ఇది ప్రకృతి సహజం. నయాగరా ప్రత్యేకత ఏమిటి? గణాంక వివరాల జోలికిపోకుండా ఈ నదీ సోయగాలను వీక్షించితే, కొండకోనల నుంచి నది ఆసాంతం క్రింద లోయలో దూకటం... అదీ అర్ధచంద్రాకారంగా వుండటంతో మీరు ఎదురుగా దూరంగా నిలబడి చూస్తుంటే అక్కడ ఒక జలప్రళయం జరుగుతున్నట్లు, గగన గంగ ఆకాశాన్ని వీడి ధరాతలం మీదుగా పాతాళానికి పయనమవుతున్నట్లు అదీ మన కళ్ళముందు జరుగుతున్నట్లు– ఈ అద్భుతాన్ని చూడటానికే మనం బ్రతికి వున్నట్లు అనిపిస్తుంది. ఎంతమంది కవులనో కవ్వించిన, మరెంతమందో కళాకారుల కుంచెలను కదిలించిన ఈ నది... ఈ దృశ్యం... ఈ జలపాతం – మీలోని కళాకారుని, కవిని వెలికి తెస్తుంది. అలవికాని అనుభూతి అంతరంగంలో గంగలా ఉప్పొంగి జలపాతంలా ప్రవహిస్తుంది. ఎక్కడో వినిర్మలమైన మంచుకొండల్లో చినుకులైరాలి, సెలయేరులుగా పారి, వరదలా పొంగి – అశ్వధాటిగా పరుగులెత్తి, ఒక మహోధృతిగా మారి, ఒక మహాశక్తిగా రూపొంది, ఒక్కమారుగా ఆకాశం నుండి "మహాప్రవాహ వేగంతో" "దిక్కులు ఘూర్ణిల్ల"గా ఆ మహానది ఆసాంతం

ఆపాతమైన ఒక అద్భుత సుందరి, ఆశ్చర్యకరమైన నిత్యయవ్వని ప్రతీత్యనృత్యహేలా లయ విన్యాసాలతో, హరివిల్లు విలాసాలతో, శీతల తుషార యవనిక పరంపరలతో, మిమ్మలను నవరసాల రసోత్పత్తిలో రంగరించి ముంచివేస్తుంది – నయాగరా... అరెరె! ఎంత నీరు. ఏమి హోరు. ఏమి జోరు, ఎంత ఘోష. ఎన్ని ఘటాఘటాలు. ఈ ధాటి, ఈ పోటు ఎవరాపగలరు? క్రింద శివ జటాఝూట సంఘటితమేవున్నదా? శతకోటిశ్వేత ఘోటక సంచయం నురగలు గ్రక్కుతున్నట్లు, పాలసంద్రంలో ఏదో పెనుతుఫాను రేగినట్లు, ఈ పతనం తనకు సుతరామూ ఇష్టంలేనట్లు, తుషారశ్వేత చేలాంచలపుటంచులతో కేలందీయమని అర్థిస్తున్నట్లు, లోయ లోతుల నుంచి ఆకాశపుటందలాలకై అఱ్రులు చాస్తూ – మరలా ఊర్థ్వ లోకాలకే పయనించాలనే అత్యాశతో అణువణువునా విచ్ఛిన్నవై నింగికెగసిపోవాలని, రంగురంగుల హరివిల్లు అందుకోవాలని, విశ్వ ప్రయత్నం చేస్తోంది– ఆ మహానది నయాగరా... అక్కడి అల్లకల్లోలం – అలల కోలాహలం, జలపాత మంద్ర ధ్వని, గంభీర సంగీత ధుని. ఒక ప్రకృతి ఘటనాఘటం. ఇది సహజం – ఇది నిత్యం – ఇదే జీవితం – దర్శించండి, తరించండి. తర్వాత తర్వాత నిలకడగా నిండుగా నడిచే నది – ఇరువైపుల జనజీవితాలను చైతన్యవంతం చేసే ప్రశాంత స్రవంతి – నయాగరానది. తిలకించండి, పులకించండి.

నయాగరా జలపాత ఉధృతిని, సౌందర్యాన్ని, నదీ ప్రవాహగతిని మూడు రకాలుగా తిలకించవచ్చు. మధ్యాహ్నం నీరెండలో నదికి ఎగువగా ప్రయాణం చేసి ఏ ప్రాంతంలో ఎంత వేగంతో ప్రవహిస్తున్నదో – ఎక్కడ ఎంత విస్తృతంగా వున్నదో చూడవచ్చు. సాయంత్రం అంటే చీకటి పడక పూర్వం నయాగరా జలపాతపు అర్ధచంద్రాకార దృశ్యానికి ఎదురుగా కొండమీదకు చేరి జలపాతనోధృతిని, ఆ ప్రళయ శబ్ద ఉద్ధతిని – ఆ దృశ్య శ్రవణ గాంభీర్యాన్ని తిలకించి పులకించి పోవచ్చు. రాత్రిరానివ్వండి. ఎన్ని కాంతిదీపాలు. ఎన్ని రంగుల కాంతులు. ఆ మహాశ్వేత జల సమూహాన్ని, ఆ తుషారమేఘ సముదాయాన్ని రంగులద్ది కనులపండుగ చేస్తాయి. ఎంతకాలం అక్కడ నిలబడి చూసినా తనివి తీరని సజీవ చిత్రం – నిత్యయౌవని సోయగం. వయసు ఉధృతిలో యౌవన సౌందర్యంతో, మేని వంపుతో మిమ్ములను రెచ్చగొట్టే జవ్వనిలా

కనులవిందు చేస్తుంది. మర్నాడు ఉదయం సూర్యోదయంతోపాటే మళ్ళీ నయాగరా జలపాతపు ప్రాంతానికి తరలివెళ్ళాం – ఇప్పుడు ఒక వింత భయంకర అనుభవం కోసం. అందరికీ రైన్‌కోటులు – తలమీదకు సరిపడా ఇచ్చారు. ఎందుకో అర్థం కాలేదు. ఒక గ్లాసు లిఫ్ట్‌లో ఎక్కాం – లిఫ్ట్ అంటే పైకి వెళ్ళాలికదా? ఇది క్రిందకి వెళ్తోందేమిటి. జర్రున జారి నీటి మీదకు వచ్చాం. అక్కడ ఒక లాంచి సిద్ధంగా వుంది. అందరిని అందులో ఎక్కించారు. అలలు అల్లకల్లోలంగా వున్నాయి. పడవ ఊగిపోతున్నది, ఇంకా బయలుదేరక ముందే. సరే, గడగడ శబ్దంతో కదిలింది. ఎక్కడకు తీసుకుపోతున్నారు? ఇంతలో చల్లని మంచు తుంపర్లు తెరలు తెరలుగా మీద పడుతున్నాయి. అప్పుడప్పుడూ అలలు కూడా చింది మీద పడుతున్నాయి. ఒక మంచు తెరవిడిపోయింది. ఒక్కసారిగా ఎదురుగా నదీ పాతం హోరు, జలఘోష, ఆపాత సంఘర్షణ, తెల్లని తెలుపు అంతా ఒక్కటే రంగు – స్వచ్ఛమైన శ్వేత వర్ణం. ఈ అద్భుతం చూస్తుండగానే జలపాతపు పాదాల చెంతకు చేరుకున్నాం. అద్భుత రసం బీభత్సరసంగా మారి భయంతో గడ్డగట్టుకు పోగా భయంకరంగా ఊగిపోతున్న పడవ. ఇక్కడ జలసమాధి ఖాయం అనుకుని ఇష్టమైనవాళ్ళని గుర్తుచేసుకున్నాం. ఇక్కడే మంచుతెరల్లో దాగిన ఒక రాగిణి మిమ్మల్ని కాపాడుతుంది. తెల్లని నవ్వుల్తో మిమ్మల్ని సేదతీర్చి మీ భయాన్ని పోగొడుతుంది. అంతలోనే జలపాత సంగీతం వేల మృదంగ లయ తరంగాలతో మీకు ఆహ్లాదం కలిగిస్తుంది. నయాగరా నగారా మీకో సందేశాన్నిస్తుంది. ఈ పడవను ఇంత నైపుణ్యంతో నడిపిన నావికుణ్ణి అభినందించకుండా వుండలేము. లిఫ్ట్ దగ్గర దిగగానే కరతాళధ్వనులతో అభివాదం చేశాం. ఆ రాత్రి హోటల్ బార్‌లో చాలాసేపు కూర్చుని, బార్ మెయిడ్‌ను అక్కడి విశేషాలు అడిగాను. బార్‌లో ఎక్కువమంది లేరు. ఒకటి రెండు టేబుల్స్ దగ్గర ఒకరిద్దరు వున్నారు. బార్ మెయిడ్ నడి వయస్సులో ఎంతో అనుభవంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడింది. తమ జీవితంలో నయాగరా ఎలా పెనవేసుకుపోయిందో – తన జీవితం, తన కుటుంబం, తన సంతానం తన కష్టాలు. ఎన్ని విషయాలు. ఒక్కొక్క వ్యక్తి ఒక పుస్తకం. తెరిచి చూస్తే... ఒక్కొక్క జీవితం ఒక నయాగరా, తరచి పరికిస్తే...

ఆధునిక ప్రపంచానికి పరోక్ష అధికార పీఠం!

వాషింగ్టన్ డి.సి.

నిన్న మొన్నటి ఘన చరిత్ర, నేటి చైతన్యవంతమైన రాజకీయ కోలాహలం, రేపటి అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానం – ఇవన్నీ కలగలసి నిరంతర ప్రకృతి సౌందర్యంలో లీనమై, ఒక విలక్షణమైన నగరంగా మిమ్మల్ని చుట్టుముట్టుతుంది వాషింగ్టన్ డి.సి.

అమెరికా చరిత్ర అమెరికన్ల జీవన విధానం, ఇక్కడి రోజువారీ జీవితంలోని సవాళ్ళు, ఇక్కడి విలువలు – విశేషాలు – మిమ్మల్ని ముంచెత్తబోతాయి. సంసిద్ధులు కండి. ఈ దేశపు మొట్టమొదటి అధ్యక్షుడు ఇక్కడే తన జీవితం చరిత్రగా మార్చుకున్నాడు. ఇక్కడే సైన్యాలు నడిపాడు, చివరికి ఇక్కడే తనువు చాలించాడు. 'జార్జి వాషింగ్టన్' పేరుతో అలరారే నగరం, దేశ రాజధాని, నేడు ఆధునిక ప్రపంచానికి – పరోక్షంగా అధికార పీఠంగా చెలామణి అవుతోంది. ఈ నగరాన్ని, పరిసర ప్రాంతాల విశేషాల్ని దర్శించి శోధించాలంటే కనీసం ఒక సంవత్సర కాలం పడుతుంది. అందుకనే ఈ నగరానికి మళ్ళీ మళ్ళీ రావలసిన అవసరం ఉంటుంది.

ఇప్పుడు ఇంత అందంగా నిలబడి వున్న ఈ నగర ప్రదేశం – ఒకప్పుడు పొటామిక్ నదీ ప్రవాహపు ఒరవడికి బురద, తడి మట్టి – పడిపోతున్న ఒడ్డు



క్యాపిటల్ బిల్డింగ్ అమెరికా పార్లమెంట్

ప్రాంతాలతో నివాస యోగ్యంగా వుండేదికాదు. అటువంటి ప్రదేశాన్ని దేశ రాజధానిగా తీర్చిదిద్దేందుకు దేశాధ్యక్షులు – జార్జి వాషింగ్టన్, 1791 నవంబర్‌లో ఫ్రెంచ్ ఇంజనీర్, రూపశిల్పి, పియరీ లా ఎన్‌ఫాంట్‌ను నియమించారు. కాని తన 'కల'కు సాకారం ఆయన పూర్తిగా చూడలేకపోయారు. పియరీ – తన కౌశల్యాన్ని 'బ్లూప్రింట్' స్థితి నుంచే అత్యద్భుతంగా వెలికి తెచ్చి – ఎంతో విశాలమైన సమతుల్యమైన, సుందరమైన నగరాన్ని– అన్ని విధాలా (అమెరికా రాజ్యాంగ ప్రయోక్తలు పేర్కొన్నట్లు) ఒక 'క్రొత్త ప్రపంచానికి' రాజధానిని రూపొందించాడు. నగరాన్ని నాలుగు భాగాలుగా ఈశాన్యం, వాయువ్యం, ఆగ్నేయం, నైరుతి – విభజించి కాపిటల్ హిల్ (అమెరికా పార్లమెంట్, సెనేట్ భవనం) కేంద్ర బిందువుగా చేసి నగరాన్ని నాలుగు చెరగులా పరిచాడు. అన్ని ఎవెన్యూలకు రాష్ట్రాల పేర్లు పెట్టారు. ఉత్తర – దక్షిణ వీధులన్నింటినీ అంకెలతోనే తెలుపుతారు. తూర్పు – పడమర వీధులు 'A' అక్షరాలతో వుంటాయి.

ఒక చిరునామా కావాలంటే, N.E.22 తర్వాత డోర్‌నెంబరు ఉంటుంది. లేదా S.W.A తర్వాత డోర్ నెంబరు ఉంటుంది. ఈ విధంగా రెండక్షరాలు, మూడక్షరాలు. ఆ తర్వాత పూల పేర్లు, చెట్ల పేర్లు పెట్టుకుంటూ వెళ్ళారు. ఎందుకు చెప్తున్నానంటే – మన డోర్ నంబర్లు పెద్ద కెమికల్ ఫార్ములావలె వుండి – అసలు ప్రదేశాన్ని మరుగున పడవేస్తాయి. వావివరస లేకుండా వీధులు, వాకిళ్ళకు నంబర్లు ఇస్తారు. ఇక చిరునామా దొరకాలంటే – పోస్ట్‌మాన్ తరం కూడా కాదు కదా. మీరు వాషింగటన్‌లో తిరగడం ఎంతో సులభం. సిటీ గైడ్ – చిత్రపటం ఉంటే చాలు. కాపిటల్ హిల్ ప్రక్కనే 'వైట్‌హౌస్' అడ్రసు: 1600, పెన్సిల్వేవేనియా ఎవెన్యూ....

మీరెప్పుడైనా ఉత్తరం రాయవచ్చు అమెరికా అధ్యక్షునికి.

వైట్‌హౌస్ ఎలా దర్శించాలో తర్వాత ప్రస్తావిస్తాను.

ముందుగా కాపిటల్ భవనం మెట్లపై నుంచి చూస్తే – మీ ముందు ఒక కిలో మీటర్ వెడల్పు – 5 కిలోమీటర్ల పొడవు 'మాల్' కనపడుతుంది పచ్చగా. రెండో చివర దక్షిణ ప్రక్కగా, లింకన్ మెమోరియల్ నిలబడి ఉంటుంది. దాదాపు మధ్యలో వాషింగ్టన్ మాన్యుమెంటు – 555 అడుగుల ఎత్తున ఆకాశంలోకి లేచిన –పాలరాతి పలకల స్తంభం. అయితే మీరు లిఫ్ట్‌లో పైవరకు వెళ్ళి

వాషింగ్టన్ నగర పరిసరాల వరకు దృష్టిసారించవచ్చు. ఇవన్నీ ఎలా తిరగాలని ఆలోచిస్తున్నారా? 'టూర్ మొబైల్' అని మినీ బస్‌లు నడుపుతారు. ఈ టిక్కెట్ కొంటే ఎక్కడైనా ఎక్కవచ్చు– ఎక్కడైనా దిగవచ్చు. ఇలా అన్నీ చూసుకుంటూ, మళ్ళీ బస్ ఎక్కి ఇంకో చోట దిగి దాదాపు ముఖ్యమైన మ్యూజియంలు, భవనాలు, మాన్యుమెంటులు దర్శించవచ్చు. మీరు ఎటు వెళ్ళినా నిండుగా ప్రవహిస్తూ పొటామిక్ నది అడ్డువస్తుంటుంది. ప్రక్కనే నేషనల్ ఎయిర్‌పోర్టులో విమానాలు దిగుతూ ఎగురుతూ కనపడుతుంటాయి.

ఇక మాల్‌కు రెండువైపులా ఎన్నో మ్యూజియంలు, ఎగ్జిబిషన్‌లు, ఆర్ట్ థియేటర్లు –సుప్రీంకోర్టు భవనాలు, ఎఫ్.బి.ఐ.భవనాలు, ఆర్ట్ గాలరీలు – ఎయిర్ అండ్ స్పేస్ భవనం, ఇంకా ఆఫ్రికన్ ఆర్ట్ మ్యూజియం, ఇలా ఒక డజను మ్యూజియంలు ఉన్నాయి. ఇవన్నీ "స్మిత్ సోనియన్ ఇన్‌స్టిట్యూట్" ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. గమ్మత్తు ఏమిటంటే "స్మిత్ సోనియన్" ఆంగ్లేయుడు ఆయన ఎప్పుడూ అమెరికా రాలేదు. కాని ఆయన పేరనే ఇవన్నీ నడుస్తున్నాయి. ఎయిర్ అండ్ స్పేస్ భవనం ఎంతో విశాలమైనది. అందులోనే ఎన్నో చరిత్రలు సృష్టించిన విమానాలు– అపోలో 11 మాడ్యూలు – వ్యోమగాముల దుస్తులు ఇలా ఎన్నో భద్రపరిచారు. యువకులు – విద్యార్థులు ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందుతారు. మేము వెళ్ళిన రోజు – హిరోషిమా మీద ఆటంబాంబు జారవిడచిన 'విమానం ప్రత్యేకంగా అక్కడ వ్రేలాడదీశారు. దీనిమీద అంతకు ముందు దినపత్రికల్లో చాలా వ్యతిరేకత వచ్చింది. అయినా ఆగలేదు. ఇండస్ట్రీ భవనంలో– అమెరికా పారిశ్రామిక చరిత్ర మొత్తం చూపుతారు. ఆఫ్రికా ఆర్ట్ గాలరీలో – ఆఫ్రికా జాతి సంస్కృతి, గ్రామీణ జీవన విధానాలు – వేషభాషలన్నింటినీ ఎంతో విపులంగా దర్శించవచ్చు. ఇంకా ముఖ్యంగా ప్రస్తావించవలసినవి –**కెన్నెడీ** సెంటర్, పొటామిక్ నది అంచున ఒక అద్భుతమైన భవనం – ఈ కెన్నడీ సెంటర్ – న్యూయార్క్ బ్రాడ్‌వేకు ధీటుగా ఇక్కడ ఒపేరా, డ్రామా, మ్యూజిక్ కన్సర్ట్‌లు నడుస్తుంటాయి. ఒక థియేటర్‌లో ఎప్పుడూ – మంచి సినిమాలు వేస్తుంటారు. కాస్ట్యూమ్స్, మేకప్ సామానులు అన్నీ ఎగ్జిబిట్ చేసే షాపులున్నాయి ఇక్కడే. అన్ని దేశాల జెండాలు రెపరెపలాడుతూ – ఎప్పుడూ, కళాకారులతో కళకళలాడుతుంటుంది. కెన్నెడీ 'బస్ట్' ఎంతో ప్రముఖంగా

కనపడుతుంది. మనలను ఆకట్టుకునే– లింకన్ మెమోరియల్ – పూర్తిగా పాలరాతితో నిర్మించారు. చుట్టూ గుండ్రని పాలరాతి స్తంభాలతో లోపల ఒక చేయికుర్చీ చేతిమీద పెట్టి – మీ వంక చూస్తున్నట్లు కూర్చున్న లింకన్ బ్రహ్మాండమైన విగ్రహం మిమ్మల్ని ఆకట్టుకొంటుంది. ముఖ్యంగా రాత్రిపూట ప్రత్యేకమైన దీపాల కాంతిలో, ఆ దగ్గర్లోనే, ఫోర్డ్ థియెటర్ – ఇక్కడే 1865 ఏప్రిల్ 14వ తేదీన, జూన్ బూత్ అనే నటుడు కాల్చిన తుపాకీ గుండ్లకు అబ్రహం లింకన్ నేలకొరిగాడు.

ఎంబస్సీ రో. వివిధ దేశాల ఎంబస్సీలన్నీ ఈ ఎవెన్యూలోనే ఉన్నాయి.

జార్జి టవున్ – ఇక్కడే అన్ని రకాల 'ఎథినిక్' హోటల్స్ – రెస్టారెంట్లు వున్నాయి. మీకు ఏ దేశపు భోజనం కావాలంటే – ఆ రెస్టారెంటులోకి వెళ్ళవచ్చు. 'మొరాకో' రెస్టారెంటు మంచి గొర్రె మాంసం వంటకాలకు ప్రసిద్ధి.

నేషనల్ లైబ్రరీ, కాపిటల్ హిల్ భవనం నుంచి అండర్ గ్రౌండ్ టన్నెల్ ద్వారా ఇక్కడికీ రావచ్చు. ఈ 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్సు'లో ఏ భాషా పుస్తకాలయినా, ఒక రిక్వెస్ట్ లెటర్ వ్రాసి, వారికి అందచేస్తే – లైబ్రరీలో పెడతారు. రెండు రోజులు తిరిగి, పోలవరపు కోటేశ్వరరావుగారి పుస్తకాలు వారికి అందచేసి వచ్చాను. నిక్సన్ని పదవీ నచుతుణ్ణి చేసిన 'వాటర్ గేట్' హోటల్ చాలా పెద్దది. దానికి ఎదురుగా చిన్న హోటల్ ఉన్నది. ఒక రూమ్ – నంబర్ 107లో నుండి ఒక విలేఖరి, కెమెరాతో "వాటర్‌గేట్" కుంభకోణాన్ని బైటపెట్టాడు. తర్వాత ఆ హోటల్ వాళ్లు – 107 రూంకి మరమ్మత్తులు చేసి పెద్దగా ప్రచారం చేసి ఎక్కువ రేటుకు అద్దెకిస్తున్నారు. ఇప్పుడు వాషింగ్టన్, నల్ల జాతీయుల జనాభాతో, నాయకులతో షావుకార్ల దర్పంతో నల్లగా వెలుగుతోంది.

'వైట్ హౌస్' అమెరికా అధ్యక్షుని అధికార భవనం. ఈ భవనం చాలా భాగం మనం చూడవచ్చు. ఇది మూడంతస్తుల భవనం. పచ్చని పచ్చికబయళ్ళు. జలయంత్రాలతో ధవళకాంతితో మెరిసిపోతుంటుంది. జార్జివాషింగ్టన్ మినహా మిగతా అందరు అధ్యక్షులు ఇక్కడ నుంచే పరిపాలించారు. వైట్‌హౌస్ చూడాలంటే ఎంతో ఓర్పు కావాలి. ఒక రోజు అయిదు గంటలకు నిద్రలేచి డాక్టరు నవీన ఇంటినుంచి, నడిచి స్టేషన్‌కి వచ్చి, ట్రైన్‌లో మేరీలాండ్ నుంచి, మెట్రో స్టేషన్‌లో దిగి, బస్‌లో వైట్‌హౌస్ చేరాను. అప్పుడే తెల్లవారుతోంది. నాలాగా వచ్చిన

అమాయకులతో వరుస పెరుగుతోంది. మంచు వీడి, ఎండ తగులుతోంది. అంతలో 'సారీ జెంటిల్‌మాన్ ఈ రోజు ప్రవేశం లేదు అని చిన్నగా చెప్పారు. ఎందుకంటే 'నెల్సన్ మండేలా' క్లింటన్ గారితో ఉన్నారు ముఖ్య అతిథిగా.

మళ్ళీ మర్నాడు – ఇదే తంతు. ఆరోజు ఎనిమిది గంటలకు సెక్యూరిటీ సిబ్బంది కోరచూపుల నుంచి, లోపల ఆడగైడ్ చేతిలో పడిన తర్వాతగాని, మనసు కుదుటపడలేదు. ఈస్ట్ రూం, స్టేట్ డైనింగ్ హాల్, బ్లూరూమ్, ఎంతో రాజసంగా, అపురూపమైన చిత్రపటాలు – శిల్పాలతో నిండి ఉన్న ఈ అధికార పీఠాన్ని – భవనాన్ని లోపలగా చూపి – అధ్యక్షుల కార్యాలయం– అల్లంత దూరంలో గమనించి – చివరిగా బైటకు మర్యాదగానే పంపబడ్డాము.

అప్పుడు గమనించాను– 'వైట్‌హౌస్' చూడాలనుకునే వాళ్ళలో– అసలు నల్లజాతి వారు లేకపోవటం. వారికిది ఎప్పటికైనా అందని పండే. ఎప్పటికైనా ఒక నల్లజాతి వ్యక్తి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అలంకరించగలడా?

(ఆ తర్వాత ఓబామా అధ్యక్షుడయ్యాడు రెండుసార్లు.)



అధ్యక్షుని నివాసం వైట్ హౌస్



ఒక సంస్కృతిగా, ఒక జాతిగా రూపు చెందని

అమెరికా

ఏదైనా ఒక దేశంలో...

ఒక జాతిగా, ఒక సంస్కృతిగా జన జీవితం రూపుచెందాలంటే ఒక వెయ్యి సంవత్సరాలు పైనే కాలవాహిని ప్రవహించాలేమో –

అమెరికా దేశం చూద్దాం –

అక్కడ కొలంబస్ పొరపాటున కాలుపెట్టి అయిదు వందల ఏండ్లు దాటింది. తర్వాత చరిత్ర చకచకా నడచి ఐరోపా జాతులన్నీ కలగాపులగంగా అట్లాంటిక్ దాటి అక్కడకు చేరి స్థానికంగా ఉన్న రెడ్ ఇండియన్లని తరిమి తరిమి చంపి, ఆఫ్రికా నుంచి నల్లజాతి వారిని బానిసలుగా తెచ్చి – ఇటు రెడ్ ఇండియన్ల జీవన విధానాన్ని, అటు ఎన్నో యుగాలుగా పరిఢవిల్లిన నల్లజాతివారి గ్రామ జీవనాన్ని– సాంఘిక సంస్కృతిని – చిన్నాభిన్నం చేసి, తమ తల్లిదండ్రులతో – తాత ముత్తాలతో వారసత్వపు పోరు నడిపారు. దీనినే వారు మొదట అంతర్యుద్ధం – తర్వాత స్వాతంత్ర్య పోరాటం అన్నారు – ముందు రాష్ట్రాలుగా, తర్వాత ఫెడరల్ దేశంగా (సంయుక్త రాష్ట్రాలు) ఆవిర్భవించి రెండు వందల ఏండ్లు పైబడినా – అమెరికా సాంస్కృతికంగా ఒక జాతిగా రూపు చెందలేదు. దీనికి కాలం ఒక్కటే కొలమానం కాకపోయినా, కాలపరిణామంలోనే కదా అనేకానేక జీవన స్థితిగతులు – సాంఘిక పరిస్థితులు కలసి కదిలేది, ఒక రూపు దిద్దుకొనేది?

సంపన్న దేశం

కొన్ని వందల సంవత్సరాలుగా పై జాతులన్నీ ఎన్నో త్యాగాలు చేసి, అహరహమూ శ్రమించి, ప్రకృతి వనరుల తోడి, ఆర్థికంగా, వైజ్ఞానికంగా, సైనిక పరంగా ఒక సంపన్న దేశాన్ని నిర్మించటంలో విజయం సాధించినా, ఈ ఆధునిక పారిశ్రామిక లౌకిక వాతావరణం – సాంస్కృతికపరంగా వెన్నుదన్ను లేక – ఒక గందరగోళ స్థితిని, బాధ్యతారహితమైన యువతను ప్రపంచానికి అందించింది. ఇక్కడి యువత యావత్తూ న్యూనతాభావంతో, అభద్రతతో క్రుంగిపోతుంది. ఇది ఎంతో ఆవేదన కల్గించే విషయం. ఇక్కడ ఒక విషయం

గుర్తు చేసుకోవాలి. గత అయిదు వేల సంవత్సరాల భారతదేశ చరిత్రలో చోటుచేసుకున్న పరిణామాలు పరిశీలిస్తే ఎంతమంది దండెత్తి వచ్చారు? ఎన్నెన్ని జాతులు చుట్టం చూపుగా వచ్చి చూరుపట్టుకు వేళ్ళాడలేదు? ఎంత చిందరవందర చేశారు? ఎంత గందరగోళం సృష్టించారు? కాని – హిమాలయాల నుండి, గంగా మైదానం, వింధ్య పర్వత సానువులు, కృష్ణా, గోదావరి, కావేరి పరివాహక ప్రాంతాలు, మలబారు, కన్యాకుమారి కొసలు – ఇలా దేశం నిలువునా పరచుకుపోయిన వీరంతా – అనన్యతను మెలమెల్లగా వదిలి మహోధృతమైన సంస్కృతీ ప్రవాహంలో కలిసిపోయారు. ఇది చారిత్రక సత్యం కదా! కాని అమెరికా ఒక జాతిగా ఎదగకపోవడానికి కారణాలు తప్పనిసరిగా పరిశోధించాలి.

ఆధిపత్యం:

ఒకే జాతి ఉంటే, దేశంలో వర్గ పోరాటాలు; భిన్న జాతులుంటే, జాతి పోరాటాలు; ఒక జాతి, ఒక వర్గం – ఆర్థికంగా కాస్త అటు ఇటుగా – ఉంటే, కులాల కుమ్ములాటలు తలెత్తుతుంటాయి. అయితే, మానవుడు తనజాతి, తన వర్గం ఆధిపత్యం కోసం అనాదిగా పోరాడుతూనే ఉన్నాడు. యుద్ధాలు చేస్తూనే వున్నాడు. ఇంకా సూక్ష్మంగా పరిశీలిస్తే, తన పరిధిలో, వ్యక్తి ఆధిపత్యం కోసం ప్రక్కవారితో, తనవారితో నిరంతరం పోరు జరుపుతూనే ఉన్నాడు.

విచిత్రమేమంటే, పైన చెప్పిన అన్ని రకాల సంఘర్షణలు అమెరికా సమాజంలో నిత్యమూ చోటు చేసుకుంటాయి. ఏదో రూపంలో, అలాంటి పరిస్థితుల్లో, వారిది ఒక జాతిగా, ఒక సంస్కృతిగా ఎలా గుర్తించడం? ఎంతగా ఇంటిముందు జెండాలు పాతుకొని, లంగోటీలకు, లాగూలకు చారలు, నక్షత్రాలు అంటించుకుంటే మాత్రం. అంతేకాదు, వీరి జీవన విధానం ఒక విచిత్ర సంకటం. అన్నీ వున్నట్లే వుంటాయి, డబ్బుతో పనిలేనట్లే కనపడుతుంది – మరి ఆ డాలర్ల వేటలో అనుక్షణం పరుగులు తీస్తూనే వుంటారు. ఇంకో మెట్టుపై నుంచి గమనిస్తే – నాకనిపిస్తుంది– వీరు నిజంగా బానిస బ్రతుకులు వెళ్ళబోస్తున్నారని. ఇంకా ఘోరమూ, విచారకరమైన విషయం – ఆ విషయం వీరికి తెలియకపోవడం. ఇలా అనుకోవటం సాహసమే అయినా, అదెలాగో చూద్దాం. ఇక్కడ రోజువారి జీవనానికి, ప్రభుత్వానికి సంబంధం వుండదు.

పాలనాపరంగా, సైనికపరంగా, ఫెడరల్ ప్రభుత్వాన్ని ప్రక్కన పెడదాం. కాని అమెరికా మొత్తంగా అయిదు వందల వ్యాపార సంస్థలు – అంటే అయిదు వందల కార్పొరేషన్ అధ్యక్షుల – గుప్పిట్లో నడుస్తోంది. ఆ అయిదువందల కంపెనీలకు శాఖోపశాఖలుంటాయి. వాటికి గొలుసు అంగళ్ళు, కౌలుదారీలు వుంటారు. అక్కడ పని చేసేవారికి బుద్ధితో పని వుండదు. కేవలం రెండు వేళ్ళు (బొటన వేలు, చూపుడు వేలు) పనిచేస్తే చాలు. రెండు రెళ్ళు ఎంతో కూడా చెప్పలేని దయనీయమైన స్థితి. వీరంతా – ఒక కాష్ మిషెన్‌కో, ఒక కంప్యూటర్‌కో కొసలు మాత్రమే. వీళ్ళు కూడా అంతవరకు పని చేస్తే చాలు. వారానికి రెండు వందల డాలర్లు వస్తాయి. సహజంగా మెదడుకు వుండే బద్ధకాన్ని పెంచి పోషిస్తుంటారు. ఉద్యోగం అయిపోగానే మెదడుకు పని లేని టి.వి. వుండనే వుంది. ఆరోజు అంతటితో సరి. మళ్ళీ ప్రొద్దునే లేవంగానే పరుగులు, కారులోనే కాఫీ – ఫోనుల్లోనే పలకరింపులు, దేనికి బానిసలో తెలుసుకోకుండానే బానిస బ్రతుకులు గడుపుతున్నారు. మళ్ళీ వీళ్ళలో ఉన్న వాళ్ళు, బాగా వున్నవాళ్ళు – వీరు తిరిగే కారు పేరును బట్టి. లేని బానిసలంటే వారానికి ఏడు రోజులు పనిచేసేవారని అర్థం.

వచ్చే నెల జీతాన్ని ఇప్పుడే ఖర్చు పెట్టి చచ్చినట్లు వచ్చే నెల పని చేస్తారు. క్రిస్‌మస్ వస్తే – మీరు నమ్మరు – వచ్చే సంవత్సరం జీతాన్ని ఆ నెలలోనే ఖర్చు చేస్తారు. అంటే మలి సంవత్సరానికి బానిసత్వం ఒప్పుకున్నట్లే. గాలి, నీరు, వెలుతురు, వినోదం, విహారం, చివరికి, వార్ధక్యాన్ని, చావుని కూడా వ్యాపార అవకాశాలుగా చేసి లాభాలు గడిస్తున్న వీరి వాణిజ్య కుశలతను కొనియాడాలా? భౌతిక సుఖాలనే వ్యసనాలుగా మార్చి ప్రజలను బానిసలను చేసిన వీరి అతి తెలివిని గర్హించాలా? అయితే వీరు దేనికి బానిసలు? వీరు ఎంచుకున్న ఆర్థిక విధానానికా? సాంకేతిక పెనుభూతానికి? సుఖాలకూ, వ్యసనాలకా? వ్యక్తి స్వేచ్ఛకు పట్టం కట్టిన వీరి రాజ్యాంగాన్ని ఆ పరిధిలోనే, ఆ పౌరులనే కీలుబొమ్మలుగా చేసి వినోదిస్తున్న వీరి ఆర్థిక విధానాన్ని (మార్కెట్ ఎకనామి) మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? రాజ్యాంగ హక్కుగా సాధించుకున్న పత్రికా స్వేచ్ఛ – ఇక్కడ పత్రిక అంటే అన్ని మాధ్యమాలు – మంచికి, చెడుకూ వెర్రితలలు వేయించి, వ్యక్తి స్వేచ్ఛను హరించిన ధోరణిని ఏమనాలి? ఈ

పొరపాట్లనుండి మనం నేర్చుకోవలసినది పోయి అదే బాగున్నదని ఎందుకు ఎగబడుతున్నాం? మరొక విషయం మనవి చేస్తాను.

నల్లజాతివారు:

బానిసలుగా తేబడి, శతాబ్దాల తరబడి అణచివేతకు లోబడి, ఇప్పటికి ఒక దిశ, ఒక దశ లేని ఈ వర్గం ఇది. వీరి జీవితం వేరు, ఎంతమంది ఎన్ని కబుర్లు చెప్పినా, వీరు అమెరికాలో అంతర్భాగమని ప్రగల్భాలు పలికినా, వీరి బ్రతుకులు వేరు, వీరి నడక తీరు వేరు, వీరి సంగీతం వేరు, వీరి భాష వేరు, వీరి యాస వేరు, వీరి తిండి వేరు; వీరిలో కూడా ఎక్కడో ఆలోచనా పరులు ఒక యాభైమంది వున్నారు. వారే వీరికి మార్గదర్శకాలు అందిస్తుంటారు. అందుకు సందేహం లేదు. లేకపోతే దేశంలోని నల్లజాతి వారంతా ఒకే విధంగా నడవరు, బట్టలు వేసుకోరు, ఒకే సంగీతం వినరు. వీరు అమెరికా ప్రధాన జీవన ప్రవాహంలో ఎప్పటికైనా కలుస్తారా అనేది సందేహమే. ఇంకా యూదులు – ఇంత చరిత్ర నడిచినా – వారి జాతి అనన్యతను వదిలి, అమెరికా స్రవంతిలో కలిశారనుకోవటం కేవలం భ్రమ. వీళ్ళకు శరీరాలు అమెరికాలో – మనసులు జెరూసలెంలో.

పరదేశీయులు:

ఇక మిగతా పరదేశీయులు (Immigrants) ఏ జాతికి ఆ జాతి, సమాజపరంగా విడివిడిగానే ఉంటున్నారు. కొరియన్లు, చైనీయులు, ఇప్పుడిప్పుడే భారతీయులు. ఎవరి కుంపటి వారిది. ఎవరి కలుగులో వారుంటున్నారు. పరిణామగతిని ఎవరూ ఆపలేరు. అలాగే మార్పుకు లోను కాకుండా మనిషి తప్పించుకోలేడు. ఈ రెండూ లేక ప్రగతీ వుండదు. అమెరికాలో వుంటున్న నా మిత్రుడు అడిగాడు; ఒక వంద సంవత్సరాలలో మన దేశం అమెరికా లాగా అభివృద్ధి చెందుతుందా? అని. “అమెరికాకే రెండు వందల ఏండ్లుపైన కదా ఈ అభివృద్ధి, అయినా ఇటువంటి అభివృద్ధి అవసరమా? ఈ సంపన్నతలో ఈ సాంకేతిక పెనుభూతం ముందు నీ ఆస్తిత్వమేమిటి? నీ విలువ ఎంత?” అని అడిగితే, “ఇక్కడ పౌరులంతా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. నా పనికి ఎవరూ అడ్డురారు; ఇక్కడ అవకాశాలు, ఎవరి అర్హతలను బట్టి, కృషిని బట్టి అందుబాటులో ఉంటాయి” అన్నాడు. రోజువారీ స్వారీలో తాను లోనవుతున్న మానసిక వత్తిడి

నుండి విముక్తి ఏది? ఇక్కడ ఒక విషయం చెపుతాను – న్యూయార్కులో ఒక కార్యాలయానికి పని ఉండి వెళ్ళాను. నేను మాట్లాడబోతున్న బాధ్యతగల అధికారిణి వెనుక ఇలా రాసివుంది. "నా ఓర్పంతా – ఇంటి దగ్గరే ఖర్చయిపోయింది – ఇంకా నన్ను విసిగించకు" అని – ఇక్కడ నీకు నీవే. నీ కారూ, నీ ఫోనూ, నీ ఇన్సురెన్సూ. ఈ ఒంటరి భావన ఎంత భయంకరమైనది.

ఈ ఏకాకి బ్రతుకు ఎంత దుర్భమైనది. దీని ఫలితం యువత అనుభవించటం లేదా – వారి విపరీతధోరణులకు మూలకారణం ఇదే కాదా?

మేధావి వర్గం:

పలు రకాల శాస్త్రజ్ఞులు, కంప్యూటర్ విజ్ఞానులు, అటార్నీలు, అటు ఇటుగా వైద్యులు, ఇదీ వీరి మేధావి వర్గం. సైనికపరమైన సాంకేతిక పరిజ్ఞానానికే పెద్దపీట వేశారు. అణుపరిశోధనలుగానీ, రోదసీ యాత్రలుగాని అందుబాటులోని భాగమేనని గుర్తించాలి. హెరాల్డ్ రాబిన్స్, ఇర్వింగ్ వాలేస్‌గాని, మేరియో పూజోగాని వీరి సమాజపు రుగ్మతలను – లొసుగులను సొమ్ము చేసుకున్నారేగాని, సాహిత్యపరంగా సాధించింది ఏమీ లేదు. జాన్ అప్‌డైక్ లాంటి రచయితలు – ఒక నమ్మకాన్ని ప్రచారం చేయటం కోసమే రచనలు చేశారు గాని, అందులో సామాజిక జీవన ప్రతిబింబం అంతగా కనిపించదు. ఎంతమంది అమెరికన్ రచయితలు నోబెల్ బహుమతి పొందారు?

ఐరోపాలోవలె, ఒక సాత్రేగాని, ఒక రస్సెల్‌గాని ఒక సోల్జనిత్సిన్ గాని ఆవిర్భవించడం మనం చూడలేదు. కాని అందుకు భిన్నంగా వేలకొద్ది, మానసిక వైద్యం పేరిట సైకియాట్రిస్టులు పుట్టుకొచ్చారు. అందుకు కారణాలు వీరి సాంకేతిక, లౌకిక జీవన విధానము, సాంఘిక అభద్రత. అంతేకాకుండా, ప్రకృతి పట్ల వీరికి తాత్విక దృష్టిలేకపోవటం, అంతర్ముఖులు కాకపోవటం కూడా మళ్ళీ అడుగుతున్నాను – ఇప్పుడు చెప్పండి – ఎంతమంది ఇంటి ముందు జెండాలు పాతేసుకున్నా – అమెరికా ఒక జాతిగా – ఒక సంస్కృతిగా రూపుచెందిందా? దీనికి ఎవరినీ వేలెత్తి చూపటం లేదు. నిందించనూ లేము. మూలంలో – ఐరోపా జాతులే అయినా – అక్కడవారికి నిర్దిష్టమైన ఎల్లలున్నాయి, భిన్న సంస్కృతులు ఖచ్చితంగా ఉన్నాయి. ఎవరి భాష వారికుంది. వారికీ గందరగోళ పరిస్థితి లేదు. అమెరికాలో చోటు చేసుకున్న పరిణామాన్ని – కేవలం

వెర్రితలలుగా చూసి వైజ్ఞానిక, సాంకేతిక, లౌకిక పరిస్థితులను పరిశీలించడమే మన కర్తవ్యం. అందులో నుండి మనం ఏమైనా నేర్చుకోగలిగితే, ఆ విపరీత పరిణామాలు ఇక్కడ (భారత్‌లో) పునరావృతం కాకుండా నివారించటానికి ప్రయత్నం చేయవచ్చు- కాని ఇప్పటికే ఆలస్యమైపోయిందేమో?

మలిమాట

'ఇదే అమెరికా' అనే అభిప్రాయం కలుగజేయటం నా ఉద్దేశ్యం కాదు. అమెరికా పౌరులు సాధించిన పారిశ్రామిక ప్రగతిని చిన్నచూపు చూడటం కూడా నా అభిమతం కాదు. పలుమారులు నా పర్యటనలలో వివిధ రంగాలలోని వ్యక్తులతో నేను జరిపిన సంభాషణలు, స్పందన - సమావేశాలు, విన్న ఉపన్యాసాలు ఇంకా ఎన్నో ఎన్నో కారణాలుగా నాకు కలిగిన అభిప్రాయపు ఒక దృక్కోణమే ఇది అని సవినయంగా మనవి చేస్తున్నాను. మరో మాట చెప్పాలి - భారత్ నుంచి చదివి, చదివాక అమెరికా మకాం మార్చి - ఎంతో కష్టపడుతున్న అన్ని రాష్ట్రాలవారిని చూశాను. వారి అసంతృప్తి గమనించాను. వారి సంతానంతో వారు పడుతున్న అనేక కోణాల సంఘర్షణలు శోధించాను. వారంతా మనం పోగొట్టుకున్న సంపద! ఎన్నో గొప్ప పదవులకు ఎదిగిన భారత పుత్రులు - పుత్రికలు - భారత్‌కు ఒరగబెట్టినదేమీ లేదు. కొందరివల్ల ఇక్కడ అనేక నగరాల్లో భూమి ధరలు ఆకాశాన్నంటాయి. ఇళ్లు సామాన్యులకు అందకుండాపోయాయి. ఎందరో ముఖ్యమంత్రులు - ప్రధానులు అమెరికా వెళ్లి- రండి పెట్టుబడి పెట్టండి అని తిరిగారు. ఏమి జరిగింది? - చాలా తక్కువే జరిగింది. పైగా అక్కడ బాగా డబ్బు సంపాదించిన కొంతమంది వచ్చి సినిమాలు తీశారు. కొంతమంది రాజకీయాలు ఎంచుకున్నారు. ఏ కొద్దిమందో (అవసరం వున్న) ప్రజలకు సేవ అందించారు.

ఈ 'డయోస్పోరా' గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన వారెవ్వరూ లేరనుకుంటాను!

స్విట్జర్‌లాండ్ - జెనీవా

ఆల్ప్స్ పర్వత సానువుల్లో – నీలి నీళ్ళ సరస్సుల అంచుల్లో వెలసిన స్విస్ దేశ నగరాలు – ఆ వెండి కొండల పై నుంచి రాలిన, మంచు కడిగిన రత్నాలో– ఈ నిర్మల జలాల్లో నుంచి పై కుబికిన మంచి ముత్యాలో చెప్పటం కొంచెం కష్టమైన పనే.



జెనీవా లేక్‌లో 150 అడుగుల ఎత్తు వాటర్ జెట్

అలాంటి ఆణిముత్యమే ఈ జెనీవా నగరం. కేవలం మూడున్నర లక్షల జనాభా వున్న కాంటన్ (Conton)లో అందులో లక్షన్నర ప్రజలు నివసించే నగరం, ప్రసిద్ధ ప్రపంచ నగరాల సరసన ఎలా చోటు చేసుకున్నది? అదే జెనీవా ప్రత్యేకత.

ప్రశాంత పరిసరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, ఈ నగరానికి పెట్టని ఆభరణాలు. చిన్నారి స్విస్ రాజ్యానికి రాజధాని జెనీవాలో ఉన్నప్పుడు– ఈ ప్రపంచంలో పేదరికం ఉన్నదని, కాలుష్యం ఉన్నదని – అనారోగ్యం వుంటుందని మీరు తప్పనిసరిగా మర్చిపోతారు.

చిన్ని రాజధాని ఈ జెనీవా:

జెనీవాకి ఇంకో ప్రత్యేకత వుంది – స్విస్ దేశంలో ఎక్కువ జనాభా జర్మన్



ఆల్ప్స్‌లో జుంగ్ ఫ్రూ జో

మాట్లాడతారు – కాని జెనీవాలో ఫ్రెంచ్ భాష మాట్లాడతారు. ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు అతి తక్కువ మంది. అయినా అంతర్జాతీయ వ్యాపారులు మీకు అడుగడుగున తారసపడతారు. మరి ఇది ల్యాండ్ ఆఫ్ ప్రవేట్ బ్యాంకింగ్. ప్రతి ఇల్లు ఒక బ్యాంకే. ప్రపంచంలోని పాపిష్టి సొమ్మంతా ఇక్కడే దాచిపెడతారు కదా. పైగా పైసా వడ్డీ ఇవ్వరు వాళ్ళు. మొన్న ఇరాన్‌షా కానివ్వండి, నిన్నటి మార్కస్ అనండి, నేటి మొబుటు అయినా – అందరూ ఇక్కడికి చేరవేసిన సంపదే. ఇక మన రాజకీయ నాయకులు – చిన్నా పెద్దా అందరికీ ఇక్కడ ఖాతాలు వున్నాయి. పేరు ఉండదు – నంబరు మాత్రమే. అంటే స్విస్ వాసులకి డబ్బుకు కొదువ లేదు. పైగా మిలటరీ ఖర్చు లేదు. అందుకని వాతావరణంతో పాటు వీళ్ళ వదనాలు కూడా వెలిగిపోతుంటాయి. స్విస్‌వాసులు ఎప్పుడూ నలగని బట్టలు వేసుకుంటారు. ఆడవారు ఎంతో అందంగా ఆకర్షణీయంగా వుంటారు.

మిలటరీ అంటూ లేకపోయినా, ప్రతి పౌరుడు శిక్షణ పొందుతాడు. సంవత్సరంలో ఒకటి రెండు వారాలు సైనిక దుస్తుల్లో Fitness - Week నడుపుతారు. Swiss Gaurds అంటే వాటికన్ పోప్‌కి ప్రత్యేక నమ్మకం కూడా.

ప్రతి చిన్న సమస్యకి రిఫరెండమ్ పెడతారు. అది కొత్త రహదారికి నిర్ణయం కానీయండి, లేదా ఎవరికైనా పౌరసత్వం ఇవ్వాలనే విషయం కానివ్వండి – రిఫరెండమ్ జరగాల్సిందే – అదే ప్రజాస్వామ్యం.



గ్లేసియర్ రైలు



ఆకాశంలో వ్రేళ్ళాడుతూ

జెనీవా కాన్‌టన్ మూడు చేతులుమారి (రోమన్, బర్గుండి, జర్మన్) 16వ శతాబ్దంలో స్వతంత్ర ప్రొటెస్టంటు రాజ్యంగా అవతరించింది – 1815లో స్విస్ కాన్ఫెడరేషన్‌లో చేరింది. తర్వాత్తర్వాత వాతావరణం, స్థలమహత్యాల (Location advantage) న్యూట్రాలిటీ (అలీన) రాజకీయ విధానాల మూలంగా అంతర్జాతీయ వ్యాపారాలకు స్వర్గధామంలా వెలుగుతోంది. రెడ్ క్రాస్ హెడ్ క్వార్టర్స్ ఇవ్వడం, కేబుల్ కార్లకి ప్రసిద్ధి అని చెప్పే పని లేదు. 1,50,000 జనాభాకి, 15,000 హోటల్ బెడ్స్ ఉన్నాయి. అంటే జనం రాకపోకల తాకిడి తెలుస్తుంది. ఇక్కడ మీరు ఖర్చు పెట్టే డబ్బుకి పూర్తి ప్రతిఫలం దొరుకుతుంది. జెనీవా సరస్సులో జెట్ ఫౌంటెన్ వుంది. మార్చిలో నీటిజెట్ కనపడింది అంటే వసంతం వచ్చిందని అర్థం : 'వర్డ్స్ వర్తు' చెప్పిన డాఫడిల్స్ పూలు మాదిరిగా, ప్రపంచానికి సమయ నిర్ణేతలు స్విస్ గడియారాలు కదా. 20 డాలర్ల నుంచి 20,000 వేల డాలర్ల వరకూ చేతి గడియారాలు మీరు కొనవచ్చు – అంత విలువైన రత్న ఖచ్చితమై – మణిమయ ముఖాలతో ఈ గడియారాలు మెరిసిపోతూ అద్దాలలో దర్శనమిస్తాయి. రోలెక్స్, ఒమేగా, ఫేవర్ లూబా ఇలా... మనకు ఎన్ని కోరికలో అన్ని పేర్లున్నాయి. నేను క్రిష్టల్ హోటల్లో వున్నాను. నిజంగా Crystal లాగానే వుంటుంది. ఇక్కడ నుంచి – బస్ స్టేసన్, నాలుగు అడుగులే



యూరోప్ తల పైన (11, 300 అడుగుల ఎత్తులో)

– రైల్వేస్టేషన్‌కి పది అడుగులు – జెనీవా లేక్ (సరస్సు)కి వంద అడుగులు. బస్ ఎక్కి ఐక్యరాజ్యసమితికి వెళ్ళే వాళ్ళం. రైలెక్కి ఆల్ప్సు పర్వతాల పైకి వెళ్ళే వాళ్ళం – నడుచుకుంటూ సరస్సును చుట్టి వచ్చే వాళ్ళం – రైల్వే స్టేషన్‌లో సూపర్ మార్కెట్ వుంది – ఎన్నో రకాల సెంట్లు. అమ్మాయిలు మీకు సెంటు పూస్తారు – అమ్మటానికి. నీలి చిత్రాల కాసెట్లు అమ్ముతారు – వీడియోలు శాంపిల్ కూడా చూపిస్తారు– జాగ్రత్త. ఇంకా బార్‌కు వెళితే ఎన్ని రకాల వైన్సు! నా స్నేహితుడు "అరెరె! ఎన్ని రకాలు. అదీ ఇంత అందుబాటులో, ఇక్కడే తాగి తాగి చచ్చిపోవాలని వుంది" అన్నాడు. అతడు తాగుబోతు కాదు – కాని అతని బాధను అర్థం చేసుకోవచ్చు. సాయంత్రం సరస్సు ప్రక్కకు వెళ్దామా? ఆరుబయట పూర్తి ఆర్కెస్ట్రా నడుస్తోంది. వెనుకనే నీలి నీళ్ల సరస్సు. ఆ సరస్సులో వెండి స్తంభంలా 270 అడుగుల జెట్ ఫౌంటెన్. చిరుగాలికి చిచ్చుబుడ్డిలా ప్రక్కలకి చిమ్ముతున్న తుషారాలు దీపాల కాంతుల్లో మిలమిల మెరిసిపోతున్నాయి. ఇంకా వేసవి వెలుతురు ఆకాశంలో తారట్లాడుతోంది – ఆల్ఫ్ వెండి కొండలపై దూకి పడుతూ.

లెనిన్ మహాశయుడు ఇక్కడ కొన్ని సంవత్సరాలు గడిపాడు, రష్యన్ విప్లవానికి ముందు. 'పికాసో' తన జీవిత సంధ్యా సమయం ఈ సాయంత్రాలతోనే గడిపాడు. అలా సంధ్య చీకటిలో కరిగి కలిసిపోతుంది – సమయం ఒడిదుడుకులు లేకుండా నడిచిపోతుంది. స్విస్ వాచ్‌లాగానే. రాత్రి 11 గం॥ అందరూ ఇళ్ళకి చేరి నిద్రపోతారు. ఉదయాన 5 1/2 గంటలకు తప్పనిసరిగా లేస్తారు. 8.30 గం॥ ఆఫీసుల్లో వుంటారు – అలా ప్రతి నిమిషం విలువైనదిగా భావిస్తారు. గడియారాలు తయారుచేయటమే కాదు – సమయాన్ని తప్పనిసరిగా పాటిస్తారు కూడా – 'కాల'జ్ఞానం గల పౌరులు మరి. బాగా సంపాదించండి (ఎలాగైనా ఫర్వాలేదు.) ఆ డబ్బంతా ఇక్కడ దాచుకోండి. త్వరగా మిగతా బంధాలు తెంచుకొని ఇక్కడ నివాసాలు ఏర్పరుచుకోండి. ప్రశాంతత, ఆహ్లాదం, అభయం, ఆరోగ్యంతో– ఆల్ప్సు పర్వతాలు, అందమైన ఈ సరస్సులాగే మీరు కలకాలం ఉండిపోవచ్చు!

థాయ్‌లాండ్

ఏదయినా సాధించాలంటే, ఒక వ్యక్తిగాని, ఒక దేశంగాని, ఎంతో సామర్థ్యం, ఎన్నో వనరులు, ఎంతో సాహసం, ఇలా గొప్ప గుణగణాలు అందుబాటులో వుండాలి కదా. కాని, సహజసిద్ధంగా, సామాన్యంగా, మామూలుగా సాదాసీదాగా బ్రతికే ప్రజలు తమ దేశాన్ని, తమ నగరాల్ని తమ సమాజాన్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలిగారు అంటే ఏదో బలమయిన కారణాలు వుండే వుంటాయి. అవేమిటో తెలుసుకోవాలంటే థాయి దేశాన్ని, థాయి ప్రజల్ని, థాయి నగరాల్ని ఒక యాత్రికునిలా స్పృశిస్తే చాలదు. ఎంతో ఓర్పుతో – ఎంతో గౌరవంతో వీటిని అవగాహన చేసుకోవాలి. దాదాపు పదిహేనుసార్లు థాయ్ దేశపు నాలుగు చెరగులా తిరిగి – రైలు – బస్ – కారు, మోటారు సైకిల్, సైకిల్ – రిక్షాలు, బోటులు, క్రూజ్ – ఇలా అన్ని విధాలా ప్రయాణాలు చేసి ఆ ప్రజల జీవనాన్ని పరిశీలించిన నీకు తెలిసిన విషయాలు!

దాదాపు పదిహేనుసార్లు థాయ్ దేశపు నాలుగు చెరగులా తిరిగి – రైలు, బస్సు, కారు, మోటార్‌సైకిల్, రిక్షా, బోటు, క్రూజు – ఇలా అన్ని విధాలా – అన్ని ప్రయాణ సాధనాలు ఉపయోగించి, థాయ్ దేశపు ఉత్తర, దక్షిణ కొసలు తూర్పు పడమర దిక్కులు తిరిగి తిరిగి ఆ ప్రజల జీవనాన్ని పరిశీలించిన నాకు తెలిసిన విషయాలు.


అయిదు టన్నుల బుద్ధ విగ్రహం

ప్రధాన కారణాలు: పైకి థాయి నగరాలు ఎంతో చైతన్యంతో, వ్యాపారంలోగాని, వ్యవహారంలోగాని, గలగలలాడుతూ, కళకళలాడుతూ కనపడతాయి. ఇంకా వీరి

రోజువారీ జీవితాలు కూడా ఏమాత్రం స్తబ్దత లేకుండా పరుగులు పెడతూనే వుంటాయి. కానీ అసలు విషయం, ఇది నడిపేది మామూలు ప్రజలని, సామాన్యులని తెలుసుకుంటే ఆశ్చర్యపోతాము. వీరికి ఇంత నైతిక బలం ఎలా వచ్చింది? ఇంత సహనం ఎలా అలవడింది? ఎన్నోసార్లు నా పర్యటనలో, నాకైతే రెండు కారణాలు కనపడ్డాయి. ఒకటి – వీరు – ఈ దేశ ప్రజలు – ఎప్పుడూ పరాయి పాలనలో లేరు. రెండోది వీరు నూటికి తొంభైతొమ్మిది మంది బౌద్ధులు, అంటే మొదటిది వీరికి అంతులేని ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ఎటువంటి పర ప్రభావం లేని సమాజ జీవనాన్ని – రూపొందించుకోవటానికి దోహదపడితే, రెండోది లౌకికపరంగా, సామాన్యంగా, మామూలుగా, తక్కువ కోరికలతో, జీవితం గడపటానికి, పరులయందు ఎనలేని ఓర్పు ప్రదర్శించటానికి ప్రేరణకావటమే కాక– వీరి జీవన సరళిని ఎంతో సులభతరం చేసింది.

తాత్విక దృష్టి: థాయి పౌరులు పరులనుంచి గాని, పర దేశీయుల నుంచిగాని ఏమీ ఆశించరు. వారు మీకు చేసే మర్యాదలను గుర్తించి, వారి మర్యాదను మన్నించమని మాత్రమే కోరుకుంటారు. మెలమెల్లగా సుతిమెత్తగా, వారు బాధపడకుండా, మిమ్మల్ని బాధించకుండా, సాగిపోయే వారి రోజువారి జీవితంలో అంతగా ఒడిదుడుకులు వున్నట్లు కనపడవు. వీరు లౌకికంగా ఎంత తాపీగా వుంటారో– మానసికంగా అంత నెమ్మదిపరులు. పశ్చిమ దేశవాసులవలె ఒత్తిడికి, అలసటకు లోనై అందులో వచ్చే ఇతర రుగ్మతలు వీరికి అంటవు. అందుకు ప్రధాన కారణాలు : పైన చెప్పిన ఆత్మగౌరవం – తాత్విక దృష్టి నుంచే అలవడినాయి. వీరికి రాజ కుటుంబాలు అంటే ఎనలేని గౌరవం – బుద్ధుని ప్రవచనాలు వీరి నిత్య జీవనంలో భాగం. రాజ కుటుంబీకులు రాజప్రసాదాలలో కులాసాలలో కులకుతూ కూర్చోరు. రాజయితే, ప్రతిరోజూ మోకాలు లోతు బురదలో దిగటానికి వెనుదీయడు. యువరాణి అయితే ఉదయాన్నే రాజప్రసాదం వీడి దిక్కులేని పిల్లలకు సేవలందించటంలో రాత్రి వరకు విశ్రాంతి తీసుకోదు. రాజవంశీకులంటే ఇక్కడి ప్రజలకు అందుకే భక్తిప్రపత్తులు. థాయి దేశంలో, మిగతా దేశాలకు భిన్నంగా, ప్రతి యువకుడు రెండుమూడు సంవత్సరాలు కాషాయ వస్త్రాలు ధరించి ఆరామాలలో బౌద్ధ భిక్షుకుని జీవితం గడపాలి.

సరిగ్గా ఈ సూత్రమే వీరి జీవితాలను సరైన సరళమైన, సహనపూరితమైన దారిలో పెడుతుంది.

ప్రార్థనా మందిరాలు: ప్రార్థనా మందిరాలలో వీరు చేసే ప్రార్థనలు నిశ్శబ్దంగా వుంటాయి. అపుడు వీరి ముఖాలు వెలిగిపోతుంటాయి. ప్రపంచంలోని శాంతి అంతా ఈ ప్రార్థనా మందిరాలలోనే వుండిపోతుంది. (అందుకే మరెక్కడా శాంతి కానరాదు.)

నేను ఒకసారి కాదు – ఎన్నోసార్లు ఈ ప్రార్థనా మందిరాలు దర్శించాను. బౌద్ధ భిక్షుల ఆరామాలు చూశాను. వారి దినచర్య గమనించాను. ప్రతి చిన్న పని, వీరు ఎంతో మనస్ఫూర్తిగా చేస్తారు. ఆ పని చేస్తూ వీరు ఎంతో ఆనందం పొందుతారు. అది వారి దినచర్య కానీయండి, ప్రార్థన కానీయండి, భోజనం కానివ్వండి – ఆ పళ్ళెంలో వున్నది అన్నమైనా, ఆకులైనా, వీరు ఆరగించే తీరు – ఆనందించే తీరు మీరు చూసి తీరవలసిందే. ఆహారం వారి దేహంలోకి వెళ్ళి అంతలోనే శక్తిగా మారి, మరుక్షణమే వెలుగై ముఖాలను కాంతివంతం చేయటం అక్షరాలా చూశాను. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మనం అనుసరించే జీవన విధానం – మనం ఎంచుకున్న మత విశ్వాసం, మన సుఖసంతోషాలకు, ఇతరులపట్ల సంయమనం పాటించటానికి, సమాజ వికాసానికి, దేశ ప్రగతికి ఏ విధంగా దోహదపడుతుందో కళ్ళారా చూశాను. తథాగతుణ్ణి మన దేశం నుంచి తరిమేసి – ఎంత తప్పు చేశాము? అది థాయి దేశ ప్రజల్నిచూసి అవగాహన చేసుకోవాలి మనం. రెండు చేతులు జోడించి కొద్దిగా ఒదిగి మీకు అభివాదం చేస్తారు. 'వాయి' అని ప్రసిద్ధి – ఒక ప్రార్థనలాగానే వుంటుంది. మీరు కూడా ప్రయత్నించండి. మీకు కుదరకపోయినా వీళ్ళు గేలిచెయ్యరు. సంతోషంగా సాదరంగా ఆహ్వానిస్తారు. రండి థాయి దేశాన్ని – బ్యాంగ్‌కాక్, 'ది ఓరియంటల్ సిటీ'ని చూద్దాం.

జీవనది: వీరి తరతరాల సంస్కృతిని వీరి దినచర్యల్లో, వీరి సహనాన్ని వీరి వ్యాపార వ్యవహారాల్లో, వీరి మర్యాదల్ని, పర్యాటకులను ఆదరించే తీరులో దర్శించి ఆశ్చర్యపోకతప్పదు.

చావోఫియా నది. ఈ సముద్రం లాంటి నది వీరికి జీవనది. వీరి జీవన సరళికి అనుకూలంగా, వీరి భావజాలానికి సానుకూలంగా ఈ నది నిండుగా,

నెమ్మదిగా ప్రవహిస్తుంటుంది. చిన్న చిన్న పడవల దగ్గర్నుంచి, పెద్ద ఓడల వరకూ నగరానికి మధ్య వరకు రావటానికి ఇది రహదారి. ఎగుమతి దిగుమతులు బ్యాంగ్‌కాక్ నడిబొడ్డు నుంచే జరగటానికి అనువుగా ఈ మహానది నిండుగా ప్రవహిస్తుంటుంది. దక్షిణ పడమరలకు ప్రవహించే ఎన్నో కాలువల ద్వారా ('క్లాంగ్' అంటారు) లక్షల ఎకరాల వరి పొలాలను సస్యశ్యామలం చేస్తుంది. ఇప్పటికీ వీరికి వ్యవసాయ భూములను కలిపే రహదారులు ఈ కాలువలే. క్లాంగ్ లే. ఎంతో మేలైన వడ్లు – ఎకరానికి వందబస్తాలు పండిస్తారు అంటే అతిశయోక్తిగా వినపడుతుంది కదూ. నీరు వీరికి పుష్కలంగా వుంది. ఊరి పేర్లు కూడా షోన్‌బురి, (బురి అంటే నీరు అని అర్థం) చావ్‌బురి... ఇలా వుంటాయి. అరే, కాలవల వెంబడి బ్యాంగ్‌కాక్ దాటి వచ్చేస్తున్నాం... ముందుగా నగరాన్ని చూద్దాం.

బ్యాంగ్‌కాక్‌లో ముందుగా లుంబిని పార్క్ స్టేడియంలో తిరుగుదాం. నగరం మధ్యలో 500 నుంచి వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పచ్చికబయళ్ళు-చెట్లు మహావృక్షాలు, ఆట మైదానాలు, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింగ్‌లూ, బాక్సింగ్‌రింగ్‌లూ, ఇలా ఒకటేమిటి సమస్తం మనకు అందుబాటులో వుంటాయి. ముఖ్యంగా చూసి తీరాల్సింది. కుస్తీ పోటీలు – ఇవి చట్టపరమయినా, అచ్చంగా



బ్యాంకాక్ సిటీ

వీధుల్లో జరిగే తన్నులాటల వలెనే వుంటాయి. ఒక తీరుతెన్ను, రూలూ, రైము వుండదు – అదిగో అందుకే దీనిలో మజా వుంటుంది. జనం ఎగబడి చూస్తారు – పందాలు, పైపందాలు కాస్తారు. ఇక్కడ నిలబడి, ఒక బీరుబుడ్డి చేతబట్టి – మధ్యలో ఈలవేస్తూ ఈ తన్నులాటలు చూసి ఆనందించాలి. లుంబిని స్టేడియంలో మైదానంలో ఎన్నో జానపద నృత్యాలు – రామాయణంలో ఘట్టాలు, హనుమంతుని వీరవిహారం, సీతారాముల కళ్యాణం, అన్నీ ప్రదర్శిస్తారు. నిష్ణాతులైన నాట్యకత్తెలు, ఎంతో అలంకారయుతమైన ఆహార్యం, రంగురంగుల దీపాల కాంతుల్లో మిలమిల మెరిసిపోయే నగలు, కిరీటాలు – ఇవన్నీ మీకు నవరసాలు అందిస్తాయి. పచ్చికబయళ్ళలో ఫుట్‌బాల్ ఆడుకునే యువకులు, సైకిల్ తొక్కుతూ తిరిగే యువతులూ, కేరింతలు కొడుతూ గంతులు వేసే చిన్నారులూ, ఓహ్, ఎంత చైతన్యం – ఎంత సందడి. సాయంత్రం, ఆ పచ్చిక మీద అలా నడుం వాల్చండి. అంత సందడిలో మీకు హాయిగా కునుకు పడుతుంది. అదే కదా లుంబిని ప్రత్యేకత. వాతావరణంలోని ప్రశాంతత.

ఆలయాలు: తర్వాత మనం చూడవలసింది – చూసి తరించవలసింది – ఇక్కడి అద్భుతమైన బుద్ధదేవుని ఆలయాలు, ఎన్ని ఆలయాలు! ఆరామాలు! కొన్ని ఆలయాలు కలిసిన ఎంతో పెద్ద ప్రాంగణం ఆరామం అంటారు. 160 అడుగుల బుద్ధ భగవానుడు శయనుడై విశ్రాంతి తీసుకునే బ్రహ్మాండమైన విగ్రహం. తల దగ్గరే 30 అడుగుల ఎత్తు. ఆ శయనాగారం అంతా బుద్ధ చరిత్రతో నిండిన శిలాఫలకాలు, విగ్రహం చుట్టూ కంచు గిన్నెలు – ఎందుకో తెలుసా? మీ కోరికలు ఒక్కొక్కటి వదిలి వేయమని.

ఒకచోట బంగారు బుద్ధుడు. ఐదున్నర టన్నుల బరువుగల ధగధగ మెరిసిపోయే ప్రశాంత వదనుడు. తలుపులు లేని గుడిలో హాయిగా ఏ భయం లేకుండా కూర్చున్నాడు. చుట్టుప్రక్కల రక్షణగాని, కాపలా కెమెరాలుగాని వుండవు – అయినా తథాగతుణ్ణి ఎవరు ఎత్తుకుపోగలరు? మంగోలియా సైన్యాలు దండెత్తి వచ్చినప్పుడు – ఈ విగ్రహానికి చుట్టూ సున్నం పూతతో కప్పి వుంచారు. పోయిన శతాబ్దంలో, అప్పటి తరాలు అంతరించిపోయిన తర్వాత నలభై యాభై సంవత్సరాల క్రిందట పెచ్చులు వూడిపోయి లోపలి బంగారు బుద్ధుడు తొంగి చూశాడు. థాయి ప్రజలు పెద్ద పండగే చేసుకున్నారు. ఇప్పుడు ఇష్టదైవాన్ని

కళ్లారా చూసుకుంటున్నారు. ఇంకోచోట – అంతా పాలరాతి మందిరాలు, చల్లగా, మనసుకు హాయిగా పాలుగారే గౌతముని విగ్రహాలు. ప్రార్థనామందిరాలు, చావోఫియా నది అంచున పెద్ద కిరీటంలాంటి బంగారు గోపురం – పగటి వెలుతురుతో పాటు రంగులు మారే బంగారు రంగు గోపురం. చుట్టూ కాపలా కాస్తూ గోపుర స్తంభాలు. అక్కడే తెల్లని, భక్తుల ఆరామాలు. అంతేనా? ఇక్కడ ప్రతి ఇంటిలో చిన్ని బుద్ధదేవుని గుడి వుంటుంది. ప్రతి ప్రహరి లోపల బుద్ధుని ఆరామం వుంటుంది. బుద్ధుడు వీరి జీవితంలో ప్రధాన భాగం. బుద్ధుని బోధనలు – వీరి జీవన విధానం.

ఎన్నో ప్రధాన రహదారుల పేర్లు – రామా1, రామా2, రామా3, ఇలా వుంటాయి. ఇంక హోటళ్ళ పేర్లు మనోహర, రాజా, ఇంద్ర రీజంట్... వీటితోబాటు సాంప్రదాయ సిద్ధమైన హోటళ్ళు – ఓరియంటల్, షాంగ్రిలా వున్నాయి. అధునాతన హోటళ్ళు షేరటాన్, హిల్టన్, హయ్యట్, మెరిడియన్ మొదలైన ఎంతో ఖరీదయినవి, వ్యాపారస్తులకు సేవలందిస్తుంటాయి.

బ్యాంగ్‌కాక్ నగరంలో ముఖ్యంగా చూడవలసిన ప్రదేశాలు, రాయల్ పాలెస్, మాజిక్‌లాండ్, వాటర్ వరల్డ్, అంతేకాక, గోల్డ్ మార్కెట్ తప్పక చూడాలి. వందలకొలది బంగారు షాపులు ధగధగమెరిసే ఆభరణాలు మేలిమి బంగారంతో చేసినవి అమ్ముతుంటారు. ప్రపంచంలో అంతటికి చౌకగా ఇక్కడ బంగారం ధర వుంటుంది. తరతరాల నుంచి బంగారు నగలు చేసే పనివారు– ఎంతో నైపుణ్యంతో నగలను తీర్చి దిద్దుతారు. మోసం, దగా అసలు వుండదు. రత్నాలు, ముత్యాలు ఎంతో మంచివి, సరసమైన ధరకు దొరుకుతాయి. ఇక బట్టల విషయానికొస్తే, ఎంతో మేలయినవి అతి చౌకగా లభ్యమౌతాయి. మీకు కావలసిన సూటు, 'సఫారి' గంటల్లో కుట్టిస్తారు. నాతో వచ్చిన ఒక స్నేహితునికి (ఆలస్యంగా ఆర్డర్ ఇవ్వడంతో) ముప్పయి కిలోమీటర్లు మోటర్ సైకిల్ మీద వచ్చి మేము ఫ్లైట్‌కి చెకిన్ చేసే ముందు అందించి వెళ్ళిన – వ్యాపారి నిజాయితీని మెచ్చుకోకుండా వుండగలమా?

మంచి నూలు, మంచి పట్టు బట్టలకు ప్రసిద్ధి. థాయి సిల్క్ అంటే ప్రపంచం అంతా మోజుపడుతుంది మరి. ఆడవాళ్ళ బట్టలు మెత్తగా జారిపోతూ సిల్క్, శాటిన్ పూలు గుడ్డలతో తయారుచేస్తారు. అవి ధరించేవారు అంతకంటే

నాజూకుగా వుంటారు కూడా. చిన్నచిన్న షాపుల నుంచి ఎంతో పెద్ద మాల్స్ వరకూ అన్ని రకాల వస్తువులు అమ్ముతారు. మాల్స్‌లో అంతగా బేరం చేయకూడదు కాని, మిగతా షాపుల్లో మాత్రం బేరాలు ఒక సరదా ఆట. ఈ ఆట అందరూ ఆడవలసిందే. చావోఫియా నదికి ఇరువైపులా ఎన్నో కాలువలు ఉన్నాయి. నగరంలోనే ఈ కాలవగట్ల మీద, ఓడల్లో పనిచేసే ఎగుమతి దిగుమతి పనివాళ్ళు చెక్క ఇళ్ళల్లో నివాసం వుంటారు. వీరి అవసరాల కోసం ప్రతిరోజు వుదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ఫ్లోటింగ్ మార్కెట్ నడుస్తుంది. ఈ వ్యవహారం తప్పనిసరిగా చూసి ఆనందించాలి. పూలు, కూరగాయలు, చేపలు, దినసరి సరుకులు ఒకటేమిటి అన్ని చిన్న చిన్న పడవల మీద సర్దుకుని తేలుకుంటూ వచ్చి అమ్ముతారు. ఇళ్ల అంచున కూర్చుని బేరం చేస్తూ అక్కడి నివాసులు అవసరాలకు కొనుక్కుంటారు. ప్రతిరోజూ సంవత్సరం పొడవునా జరిగే తంతు ఇది. ఇది చూడటానికి అన్ని దేశాల నుండి పర్యాటకులు చిన్న పడవల్లో నది దాటి వస్తారు. కాలవల్లో తిరుగుతారు ఫొటోలు తీస్తుంటారు. బ్యాంగ్‌కాక్ రాత్రులు ప్రపంచ ప్రఖ్యాతం.

రాత్రి సరదాలు: ప్రతి హోటల్‌లో కూడా 'మసాజ్' గదులు వుంటాయి. అక్కడ శిక్షణ పొంది 'మసాజ్' చేసే యువతీ యువకులు వుంటారు. రోజంతా తిరిగి అలసిపోయిన దేహానికి, ఎన్నో వత్తిళ్ళకు లోనయిన మనస్సుకు ఎంతో సాంత్వన చేకూరుస్తుంది ఈ మసాజ్. మీకు, మీ చిన్నపుడు చక్కగా మీగడ రాసి, నలుగు



ఫ్లోటింగ్ మార్కెట్

పెట్టి, వళ్లంతా మెత్తగా రుద్ది స్నానం చేయించిన రోజులు గుర్తు వస్తాయి. అక్కడ తృప్తిపడకపోతే, పాట్‌పాంగ్ రోడ్‌కి వెళ్ళాలి. స్టీమ్ బాత్, టర్కిష్ బాత్, సాన, ఇలా ఎన్నో రకాల హెల్త్ క్లబ్బులుంటాయి. పేర్లు కూడా 'మాడ్‌నెస్, థైయ్‌బార్, లిప్‌స్టిక్, పింక్ పాంథర్, మోనాలిసా, క్లియోపాత్రా ఇలా వుంటాయి. విశేషం ఏమిటంటే, ఏమాత్రం భయంలేకుండా ఎంత రాత్రయినా, హాయిగా తిరిగి గూటికి చేరవచ్చు. కాని ఎవరు కూడా హోటల్‌కు వెళ్ళి నిద్రపోవటానికి తొందరపడరు. చూడాల్సినవి అయిన తర్వాత ఒక డిస్కోతిక్ వెళ్ళాలి. అక్కడ మసకమసక చీకటిలో ఆ లైవ్ ఆర్కెస్ట్రాతో తళుకుతళుకు బట్టలతో గంధర్వ స్వరాలతో ఒక్కొక్కరు వచ్చి మనకు అర్థం కాని పాటలు పాడి మనలను అలరిస్తుంటే, 'సింగా' బీర్ ఎంతో చల్లగా మీ గొంతు జారుతుంటే, నిద్రపోవటానికి తొందర ఏమిటండీ. ఆ రాత్రి తెల్లవారకుంటే ఎంత బాగుండును అని తప్పకుండా అనుకుంటాం. థాయి పౌరులు ఎక్కువగా 'మాయిపెన్‌రాయ్' అని అంటారు. అంటే 'టేకిట్ ఈజీ' అని, 'హాయిగా బ్రతక'మని కూడా. ఈ తాత్వికదృష్టి వీరి



ఫ్లోటింగ్ విలేజ్

దైనందిన జీవితంలో ప్రతిబింబిస్తూంటుంది. ఏ విషయంలోనూ వీరు బిగుసుకుని 'ఖచ్చితంగా' వుండరు. టాక్సీలకు మీటర్లు వుండవు. చక్కగా బేరం ఆడుకుని చాలా చౌకగా ప్రయాణం చెయ్యవచ్చు. చెప్పిన టైంకి కాస్త అటూఇటూగా వస్తారు. చూశారా. అందుకనే వీలయితే వాళ్ళతోపాటు – వాళ్ళ ధోరణిలో నడవండి – లేదా వదిలి పొండి.

"థాయ్‌లాండ్" అంటే – "చిరునవ్వుల దేశం" అని అర్థం:

మొట్టమొదటిగా సియామ్ (ఇప్పటి థాయ్) ప్రదేశంలో అడుగు పెట్టింది మన ఉపఖండం నుంచి వెళ్ళిన 'మాస్' ప్రజలు. దాదాపు రెండువేల సంవత్సరాల క్రితం తమతోపాటు బుద్ధుణ్ణి కూడా తీసుకువచ్చారు. ఛావోఫియానది అంచుల్లో నిలదొక్కుకుని, అప్పుడప్పుడూ మంగోలియా జాతివారితో యుద్ధాలు చేస్తూ (వీళ్ళు ఎప్పుడూ ఎవరిమీదా దండెత్తిన దాఖలాలు లేవు – కాని ఎవరు తమ మీదకు వచ్చినా చావగొట్టి తరిమేవారు) ఆ నదీ పరివాహక దేశంగా "లాప్‌బురి" రాజధానిగా ఒక వెయ్యి సంవత్సరాలు గడిచింది. మంగోలియా పీడ వదిలిన తర్వాత దక్షిణంగా జరిగి, "ఉతాంగ్" రాజు "అయోధ్య" రాజధానిగా 1350లో రాజ్యాన్ని నెలకొల్పాడు. 400 ఏళ్ళ తర్వాత బర్మావాళ్ళతో జరిగిన యుద్ధంలో అయోధ్య నాశనం అయింది. 1767 ప్రాంతంలో. తాత్కాలికంగా 'తోన్‌బురి' రాజధానిగా, ఇంకా దక్షిణంగా పాలన సాగించినా, తర్వాత ఇప్పుడున్న



చావో ఫియా నది ఒడ్డున బంగారు బౌద్ధాలయం

‘బ్యాంగ్‌కాక్’ రాజధానిగా రాజ్యాన్ని సుస్థిరం చేశాడు – ‘చక్రి’ వంశానికి చెందిన యోధుడు – “ఫ్యాచక్రి రామా!”. ఇప్పుడు పరిపాలించేది ఆ వంశం వారే. తర్వాత 1932లో రక్తపాతంలేని తిరుగుబాటుతో సైనిక ప్రజాస్వామ్యం వచ్చింది. 1973 వరకూ అదే పాలనలో వున్నా, అక్టోబర్‌లో విద్యార్థులు, యువకులు తిరుగుబాటు చేసి, సైనిక పాలన అంతం చేసి, “ధర్మశక్తి”ని ప్రధానిగా చేశారు. 1974లో ‘భూమిబల్’ రాజు పార్లమెంటుకు, క్రొత్త రాజ్యాంగాన్ని రూపొందించటం కోసం శాసనం చేశాడు.

విస్తీర్ణం: జనాభా: రెండువేల చదరపు మైళ్ళ విస్తీర్ణంలో నదులు, అడవులు – ఎన్నో దీవులు – అంతా ప్రకృతిమయం – ఎంతో ఆహ్లాదకరంగా వుండే వాతావరణం, ప్రజలతో మీకు ‘వాయి’ చెప్పే ‘చిరునవ్వుల’ దేశం ‘థాయిలాండ్’ వీరికి ప్రధానంగా ఉన్న బ్యాంక్ పేరు : ‘భూమి పుత్ర’ బ్యాంక్.

చిన్న కథ: ఒక రోజు ‘ఫరాంగ్స్’తో (అంటే ఫారినర్స్ అన్నమాట) సిటీ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు టూరిస్ట్ బస్ వెళ్తోంది. సగం దూరంలో బస్ ఆగిపోయింది. కొద్దిసేపు డ్రైవర్ బస్సు స్టార్ట్ చెయ్యటానికి ప్రయత్నించాడు. గైడ్ కూడా అతనితో చేరాడు. ఉన్నట్లుండి. ఇద్దరూ పెద్దగా నవ్వటం మొదలుపెట్టారు. బస్‌లో ఉన్న ఫరాంగ్స్‌కి అర్థం కాకపోయినా వాళ్ళూ గట్టిగా నవ్వడం మొదలు పెట్టారు. నవ్వులు ఆపిన తర్వాత – అడిగారు – ఏమిటి విషయం అని డ్రైవర్, గైడ్ “మనం ఎయిర్‌పోర్ట్‌కి ఆలస్యంగా వెళ్తాం కదా. ఈలోపు విమానం ఖాళీగా వెళ్ళిపోతుంది. అంతా ఖాళీ” అని మళ్ళీ నవ్వడం మొదలుపెట్టారు. విమానం ఖాళీగా వెళ్తుంది అనే ఆలోచనే వీళ్ళకు చక్కిలిగిలి పెడుతోంది. వీళ్ళకు ప్రతిరోజు క్రొత్తరోజే. రేపు సూర్యుడు ఉదయిస్తాడు. రేపు ఇంకో విమానం సిద్ధంగా వుంటుంది. ఎందుకు హైరానా!

చైనా చేతికి హాంగ్‌కాంగ్

***1997** జూన్ **30**వ తేదీ అర్ధరాత్రి హాంగ్‌కాంగ్ పాలనాధికారం చైనా దత్తం అయింది. **1997** జూలై **1**వ తేదీ సూర్యోదయాన అక్కడ బొహీమియా పుష్పం హాంగ్‌కాంగ్ కొత్త అధికార చిహ్నమై వికసించింది. తొంభైతొమ్మిది సంవత్సరాల లీజ్ దశలో అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా, భౌతిక స్వేచ్ఛల సౌభాగ్య ద్వీపకల్పంగా ఎదిగిన హాంగ్‌కాంగ్ యికపై చైనా పాలనలో ఎలాంటి పరిణామాలకు లోనవుతుందో అనే ప్రశ్నకు జవాబు దాని యిన్నేళ్ళ చరిత్రలో దాగి వుంది. స్వేచ్ఛాప్రియులైన అక్కడ ప్రజలకు చైనా కమ్యూనిజమ్ సంకెళ్ళు వేస్తుందా? చూద్దాం.*

కలగూరగంపలా, అన్ని జాతుల కలయికతో అరవై లక్షల జనాభాతో ఎప్పుడూ కుతకుత ఉడుకుతున్న కుండలా ఉంటుంది హాంగ్‌కాంగ్. ద్వీపకల్పం (ఆర్చిపాలాగో) జూన్ 30, 1997వ తేదీన వేల్స్ యువరాజు హాంగ్‌కాంగ్ తాళాలు చైనా చేతుల్లో పెట్టాడు. ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అని పొలికేక



హాంగ్ కాంగ్ రేవు

పెట్టే ఇంగ్లండు గాని, పౌర హక్కులు, మానవ హక్కులు అని నక్క కబుర్లు చెప్పే అమెరికా గాని, హాంగ్‌కాంగ్‌ని చైనాకి ధారాదత్తం చేసే ముందు 150 సంవత్సరముల ప్రగతి పథంలో, సంస్కృతీ సంగమంలో, ఒక క్రొత్త జాతిలా ఆవిర్భవించి పెనవేసుకుపోయిన అక్కడి అరవై లక్షల మంది జన జీవితాలకు ఒక సామూహిక చైతన్యము ఉంటుందని, సామాజిక భావసారూప్యత ఉంటుందనే ఆలోచన లేకుండా – కనీసం వారి అభిప్రాయ సేకరణ కూడా చెయ్యకుండా (దాని పరిణామము తెలిసే) వీరందరినీ రక్త మాంసాల సరుకులాగా (హ్యూమన్ లగేజ్) చైనా గుప్పిట్లో పెడుతున్నారు. 20వ శతాబ్దములో జరిగిన ఘోరాతిఘోరమైన చారిత్రకపరమైన పెద్ద తప్పిదం యిదని కొందరైనా విమర్శిస్తున్న సందర్భం ఇది. ఇప్పుడు నెలకొని ఉన్న (యూనిపోల్) ఏకధృవ వ్యవస్థకు అధికార స్థావరంగా ఉన్న అమెరికా, హాంగ్‌కాంగ్ పరిస్థితికి అడ్డుపడి ఉండవచ్చు. కాని చైనా సైనికపరమైన బలానికి, జనాభాపరమైన బలుపునకు (ఒబెసిటి) జంకి ఇంగ్లండు, అమెరికాలు యీ పని చేశాయి అని చెప్పవచ్చు. ఇంకా పెట్టుబడుల పరంగా ఉండే సొంత లాభం కూడా చాలావరకూ కారణం కూడా. ఈ అగ్రదేశాలు చైనాకు లొంగిపోయినట్లేనని భావించవచ్చు. ఇది చైనాకి నైతికపరంగా పెద్ద విజయం. చైనా చేతిలో హాంగ్‌కాంగ్ ఒక ట్రంప్ కార్డ్.

చరిత్ర:

పోర్చుగీసువారు మొదలుపెట్టిన (18వ శతాబ్దము) నల్లమందు వ్యాపారానికి చైనాలో బాగా గిరాకీ ఉండటంతో అన్ని తెల్లజాతులవారు చైనా తీరంలో వాలారు. అందులో ఈస్ట్ యిండియా కంపెనీ కూడా ఒకటి. బెంగాల్లో పండిన నల్లమందుని చైనా దేశానికి ఎగుమతి చేసి ఈస్ట్ యిండియా కంపెనీ లాభించింది. అప్పటికీ చైనా చక్రవర్తి నల్లమందును నిషేధించాడు. అయినా ఎగుమతులు ఆగలేదు. ఆ నిషేధాన్ని మళ్ళీ తిరగదోడి అమలుపరచటానికి ప్రయత్నించాడు చక్రవర్తి. ఎగుమతులు పెరిగినాయే గానీ తగ్గలేదు. ఈ స్థితిలో మొదటి నల్లమందు యుద్ధము (ఓపియం వార్) 1839–41 జరిగింది. అప్పుడు జరిగిన ఒప్పందంలో చైనా హాంగ్‌కాంగ్‌ని ప్రాంతాన్ని – కౌలూన్ పెనిన్సులా అనే నాలుగు చదరపు మైళ్ళ ప్రాంతాన్ని – స్టోన్ కట్టర్ దీవిని బ్రిటన్‌కు యిచ్చింది. ఆ తరువాత 1898లో బ్రిటిష్ వాళ్లు సైనిక విన్యాసాలకు, వ్యాపార లావాదేవీలకు

చైనా నుండే “కొత్త ప్రాంతాలు” అని 235 దీవులను (366 చదరపు మైళ్ళు) 99 సంవత్సరముల నేల అద్దెకు తీసుకొన్నారు. ఆ రకంగా హాంగ్‌కాంగ్ దీవి, కౌలున్ పెనిన్సులా, న్యూ టెరిటస్ బ్రిటన్ పాలన క్రిందకు చేరినాయి. ఈపాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. హాంగ్‌కాంగ్ దీవి కౌలున్ పెనిన్సులా రెండూ చైనా, బ్రిటన్‌కి యుద్ధములో ఓడిపోయి యిచ్చినవి. కాని క్రొత్త ప్రాంతాలు అనే 235 దీవులు 90 సంవత్సరముల ఒప్పందములో వచ్చినవి. అంటే మొదటి రెంటి మీద చైనాకు ఎట్టి అధికారము లేదు. 1997 జూన్ 30 నాటికి చైనాకు ఒప్పందము ప్రకారము రావలసింది కొత్త ప్రాంతాలు - 235 దీవులు - మాత్రమే. కాని తరువాత చరిత్రను తిరగవ్రాసి మూడింటిని మూటకట్టి చైనా ముంగిట్లో పెడుతున్నారు. మీకు గుర్తుండే వుంటుంది. భారత ఖండానికి స్వాతంత్ర్యము యిచ్చిన రోజున గవర్నరు జనరల్ మౌంట్‌బాటన్ తనే ఉన్నారు. బ్రిటిష్ ప్రధానిగాని, రాణిగారి వారసులుగానీ ఎవ్వరూ రాలేదు. కానీ యిప్పుడు కేవలము 240 చదరపు మైళ్ళ భూభాగాన్ని అప్పగించటానికి సాక్షాత్తూ వేల్స్ యువరాజు, అమెరికా విదేశాంగ మంత్రి దిగి వస్తున్నారు. ఇది నిజంగా చైనా విజయం.

హంగ్‌కాంగ్ అభివృద్ధికి ముఖ్య కారణాలు - అలలు రాని హార్బర్, తెల్లజాతి తెలివితేటలు - చీమల్లా కష్టపడే చైనా జాతి, త్వరితగతిని అభివృద్ధి చెందే వ్యాపారవకాశాలు - తద్వారా పెట్టుబడులతో సహా వలస వచ్చిన - అనేకానేక జాతి ప్రజలు - హాంగ్‌కాంగ్‌ని వంద సంవత్సరాల్లో - మిగతా పారిశ్రామిక దేశాల కన్నా ముందు నిలబెట్టాయి. ఇది మామూలు చేపలు పట్టే మత్స్యకారులకు ఆలవాలమైన ‘అబర్దీన్’ రేవు. ముందుగా తెల్ల జాతివారు వ్యాపారరీత్యా ‘మకావ్’లో మకాం పెట్టి హాంగ్‌కాంగ్‌కు ఉన్న Strategic Location గుర్తించి 4, 5 దశాబ్దాల తర్వాత చైనాతో నేల అద్దెకు ఒప్పందం కుదుర్చుకున్నపుడు - హాంగ్‌కాంగ్ అభివృద్ధిని ఇరుపక్షాలు అంచనా వేయలేదు. అలాగే చైనా మెయిన్ లాండ్ నుంచి చైనీయుల వలసను ఆపలేకపోయాయి. తర్వాత చైనాలో వచ్చిన (మరోకాలంలో) పరిణామాల పర్యవసానంగా వలస ద్వారాలు మూసివేసి - ఇనుప తెరలు పెట్టారు. ఆ తర్వాత కాలంలో హాంగ్‌కాంగ్ ఒక దేశంగా అక్కడ ప్రజలు ఒక జాతిగా, పూర్తి ప్రజాస్వామ్య రీతిలో (ఇంగ్లాండ్‌కి లోబడి

అయినా) జీవనం సాగించి – అభివృద్ధి సాధించి – ఇప్పుడు పరాధీనగా ప్రపంచ దేశాలకు ప్రశ్నగా మిగులుతోంది.

సంస్కృతి – సంపద:

హాంగ్‌కాంగ్ – జనజీవనం – బహుళజాతి ప్రభావితం – పలురకాల పూలహారం – వివిధ మతాల సమాహారం, క్రిష్టియన్ చైనీస్ – ఇండియన్స్ చైనీస్ ఫిలిప్పినో చైనీస్ క్రిస్టియన్స్ – ఇండియన్స్ అంతర్లీనంగా బౌద్ధ మత ప్రభావం– వీటన్నింటికీ చోదక శక్తి డాలర్ వేట. బెంజ్ – రోల్స్ రాయిస్ బి.యం. డబ్ల్యూ కారులు – అద్భుతమైన స్టార్ హోటళ్ళు – 30 డాలర్లు నుంచి మూడువేల డాలర్లు ఖరీదు చేసే హోటల్ గదులు – హాంగ్‌కాంగ్ సంపదకు చిహ్నాలు. పైన పెద్దపెద్ద నౌకలు నిద్రపోతుంటే – నీటి క్రిందనుంచి కారులు చీమల బారులా పరుగులు తీసే సొరంగ మార్గాలు – ఇంతకూడా దుమ్ములేని భూగర్భరైలు పెట్టెలు – సముద్రమే రన్‌వేగా ఉపయోగించి దిగి వస్తున్న విమానాలు– ప్రపంచంలో ఏమూల తయారయిన వస్తువైనా లభించే డ్యూటీ ఫ్రీషాపులు – పగలంతా గలగల పనిచేసే అమ్మాయిలు – ఇంత శక్తి – ఎక్కడి నుంచి వస్తుందని– వీళ్ళని పరుగులు పెట్టించే ఆ చైతన్యం ఏమిటని మనం ఆశ్చర్యపోక తప్పదు. సాయంత్రం సూర్యుడు అబర్దాన్ చేపల రేవు వెనుకగా సముద్రంలో జారిపోగానే – పెళ్ళివారి ఇల్లులాగా లక్షల లైట్లతో



ఓషియన్ పార్క్

వెలిగిపోయే ఆకాశహర్మ్యాలు – వాటి నీడలు హార్బర్‌లో వూగులాడుతుంటే, పగటికంటే వేగంగా పరుగులు తీసే హాంగ్‌కాంగ్ రాత్రులు – నైట్ క్లబ్‌లు – డిస్కోతిక్‌లు – క్రూయిస్‌లు – కాసినోలు – ఎవరి అనుభవం వారికి సొంతం. జీవితాన్ని పరుగెత్తించటమే వీరికి తెలుసు. వీరు మనలాగా జీవితాన్ని గడపరు. పరుగులెత్తిస్తారు.

గ్రామాలు:

ఈ రెండు వందల యాభై దీవులలో ఎన్నో గ్రామాలు వున్నాయి. గేదెలతో– వ్యవసాయంతో కాలక్షేపం చేసే కాపురాలు ఎన్నో ఉన్నాయి. ఒక మేజస్ట్రేటుగారి దగ్గరకు – ఒక ఫిర్యాది వచ్చాడు. మెజిస్ట్రేటు ఆంగ్లేయుడు. ఫిర్యాది చైనీయుడు. అయ్యా! మా అల్లుడు ఈ రెండు గేదెలను మా యింటికి తోలాడు అని మొరపెట్టుకున్నాడు. మేజిస్ట్రేటు గారికి ఏమీ పాలుపోలేదు. ఇందులో నేరమేమిటో. అల్లుడు గారికి సమన్సు పంపి పిలిపించారు. ఆయన – ఈ గేదెలు మా మామగారివి. ఆయనకే పంపాను అని చెప్పాడు. మెజిస్ట్రేటుగారికి మతిపోయింది. మామగారి గేదలు మామగారికి పంపితే ఎలా శిక్షిస్తాడు? విషయం తేలక కేసు వాయిదా వేశారు. తర్వాత రెండు నెలలకి – అల్లుడుగారు అమ్మాయిని

> ***హాంగ్‌కాంగ్ అంటే?***
>
> *హాంగ్‌కాంగ్ అనే పేరు ఎలా వచ్చింది? ఈ పదానికి అర్థం ఏమిటి? అనే సందేహం కలుగుతుంది. HEUNG KONG అనే రెండు చైనీస్ పదాల్ని కలిపి HONG KONG అనే పదాన్ని సాధించారు. ఈ చైనీస్ పదాలకు అర్థం "పరిమళ రేవు పట్టణం". నల్లమందు రవాణా చేసే ఓడల నుంచి వచ్చే సువాసననుబట్టి ఈ పేరు పెట్టారని కొందరు అంటున్నారు. అది కాదు ఇక్కడి దక్షిణ తీరంలో పశ్చిమ కోస్తా తీరం వెంటగల ఒకరకం కలప వాసన వలన ఈ పేరు వచ్చిందని మరికొందరు అంటున్నారు.*
>
> *అలాగే ఈ దీవులలో ముఖ్యమైన కొవ్‌లూన్ పేరు "తొమ్మిది డ్రాగన్ల" పేరు వచ్చింది. ఇక్కడ ఎనిమిది కొండల్ని ఎనిమిది డ్రాగన్లుగా భావిస్తారు. తొమ్మిదవ డ్రాగన్ ఆనాటి చైనా రాకుమారుడు పింగ్ అట!*

పంపివేశాడు అని మామగారు కోర్టుకు తెలియజేశారు. అప్పుడుగాని విషయం అర్థం కాలేదు జడ్జిగారికి – ఇది విడాకుల కేసని. మొదట్లోనే తాను తీర్పు యిచ్చివుంటే కాపురం నిలిచేది అని.

నేలని – నీటిని నమ్ముకుని వున్న ఎన్నో గ్రామాలు – కుటుంబాలు మనకు కౌలూన్ దాటి 'న్యూటెరిటిరీస్' (కొత్త ప్రాంతాలు) వెళితే తారసపడతాయి. పెద్ద రెల్లు టోపీ, గేదెలు, దున్నలు, వరిచేలు మీకు దర్శనమిస్తాయి. ఎన్నో రకాల చైనీస్ భాష – ముక్కుతో పలుకుతారు – వత్తులు వుండవు – సరళంగా సంగీతంలా సాగిపోతుంది – ముఖ్యంగా ఆడవాళ్ళు మాట్లాడే సమయంలో. హార్బర్ దాటించే స్టార్ ఫెర్రి భారతీయులదే. వంద సంవత్సరాల నుంచి నడుస్తోంది. హార్బర్ ఇరు ప్రక్కలా ఆకాశహర్మ్యాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనం – బ్యాంక్ ఆఫ్ అమెరికా టవర్, ప్యూరమ హోటల్ – వందలకొద్దీ అంతర్జాతీయ బ్యాంకులు – కౌలున్ పండా హోటల్, నాతన్ రోడ్, ఇండియా మార్కెట్, వాల్డ్ నగరం (Walled City) మాఫియాలకు, మత్తుమందులకు ఆలవాలం. లెక్కలేనన్ని డైమండ్ ఫ్యాక్టరీలు, మైలు పొడవు షాపులు, ఫాషన్ షోలు, సూట్ మేకర్స్, అంతులేనన్ని డ్యూటీ ఫ్రీ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీదారులు – ఇలా ఎన్నో, ఎన్నో... హాంగ్‌కాంగ్‌లో బిల్డింగ్ కట్టాలంటే ఉన్న స్థలం అంతా ఉపయోగించాలి. (మనకు సగానికి పైగా వదలాలి అనుకోండి.)



Hong Kong's chaotic Kowloon Walled City,
once the most crowded place on earth



ఎమరాల్డ్ హోటల్ హాంగ్‌కాంగ్ సెంట్రల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్నది. అక్కడ దిగాను. ఇక్కడ వుంటే ఈ దీవి పూర్వాపరాలు బాగా తెలుస్తాయి. ఒక ప్రక్క చైనావాళ్ళ అపార్ట్‌మెంట్‌లు– బైట బట్టలు వేలాడదీసి ఆరబెడతారు – ఇంకో ప్రక్క గ్రైనేట్ బిల్డింగులు – ట్రామ్‌లు ఏ.సి.బస్‌లు – క్రొత్త టాక్సీలు ఈ విధంగా అన్నీ విరుద్ధంగా – కలసి కదలిపోతుంటాయి. మా గైడ్ 8.30కి వచ్చి నా రూమ్‌కి ఫోన్ చేసింది. దిగివచ్చి – అడిగాను – ఎక్కడ వుండేది. ఎలా వచ్చావు అని – 50 మైళ్ళ దూరం నుంచి – యం.టి.ఆర్ (భూగర్భ రైలు)లో వచ్చి అక్కడ నుండి హోటల్‌కి బస్‌లో చేరి 8.30కు రిపోర్టు చేసింది. ఇలా అందరూ – పంక్చువల్‌గా వుంటారు– చెపితే – మాటకు నిలబడతారు. వస్తాము అని రాకుండా వుండటం – ఆ తర్వాత కుంటిసాకులు చెప్పడం వుండదు –గైడ్ పేరు లీ. ఎన్నో విషయాలు తెలియజేసింది – ఎన్నో ప్రదేశాలు ఓపిగ్గా చూపింది – లౌకిక సౌఖ్యానికి భాష్యం చెప్పే వీరి జీవన విధానం ఇకముందు మాత్రం ఈ విధంగా ఉండబోదు. తియాన్మెన్ స్క్వేర్‌లో జరిగిన దారుణ మారణకాండ తాలూకు నెత్తుటి మరకలు తలుచుకుంటూ అరవయి లక్షల జీవితాల వర్తమానాన్ని ఆ బహుళజాతి భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేసే హక్కు అగ్రరాజ్యాలకి ఎవరిచ్చారని అడగాలని – ఓషన్ పార్కులోని డాల్ఫిన్‌లా అరవాలని అనిపిస్తుంది.



థాయ్ నృత్య నాటకం



చైనీయులు

మలేషియా

సారవాక్‌లో ఉన్న నియా సున్నపు గుహలలో 50 వేల సంవత్సరాల నాడు మనిషి తిరుగాడిన గుర్తులు దొరికాయి. మలేషియా ద్వీపకల్పం కొండలలో తిరిగే ఆది మానవులను ఇప్పుడు చూస్తే, అది నిజమనిపిస్తుంది. ఇప్పుడున్న మలయ్ ప్రజలకు ఈ నేలకు ఏమాత్రం సంబంధం లేదనిపిస్తుంది. ఒకప్పుడు ఫూనన్ రాజ్య భాగంగా (ఇప్పుడు కంబోడియా) ఉన్న మలయ్ ద్వీపకల్పం, 7వ శతాబ్దపు మొదటి భాగంలో సుమరతా రాజధానిగా వెలుగొందిన శ్రీ విజయ సామ్రాజ్యాధికారం చేరింది. అప్పుడు ఈ దక్షిణ చైనా సముద్రంలో ఉన్న ఎన్నో దీవులు, ద్వీపకల్పాలు శ్రీ విజయ సామ్రాజ్యంలోని భాగాలే. తర్వాత ఏడువందల సంవత్సరాలకు శ్రీ విజయ వంశపు యువరాజు పరమేశ్వర, మజపాహిత్‌తో జరిగిన యుద్ధంలో ఓడిపోయి, పారిపోతూ మలక్కాలో క్రొత్త రాజ్యాన్ని స్థాపించాడు. ఆ తర్వాత ఆయన తెలియని రోగంతో బాధపడుతూ ఎన్నో వైద్యాలు చేయించాడు. చివరికి ఒక ముసల్మాను ఫకీరు ఆయన రోగం తగ్గించగలిగాడని, అందుకే తానే కాకుండా మొత్తం ప్రజలందరినీ ఇస్లాం మతంలోకి మార్పించాడని అంటారు. దీనిలో నిజం వుందో లేదోగాని, బంగాళా ఖాతపు అంచులలో



జెంటింగ్ ఐలాండ్

వున్న యీ దేశానికి ఇస్లాం రావటం – అందునా మంగోలియా – చైనా, భారత జాతులు – ఆ మతాన్ని స్వీకరించడం వింతగానే వుంటుంది. ముందు పోర్చుగీసు (1509) తర్వాత డచ్ (1641) కాలనీలు వెలిసి వ్యాపారం చేశాయి. బంగాళాఖాతం – చైనా సముద్రం సంగమంగా – ఎన్నో ద్వీపాలున్నాయి. అందులో పెనాంగ్ ద్వీపం చాలా ముఖ్యమైనది.

సరిగ్గా అప్పుడే భారతీయులు (ఎక్కువగా విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి), చైనీయులు ఎక్కువగా కూలీలుగా వచ్చారు (తెచ్చారు అనుకోవచ్చు). 1824లో పూర్తిగా ఇంగ్లీషు వారి ఆధీనంలోనికి వచ్చింది. 1909లో మలేషియా రాష్ట్రాలు ఒక దేశంగా రూపు చెందాయి. 1942 నుంచి 1948 వరకు జపాన్ ఆక్రమణలో వుండి, 1948లో మలేషియా ఫెడరేషన్ అయింది. సరిగ్గా అప్పుడే కమ్యూనిస్టుల బారి నుండి తప్పుకోవటానికి అత్యవసర పరిస్థితి పెట్టారు. 1960 వరకూ ఆ అత్యవసర పరిస్థితే కొనసాగింది. 1965లో మొదటసారిగా ఎన్నికలు పెట్టి – తుంకు అబ్దుల్ రహమాన్ సారథ్యంలో స్వాతంత్ర్య సాధించుకున్నారు. ఇక్కడ బ్రిటిష్ వాళ్ళు రబ్బరు ప్లాంటేషన్, తగరపు గనులు విపరీతంగా సొమ్ము చేసుకోటానికి ఉపయోగించుకున్నారు. అప్పట్లో 'బ్రూక్' కుటుంబాన్ని 'వైట్ రాజా'లు అని కూడా పిలుస్తుండేవారు. మలేషియాలో సారవాక్, సింగపూర్ 1965 వరకూ భాగంగానే వుండి "65లో సింగపూర్ విడిపోయింది. గత పాతిక సంవత్సరాలలో ఇక్కడి జాతులన్ని కలసి అబ్దుల్ రజాక్, డా॥ మహతిర్ మహమ్మద్ పాలనలో ఎంతో అభివృద్ధి సాధించి– దేశాన్ని ప్రగతిబాటలో నడిపాయి. ప్రకృతి సంపద, సౌందర్యం – ఆకుపచ్చని సముద్రం, దట్టమైన అడవులు, చక్కటి, చల్లటి వాతావరణం, పుష్కలంగా వర్షాలు – తోటలు, టేకు, రబ్బరు, తగరపు రేకు అంతులేని బీచ్‌లు – కొబ్బరి తోటలు, ఇలా ఎన్నో వనరులున్న మలేషియా దేశాన్ని ఎటునుంచి చూసినా – ఒక అందమైన పాతికేళ్ళ యువతిని చూసినట్లే వుంటుంది. పేరుకు ఇస్లాం కాని – వీరి మలయ్ సంతతి, చైనీయుల ప్రభావం – భారతీయుల పురాణాలు మీకు అడుగడుగునా కనబడుతూనే వుంటాయి. ఇస్లాం బురఖాలో బొట్టుపెట్టుకుని జీన్ పాంట్స్‌తో వున్న మలయ్ యువతులను మీరిక్కడ చూడవచ్చు.

కౌలాలంపూర్

1859లో ఇదంతా బురద ప్రాంతం – (అదే అర్థం కూడా). ఇప్పుడు ఒక పూల తోటలాగా, ఒక నందనవనంలాగా మలిచారు. సుభాంగ్ ఎయిర్‌పోర్టు నుంచి సిటీకి వస్తుంటే మీరు చూసేది పూలతోటలే, రబ్బరు దారులే – ఎటు చూసినా పచ్చని చెట్లు – మీరు హోటల్ ముందుంటారు. ఇక హోటళ్లు – తీర్చిదిద్దినట్లు ఇప్పుడే కట్టి రంగులు వేసినట్లు పెళపెళలాడుతుంటాయి. సిబ్బంది నవ్వుతూ వుంటారు. కాని – అంత కలుపుగోలుగా వుండరు. ఇక్కడ ఆడవాళ్ళు పనిచెయ్యడం తక్కువే. మన యాత్ర పెనాంగ్ దీవితో మొదలుపెడదాం.

కన్నీటి బిందువులా కనపడే ఈ దీవి బంగాళఖాతానికి తూర్పు అంచున వుంటుంది. ప్రశాంతంగా ఏ మాత్రం రద్దీలేని దారుల్లో, పూర్వపు వలస వాసనలు పూర్తిగా పోయినా, పాతకాలపు కట్టడాలు, ఆనవాళ్ళు అక్కడక్కడా వున్నాయి. ఇక్కడి ప్రజలు ఎంతో తాపీగా తమ తమ పనులు చేసుకుపోతుంటారు. అందుకేనేమో, దేశంలో రిటైరైన వాళ్ళు ఎక్కువగా ఇక్కడకు వచ్చి నివసిస్తుంటారు. పెనాంగ్ కొండపై నుంచి చూస్తే మీ ముందు ఒక అద్భుత దృశ్యం కనపడుతుంది.



మలేషియా మ్యూజియం

పూర్తిగా చెట్లతో కప్పబడిన నేలపై అక్కడక్కడ ఎర్రటి టిన్‌రేకు కప్పులు కనపడతాయి. ఎమరాల్డ్ గాజుల్లో కెంపులు పొదిగినట్లు సముద్రం – ఇంకొంచెం తూర్పుగా చూస్తే ఆ సముద్రం మీద దీవిని, ప్రధాన భూభాగాన్ని కలుపుతూ కట్టిన అందమైన అద్భుతమైన బ్రిడ్జి – ఆకుపచ్చని చీరకు పెట్టిన బోర్డరు కనపడుతుంది.

ఈ దీవిలో ట్రాఫిక్‌ని ఆడ పోలీసులే సరి చూస్తుంటారు. సరే ఈ బే్రిడ్జి మీదనుంచి మలేషియా భూభాగాన్ని చేరదాం. ఈ బ్రిడ్జి మధ్యలో విడిపోతుందండోయ్– నౌకలు ప్రయాణం చెయ్యడానికి వీలుగా. ముందుగా తూర్పు తీరం వెళ్దాం – ఇక్కడ ప్రకృతి – ఎవరూ ముట్టుకోని పూవులా వుంటుంది. ఇక్కడి బీచ్‌లో అడుగులే కనపడవు. సముద్ర జలాలు లేత ఆకుపచ్చగా వుండి లోపలి చేపలు కనపడుతుంటాయి. రంగురంగుల 'కోరల్' రాళ్లు, పరావర్తనం చెందిన పగటి వెలుగులో వింతగా కనపడతాయి. వెయ్యి కిలోల బరువున్న తాబేళ్ళు వందగుడ్లు పెడతాయి – అంతులేని కొబ్బరి చెట్లు గాలికి ఊగుతూ ఈల పాటలు పాడుతూ – ప్రపంచంలో ఏ చీకూ చింతా లేనట్లు ఆడుతుంటాయి. సముద్రపుటంచు వదిలి దేశంలోనికి ప్రవేశిస్తే రబ్బరు తోటలు మైళ్ళకొద్దీ పరుచుకుని వుంటాయి. ఇంకా పామాయిల్ తోటలు వేల ఎకరాల్లో పంటనందిస్తుంటాయి. ఇక్కడి దట్టమైన అడవులు (రైన్ ఫారెస్ట్) వేల వేల ఎకరాలకు పరచుకుని, ఎన్నో రకాల కీటకాలు – పక్షులు, జంతువులకు నిలయమై వుంటాయి. అంతులేని టేకు సంపద వీరి సొంతం. ఈ అడవులలోని సీతాకోక చిలుకలు, రంగు రంగుల పురుగులు, తేళ్ళు – మండ్రగబ్బలు, ఇవన్నీ వీరు పోగుచేసి (అవి చచ్చిపోయిన తర్వాత) పేపర్‌వెయిట్‌లు, గడియారాలు, వాచ్‌లు ఎన్నో వస్తువులను అలంకరించి అమ్ముతారు. ఇక కొండచిలువలు ఎన్ని రకాలు వున్నాయో అంతులేదు. వాటితో ఎంతో రుచికరమైన సూప్ చేస్తారు. ధైర్యం వుంటే రుచి చూడవచ్చు. మళ్ళీ కె.ఎల్. చేరదాం. కె.ఎల్ అంటే కౌలాలంపూర్ అన్నమాట.

కె.ఎల్ దగ్గర్లో ముందుగా చెప్పిన సున్నపు కొండలు, అందులో గుహలు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుహలు వున్నాయి. ఎంతో ఎత్తుకు మెట్లమీదుగా ఎక్కాలి. అక్కడ నుంచి గుహల్లో అడుగుపెట్టినట్లే. సున్నపు కొండలలోని గుహల లోపల చిక్కని వెలుతురు తెల్లగా వుంటుంది. ఒక రకమైన ఘాటువాసన

వస్తుంటుంది. పైనుంచి నీటి ధారలు పడి వింత ఆకారాలుగా ఘనీభవించి వుంటాయి. ఇక్కడ ఒక హిందూ దేవాలయం వుంది.

'తాయిపూసల' అనే పండగ ఎంతో ఆర్భాటంగా ఇక్కడ జరుపుతారు. ఎన్నోవేలమంది యాత్రికులు ఎంతో దూరం నుండి వచ్చి ఇక్కడి ఉత్సవం చూస్తారు. నిప్పుల్లో నడవటం – శూలాలు గుచ్చుకోవడం, వళ్ళు గగుర్పాటు చెందేట్లు నృత్యాలు చేస్తారు. అన్ని రాజధానుల్లో వుండే విధంగానే కె.ఎల్.లో గూడా పార్లమెంటు హౌస్, నేషనల్ మాన్యుమెంటు, నగర మ్యూజియం, నగర స్టేడియం (పూర్తిగా ఎయిర్ కండిషన్ చేయబడిన షటిల్ స్టేడియం) ఆర్ట్ మ్యూజియం ఇలా ఎన్నో ప్రధాన యాత్రా స్థలాలు వున్నాయి. ఇక్కడ జలన్ అంటే పెద్ద రోడ్ అని అర్థం. జలన్ అంపాంగ్, జలన్ క్యాంప్ బెల్, జలన్ రాజా ఉడా – ఇలా ఉంటాయి పేర్లు. కె.ఎల్.కి 50 కిలోమీటర్ల దూరంలో ఉత్తరాన ఉన్న కొండకోనలో 5000 అడుగుల ఎత్తులో దాగి ఉంది 'జెంటింగ్ హైలాండ్' అనే అద్భుతమైన ఆటవిడుపు సముదాయం. వెయ్యి పడకల హోటల్స్, కాసినో, ఈతకొలను, థియేటర్, షాపింగ్ ఆర్కేడ్, గోల్ఫ్‌కోర్స్, బౌలింగ్ ఎల్లే ఇంకా ఎన్నో ఎన్నో – మీరు రోజువారీ వత్తిళ్ళ నుంచి తప్పుకోవటానికి, ఈ ప్రపంచాన్ని కొన్ని గంటలు మరిచిపోటాననికి– మీ బలాన్ని ప్రదర్శించటానికి, బౌలింగ్, స్విమ్మింగ్; మీ బలహీనతల్ని వదిలించుకోవటానికి – కాసినో కాష్ మిషన్లు, రౌలెట్ ఇంకా



కౌలాలంపూర్ మస్జీద్

ఇంకా – ఇక్కడ చక్కటి అవకాశం దొరుకుతుంది. నా అనుభవం చెప్తాను. కె.ఎల్. నుంచి కారులో బయలుదేరాము. ఎ.సి.కారు కదా – ఎంత వేగంగా వెళ్తుందో తెలియలేదు. ఘాట్‌రోడ్ ఎక్కే సమయం నుంచి – నా స్నేహితునికి త్రిప్పటం మొదలయింది. స్పీడు చూద్దును కదా 80 పైనే. ఎంతో వెడల్పైన రోడ్ – అయినా భయంగానే వుంది. ఇంతలో కేబుల్ కార్ స్టేషన్ వచ్చింది. ఇక్కడ ఆపమని – హోటల్ దగ్గర కలవమని కారును పంపివేశాము. కేబుల్ కారు చాలా పెద్దది. దాదాపు 30 మంది ఎక్కవచ్చు. అది తీగల మీద వేలాడుతూ పైకి వెళ్తుంటే మొదట్లో సరదాగానే వుంది. ఎప్పుడైతే క్రిందకు చూశామో – అప్పుడు అంత చలిలో చెమటలు పడతాయి – ఆ గ్లాసు కారు వూగుతుంటే – తల కడుపు తిరుగుతాయి. అదొక వింత అనుభవం. సరాసరి హోటల్ సెల్లార్‌లో దింపుతారు. ఇక్కడ నుంచి మెట్లెక్కి (చాలా వున్నాయి) హోటల్ వెనుకనుంచి – హోటల్ హైలాండ్స్ – లాబీలో అడుగుపెట్టాను. పెద్ద పెద్ద గ్లాసు డోర్స్ వేసి వున్నాయి – అప్పుడు వాటికేదో హోటల్లో పనివున్నట్లు – చల్లటి మబ్బులు ఒకసారిగా వచ్చి చుట్టి వేశాయి. సన్నటి మంచు బిందువులు ముఖాన ముద్దులు పెట్టినాయి. కొద్దిసేపు లాబీ అంతా మబ్బుల్లో మునిగిపోయింది. ఇలా రోజంతా జరుగుతూనే వుంటుంది. అతిథులకు మేఘాల ఆహ్వానం – బైటకు వచ్చి



ప్రార్థనా మందిరం

చూశాము. 18 అంతస్తుల హోటల్ – పైన రివాల్వింగ్ రెస్టారెంట్ కాసినో – కాని ఆరు అంతస్తులే కనపడుతున్నాయి. మిగతావి మబ్బుల పైనే కట్టారేమో అని భ్రమ కలిగిస్తాయి.

కాసినో గురించి చెప్పి ముగిస్తాను.

18వ అంతస్తులో వున్న కాసినో – అది వేరే లోకం – అందులో అడుగు పెట్టాలంటే – మీకు 18 ఏళ్ళు నిండాలి. మీ జాతీయ దుస్తులుగాని, సూటు, బూటుగాని, లేక బతిక్ చొక్కాగాని లేకుండా రానివ్వరు. ఇప్పుడు లోనికి రండి. అన్ని టేబుల్స్ దగ్గర చక్కని అమ్మాయిలు బతిక్ సిల్క్ దుస్తుల్లో మెరుస్తూ నవ్వుతూ ఆహ్వానిస్తారు. బ్లాక్ జాక్, రౌలెట్ డైస్, వీల్, ఇలా ఎన్నో ఎన్నో బెట్టింగ్ గేమ్స్ నడుస్తుంటాయి. డబ్బులు వస్తున్నాయా, పోతున్నాయా అని ఎవరు ఆలోచిస్తారు? మీకు ఏది ఆడడం రాకపోయినా దిగులుపడకండి – బారులు తీరి కాష్ మిషన్లు వుంటాయి. ఒక నాణెం స్లాట్‌లో వేసి లివర్ లాగటమే. అదృష్టం బాగుంటే బుట్టనిండా గలగలా డబ్బు రాలుతుంది. పోతే ఒక డాలర్‌కదా. మళ్ళీ ఆడండి – అదృష్టం వరించకపోదు.

ఇక్కడ ఎన్ని గంటలున్నా – విసుగుపుట్టదు – ఎందుకంటే ఈ చుట్టుప్రక్కల దేశాల్లో ఎక్కడా కాసినో లేదు. అందుకని చైనా మొదలు ఇండోనేషియా వరకు అందరూ వచ్చి ఇక్కడ కాసినోలో కాలం గడుపుతారు. అందుకని ఎంతో సందడి – ఎంతో అలజడి. ఆడేవాళ్ళ ముఖాలు చూడాలి. ఆశ, ఉత్సాహం, అంతలో విచారం, ఆనందం అన్నీ అలా అలా మారిపోతుంటాయి. సాయంత్రానికి సెల్లార్‌లో వున్న బౌలింగ్ ఎల్లీలో దిగి – కాసేపు ఎలా బౌల్ చెయ్యాలో చూసి, తీరా బాల్ పట్టుకుని బౌల్ చెయ్యబోతే బాల్‌తో పాటు మనం కూడా పడతాం. చూడటం తేలిక – చెయ్యటం చాలా కష్టం. కారులో క్రిందకు దిగి హోటల్‌కు చేరి – అలసి నిద్రపోతుంటే కాసినో కాష్ మిషన్ల గలగల తెల్లవార్లూ వినపడుతూనే వుంది.

ఆ తర్వాత చైనాలో భాగమైన మకావ్ పెద్ద గాంబ్లింగ్ సెంటర్ అయిపోయింది. మకాన్, లాస్‌వెగాస్ లాగా ప్రత్యేకించి కాసినోలకి గాంబ్లింకి ప్రసిద్ధి పొందింది.


ஜாதி


KOMALA'S
Your Vegetarian Restaurant
Serangoon Rd
CHINDIAN
HITACHI



కోమల విలాస్ సింగపూర్

సింగపూర్

దృఢచిత్తుడైన వ్యక్తి ప్రభుత్వాన్ని నడిపితే, క్రమశిక్షణ గల పౌరులు కష్టజీవులై శ్రమిస్తే, జాతి, మత, అంతరాలను ఎంతదూరంలో ఉంచాలో తెలుసుకుంటే ప్రకృతి ప్రసాదించిన వరాలను ఏ విధంగా భావితరాలకు బంగారు బాటగా మార్చుకోవచ్చునో, ఆరోగ్యకరమైన ఆర్థిక ఆంక్షలు ఏ విధంగా సంపన్నులకు దోహదం చేస్తాయో, యువతరానికి క్రమశిక్షణ అలవడటానికి అవకాశం ఎక్కడవుందో, ప్రజలంతా ఒక దేశ పౌరులుగా ఎలా రూపుచెందాలో తమ దేశం బలమేమిటి, బలహీనతలేమిటి అంచనాలువేసి ముందుకు సాగితే ఎంత చిన్న దేశాన్నయినా అగ్రదేశాల సరసన నిలబెట్టవచ్చునని, సింగపూర్ నిరూపించింది.

ప్రకృతిసిద్ధంగా వున్న సింగపూర్ హార్బర్ – నౌకల రాకపోకలకు, సరుకుల రవాణాకు, తూర్పు పడమరలకు – ఉత్తర దక్షిణాలకు ప్రధాన ద్వారమై, విపరీతమైన రాబడిని తెచ్చిపెడుతుంది. దాదాపు ఊరికే – లేక తేలికగా – వచ్చిపడుతున్న ఈ డాలర్ల ధాటికి, ఎన్నో దశాబ్దాలుగా వున్న సంస్కృతులు బుల్‌డోజర్ల క్రిందపడి దుమ్ములో కలిసిపోతే, అద్దాల మేడలు, కాంక్రీటు గోడలు, ఆకాశహర్మ్యాలు – ఇవేపైకి లేచాయి. ఏ వైవిధ్యాన్ని చూడాలని ఐరోపా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల నుంచి యాత్రికులు వచ్చారో, వారికి ఈ కాంక్రీటు కట్టడాలు కంటగింపుగా కనపడి, రావటం తగ్గించారు. అప్పుడు, సింగపూర్ పర్యాటకశాఖ, ప్రభుత్వం చేసిన తప్పులు తెలుసుకుని, మళ్ళీ అన్ని సంస్కృతుల చిహ్నాలను యధావిధిగా నిలబెట్టి తీర్చిదిద్దాయి. “ఎమరాల్డ్ హిల్” ప్రాజెక్టు క్రింద ప్రాచీనమైన తీరుతెన్నులు– పెంకులు, అలంకరణతో, ‘పెరాంకన్’ సంస్కృతి ప్రాచీన (మలయ్ – చైనా) చిహ్నాలైన ఆరు పాతకాలపు కట్టడాలను తీర్చిదిద్దారు. అధునాతనమైన ఆర్చిడ్‌రోడ్‌లో – ఇవన్నీ షాపింగ్ హౌస్‌లే. అంతేకాక, భారతీయ సంస్కృతికి సంబంధించిన “హిందు టెంపుల్”, చైనా టౌన్, అరబ్ స్ట్రీట్‌లను కూడా యథావిధిగా వుంచారు. ఇంకా నగరం అంతా చెట్లు, పూల తోటలతో నింపి, ఉద్యానవనంలా చేశారు. డ్యూటీ ఫ్రీ పోర్టు చేసి, కావలసినన్నీ కారుచౌకగా అందేట్లు చేస్తున్నారు. మళ్ళీ పర్యాటకులు తండోపతండాలుగా రావటం

సాగించారు. ప్రపంచంలో రెండో 'బిజీ' పోర్టు సింగపూర్, ఇక్కడ ఇన్‌కంటాక్సు 40%. జీవన వ్యయం ఎక్కువే. ప్రభుత్వం చాలా కఠినమైనదే కాని మీకు అడ్డురాదు. ఎలక్ట్రానిక్ పరికరాలు తయారుచేయటం, ఆయిల్ శుద్ధి చేసి అమ్మటం, విమానయాన సంబంధమైన పరికరాల వ్యాపారం చాలా ఎక్కువ.

ప్రపంచ ప్రఖ్యాతమైన హోటళ్ళు మీకోసం పెళపెళలాడుతూ సిద్ధంగా వుంటాయి. ప్రాచ్య సంప్రదాయ అతిథి మర్యాదలతో – అధునాతనమైన గదుల అలంకరణలతో లౌకిక సుఖాలకు క్రొత్త అర్థాలు చెప్తాయి. ఈ రోడ్లు నిగనిగలాడుతూ గుంటలు – గోతులు లేకుండా వుంటాయి. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటానికి ముందునుంచి ఎన్నో రకాల నియంత్రణలతో జాగ్రత్తలు తీసుకోవటంతో, ప్రజల రోజువారీ జీవితం సుఖమయంగా, అర్థవంతంగా (ఎవరు, ఎందుకోసం, ఎంతవరకూ కష్టపడుతున్నారో) జరిగిపోవటానికి ఎటువంటి అంతరాయం ఉండదు. నేరాలు జరగటంకాని, నేరచరితులు (ఎక్కడైనా వుంటే) తలెత్తడంకాని మీరు చూడరు. హాయిగా, ఆనందంగా సింగపూర్ చూడండి.

చరిత్ర:

'తెమ్‌సెక్' అని పురాతనమైన పేరుగల ఈ ద్వీపం (సముద్రపట్నం అని అర్థం) అంత ఘనచరిత్ర గలిగినదికాదు. యువరాజు "నీల ఉత్తమ" సముద్ర తుఫానులో చిక్కుకుని, ఈ ద్వీపతీరం చేరినపుడు ఆయనకు ఎర్రని వెలుగులు విరజిమ్ముతూ ఒక సింహాకారం కనిపించింది, అందుకని ఇది 'సింగపూర్' అయ్యింది. "నీల ఉత్తమ" యువరాజు భారతీయ సంతతికి చెందినవాడు కావటం – ఆ సంస్కృతి ప్రభావంతో "సింహ దర్శనం" జరిగిందేమోగాని, ఈ ప్రాంతంలో ఎప్పుడూ సింహాలు సంచరించిన దాఖలాలు లేవు. ఒకనాడు శ్రీవిజయన్ సామ్రాజ్య భాగమైన మలేషియాలో ఉన్న 'సింగపూర్' కొన్నాళ్ళు థాయి పాలనలో కూడా – కేవలం చేపల దీవిగానే వుండిపోయింది. ఈస్టిండియా కంపెనీకి సంబంధించిన స్టాంఫోర్డ్ రాఫిల్స్ 1819లో ఈ ద్వీపాన్ని నేల అద్దెకు తీసుకుని వ్యాపార కూడలి ప్రారంభించాడు. హార్బరు ప్రకృతిసిద్ధమైనది కావటం మూలంగా, ఎంత పెద్ద నౌకలైనా వచ్చి ఎగుమతి దిగుమతులకు ఎంతో అనుకూలంగా వుండేది. వ్యాపారంతో మొదలయి ఈస్టిండియా వ్యాపారం అన్ని చోట్లవలెనే,

బ్రిటిష్ నావికా బలగానికి నిలయమై సైనికపరమై ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. 1942లో జపాన్ ఆక్రమణకు గురై, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మళ్ళీ వ్యాపార లావాదేవీలు ముమ్మరమైనాయి. 1959లో లీ కువాన్‌యూ సింగపూర్ ప్రావిన్సుకు ప్రధాని అయ్యాడు. PAP పార్టీ అధినేతగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పిదప, మలేషియా నుండి విడిపోయి సింగపూర్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. ఆ తర్వాత బ్రిటిష్ కామన్‌వెల్త్‌లో చేరి ప్రగతిపథంలో పరుగులు తీసింది. 'సింగపూర్' ద్వీపం 42 కి.మీ × 23 కి.మీ. విస్తీర్ణంతో భూమధ్య రేఖకు 83 కి.మీ ఉత్తరంగా కూర్చుని ఉంటుంది.

ప్రజలు:

చైనీస్, మలయ్, భారత్, ఆగ్నేసియా జాతులన్నీ సింగపూర్ నివాసులై వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడి తమ వంశ వృక్షాలను, తమతమ సంస్కృతుల కనుసన్నల్లో పెంచి తమ వ్యక్తిత్వం నిలుపుకుంటూనే, సింగపూర్ పౌరులుగా రూపుచెంది, తమ దేశాన్ని సంపన్న దేశాల సరసన నిలబెట్టగలిగారు. PAP అధినేత, ప్రధాని లీకువాన్ పాతిక సంవత్సరాలు కఠోర తపస్సు లాగా ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపి – ప్రజలను ప్రగతి మార్గంలో పరుగులెత్తించి, ఒక జాతిగా, ఒక దేశంగా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూనే, ఆదర్శప్రాయుడై ప్రపంచ రాజకీయ నాయకులకు దీటు కాగలిగాడు. ఒక చిన్న ద్వీపాన్ని అగ్రరాజ్యాలు సైతం గౌరవించే స్థితికి తీసుకువెళ్ళాడు.

సింగపూర్‌లో ఎవరైనా చైనీ, మలయ, భారత సంతతి వారెవరైనా – సింగపూరియన్‌గానే చలామణి అవుతారు. గర్వంగా చెప్పుకుంటారు. ఇంటర్ తర్వాత రెండు సంవత్సరాలు ప్రతి విద్యార్థి – సైనిక శిక్షణ పొందవలసిందే. వీరి క్రమశిక్షణకు ఇదే మూలకారణం. అన్ని విధాలుగా పాశ్చాత్య నగరంలా కనువిందు చేసే సింగపూర్ – అంతర్లీనంగా (ఓరియంటల్) పాశ్చాత్య పారిశ్రామిక రుగ్మతలకు దూరంగా ఉంచగలిగింది. సిగరెట్ పీకలను రోడ్డుపై వేయటమే పెద్ద నేరంగా పరిగణించే కట్టుబాట్లు, ఇక డ్రగ్స్‌లాంటి మాదక ద్రవ్యాల గురించి ఆలోచించటానికే ప్రజలు భయపడతారు.

చాంగీ ఎయిర్‌పోర్టు:

ప్రపంచంలోని అన్ని దేశాల విమానాలు వచ్చి వాలే ఈ సుందరమైన

విమానాశ్రయం చూడటానికే సింగపూర్ వెళ్ళి రావచ్చు. ఎప్పుడు చూసినా ఇది ఇప్పుడే కట్టారా అనిపించేలా విమానాశ్రయం ధగధగ మెరిసిపోతూ కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది. సింగపూర్ సివిల్ ఏవియేషన్ సిబ్బంది పనితనానికి మెచ్చి చైనా ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు మెయింటెనెన్సు వారికే అప్పగించారు. 15 సింగపూర్ డాలర్ల వీడ్కోలు రుసుము వసూలు చేసే ఈ విమానాశ్రయం ఆదాయం 14 మిలియన్ల డాలర్లు. వీరి దేశ సౌభాగ్యానికి ఈ సంపాదన కూడా ఒక కారణం. ఎయిర్‌పోర్టు నుంచి పట్టణానికి వెళ్తుంటే, మీరు ఏదో తోటలో, పచ్చని చెట్లు మధ్యనుంచి – రంగురంగుల పూల తోరణాల ప్రక్కనించి కదిలిపోతున్నట్లు అనిపిస్తుంది. ప్రతి బిడ్డి ఒక 'ఆర్ట్‌పీస్'లా అనిపిస్తుంది. కాని అంతా ఆధునికంగా తీర్చిదిద్దటంతో – మీకు చారిత్రకమైన పరిమళాలు గాని – సంస్కృతిపరమైన సువాసనలు గాని అంతగా అనుభవంలోనికి వెంటనే రావు. అయినా క్లీన్‌గా – నీట్‌గా ఒక మోడల్‌గా కనిపించే సింగపూర్, ఈనాటి పర్యావరణ కాలుష్యాన్ని అల్లంత దూరంలో ఉంచగలగటం మీరు గమనించవచ్చు.

దర్శనీయ స్థలాలు:

ఈ చిన్న దీవిలో చూడటానికి ఏముంటాయిలే అనుకుంటే పొరపాటే. మీరు దిగిన హోటల్ దగ్గర్నుంచి అది పది డాలర్లు కానీయండి – 300 డాలర్ల హోటల్ కానివ్వండి. బయటకు వస్తే అన్నీ విశేషాలే – అల్ట్రా మోడరన్ షాపింగ్ కాంప్లెక్సులు, అధునాతనమైన బ్యాంకులు, ఖరీదయిన హోటళ్ళు, విడిది చేసినట్లు వుండే ఆర్చర్డ్ రోడ్ గ్లాస్ ఎలివేషన్లు, గ్రానేట్ ఫాకేడ్స్ అద్దాల ముఖాలు మబ్బుల్ని తమతో తిప్పుకుంటాయి. గుట్టలు గుట్టలుగా బట్టలు రాసులుపోసి, రంగు రంగు డిజైన్లతో అమ్మకానికి 'హైస్ట్రీట్'లో వుంటాయి. ఇది వీధి కాదండి ఒక షాపింగ్ కాంప్లెక్సు. సంగీత శబ్దాలతో హోరెత్తించే ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు, హైఫిలు, C.D., VCD హోం థియేటర్ ఏపేరయినా కానీండి – మిమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసి, అవసరం లేకపోయినా కొనిపించేంత కారు చౌకగా అందించే "సిమ్‌లిమ్" (Sim Lim) టవర్స్ భారతీయులకు ప్రత్యేకంగా వున్న సెరంగూన్ రోడ్, 'లిటిల్ ఇండియా' లోని షాపులు, కోమల విలాస్, ఉడ్‌లాండ్, అన్నపూర్ణ రెస్టారెంట్లు, హిందూ టెంపుల్, చైనా టెంపుల్, అరబ్ స్ట్రీట్, మీకు వినోదం కలిగించే జురాంగ్ బర్డ్ పార్కు, మ్యూజిక్ ఫౌంటెన్లు,

బొటానికల్ గార్డెన్లు (ఆర్చర్డ్ పూలకు ప్రసిద్ధి) ఓషన్ పార్కు ఎన్నోవేల చేపల రకాలతో నిండి – మిమ్మల్ని నీటి అడుగునకు తీసుకువెళ్ళి పైన షార్కులను తిప్పి ఆశ్చర్యపరుస్తుంది.

అలా మౌంట్ ఫేబర్‌కు వెళ్తే – ఊరంతా మీముందు సోయగాలు పోతుంది. అక్కడ టీ సేవించి దూరంగా ఆగిన టాంకర్లు సూపర్ టాంకర్లు బారులు తీరి, ఇండోనేషియా వరకూ నిలబడి ఉంటాయి బైనాక్యూలర్‌లో చూడవచ్చు. ఒక టోపి (ఈత ఆకులతో పేనినవి) కొని కేబుల్ కారెక్కి, సెంటాసా దీవికి వెళ్తే ఇక ఆటవిడుపే, మోనో రైలు, వింత రైడ్లు, ఒక ప్రక్క తెల్లని బీచ్, సావనీర్స్, ఒకటేమిటి అలా తిరిగి తిరిగి సాయంత్రానికి మ్యూజికల్ ఫౌంటెన్స్ దగ్గరకు చేరి – రంగు రంగుల వయ్యారాల నృత్యం చేసే నీటి తుంపర్లను చూసి కేరింతలు కొట్టే చిన్న, పెద్దలు. సాయంత్రం వెలుగు ఉండగానే వాక్స్ మ్యూజియంలో చూస్తే రెండవ ప్రపంచ యుద్ధకాలంలోని సంఘటనల ప్రతిరూపాలు నిలువెత్తు మైనపు బొమ్మలు చల్లని గదుల్లో కొలువుతీరి చరిత్ర పాఠాలు చెప్తాయి. బోటు ఎక్కి హార్బర్ దాటి వరల్డ్ ట్రేడ్ సెంటర్ దగ్గర్లో ఒడ్డుపట్టి అంతులేని దీపాల వింత కాంతుల్లో మెరిసిపోయే రహదారుల వెంట నిర్భయంగా మీ హోటల్ చేరి చక్కని ఆంధ్ర భోజనం చేసి, సెరంగూన్ రోడ్‌లో తాంబూలం సేవించి సైకిల్ రిక్షా ఎక్కి షికారు చెయ్యవచ్చు. ఇంకా, బంగారు నగలు, బట్టలు, డైమండ్స్, ముత్యాలు చౌకగా బేరం చేయవచ్చు. సింగపూర్‌లో రాత్రి సరదాలు తక్కువే. బీర్ మగ్గులో పోసుకుని; (పది గ్లాసులు పడుతుంది.) డిస్కోతెక్‌లో కూర్చుంటే రాత్రి పన్నెండు వరకు మ్యూజిక్ వింటూ కాలం గడుస్తుంది. ఓపిక ఉంటే, బాల్ డాన్సులో కాళ్లు తొక్కవచ్చు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేస్తూ, ప్రజల దగ్గర నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన సంపదను, ఆ ప్రజల శ్రేయస్సు కోసం ఖర్చు చేస్తూ, దేశాన్ని యువతరాన్ని ప్రగతిబాటలో ఏవిధంగా నడపాలో 'సింగపూర్'ను చూసి నేర్చుకోవాలి ఈనాటి మన రాజకీయ నాయకులు. జపాన్‌లో ప్రభుత్వం సంపన్నంగా ఉంటుంది. ప్రజలు కార్మికులే – కష్టజీవులే. అమెరికాలో ప్రజలు సంపన్నులు. ప్రభుత్వం అప్పులపాలే ఎప్పుడూ.

భారత్‌లో – సగం ప్రజలు ధనవంతులు మిగతా సగంతో పాటు ప్రభుత్వం కూడా దరిద్రరేఖకు క్రిందనే కొట్టుమిట్టాడుతుంటుంది, ఎన్ని పన్నులు వేసినా



సింగపూర్‌లోని హిందూ దేవాలయం

కాని. సింగపూర్ ప్రభుత్వం ఖచ్చితమైన ఆర్థిక విధానాలతో, క్రమశిక్షణ, పొదుపుతో తనతోపాటు, ప్రజలను కూడా సంపన్నులను చేసి భావితరాలకు బంగారు బాట వేసింది.

సింగపూర్ ప్రభుత్వం ఎంత కఠినమైనది? ఈ ఉదాహరణలు చాలు:

సింగపూర్ యూనివర్శిటీ – క్రమశిక్షణకు మారు పేరు. అక్కడి ఫారిన్ విద్యార్థులలో ఒక అమెరికన్ తన బుద్ధిపోక – ఒకరోజు బట్టలు ఊడతీసి కాంపస్‌లో నడిచాడు (ఇదోరకం స్వతంత్ర భావ ప్రకటన) అక్కడి రూల్ ప్రకారం అతని పిర్రలు వాయకొట్టటం శిక్ష. కాని ఇది ఇలా ఇక ముందు జరగరాదని – అతన్ని అందరి సమక్షంలో శిక్షించటానికి ప్రభుత్వం నిర్ణయించింది. పేపర్లు, టి.వి.లు గోలపెట్టాయి. ఆనోట ఈనోట, అమెరికా ప్రెసిడెంటు చెవిలో పడింది. సింగపూర్ లాంటి చిన్న దేశంలో ఒక అమెరికా పౌరుణ్ణి బహిరంగంగా శిక్షించటమా? ప్రధాని 'లీ'కి కబురు చేశారు. ఆపమని– కాని ఆయన 'లీ' కదా. సారీ ప్రెసిడెంట్, మా దేశంలో రూల్స్ అమలు చేయటానికే. అని అన్ని టి.వి.కెమెరాల ముందు అతనికి శిక్ష అమలు చేశారు. అంత పెద్ద అగ్రరాజ్యం ముక్కున వేలేసుకుని మౌనంగా ఉండిపోయింది. బహుశా ఇలాంటి శిక్షలు అమెరికాలో కూడా అమలు చేస్తే పిల్లలు బాగుపడతారని లోలోన అనుకుని వుంటారు!

నెలవంక నేల

దుబాయి – షార్జా:

బొంబాయిలో ఎక్కిన ఎయిర్ ఇండియా విమానం – మద్రాసు మీదుగా దుబాయి చేరే సమయానికి – ఎడారిలో పెళ్లి జరుగుతున్నట్లు అంతా పసుపు దీపాలతో వెలిగిపోతోంది. ఎయిర్‌పోర్ట్ – అప్పుడే చెక్కిన వజ్రంలా మెరుస్తోంది. లాటరీలో కారు వస్తుందేమోనన్న ఆశతో 150 దార్హామ్‌లతో టిక్కెట్టుకొని బి.ఎమ్.డబ్ల్యూలు బెంజికార్లను చుట్టూ తిరిగిచూసి బైటకు వచ్చాం. నాతోపాటుగా నా స్నేహితులు, మండవ రామకృష్ణ, రసిక్‌లాల్, (వీళ్ళిద్దరూ డాక్టర్లు) నారాయణరావుగారు నాకు తోడుగా – మాకోసం ఒక అనామిక ఎదురుచూస్తోంది. అడ్మిరల్ ప్లాజా హోటల్‌లో బ్యాగేజి పెట్టి స్నానాలు చేసి వెంటనే క్రీక్ వాక్‌కి బయలుదేరాం. జనవరి రాత్రి అరేబియా గల్ఫ్ చలిగాలులు గోరు వెచ్చగా తగులుతున్నాయి. ఈక్రీక్ వాక్ తప్పక చేయాలి. అంతా ఆరుబైట రెస్టారెంట్లు కొంచెం లోపలగా– 'రెల్లు' గడ్డి పాకలు అందులో ఖర్జురాలు – ఘుమఘుమలాడే 'టీ' అందిస్తూ అందాల్ని దాస్తూ – నలుపు, ఆకుపచ్చ మేలి ముసుగులో అరేబియన్ అతివలు, కొంత వారి సంస్కృతి – మరికొంత టూరిస్టుల కోసం సరదాలు. ఆ ప్రక్కగా – రాజప్రసాదపు నమూనా గోడలు – పైన



షేకుల సోకులు

'షేక్'గారి 'మ్యూరల్'– ఆరుబయట రెస్టారెంట్లలో వేడివేడి చీకులు. 'హుక్క' గులాబి వాసనతో వెచ్చని పొగ ఊపిరి నిండిపోతుంటే – అదో వింత అనుభవం. అంతలో 'క్రీక్'లో పడవషికారు – అందులో సంగీతం, బుల్ బుల్ ఇదంతా ఏదో కథలో మాదిరి, సెల్యులాయిడ్ రంగుల కలలాగా ఉంది కదూ – ఇదే దుబాయి – హోయి!

మర్నాడు పొద్దున – లాండ్‌క్రూజిర్ అద్దెకు తీసుకున్నాం. డ్రైవర్ శ్రీలంక వలసవాసి! కొన్నాళ్లు టైగర్లతోపాటు ఉన్నాడు కూడా!

దుబాయి అంతా తిరిగాము. రాజప్రసాదం అల్లంత దూరం నుంచే చూశాం! దారి పొడుగునా, చెట్లకు నీళ్లుపోస్తూ మనవాళ్లు, కాస్త బాధగా అనిపించింది.

అద్భుతమైన బీచ్ తయారు చేసుకున్నారు. తెల్లటి ఇసుక ఎక్కడ నుంచో తెచ్చుకుని గుండ్రాళ్లు కూడా ఇంపోర్టు చేసుకుని వాళ్లకోసం, సందర్శకుల కోసం (ఎక్కువమంది లేరులెండి) బీచ్ కట్టారు. నీలిరంగు సముద్రం, తెల్లని నురుగలుకక్కుతూ అద్భుతంగా ఉంది. ఈ బీచ్‌కి ఎదురుగా ఎంతో ఖరీదయినా 'మాన్షన్లు' అన్ని సినిమా సెట్టింగులా ఉన్నాయి. ఇవి మిలినీయర్ల విలాస భవనాలు. బీచ్ చివరగా – తెల్లని గోడలతో రేకుల షెడ్డులు చిన్న కిటికీ ఇక్కడ పేదరికానికి నిదర్శనంగా ముందు చిన్న గతుకులు రోడ్డు.

ఇక్కడ పనిచెయ్యని అమీర్లు, పనిలేని గరీబులు ఉంటారని తెలిసింది!

అదే బీచ్‌కి – అయిదు కిలోమీటర్లపైన – 'షేక్' గారి తమ్ముడికి 7 స్టార్ హోటల్ ఉంది. పడవ ఆకారంలో తెరచాపతో సహా! 24 అంతస్తుపైన హెలికాప్టర్ దిగటానికి హెలిపాడ్, అద్దాల రెస్టారెంటు – ఇది సముద్రంలో అయిదు వందల మీటర్ల లోపల కట్టారు. ఎయిర్‌పోర్ట్ నుంచి అతిథులను తీసుకురావటానికి రోల్సు రాయిస్ కార్లు ఉన్నాయి! మధ్యాహ్నం నుంచి షార్జా వెళ్లాం – అక్కడ ఎక్కువగా మనవాళ్ళు ఉన్నారు. క్రికెట్టు మైదానంలోకి వెళ్లి చాలా చిన్నది, కాసేపు తిరిగాం కూరగాయల మార్కెట్లు, చిల్లర మార్కెట్లు అన్ని తిరిగి ఏమి కొనాలో తెలియక తికమకపడ్డాం.

మర్నాడు బర్ దుబాయి – అంతా డ్యూటీ ఫ్రీ చౌకబేరం, గోల్డ్ సుక్ (సుక్ అంటే వీధి) ప్రపంచంలో 5వ వంతు బంగారం ఇటు నుంచే వెళ్తుంది. తిరిగి

తిరిగి భోజనం తర్వాత 'డిజర్ట్ సఫారి'కి బయలుదేరాం – ఈ అనుభవం లేకపోతే దుబాయి ఎందుకు రావటం?

'లాండ్ క్రూజిర్' 140 కి.మీ. వేగంలో వెళ్తుంది. వంకర లేని హైవే ఎక్కడా ఊళ్లు కూడా లేవు. రోడ్డుకు రెండుప్రక్కలా – ఒంటెలు రాకుండా తీగ ఫెన్సింగ్ వేశారు. ఒక గంట పైనే ప్రయాణం చేశాము. ఒక బంక్ దగ్గర ఆపారు – ఇంకా పది లాండ్ క్రూజిర్స్ వచ్చి చేరాయి. టైర్లలో గాలి సగం తగ్గించారు. అప్పటికి సాయంత్రం నాలుగవుతుంది. మళ్లీ బయలుదేరి – కొంతదూరం రోడ్డుమీద నుంచి చూస్తే ఎడారిలో ఇసుక పొరలు పొరలు లేస్తోంది. అంతలో ఇసుక కొండలు కనపడినాయి.

అన్ని వ్యాన్లూ అటు తిప్పారు. వరుసగా పెట్టి మళ్లీ గాలి తగ్గించారు.

ఇప్పుడే మొదలవుతుంది మజా!

అంత పెద్ద లాండ్ క్రూజిర్ ఇసుక కొండలెక్కి దిగుతుంటే – తలక్రిందులవుతుంటే – పైనుంచి ఏనుగులాగా జారిపోతుంటే – తల తిరిగినట్లు– కడుపులో త్రిప్పినట్లు – ఏదో తెలియని థ్రిల్.

సాహసం మనం చేస్తున్నట్లు చక్రాలు ఇసుకలో దిగిపోతుంటే – బండి సగం వరకు ఇసుక కొండలో దిగబడిపోతుంటే – ఏమి జరుగుతుంది? ఎలా బైటకు వస్తాం? మన కళ్ళముందే ముందు వ్యాన్ పక్కకి ఒరిగిపోతుంటే పది పదిహేను వాన్లు ఐరావతాల్లాగా ఇసుక కొండలమీద వీరవిహారం చేసి అలసి ఆగిపోయాయి. అక్కడ దిగితే దిక్కుతెలీక ఇసుకలో కాళ్లు కూరుకుపోతుంటే తెల్లబోయాం. ఇక్కడ నుంచి బైటపడేదెలా అని ఆశ్చర్యం, ఆందోళన, తర్వాత అన్ని వ్యాన్లు మెల్లగా బయలుదేరి ఒకచోట సూర్యాస్తమయం చూడటానికి ఆపాం! ఈ ఎడారిలో పాపం సూర్యుడు చిన్నవాడైపోయాడు, పాలిపోయాడు,


ఎడారి సంబరం

అలాగే దిగిపోయాడు. ఎడారి అంచుల్లో చీకట్లు తరుముకొస్తున్నాయి. మా వ్యాన్లన్ని అరగంటపైగా ప్రయాణం చేసి ఒక ఇసుకలోయలోకి వచ్చాము. అక్కడ మంటలు! దుంగలు మండుతున్నాయి.

కొంపతీసి బలియివ్వరు కదా! ఇది ఆలీబాబా నలభై దొంగల కథ కాదు కదా? చుట్టూ గుడారాలు ఉన్నాయి. ఏదో మాంసం వండుతున్న వాసనలు వస్తున్నాయి. మెల్లగా మైదానంలోకి వచ్చాము. నేల బారు బల్లలు, తివాచీలు, దివాన్లు ఏర్పాటుచేశారు. మేము కూడా చిన్నపాటి నవాబుల్లా వేషం వేసుకున్నాం. కందూర వేసుకొని తలపైన చుట్టు కుదురుపెట్టుకున్నాం. మద్యపాన నిషేధం లేదు. అంతలోనే దీపాలు ఆరిపోయాయి. అరేబియన్ 'బెల్లి' బొడ్డు నాట్యం ఉధృతంగా మొదలుపెట్టింది. చుట్టూ చేరాం. అందర్నీ ముగ్గులో దింపింది. ఆ తర్వాత అంతా కోలాహలం, కోలాటం, ఒక గంటన్నర ఏకధాటిగా సాగింది. ఏదో ట్రాన్సులో పడినట్లు చిన్నాపెద్దా, ఆడమొగా ఆ 'బెల్లి'తో వీరంగం వేశారు. తర్వాత 'బార్బెక్యూ' బిర్యాని ఎడారి గొర్రె, అదొక వింతైన విందు! ఎడారిలో ఏదారి తెలియని లోయలో అరేబియన్ నైట్! ఎప్పుడో అద్మర్‌లికి చేరాం! ఆ మర్నాటి సాయంత్రం – దుబాయి పోర్టుకు వచ్చి 'ఓషన్ మెజిస్టిక్' లోనికి ప్రవేశించాం!

దుబాయిలో చూడాల్సినవి:

దుబాయి మ్యూజియం – 'ఫహిది' కోటలో అరేబియన్లు మూడువేల సంవత్సరాల ఎడారి బ్రతుకు ఎండకు, ఎడారికి ఎదురీది – వీరి ముందు తరాలు ఎలా బ్రతికి బట్టకట్టింది తెలుస్తుంది?

ఒకరకమైన సానుభూతి – భయం కలుగుతాయి. ఈ ఎడారిలో వాళ్లని ఎవరు విసిరేశారో వీళ్లు ఇన్ని తరాలు ఎలా జీవించగలిగారో అని ఆశ్చర్యపోయాం. ఈతకాయలు, ఖర్జూరాలు, గుక్కెడు నీళ్ళతో బ్రతుకు ఎలా వెళ్లబోస్తారో అని జాలి కూడా. 'బర్జ్ అల్ అరబ్' – ఏడు నక్షత్రాల హోటలు లోపలికి వెళ్లాలంటే 55 డాలర్లు వసూలు చేస్తారు. దుబాయి విస్తీర్ణం 3900 చ.కి.మీటర్లు అరేబియన్ గల్ఫ్‌కి దక్షిణ కొసలో ఉంటుంది. UAE (7 షేక్ దమ్ములులో) బాగా సంపన్నమైనది. దుబాయి నగరంలో 8 1/2 లక్షల మంది ఉంటున్నారు. వీరిలో 75% ఇతర దేశస్థులు. దీన్ని అరేబియన్ హాంగ్‌కాంగ్ అని అంటారు. మీకో విషయం

తెలుసా – ఈ ప్రాంతాలన్ని భారత్‌లో భాగం అని, బ్రిటిష్ పాలకులు ఇండియాలోనే ఉంచుతామంటే అప్పటి మన తెలివైన పాలకులు ససేమిరా వద్దన్నారని? మేము విడిది చేసిన – అడ్మిరల్ ప్లాజా హోటల్ బర్ దుబాయ్‌లో ఉంది. ఇదంతా వ్యాపార కూడలి. ఎదురుగానే ఒక కంప్యూటర్ షాప్ ఉంది. అతను హైదరాబాద్ కుర్రాడు. లోకల్ వాడికి పావలా వాటా యిచ్చి వ్యాపారం పెట్టుకోవచ్చు. వాడు పనిచెయ్యడు, పావలా లాభం తప్పనిసరిగా వాడికి పంచిపెట్టాలి. అదీ ఇక్కడి ఆనవాయితీ.

పడవ ప్రయాణం:

'ఓషన్ మెజిస్టిక్' చాలా హుందాగా దుబాయి రేవు నుంచి బయలుదేరింది. ఈ ఓడకు తోడుగా రెండు మోటారు బోట్లు ఎస్కార్టు, రేవు దాటేవరకు. రేవు దాటుతుండగానే దీపాలు వెలిగాయి. ఓడ అంతా పెళ్లిపందిరిలా దీపాల తోరణాలు కట్టారు. ఓడ ఎక్కటమే మొదటిసారి అందులోనూ అధునాతనమైన హోటల్లాంటి ఓడ. అరేబియన్ సముద్ర జలాలపై తేలుతుంటే మొదటిసారిగా నేలను వదిలి నీటి మీద ఎటు చూసినా నీరే, తేలటం ఎంతో క్రొత్త, వింత అనుభూతి! ఈ రాత్రి ఒకటి రెండు గంటలు అంతా క్రొత్తగా, బెరుగ్గా – భయంగా అనిపించినా – ఎన్నో దేశాలు తిరిగిన అనుభవం నలుగురం ఉన్నామన్న దన్ను మమ్మల్ని ముందు నిలబడేట్లు చేసింది. ఇంకో విశేషం మాతో పాటు ఒక సినిమా సిబ్బంది, ఇద్దరు హీరోలు, ఇద్దరు హీరోయిన్లు ఇద్దరు డైరెక్టర్లు మాకు వారం రోజులు సందడే సందడి.

ముందుగా మాకు లోపలి కాబిన్స్ ఇచ్చినా మేనేజర్‌తో మాట్లాడి Diamond deck లోనికి చక్కని 'సీవ్యూ' కాబిన్‌లోనికి మారాం! ఇద్దరికి ఒక కాబిన్, రెండు మెత్తని పడకలు, ప్రత్యేకమైన బాత్‌రూం! రేడియో, టి.వి. అన్నిటికిమించి పెద్ద అద్దాల కిటికీలో నుంచి కనపడే సముద్రం, ఆకాశం!

ముందుగా – 'లైఫ్‌బాయ్' క్లాస్‌లు, తర్వాత ఓడ మర్యాదలు.

ఏ ప్రాంతంలో ఏముంది, ఎటునుంచి ఎటు పోవాలి, డిన్నర్ ఎక్కడ, లంచ్ ఎక్కడ, ప్రొద్దున బ్రేక్‌ఫాస్ట్, ఎప్పుడు – సినిమా ఎందులో? డిస్కో ఎన్నిగంటలకు. ఈ రాత్రి బిపాసాబసు పుట్టినరోజు, స్విమ్మింగ్ పూల్ ప్రక్కన పార్టీ, అక్షయ్‌కుమార్ డాన్స్, బాబీడియోల్ అల్లరి, కరీనాకపూర్ అమాయకత్వం.

గ్రీక్ – భారత్ వంటలతో అమోఘమైన విందు! బీరు, వైను – నిజంగా ఇది ఆటవిడుపు.

రాత్రి పన్నెండు వరకూ ఆటలూ, పాటలు – తర్వాత మళ్ళీ వేడివేడి కేకులు! కాబిన్‌లోకి వచ్చి చూస్తే గల్ఫ్ సముద్రంలో దివిటీలు పట్టుకున్నట్లు ఆఫ్ షోర్ ఆయిల్ రిగ్గులు, ఉయ్యాల ఊపుతున్నట్లు అలలమీద పడవ ప్రయాణం. ఎప్పుడు నిద్రపోయామో!

బహ్రాయిన్ కోట!

ఇది మట్టికోట – మూడువేల సంవత్సరాల నుంచి సముద్రపు గాలికి తుఫానులకు పోర్చ్ గ్రీసు – ఫ్రెంచి, బ్రిటీష్ దండయాత్రలకు శిథిలమై అవశేషాలు మిగిలిన చరిత్రకు నిదర్శనం! ఈ మట్టి శిథిలాలలో తిరుగుతుంటే తరతరాల మానవుని చరిత్ర పుటలు చిరిగిపోతున్నట్లు అనిపించింది.

కింగ్ ఫాహెడ్ కాజ్‌వే! ఇది 14 కిలోమీటర్లు సముద్రంపై బ్రిడ్జి! ప్రపంచంలో అత్యంత ఖరీదయిన బ్రిడ్జిల్లో ఇది కూడా ఒకటి.

సౌదీ అరేబియాకు ఇదే దారి!

మధ్యాహ్నం తర్వాత ఈ బ్రిడ్జి మీదకు వెళ్ళాం. ఎంత డబ్బు పోశారో చూస్తుంటే తెలుస్తుంది. ట్రాఫిక్ పెద్దగా లేదు. సౌదీ బోర్డర్ వరకూ వెళ్ళాం. అక్కడ టవర్ పైకి వెళ్ళి, రెస్టారెంటులో టీ తాగాం! ఎటు చూసినా సముద్రమే, ఏదో తెలియని దిగులుతో కప్పబడినట్లు, పొగ మేఘాలు, క్రింద ఓడలూ,



దుబాయ్ 7 స్టార్ హోటల్

లేవు, పైన కారులూ లేవు. ఎందుకు ఇంత ఖర్చుపెట్టారు. ఎవరు వీరి సంపదంతా దోస్తున్నారు? ఒకటి రెండు మాల్స్ తిరిగి, చాలా అద్భుతంగా ఉన్నాయి. ఏవో బొమ్మలు కొని మానామా సూక్ వెళ్లాం. ఇక్కడ షాపులన్నీ మనవాళ్లు నడుపుతున్నారు.

బహ్రయిన్ రాజధాని 'మనామా' బహ్రెయిన్‌లో మేము తిరుగుతున్నప్పుడు 'రెయిన్' పడుతోంది. అనుకోకుండా ఇక్కడి పేదల రేకుల షెడ్డులు, మురుగు నీరు, రోడ్లు వేయని పేటలు కూడా చూశాం. వర్షం మూలంగా చీకటిపడిపోతుంది. డ్రైవర్‌కి త్వరగా రేవుకు పోనిమ్మని చెప్పాం కాని లోపల దడగానే ఉంది. మేం ఎక్కిన టాక్సీ ఎంత పాతదో అప్పుడుగాని గమనించలేదు. టైర్ పంచర్, బ్రేక్‌డౌన్, అన్ని కంగారుపెడుతున్నాయి. చివరికి రేవు ద్వారం దగ్గర ఆగాం. బైట వర్షం, దిగగానే తడిసిపోయాం. హడావుడి, పిచ్చి లెక్కలు వేసి ఇరవయి డాలర్లు ఎక్కువ ఇచ్చాం. ఇమ్మిగ్రేషన్‌లో ఎవరయినా ఉన్నారా? తాళంవేసి వెళ్లిపోయారా మా పాస్‌పోర్టులు? ఇంకా ఓడ దగ్గరకు రెండు కిలోమీటర్లు నడవాలి వర్షంలో. ఓ ముసలి 'ఆఫీసరు' కౌంటర్ వెనకాల ఉండడం గమనించాం. వాడి భాష మాకు రాదు. పాస్‌పోర్టులు తీసి ఫొటోలు చూసి మా తడిసిన అవతారాలు చూసి వాడికి అనుమానం వచ్చింది. అయినా అక్కడ మా పాస్‌పోర్టులు కాక ఇంకెవ్వరివీ లేవు. అందుకని ముద్రవేసి ముసిముసి నవ్వులు నవ్వి ఇచ్చాడు. మేము తీసుకున్నాక తలుపులు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు.

నడుస్తూ, తడుస్తూ, పడుతూలేస్తూ, ఓడ చేరేసరికి పావు తక్కువ ఏడయింది. బోర్డుమీద మా నాలుగు టోకెన్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. మా టోకెన్లని తగిలించి, కాబిన్‌కి వెళ్లేసరికి ఓడ బయలుదేరింది. బహ్రయిన్ కనుమరుగయింది చీకటిలో – బహ్రయిన్ 'రాజ్యం'లో 33 ద్వీపాలున్నాయి. పర్షియన్ గల్ఫ్‌కు పడమరగా– సౌదీ నుంచి 24 కి.మీ. తూర్పుగా, ఖతార్‌కు 29 కి.మీ పడమరగా ఈ ద్వీపాలన్నీ నీటి మట్టానికి దగ్గరలోనే తేలుతుంటాయి. మూడు నాలుగు, తప్ప అన్ని ద్వీపాలు నివాసయోగ్యం కావు. బహ్రయిన్, అల్‌ముహర్రాక్ (అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది) సిట్రా, ఈ మూడు ద్వీపాలు ముఖ్యమయినవి. 620 చ.కి. వున్న బహ్రయిన్, కొండలుగాని, నదులుగాని, సెలయేరులుగాని లేవంటే నమ్మండి.

ఆరున్నర లక్షల ప్రజలు – అందులో నలభైశాతం బైటవారే! 1930లో ఆయిల్ బయటపడింది. అదే గల్ఫ్‌లో తొలి చమురు బావి. 1971లో స్వాతంత్ర్యం పొందిన ఈ రాజరికపు వ్యవస్థలో వంశపారంపర్య పాలనే – రాజకీయపార్టీలు నిషిద్ధం.

ఇక్కడ దీనారాలు చెల్లుబాటులో ఉంటాయి... మేము దిగిన రేవు పేరు 'మీనాసల్మాన్'!

రాత్రి :– ఓడలో 8.30 గంటలకు రుచికరమైన భోజనం తర్వాత! గ్రీన్–మిల్లర్ అద్భుతమైన మాజిక్ షో చేశారు. కళ్లముందు జరుగుతుంది. నమ్మలేకపోతున్నాం. మాతోపాటు బాబీడియోల్, అక్షయ్, బిపాసాబాసు, కరీనాకపూర్ నోళ్ళు తెరిచిచూశారు. ఆనందం పట్టలేక ఆశ్చర్యంతో హర్షధ్వానాలు చేశాం. తర్వాత, డిస్కో ఫ్లోర్ షో రాత్రి పన్నెండు గంటల వరకు. అప్పుడు వేడి బిస్కెట్లు తిని ఓపెన్ డెక్ పై నుంచి చూస్తుంటే చుట్టూ చీకటి నీళ్లు, క్రింద 2 కి.మీ. లోతు నీళ్లు, ఎక్కడా నేల కనపడని వింత అనుభవం. పూర్తి అధునాతన సాంకేతిక ప్రమాణాలపై విశ్వాసంతో నెమ్మది!

ఎప్పుడు ఎలా ప్రయాణం చేశామో – తెల్లవారేసరికి కొండలు, కొండల్లాంటి రిగ్‌లూ, దూరంగా రేవు, మస్కట్ ఓడరేవు, దూరం నుంచే ఎస్కార్టు బోటులు వచ్చాయి. బెర్త్ చేరటం తాళ్లు విసరటం, ఓడను కట్టటం అన్నీ మేము చూస్తుండగానే జరిగిపోయాయి. మేము రాత్రి అలసటతో నిక్కి, నీలిగి, బ్రేక్‌ఫాస్ట్ చేసి, బైటకు రావటానికి, గంటపైన పట్టింది.

* * *

మస్కట్:

'ఒమన్'కి రాజధాని, అంతా 50 కి.మీ. చదరం ఉంటుంది. ఇరవయి లక్షల జనాభా గల దేశంలో 5 లక్షల ఇతర దేశస్థులు, ఎక్కువ భారతీయులు, కేరళీయులు ఉన్నారు. ఇక్కడనుంచి 300 కి.మీ. దుబాయి రోడ్డు ప్రయాణంలో చేరవచ్చు! అచ్చమైన అరేబియన్ సంస్కృతి చూడవచ్చు. మగవాళ్లు కందూరాలు, చుట్టు కుదుళ్లు, ఆడవాళ్లు బురఖాలు తప్పనిసరిగా ధరిస్తారు. భవనాలు కూడా అరబ్బు వాస్తులోనే కడతారు. పెద్దగా హడావుడి లేని జీవితం, బాగా విలువైన రియాల్, ఒక రియాల్‌కి మూడు డాలర్లు! మస్కట్‌ని 3 సిటీస్ అంటారు!

మస్కట్ – ముత్రా – రూవి:

డాక్టర్ రూప్ కుమార్ కారులో మేం నలుగురం ఎక్కి మస్కట్ యాత్రకు బయలుదేరాం! ఇప్పుడున్న సుల్తాన్ కబూస్ బిన్ సయ్యద్ గారు అన్నగారిని చంపి సింహాసనం ఎక్కారు (గట్టిగా అనకూడదు) ఆయన చేతికి సోదర రక్తం అంటినా, 'మస్కట్' నగరాన్ని ప్రపంచంలో రెండో క్లీన్ సిటీగా మార్చారు! (మొదటిది సింగపూర్)

మస్కట్ సహజసిద్ధమైన ఓడరేవు. ఇక్కడ 1950 వరకు భారత ప్రభుత్వం భారత రూపాయలు చెల్లుబాటులో ఉంది. ఒక్క రియాల్‌తో చక్కని భోజనం చేశాం. కళ్లు చెదిరే షాపింగ్ మాల్స్ ఉన్నాయి. రెండు రియాల్స్‌తో టేప్ రికార్డర్ కొన్నాం.

మాల్స్‌లో మాకు ఇంకా తెలుగు డాక్టర్స్ పరిచయమయ్యారు.

సాయంత్రం వరకూ మస్కట్ చూసి ఓడ చేరాం! రూప్‌కుమార్‌గార్కి కృతజ్ఞతలు తెల్పి బ్రహయిన్ పోర్టులో మా కష్టాలు ఇక్కడ ఎంత వీలుగా ఉందో, కారు ఓడ వరకు రావచ్చు, గుర్తు చేసుకున్నాం.

రెండు రోజుల పడవ ప్రయాణానికి ఓడలో ప్రవేశించాం!

ఇప్పుడే మీకు మేము ప్రయాణం చేసే ఓడ గురించి చెప్పాలి. ఓడ పేరు 'ఓషన్ మెజిస్టే' పేరుకు తగినట్లు అంత ఠీవిగా అందంగా వుంటుంది.

పదివేల టన్నుల బరువు!



మస్కట్ సీ పోర్ట్

16 వేల హార్స్‌పవర్ ఇంజన్లు! 4 పెద్ద జనరేటర్లు వెయ్యి వాట్ల కరెంటు–

ఓడ బేలన్స్ తప్పకుండా రెండు స్టెబిలైజర్లు! మామూలు వేగం 17.5 వాటికల్ మైల్స్ – (గంటకు 20 మైళ్లు) పూర్తి వేగం గం. ముప్పయి కి.మీ. 273 కాబిన్స్‌లో 621 మంది అతిథులు! 235 మంది సిబ్బంది! ఒక గ్రీక్ కాప్టెన్ – ఈ నీటి మేడను అంగుళం, అంగుళం చూపించి వివరించింది టఫ్టీ గోల్డాన్!

బ్రిడ్జి మీదకు తీసుకువెళ్లి – ఓడ ఎలా నడుపుతారు! సముద్రపు లోతు ఎలా తెలుస్తుంది. ఎన్ని వేల చార్టులు ఉంటాయి – 5 వేలకు పైగా!

సెటిలైట్ రేడియో ఎలా పని చేస్తుంది. గ్రీకు దేశం ఓడలు నిర్మించడం లోను ప్రపంచవ్యాప్తంగా ఓడలు నడపటంలోనూ ఎంత ప్రసిద్ధి గాంచింది. అని చక్కగా వివరించింది. మా పిచ్చి ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా సమాధానం చెప్పింది! రాడార్ చూపించింది. అంతలో SOS కాల్ వచ్చింది! మేమున్న ప్రాంతానికి – 250 కి.మీ. దూరంలో ఎవరో ప్రమాదంలో ఉన్నారు. అయితే మా కంటే దగ్గర్లో ఇంకో ఓడ వుందని మా కాప్టెన్ అందుకు సమాధానం పంపలేదు.

మాకు రాత్రి ఫ్లోర్ షోలు. మెరుపు తీగల్లాంటి నలుగురు అమ్మాయిలు, రోజూ అద్భుతంగా నాట్యం చేస్తున్నారు వారు.



బెల్లీ డాన్స్

కెన్, రీటా, టాలర్, కిస్మల్; రసిక్‌లాల్ గారు వీరి విన్యాసాలు చూసి ముగ్ధులైపోయి వారితో కలసి డిస్కో చేసేవారు!

ఆ రాత్రి కెప్టెన్ మాకు ప్రత్యేకమైన డిన్నర్ ఇచ్చారు. ఆయనను అందరు మాస్టర్ అంటారు. గ్రీకువీరుడు! క్రిస్టోస్ కరబాగియస్! దుబాయిలోనే ఆయన భార్య ఓడలో ఎక్కింది. మాతో పాటు భోజనానికి కూర్చుంది. అద్భుతమైన స్టేట్ డిన్నర్, ఏ ప్లేటు ఎందుకు? ఏ స్పూనుతో ఏమి తినాలి? నీళ్లు కావాలంటే గ్లాసు ఎటు పెట్టాలి? వైన్ కావాలంటే ఎటు త్రిప్పాలి? అన్ని మాకు హోటల్ మేనేజర్ ట్రైనింగ్ ఇచ్చారు. ఆ రాత్రి స్టేట్ డిన్నర్‌కి ఎనిమిది మంది అతిథులను ప్రత్యేకించి ఆహ్వానించారు! ఆయన భార్యవచ్చి షాపింగ్‌కి డబ్బు ఖర్చు పెట్టేస్తుందని అన్నారు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు, కాలేజీ చదువుకు వచ్చారు. అమ్మ ఇంట్లో వుంటే ఆంక్షలెక్కువగా వున్నాయని, ఓడమీదకు పంపించారని నవ్వుతూ చెప్పారు. చూశారా ఎంతటి రాజుకయిన ఇంట్లో కష్టాలు ఒకటే తీరు!


* * *

గల్ఫ్ దేశాలు తిరిగిన తర్వాత – నాకనిపించింది! ఇక్కడ పౌరులెవ్వరూ పని చెయ్యరు, కారణం పన్నులు లేవు. పని చేసేవాళ్లు పరదేశీలు దొరుకుతారు. ఆయిల్ అమ్ముకుంటారు, అమెరికా యూరోపు కంపెనీలు ఆయిల్ తోడుకు పోతున్నారు. అందుకు ఒక చేతితో వీళ్ళకు డాలర్లు ఇస్తున్నారు. బ్రిడ్జిలని, రోడ్లని, మాల్సని, హోటల్సని, కాంట్రాక్టులకు రెండు చేతులతో సొమ్ము తీసుకుపోతున్నారు. ఇంకా ఏమయినా మిగిలితే వాళ్లకు అరకొరి ఆయుధాలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలతో పని లేదు. పాలకులు షేక్‌లు కదా! వాళ్లకు సలహాదారు, ఒక తెల్లవాడుంటాడు. షేక్ లందరూ ప్రవేట్‌జెట్‌లో ప్రొద్దునే లండన్ వెళ్లిపోతారు. పైలట్‌లు తెల్లవాళ్లే మరి! ఆయిల్ అడుగంటితే వీళ్ళకు తింటానికి కూడా ఉండదేమో అనిపిస్తుంది.


రెండు రోజుల ఆనందడోలిక ఓడ ప్రయాణంతో బొంబాయి చేరాం. గేట్‌వే ఆఫ్ ఇండియా దగ్గర డాక్టరుగారు వెళ్ళి ఫొటో దిగారు. వెనుక తాజ్‌హోటల్‌తో! పది రోజుల తర్వాత పోస్టులో చక్కని ఫొటో వచ్చింది. తాజ్ హోటల్ వుంది, పావురాలు వున్నాయి, ఫొటోలో డాక్టరుగారు లేరు!



డ్రాగన్



లావోస్ మికాంగ్ నది



ఇండో చైనా

శ్రీలంక, కాంభోజము, లావోస్, థాయ్‌లాండ్!

ఎయిర్ లంక విమానం హిందూమహాసముద్రం పైనుంచి అర్ధచంద్రాకారంలో తిరుగుతూ కొలంబో విమానాశ్రయంలో దిగుతున్నపుడు-

శ్రీలంక ఎమరాల్డ్ పెండెంటులా అనిపించింది. పెద్ద కన్నీటి బొట్టులా కూడా అనిపించింది. విమానాశ్రయంలో సిబ్బంది చాలా మర్యాదగా ఆహ్వానించారు. బైట సెక్యూరిటీ ఎక్కువగా మహిళా సైనికులు చలాకీగా ఉన్నారు. కొలంబో బీచ్ - ప్రక్కనే ఓడలు, అంతలో పెద్ద వర్షం - పూర్తిగా తడిసి, ఆనందించాం. ప్రకృతి సౌందర్యంతో, ప్రకృతి వనరులతో, పుష్కలంగా నీటితో కొబ్బరి తోటలతో, అన్ని రకాల పంటలతో పచ్చగా ఉన్న లంకను రావణాసురులు రక్తసిక్తం చేసినా తట్టుకుని, మళ్ళీ పరదేశీయులను తమ దేశం చూడమని ఆహ్వానిస్తున్నారు. అతిథి మర్యాదలు చేస్తున్నారు. అందరి ముఖాలలో నవ్వు కనిపిస్తోంది. మర్నాడు ప్రొద్దున్నే బాంకాక్ విమానం ఎక్కి మధ్యాహ్నం 12గంటలకు ఒక అద్భుత ప్రపంచంలోనికి కనిపిస్తోంది. బాంకాక్ అంతకుముందు అనేకసార్లు దర్శించిందే అయినా - ఎప్పుడూ క్రొత్తగానే



కాంబోడియాలోని అంకోర్‌వాట్ విష్ణు దేవాలయం

వుంటుంది. ఇప్పుడు ప్రత్యేకంగా వీరి అభివృద్ధి, అన్నీ ఒడిదుడుకులకు ఓర్చి, ఎదురీది, వీరు సాధించిన అభివృద్ధి, ఎంతో మెచ్చుకోదగినది. అదికూడ మానసిక రుగ్మతలకు ఎంతో దూరంగా ఉంటూ– రెండు రోజులు బాంకాక్‌లో టూర్ మేనేజర్‌తో కార్యక్రమాల వివరాలు పూర్తి చేసుకుని, ఒకరోజు ఉదయాన్నే కాంభోజ రాజ్యానికి ప్రయాణమైనాం. ఇప్పుడు కంబోడియా అని అంటున్న దేశమే– కాంభోజము, ఫ్రెంచివాళ్లు ఇప్పటికీ కాంభోజమనే పిలుస్తారు. ఈ కాంభోజము మన కాంభోజమే! జయవర్మ రాజవంశము వెయ్యి సంవత్సరాలపైగా పరిపాలించి, తమ అడుగుజాడల్ని అద్భుతమైన దేవాలయాల సముదాయాలలో వదిలి, చరిత్రలో కలిసిపోయారు. వీరి సృష్టే సియాంరీప్‌లోని అంకుర వాటిక. అయిదు కిలోమీటర్ల చదరంలో, చుట్టూ 20 మీటర్ల వెడల్పు కందకంతో మహాద్భుతమైన వాస్తుశిల్ప నైపుణ్యంతో, శిల్పకళా చాతుర్యంతో, భక్తి ప్రపత్తులతో నిర్మించిన హిందూ దేవాలయ ప్రాంగణం అంకురవాటిక!

ఇప్పటి కాంభోజ రాజ్యపాలకులు ఈ దేవాలయాన్నే వారి జాతీయ పతాకంపై ప్రదర్శిస్తున్నారు! అంకురవాటికను చూడటానికి, రెండు కళ్ళూ చాలవు, తిరగటానికి రెండు కాళ్ళూ చాలవు, అప్పటి వీరి రాజధాని అంకుర్‌థాన్ ముందుగా చూసి, వీరి చరిత్ర ఎలా చిత్రించారో చూసి ఆశ్చర్యపోయాం. ఇది భారతీయగతం. మొదటి జయవర్మ మొదలు ఎనిమిదో జయవర్మ వరకు వీరి వంశపాలన మూడు పూవులు, ఆరు కాయలుగా నడిచింది. ప్రజలు, పాలకులు అన్ని సుఖాలు అనుభవించిన దాఖలాలు కోకొల్లలు. వేల సంఖ్యలో ఏనుగులు, ప్రకృతి వనరులు, పంటలు అన్ని అందుబాటులో ఉండేవి. భారతీయ సంతతి వాస్తు శిల్పుల్ని శిల్పకళా నిపుణులను తీసుకువచ్చి ఒక మహత్తర కార్యానికి రూపకల్పన చేసి, నాలుగు తరాలలో సాకారం చేసుకోగలిగారు. ప్రపంచ చరిత్రలో ప్రముఖంగా ఇప్పటికీ నిలబెట్టగలిగారు. నలభై మైళ్ల దూరం నుంచి కొండరాళ్లు మలచి అవి తీసుకురావటానికి ఒక కాలవత్రవ్వి, వాటిని గట్టుమీదకు చేరవేయటానికి, నీటిని అడ్డుకట్టి, ఏనుగులతో లాగించి, వంద అడుగులకుపైగా ఏరాయి ఎక్కడ పెట్టాలో అక్కడే సరిగ్గా పెట్టగలిగారు అంటే – వీరి 'ఇంజనీరింగ్' కౌశలం ఇప్పటికీ 'ఔరా' అనిపిస్తోంది. ఈ అంకుర వాటిక చూడటానికి రోజూ అయిదువేలమంది విదేశీయులు వస్తున్నారు. అక్కడి గోడలమీద చెక్కిన

రామాయణ కావ్యం చూసి తెలుసుకొని ఆశ్చర్యపోతున్నారు. ఒక రోజంతా ఇక్కడి గడిపినా మేము పశ్చిమ ద్వారం దగ్గరే ఉండిపోయాం! ఎండలో, సాయంసంజలో, వెన్నెల్లో ఈ హిందూ దేవాలయాన్ని తనివితీరా చూసి, గూటికి చేరాం. 'కాంభోజ' ప్రజలు ఎంతో సాత్వికులు – ఇప్పుడు అంతా బౌద్ధులే! అయినా చాందసులు కారు. ఉన్నదానితో తృప్తిపడి, హాయిగా ఉండగలరు! వీరి దురదృష్టం 'పోల్‌పాట్' రూపంలో వీరిని పాలించి నానా కష్టాలు పెట్టింది. ఇప్పుడిప్పుడే ఆ గతాన్ని వదిలి, క్రొత్త ప్రపంచంలోనికి అడుగుపెడుతున్నారు. మాకు గైడుగా వచ్చిన, నానీ చాలా చదువుకుని, ఓర్పుతో మాకు సొంత మనిషిలా సేవలందించి ఎయిర్‌పోర్టులో వీడ్కోలు ఇస్తూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఈ మధ్య ఆర్కియాలజిస్టు నాగిరెడ్డి గారు వచ్చి మీరు అంకుర్‌వాట్ చూసి వచ్చారా అని నన్ను ముట్టుకుని తన్మయత్వం చెందారు! మీకు, ఏమాత్రం అవకాశం కుదిరినా కాంభోజ రాజ్యాన్ని, అంకుర వాటికను చూసి రండి.

లావోస్:

'అంకురవాటికను' ఎంత చెప్పినా తరిగేది, జరిగేది కాదు.

వదలలేక తనివితీరకపోయినా కార్యక్రమం ప్రకారం వెళ్లిపోవలసిందే.



అంకోర్‌వాట్‌లోని కుడ్య శిల్పం

లావోస్ చేరాం. మికాంగ్ నదికి ఉత్తరం ప్రక్కన, చైనాకి దక్షిణం – తూర్పున ఉన్న దేశం లావోస్. అయితే వీరికి అన్న థాయ్‌లాండ్ మాత్రమే!

థాయలాండ్ మీదే వారు అన్నింటికి ఆధారపడతారు. వారికి వీరికి సోదర ప్రేమతో పాటు దాయాదుల పోరు కూడా ఉంటుంది.

అదీ గుళ్లు – గోపురాల విషయంలోనే, అయినా లావోస్ ప్రజలు బౌద్ధ సంస్కృతి, ప్రకృతి సంపదలతో సౌఖ్యంగా ఉండగలుగుతున్నారు. పెద్దగా కోరికలు పెంచుకోరు, ఉన్నదానితో తృప్తిపడటం వీళ్ల దగ్గరే నేర్చుకోవాలి.

మాకంటే ముందే వాజ్‌పేయిగారు వచ్చి వెళ్ళారు. ప్రస్తుతం రోమెల్‌గారు ఇక్కడ ఎంబాసిడర్. చక్కని ఇండియన్ భోజనం పెట్టే రెస్టారెంట్లు మికాంగ్ నది ఒడ్డునే వున్నాయి.

వాతావరణం ఆహ్లాదకరంగా వుంటుంది. ఇప్పుడిప్పుడే పర్యాటకులను ఆకర్షించేందుకు అన్ని ఏర్పాటులు చేసుకుంటున్నారు! చక్కని విమానాశ్రయం, మినివాన్లు, హోటల్స్, గైడులూ అన్నింటిని మంచి, చౌకగా అన్ని అందుబాటులో ఉంచడం, ఎక్కడా పోలీసు పెత్తనం కనపడకపోవటం, సాఫీగా గడిచిపోయే జీవనం, ఇది “లాండ్ ఆఫ్ టెన్ థౌజండ్ ఎలిఫెంట్సు” దట్టమైన అడవులు, పుష్కలంగా నీటితో నదులు, ఇది లావోస్, వీరికి ఒక్కటే భయం. అదే చైనా – చైనాసరుకులు! మికాంగ్ నది దాటి థాయ్‌లాండ్ వెళ్లేందుకు ‘ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జి’ కట్టారు. అంతా అన్న పెట్టుబడే! లావోస్ ప్రక్క డ్యూటీ ఫ్రీషాపులు చాలా



అంకోర్‌వాట్‌లోని శిల్పాలు



జేమ్స్‌బాండ్ ఐలాండ్

వున్నాయి. అన్ని కారు చౌక! లావోస్ వదిలి, 'బ్యాంక్‌కాక్ ఎయిర్'లో 'బ్యాంక్ కాక్' సిటి వచ్చాం–

అయినా 'హోటల్ లావో', 'బీర్‌లావో' అంటున్నారు మా డాక్టర్లు! ఈ యాత్రలో నారాయణరావుగారు ఎక్కడ నన్ను కష్టపడనీయకుండా, నా బాగ్‌ని మోయటమేకాక, అక్కడక్కడా నన్ను కూడా మోసేవారు.

ముగ్గురు మిత్రులు తోడు లేకపోతే – ఈ యాత్ర ఆహ్లాదకరంగా ముగిసేది కాదు. డా. రఫిక్‌గారి హాస్యప్రియత్వం, డా. కృష్ణకొంటె కామెంట్లు, నారాయణరావుగారి అండ, ఈ పదిహేను రోజులు తెలియకుండా గడిచిపోయాయి!

కావాలనే డిశంబరు 31న పూకెట్‌లో వుండటానికి ప్రణాళిక పెట్టుకున్నాం.



సువర్ణభూమి



సువర్ణ భూమి – క్షీర సాగర మథనం



హువాంగ్‌పూ నది చుట్టూ షాంగై నగరం



హయత్ ఆన్ బండ్



పొగ మంచు, నది – జెట్టి



రచయిత



చైనా ఛాలెంజ్

ఇది చైనా ఛాలెంజ్ ఎందుకంటే – ఆ పేరుతో క్లౌడ్ ఫండ్ కోసం సైట్ ఓపెన్ చేశాను. అన్ని ఫారాలు పూర్తి చేసి అప్‌లోడ్ చేశాను. పూర్తికావటానికి 6 నెలల సమయం పడుతుంది. అంటే, జనవరి 2017. అది అనుకూలమైన సమయం కాదు చైనా ప్రయాణానికి. చివరి నిమిషంలో క్లౌడ్ ఫండ్ కాన్సిల్ చేశాను. సెల్ఫ్ ఫండ్‌తో నాగ్‌తో కలిసి ఈ సాహసయాత్రకు మొదటి అడుగు వేశాను. టికెట్లు, హోటళ్లు, టూర్లు – అన్నీ కంప్యూటర్‌తో నిరంతర శ్రమతో ఒక దారికి తెచ్చాను. అయితే, చైనా వెళ్లటానికి చాలా దార్లున్నాయి. ఇదివరకు మేము వెళ్లిన దారి హాంకాంగ్. సరే, అదే ఎన్నుకున్నాం. కానీ వాళ్లు కొత్తగా ప్రీ ఎరైవల్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో పెట్టారు. ఇద్దరమూ రిజిస్టర్ చేయాలి. ఫారాలన్నీ చదివాను. చేశాం కూడా. ఒకటి ప్రింట్ వచ్చింది. రెండవది రాలేదు. అంటే హాంకాంగ్ ద్వారా వెళ్లలేం. ఆదిలోనే హంసపాదు. అప్పుడే థాయ్‌లాండ్ దారి పట్టాం అన్నీ మన మంచికే అనుకుంటూ ఏప్రిల్ 3, 2017. ఇది ఎందుకు సాహస యాత్ర అన్నానో మీరు చదవండి... నాతో ఏకీభవిస్తారు.

అప్పటికి అరవైసార్లు చూశాడు, అరవై రకాలుగా చూశాడు, అరవై నిమిషాలూ గడిచిపోయాయి.

'ఐ యామ్ సారీ... ఐ కుడ్ నాట్ ఫైండ్ యువర్ నేమ్' అని కాస్త విచారంగానే రిసెప్షన్‌లో 'సాంగ్' సన్నాయి సన్నగా వినిపించాడు.

అంటే ఇంటికి పదివేల కిలోమీటర్ల దూరంలో, రాత్రి తొమ్మిది గంటలకు హోటల్ రిజర్వేషన్ లేకుండా, ఈ భాష రాని దేశంలో, అప్పుడే నిద్రకు ఉపక్రమిస్తున్న ఈ దారి లేని దీవిలో, రాత్రి నగరాన్ని ఎలా దాటాలి? ఎక్కడ ఈ చలిలో తల దాచుకోవాలి?...

'యు మీన్ దిస్ పేపర్ హేజ్ నో వాల్యూ...' అని చేతిలో రిజర్వేషన్ పేపర్ చూపించాను. సాంగ్ సమాధానం చెప్పలేదు.

'యువర్ కన్ఫర్మేషన్ డిడ్ నాట్ రీచ్ అస్ - బట్ ఐ కెన్ ఎకోమిడేట్ యు... ఇఫ్ యు కీప్ some డిపాజిట్' అని అంటున్నాడు.

వాట్ ఈజ్ ద sum అని అడిగాను.

సాంగ్ 'ఫైవ్ గ్రాండ్' అని సాగదీశాడు. అంటే ఐదువేల యువాన్లు - అంటే యాభైవేల రూపాయలు. ఇండియా నెంబర్‌కు కాల్ చేశాను. నా ఏజెంట్‌కు విషయం చెప్పాను.

'సర్ అన్ని వివరాలూ పంపాను. ఏ క్షణంలోనైనా సమాచారం వస్తుంది. అది న్యూయార్క్ నుంచి రావాలి. ఇవాళ ఆదివారం కదా! అందుకు ఆలస్యమయివుంటుంది..' అన్నాడు. సాంగ్‌తో మాట్లాడించాను. చివరికి ముగ్గురం ఒక ఒప్పందానికి వచ్చాం- 'డిపాజిట్ ఇస్తాను, ఏజెంట్ నుంచి సమాచారం రాగానే డిపాజిట్ తిరిగి ఇచ్చేయాలి' ఇది ఒప్పందం. కాష్ వద్దన్నాడు. నా కార్డు తీసుకొని గీకాడు. ఏడు వేల యువాన్లు - డెబ్బైవేల రూపాయలు నా ఖాతా నుంచి ఖాళీ అయిపోయాయి. 14వ అంతస్తులో పూర్తిగా షాంగై రివర్ కనిపించే కార్నర్ గది 1405 ఇచ్చాడు.

'హేవ్ ఎ నైస్ స్టే సర్' అని నవుతూ 'ఇట్ ఈజ్ స్పెషల్ ఫర్ యు.'

సరే, నవ్వాలో - ఏడవాలో తెలియక నాగ్‌ను వెంటబెట్టుకొని (అప్పటి వరకు ఆయన సోఫాలో కూర్చొని చిద్విలాసంగా పరిసరాలు పరికిస్తున్నారు), బెల్ బాయ్‌తో ఆ అద్భుతమైన 'హయత్ ఆన్ బండ్' ఫైవ్‌స్టార్ హోటల్ లాబీ నుంచి ఎలివేటర్‌లోకి, పద్నాలుగవ అంతస్తు కారిడార్‌లోకి, చివరికి కార్నర్ రూమ్ 1405లోకి చేరాం. బెల్‌బాయ్‌కు టిప్ ఇచ్చాను. అతను గదంతా సరి చూసి, గుడ్నైట్ చెప్పి వెళ్ళిపోయాడు. నాగ్ బాత్రూంలోకి, నేను ఫ్లోర్ టు సీలింగ్ గ్లాస్ విండో దగ్గరకు వెళ్ళి కర్టెన్‌లు పూర్తిగా తెరిచాను. భళ్ళున షాంగై నది మెరిసిపోతోంది. దీవిలో దీపావళి జరుగుతోంది. బండ్ అంతా దీపాలతో తారాడుతోంది. క్రూజ్‌లు ఎల్.ఇ.డి. తోరణాలతో నదిలో షికారు చేస్తున్నాయి. నది అలా వయ్యారంగా వంకర తిరిగి మా హోటల్ దగ్గర టాన్జెంట్‌తో మళ్లీ ప్రక్కగా వెళ్ళిపోతోంది. ఒక్కసారిగా గుండె నిండా వెలుగు నిండిపోయింది.

ఆర్నెల్ల నుంచి కల్పించుకున్న నా సంకల్పం ఇప్పటికి కళ్ల ముందు నిలిచింది. ఇప్పటివరకూ పడిన శ్రమ ఒక్కసారిగా మరిచిపోయాను.

*

ఈ శ్రమ ఇక్కడిది కాదు. హైదరాబాద్‌లోనే మొదలైంది. ఆదివారం రాత్రి ఒంటిగంటకు థాయ్ విమానం ఎక్కాలి. అంటే శనివారం అన్ని పనులూ అయిపోవాలి. అంటే శుక్రవారమే పాస్‌పోర్ట్, వీసాలతో రావాలి. మధ్యాహ్నం 4 గంటల వరకు కొరియర్ బాయ్ పొద్దున్నుంచి ఇవ్వకుండా తిరుగుతున్నాడు. తరువాత చైనా యువాన్‌లు తీసుకోవాలి. శనివారం ఎక్స్ఛేంజ్ కోసం తెలిసినాయన దగ్గరకు వెళ్ళాం. పదివేల యువాన్ల కోసం లక్ష రూపాయలు ఇవ్వటానికి ఇదిగో కార్డు అని ఇచ్చాను. 'సర్, క్యాష్' అన్నాడు. 'అయ్యో రామా' అని నాగ్‌ను బ్యాంక్‌కు పరిగెత్తించాను. అక్కడ కార్ పార్కింగ్ ఉండదు. బ్యాంక్ మూసివేయబోతున్నారని హడావుడి చేసి చివరకు క్యాష్ ఇచ్చారు. నోట్ బందీ కదా! ఆ రకంగా అప్పటికి పదివేల యువాన్లు తీసుకొని ఇళ్ళకు చేరాం. మర్నాడు రాత్రి తొమ్మిది గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాలి.

అన్నీ సరిగానే జరిగిపోయాయి అనుకున్నాం.రాత్రి ఒంటిగంటకు గాలిలో లేచిన విమానం చీకటిలోకి ఎగిరింది. నాగ్ వెంటనే నిద్రలోకి జారుకున్నారు. నాకు ఎందుకో ప్రయాణంలో నిద్ర పట్టదు. థాయ్ ఎయిర్ హోస్టెస్‌ల సిల్క్‌లాంటి సేవలందుకుంటూ మేల్కొనే ఉన్నాను. తూర్పున మెలమెల్లగా బంగారం విరుస్తోంది. ఆ బంగారం నేలమీద పోశారా అన్నట్లు సువర్ణభూమి నా కన్నులకు పండుగ చేసింది. నేను ఒక్కడినే ఈ పండుగ చూస్తున్నానా, విమానంలో అందరూ నిద్రపోతున్నారు – ఇద్దరు పైలెట్లు, నేను మినహాయింపు. బంగారు భూమికి వెలుగు తోరణాలు కట్టి అంతటా పరిచారు. ఆ విమానాశ్రయ పరిసరాలు అంత ఎత్తు నుంచి చూడటానికి రెండు కళ్లు ఎలా సరిపోతాయి?!

పొద్దున ఆరుగంటలకు సువర్ణభూమిలో దిగాం. నిజంగా బంగారు భూమే. బుద్ధభూమి. సువర్ణభూమి విమానాశ్రయం ఒక అద్భుతం. ఇక్కడ రామాయణ విశేషాలు, హనుమంతుని చిత్రాలు మాకు స్వాగతం పలుకుతున్నాయి. క్షీర సాగర మధనం – మంథర పర్వతం, వాసుకి, రాక్షసులు, దేవతలు – సాగర మధన ఘట్టాన్ని కన్నులపండువగా సృష్టించారు. అంతా బంగారు రంగులోనే.

ఇవన్నీ మనదగ్గర ఉండవలసినవి కదా! మరి ఈ బుద్ధభూమిలో (థాయ్‌లాండ్) విమానాశ్రయాన్ని అలంకరించాయేమిటి? మన దేశ విమానాశ్రయాలలో ఎక్కడైనా, ఏవైనా భారత, రామాయణ ఘట్టాలు పెట్టారా? లేక దశావతారాలు చూపించారా? నిద్రకళ్ళతోనే తిరిగి, తిరిగి సామానుకు నాగ్‌ను కాపలాపెట్టి నేను నిద్రపోయాను. షాంగై ఫ్లైట్ పదిగంటలకు. కానీ అరగంట ముందే గేట్లు తీశారు. విమానం నిండిపోయింది. అందరూ చైనావాళ్లే. మేమిద్దరమే భారతీయులం. అయిదు గంటలు ప్రయాణం. మూడు గంటలు ముందుకు గడియారం. సాయంత్రం అయిదు గంటలకు షాంగైలో దిగాం. అక్కడ ఎయిర్‌పోర్ట్ పాడుపెట్టారు. శిథిలాలయం మాదిరిగా ఉంది. ఎదురుగా చాలా పెద్ద టెర్మిల్ కడుతున్నారు. అందుకనే ఈ టెర్మిల్‌ను గాలికి, దుమ్ముకు వదిలి కేవలం ఇమ్మిగ్రేషన్ పోలీసులే కాపలా ఉన్నారు. చైనా పోలీసులు నవ్వరు. కనీసం కళ్లతో పలకరించరు. అది ఎలాగూ తెలియదు. చిన్ని కళ్ళు కదా! అమెరికా ఎయిర్‌పోర్ట్‌లో పాస్‌పోర్టులు చాలా నిశితంగా పరిశీలించి, ముద్రవేసి మనకు తిరిగి ఇచ్చేప్పుడు నవ్వుతూ 'వెల్‌కమ్ టు అమెరికా – హేవ్ ఎ నైస్ డే' అంటారు. ఇక్కడ అటువంటి మర్యాదలేమీ లేవు. వాళ్ళను దాటుకుని కస్టమ్స్ కష్టాలేమీ లేకుండా ఆగమనాల చివరికి చేరుకున్నాం. నా పేరుతో ప్లే కార్డు కనపడాలి. అది తప్ప ఎన్నో పేర్లు కనబడుతున్నాయి. చైనా భాషలో. ఒకవేళ నా పేరు కూడా చైనా భాషలో ఉందేమో? అటూ ఇటూ రెండు మూడు సార్లు తిరిగాను. నాగ్‌ను ఒకచోటే నిలబెట్టి. నా తిరుగుడు చూసి సూట్‌లో ఉన్న ఒక చైనా జెంటిల్‌మెన్ 'కెన్ ఐ హెల్ప్ యు' అన్నాడు. 'ఐ యామ్ లుకింగ్ ఫర్ మై పికప్ ఏజెంట్.. టు గో టు హయత్ ఆన్ బండ్' అనగానే అతను నా చేతిలో పేపర్ తీసుకొని అందులో ఉన్న లోకల్ ఫోన్‌కు చేశాడు. కాసేపటికి ఒక జబర్దస్త్‌లో ఆడవేషం వేసిన మగవాడిలా ఉన్న లేడీ (ఛెంగీస్ ఖాన్ చెల్లెలేమో) నా పేరు తలక్రిందులుగా పట్టుకొని ఎలా పలకాలో తెలియక ఇకిలిస్తోంది. ఆ బోర్డు తిప్పి 'ఐ యామ్ కుమార్' అని పరిచయం చేసుకున్నాను. లేడీ ఛెంగీస్ ఖాన్ మా యిద్దర్నీ చంకలో వేసుకొని, లగేజ్‌తో లిఫ్ట్‌లో క్రిందకు దింపింది. డ్రైవర్‌కు ఫోన్ చేసింది. మధ్యలో నన్ను చూసి ఒక నవ్వు నవ్వి, మళ్లీ ఫోను, మళ్లీ నవ్వి మళ్లీ ఫోను... ఇలా ముప్పావుగంట గడిచింది. చివరికి ఆమె

ఫోనులో చైనీస్‌లో టైప్ చేసి నాకు చూపించింది. క్రింద ఇంగ్లీష్ అక్షరాలు. విషయం ఏమిటంటే – 'హి ఈజ్ ఇన్ ద రాంగ్ ప్లేస్.' ఆ రాంగ్ ఫెలో అరగంటలో లాంగ్‌వాన్‌లో వచ్చాడు. లగేజ్ సర్ది, మమ్మల్ని కూర్చోబెట్టి మా పెద్దక్క సాగనంపింది.

ఈ శ్రమ ఇంకా అయిపోలేదు. షాంగై ఎయిర్‌పోర్ట్ సిటీకి గంట పైనే, అదీ ఎక్స్‌ప్రెస్ హైవే మీద వంద కిలోమీటర్ల వేగంతో. చివరకు సిటీ చేరాం. ఇక్కడ సోమవారం సెలవు. ట్రాఫిక్ రద్దీగానే ఉంది. షాంగై నది క్రింద నుంచి పైకి వచ్చి ఓ వంతెన దాటి, మా హోటల్ రోడ్‌లో తిరిగాం. ఓ వెయ్యిమంది రోడ్డుకు ఇరువైపులా నడుస్తూ మాకు స్వాగతం చెబుతున్నట్లుగా ఎదురొస్తున్నారు. ఎలాగైతేనేం హోటల్ లాబీ చేరాం. డ్రైవర్‌కు ఏదో చేతిలో పెట్టాం. అంతలో హోటల్ బెల్ బాయ్ మా లగేజ్‌తో లాబీలోకి తీసుకెళ్ళాడు. తర్వాత ఏం జరిగిందో ఇంతకు ముందు చెప్పాను. అంటే నిన్న రాత్రి తొమ్మిది గంటలకు ఇండియా వదిలి ఈ రాత్రి తొమ్మిది గంటలకు షాంగైలోని హయత్ హోటల్‌కు చేరాం. ఆ రాత్రి కొత్త దేశం, కొత్త గాలి, నిద్ర మత్తు, కలలు, కలకలం, తూర్పు వెలుతురు గదిలో పడుతూనే మెలకువ. అద్దాల కిటికీ దగ్గర కూర్చొని నది నడక చూస్తున్నా.

పెద్ద పెద్ద జట్టీలు ఎగువగా వెళుతున్నాయి. రాత్రి లైట్లన్నీ వెలుతురులో, పొగమంచులో కలిసిపోయాయి. బండ్ మీదకు నడకకో, జాగింగ్‌కో మెల్లమెల్లగా జనం చేరుతున్నారు. చలికాలం పూర్తిగా పోలేదు. నగరం పొగమంచు పరచుకొని నిద్రపోతుందేమో! ఎదురుగా దీవిలో ఎత్తైన టి.వి. ట్రాన్స్‌మీటర్ టవర్ ఠీవిగా నిలబడి ఉంది. అప్పుడే నాగ్ రెడీ అయి 'అయ్యా, బ్రేక్‌ఫాస్ట్' అన్నారు. నిద్ర లేవగానే కాఫీ మేకర్‌తో కాఫీ చేసి, ఇద్దరం తాగాం (బ్రూ సాచెట్లు ఇంటి నుంచి తెచ్చుకున్నాం). బ్రేక్‌ఫాస్ట్? హోటల్‌లో పెట్టుకోలేదు. రోజుకోచోట తిందాం అని అనుకున్నాం. కానీ అదే పెద్ద పొరపాటైపోయింది. చుట్టూ ఎక్కడా మనం తినదగిన బ్రేక్‌ఫాస్ట్ కనపడలేదు. చివరికి ఒక స్టార్ బక్స్ పట్టుకొని బ్రెడ్, చీజ్ వగైరా తిని, హోటల్‌కు చేరాం. మా టూర్ ప్లాన్ రెడీ చేసుకున్నాం రాత్రే. కన్సీర్జ్ కౌంటర్‌లో ఓ ఆంగ్లో చైనీస్ 'శ్యాం' అందాం, మాకు ఎదురైతే, మేము చూడదలచుకున్న ప్రదేశాలు చెప్పాం. రెండు మూడు

బ్రోచర్లు తీసుకున్నాం. ఆ రోజు షాంగైలో చూడవలసినవన్నీ చూడటానికి, అన్నీ తిరగటానికి, మాకోసం వేచి ఉండటానికి ముందే క్యాబ్ మాట్లాడిపెట్టాడు శ్యాం. ఆవిధంగా షాంగైలోని ముఖ్య ప్రదేశాలు దాదాపు అన్నీ తిరిగాం. వివరాలు తరువాత ఇస్తాను. అలా సాయంత్రం వరకు తిరుగుతూనే ఉన్నాం. ఆరుగంటలకు బాగా చీకటిపడిపోయింది. హోటల్ దగ్గర దిగి, క్యాబ్ పంపించివేశాం. ఇక తిండి విషయం అడగొద్దు. అప్పటికి అర్థమైంది ఇక్కడ మనం తినగలిగిన భోజనం నాస్తి అని. ఒక చిన్న స్టోర్‌కు వెళ్ళి, బ్రెడ్ – అది కూడా సరిగ్గా దొరకదు – బటర్, చీజ్, చిన్న మిల్కు కుందులు – ఇది శాంపిల్, హోటల్ నుంచి తెచ్చాను – అది చూపిస్తేనే అర్థమైంది వాళ్ళకు – మిల్క్ ప్రొడక్ట్స్ వీళ్ళు చాలా తక్కువ తింటారు. ఇవి కాక ద్రాక్ష, యాపిల్ దండిగా పెట్టుకున్నాం. 'నా భాషా పరిమితులే నా ప్రపంచపు పరిమితి' అంటాడు లుడ్‌విగ్ విట్‌జెన్‌స్టీన్. మర్నాడు ముందుగా కన్సీర్జ్ దగ్గరకు వెళ్ళి షాంగై నుంచి బీజింగ్‌కు బుల్లెట్ ట్రైన్ టికెట్లు ఆన్‌లైన్లో కొన్నాం. ముందుగా హోంవర్క్ చేసి నిర్ణయించుకున్నదే. మరీ పొద్దున్నే లేవటం, స్టేషన్‌కు రావటం హడావుడి అవుతుందని (7వ తారీఖు) ఉ. 11.00 గం॥లకు తక్కువచోట్ల ఆగే ట్రైన్‌ను ఎంచుకొని ఫస్ట్‌క్లాస్ టికెట్లకి కన్సీర్జ్‌కి కార్డుతో చెల్లించాం. 'ఒ.కె. మీ టికెట్లు రూంకు పంపుతాను' అన్నాడు.

*

ఈరోజు కార్యక్రమం రాత్రే నిర్ణయించుకున్నాం. షాంగైకి వంద కిలోమీటర్ల దూరంలో ఒక నీటినగరం (నగరం కాదు ఒక గ్రామం ఉంది) వెనీస్‌లాంటిదన్నమాట. ఇది రెండు ముఖ్య యాత్రావిశేషాలను దర్శించినట్లు. ఒకటి – వీరి గ్రామాలు ఎలా ఉంటాయి, రెండోది – నీటిలో ఎలా తేలుతుంది. అక్కడ గ్రామవాసుల జీవన, ఆరోగ్య ప్రమాణాలు – మానసిక స్థితి ఎలా ఉండవచ్చు.... మరొకటి కారులో రెండువందల కిలోమీటర్ల ప్రయాణం, రాను పోను ఎలా ఉంటుంది... ఇవన్నీ మన దేశ పరిస్థితులతో పోల్చుకోవటానికే ఈ యాత్ర పెట్టుకున్నాం. సన్నగా వర్షం మొదలైంది. బాగా చలిగా కూడా ఉంది. అయినా కన్సీర్జ్‌తో కాబ్ మాట్లాడమని చెప్పాం. బేరం కూడా చేశాం. దారిలో చూడవలసిన ప్రదేశాల బొమ్మలు, ప్రదేశాల బొమ్మల బ్రోచర్లు జాగ్రత్త

చేసుకొని, జాకెట్లు వేసుకొని, టోపీలు కూడా పెట్టుకున్నాం. క్యాబ్ డ్రైవర్‌ని గ్రీట్ చేసి (పేరు అడగకండి) – కార్లన్నీ మీడియం లగ్జరీ కారులే – చాలా సౌఖ్యంగా – రూమీగా ఉంటాయి. బయలుదేరాం. బయలుదేరే ముందు కాబ్ డ్రైవర్‌తో నాగ్‌ని ఫోటో తీసేవాణ్ణి. ఈ రోజు కూడా స్టార్‌బక్స్ బ్రేక్‌ఫాస్టే. బండ్ ప్రక్కగా వెళ్ళి రింగ్‌రోడ్‌లో నుంచి షాంగై సబర్బ్‌కు చేరాం. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు లేవు. జల్లులు పడుతున్నా, పరిసరాలు చక్కగా కనబడుతున్నాయి. రెసిడెంట్ అపార్ట్‌మెంట్‌లు ఎక్కువగా ఊరికి బయటగానే ఉన్నాయి. ఆ ప్రాంతంలోనే ఒకటి రెండు సినిమా హాళ్లు కనిపించాయి. ఇంటర్నేషనల్ బ్రాండ్ మాల్స్ ఎక్కడా కనిపించలేదు. జనాలు, క్రిక్కిరిసి తోసుకోవటం లేదు. అలాగే రాష్, రాంగ్ డ్రైవింగ్ లేదు. మనసు కుదుటగా, హాయిగా షాంగై దాటి, రయ్యిన వెనీస్‌వైపు కారు పరుగుపెడుతోంది. మాట్లాడటానికి ఏముంది – నేను ఒకవైపు నాగ్ ఒకవైపు చూస్తూ ఫోటోలు తీస్తున్నాం. కారులో రేడియోగానీ, పాటలుగానీ పెట్టరు. అడిగితే పెడతారేమో! కానీ మాకు చూడటానికే సమయం చాలదు. సిటీగాని, పరిసరాలుగానీ ఎంత రిచ్‌గా ఉన్నాయంటే ఐరోపా, అమెరికాకంటే బాగున్నాయనిపించింది. 30 సంవత్సరాల కాలంలో ఎంత మార్పు.... ఎంత పురోగతి, ఎంత సాంకేతికత, ఎంత కష్టం – అన్నీ ప్రతిఫలిస్తున్నాయి. 100 కిలోమీటర్లు అంతలోనే వచ్చేశాం. రెండు మూడు సర్కిల్ రూట్స్ దాటి, ఎడమవైపుకి 5 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ చైనా వెనీస్ నగర గ్రామంలోకి ప్రవేశిస్తాం. క్యాబ్ డ్రైవర్ జాగ్రత్తగా ఒక గ్రౌండ్‌లో పార్క్ చేసి మాకు దారిచూపాడు. మేము 2 గంటలలో తిరిగి వస్తాం అని అతనికి తెలిసేవిధంగా సైగలతో చెప్పాం. ఒక కాలవ మీద చిన్న వంతెన దాటి ఆ గ్రామంలో ప్రవేశించాం.

*

'గ్జీటాంగ్' – జోజాంగ్ జిల్లాలో చాలా పురాతనమైన గ్రామం. 1000 సంవత్సరాలుగా ఇక్కడ జనావాసం ఉంది. తరతరాలుగా చాలా ప్రశాంతంగా, ప్రకృతి సహజంగా, పరిసరాలు,



గ్జీటాంగ్



గ్జీటాంగ్ బ్రిడ్జి పైన

వాతావరణం అనుకూలంగా ఉండగా, వీరి జీవన సరళి మనోహరంగా ఉంది. 20 డిగ్రీలు టెంపరేచర్ దాటదు. చల్లగా, చలిగా, హాయిగా – ఒత్తిడి లేని బ్రతుకు తీరు కనిపిస్తుంది. ఎన్నో వంతెనలు, ఎన్నో వీధులు – అందరూ చేతిపనులే చేసుకుంటున్నారు. మిషన్లు, ఫ్యాక్టరీలు పరిసరాలలో లేవు. గ్జీటాంగ్ తూర్పు వెనీస్ అనవచ్చు. ఇలాంటిదే మరో నీళ్ళమీద నగరం ఉంది. దాని పేరు 'జౌజువాంగ్' నగరం. అది షాంగైకి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఆర్చ్ వంతెనలు, వెడల్పు కాల్వలు, చిక్కటి రంగులు – వారి సాంప్రదాయాన్ని వదలకుండా, హాయిగా జీవిస్తున్నారు ఇక్కడి ప్రజలు. ఇక పరిశుభ్రత – పరిసరాలన్నీ చిన్న కాగితం ముక్కగానీ, సిగరెట్ పీకగానీ, చెడు వాసనగానీ రాదు. వీళ్లు సిగరెట్లు విపరీతంగా కాలుస్తారు.

చిరు చినుకులు పడుతున్నాయి. వెలుతురు ఉంది. ఇరుకు వీధులు – ఊడ్చి ముగ్గేసినట్లున్నాయి. పెద్దగా టూరిస్టులు తిరుగుతున్నట్లు లేదు. మేమిద్దరం మాకిద్దరన్నట్లు ఒకరో ఇద్దరో కనిపిస్తున్నారు. అటు కాలువ, ఇటు కాలువ



ముదురు పెళ్లికూతురు

మధ్యలో వీధి – వీధికి అటూ ఇటూ కింద కొట్లు, పైన ఇళ్ళు. అంతే. స్కూటర్ కూడా తిరగదేమో! ఎక్కడా చెడు వాసన లేదు. చిత్తు కాగితం కూడా కనపడలేదు. ఓ ఖాళీ ప్రదేశంలో – ఒక ముదురు పెళ్ళికూతురు ఎర్రని జరీ గౌను, విసనకర్ర, సమస్త హంగులతో ఫోటోలు దిగుతోంది! వింత వింత ఫోజులతో. నేనూ ఫోటోలు తీశాను. షాపులు చూస్తూ, సీసాల్లోని తినుబండారాలు, వింత వింత ఆహార పదార్థాలు చూస్తూ, ఆకలి చంపుకుంటూ – 2 గంటలు తిరిగాం. ఇది చిన్న వెనీస్! బారుగా రెస్టారెంట్లు ఉన్నాయి. అప్పుడో పడవ, అక్కడో బోటు

కనపడుతుంది. దాదాపు వీధులన్నీ తిరిగాం. ఎవ్వరూ మమ్మల్ని వింతగా చూడటంలేదు. వారు ఎవరి కోసమూ ఎదురు చూడటంలేదు. తమ పని తాము చేసుకుపోతున్నారు. పెద్ద కాలువ, ఎత్తు వంతెన దాటి మరో పేటకు వచ్చాం. ఇక్కడ కాస్త వెడల్పు వీధులున్నాయి.


జాడీల జాతర

రెస్టారెంట్లలో కొందరున్నారు. గుంపులుగానీ, జన సాంద్రతగానీ కనపడలేదు. మరి ఎక్కడ చైనా జనాభా అంతా? చైనా ప్రజలు ఇంత ప్రశాంతంగా, ఎవరి ముఖానా ఆందోళన లేకుండా ఎలా ఉంటున్నారు? నేనిలా అనుకుంటుండగా నాకు ఆందోళన కలిగిస్తూ నాగ్ మాయమైపోయారు. తీరా చూస్తే ఆయన ఒక స్వెట్టర్ల దుకాణంలోకి దూరారు. 100 ఇవాన్లకు ఒక స్వెట్టర్ కొన్నారు. 'అయ్యా, కాస్త బేరం చేయండి' అన్నా. ఆయన చిరునవ్వుతో 'చాలా బాగుందండీ, ఇచ్చేద్దాం' అన్నారు. నేను చివరికి 90 ఇవాన్లు ఇచ్చి షాపు అతనితో ఫోటో కూడా దిగాం.

ఆ తరువాత మరో దుకాణంలో 'పండా' కొన్నాను కారులోకి. ప్రక్కనే ఉన్న దుకాణమో, రెస్టారెంటో రెండు మూడు బల్లలు వేసి, చిన్న కుర్చీలున్నాయి. వెళ్ళి కూర్చున్నాం. ఎవ్వరూ లేరు. అంతలో లోపలి నుంచి 14 సంవత్సరాల ఒకమ్మాయి వచ్చింది నవ్వుతూ. ఏం చెప్పాలి? అక్కడ మెన్యూ లేదు. గ్లాసుల్లో నుంచి ఏవో కనపడుతున్నాయి. బ్రెడ్డు కాదు, కేకులు కాదు, భాషా రాదు. ఆ పిల్లకి ఇంగ్లీషు రాదని తెలుస్తూనే ఉంది. ఇంతలో బీరు డబ్బాలు కనిపించాయి. రెండు మూడు రకాలు ఉన్నాయి. ఏదో తెలిసినట్లు అన్నీ పరీక్షించి, రెండు డబ్బాలు తీసుకున్నాం. అక్కడే బల్ల దగ్గర కూర్చొని మెల్లగా మొదలుపెట్టాం. అదీ ఆహారమే కదా. నాగ్ గుడ్లు తిందామన్నారు. వద్దు అవి బాతుగుడ్లు, వాసన అని వారించాను. అలా బీరు త్రాగి, ఆకలి తీర్చుకున్నాం. నేరేడుపళ్లు నంజుకున్నాం. అమ్మాయితో ఫోటో తీయించుకున్నాం. చివరికి కారు ఎక్కడ ఆపామో తెలియలేదు. వర్షం పెరుగుతోంది, చీకటి ముదురుతోంది. అలా రెండు వంతెనలు అటూ ఇటూ దాటాం. నీరంతా ఒకటేలా ఉంది. వీధులన్నీ అలాగే ఉన్నాయి. ఈ కాస్త సమయంలో


నేరేడుపళ్లు

కొండగుర్తులు ఏం పెట్టుకుంటాం.. తిరిగి, తిరిగి పెళ్ళికూతురు ఫోటోల దగ్గరకు వచ్చాం. అక్కడి నుంచి వచ్చిన దిక్కుకు ఎదురుగా వెళ్ళగా ఓ పెద్ద వంతెన, కార్లు వెళ్ళే పెద్ద రోడ్డు కనిపించింది. ఖచ్చితంగా దారి తప్పాం. కానీ దిక్కు తప్పలేదని తెలుస్తోంది. ఆ రోడ్ నుంచి 90 డిగ్రీలు వెనక్కు తిరిగి, మరో పెద్ద రోడ్‌లో ప్రవేశించాం. షాపులు చూసుకుంటూ ఎడమవైపు ఒక వీధిలోకి తిరిగాం. గుర్తుపట్టటానికి ఏమీ లేదు. ఇన్‌స్టింక్ట్ తప్ప. అలా మళ్ళీ వెనీస్‌లోకి నడవగా మమ్మల్ని చూసి డ్రైవర్ కారు తీసుకువచ్చాడు. మేము దారి తప్పినట్లు అతనికి కొంచెం కూడా అనుమానం రాకుండా నవ్వుతూ 'సారీ ఫర్ ది లేట్' అంటూ ఎక్కాం. అది అతనికి అర్థమయిందో లేదో. షాంగై అని చెప్పవలసిన అవసరం లేదుకదా! కారు రయ్యిన వెళ్ళిపోతుంది. లైట్లు వెలుగుతున్నాయి, సన్నటి చినుకులు పడుతూనే ఉన్నాయి. మనసు హాయిగా ఉరకలు వేస్తోంది. నాగ్ చిన్న పవర్‌నాప్ తీస్తున్నారు.

తిరుగు ప్రయాణంలో దీపాలతో వెలిగిపోతున్న ఆర్క్ బ్రిడ్జ్ అందాలు చూసి, పెరల్ టి.వి. టవర్ కాంప్లెక్స్ దగ్గర ఆగాం. చుట్టూ తిరిగి, అక్కడ ఉన్న రెస్టారెంట్లలో మేము తినగలిగిన కుకీలు, పాస్తా, కేకుల్లాంటివి తిన్నాం. టవర్ పైకి వెళ్ళడానికి హైస్పీడ్ లిఫ్టులు ఉన్నాయి. చాలా బారువరుసలో జనం వేచి ఉన్నారు. మేము ఉదయం నుంచి తిరిగి, అరిగిపోయి ఉన్నాం కదా. వద్దనుకుని హోటల్ దారి పట్టాం. అప్పటికే రాత్రి. 8.00 గంటలవుతుంది. చలి చిక్కబడింది. షాంగై నది గాలులు వేగాన్నందుకున్నాయి. రాత్రి క్రూజ్‌లు బద్ధకంగా బండ్ ప్రక్కనే వెళుతున్నాయి. హోటల్ పోర్టికోలో కారు దిగి, డ్రైవర్‌కి డబ్బు ఇచ్చి పంపాం. అతను హ్యాపీగా నవ్వుతూ తీసుకొని కొద్దిగా తల, నడుము వంచి అభివాదం చేసి వెళ్ళిపోయాడు. అప్పటికే కన్సీర్జ్ కూడా డ్యూటీ దిగి వెళ్ళాడు. రిసెప్షన్‌లో సాంగ్ ఉన్నాడు. నవ్వుతూ నా డిపాజిట్ అడిగాను. కార్డ్ ఇవ్వమన్నాడు.



ఆర్క్ బ్రిడ్జ్ వైభవం

తీసుకొని 7 వేల ఇవాన్లు రివర్స్ ట్రాన్జాక్షన్ చేశాడు. బిల్ కూడా ఇచ్చాడు. కానీ నా ఫోనుకు డిపాజిట్ మెసేజ్ రాలేదు. 'యు విల్ గెట్ ఇట్' అన్నాడు. సరే, బీజింగ్ హోటల్‌కి ఫోన్ చేసి మా రిజర్వేషన్ ఉందో లేదో కనుక్కోమన్నాను. గ్రీన్ ట్రీ హోటల్‌కు



పెరల్ దీవిలో దీపావళి

కాల్ చేసి చైనీస్‌లోనే మాట్లాడి ఒ.కె. అని నవ్వాడు. మెల్లగా లాబీ దాటి, ఎలివేటర్‌లో 14 వ అంతస్తు కారిడార్‌లోకి చేరాం. ఎవరూ కనపడరేం.. 1405లో అడుగుపెట్టాం. గది చక్కగా సర్ది ఉంది. నేను ఫ్లోర్ టు సీలింగ్ విండో కర్టెన్లు తీశాను. నది వెలుగు ప్రవహిస్తోంది. బండ్ మీద పండుగ జరుగుతోంది. షాంగై హయత్ ఆన్ బండ్ హోటల్ 14వ అంతస్తు కార్నర్ స్వీట్ నుంచి షాంగై నదిని చూస్తుంటే అది ఒంపు తిరిగి, పెరల్ టవర్ దీవి చుట్టూ నడుస్తోంది. అంతలో నాగ్ సింగిల్ మాల్ట్ ఆన్‌రాక్స్ తెచ్చారు. రెండు, కట్‌గ్లాసుల్లో.

Oh! Fumes of Poison – how warm!
Aroma of English Malt – how tempting!
Sweetness of Scottish waters, how wanting!
Spirits of Melting Rocks – how swindling!
Oh, oh, oh, Fumes of Poison – oh –
Whither we go...... we go......
.... Golden hues of Sun dipping –
Dungeons of Darkness gripping –
Oh, oh, oh, Fumes of Poison – oh!
Whither...... we go..... we go.....



స్వెటర్ షాపు

అలా అర్ధరాత్రి 12.00 గం॥లవరకు స్పిరిట్యుయల్ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. వీళ్ళెక్కడ ఉన్నారు, మనమెక్కడ ఉన్నాం.. కాంతి సంవత్సరాల అంతరం అన్నాను. మన డెమోక్రసీ, మాకరీ, హిపోక్రసీ – అన్నీ కలిపితే మన

రాజకీయం. ఎక్కడ ఎప్పుడు జరిగిందో పొరపాటు... ఇప్పుడు దిద్దుకోలేకపోతున్నాం. ఆలోచించేవాడికి అన్నీ చింతలే. అలా మథనపడుతూ, ఇండియా నుంచి తెచ్చుకున్న మిక్చర్ తింటూ, నది నడక చూస్తూ; ఒక్కొక్క క్రూజ్ ఇంటికి చేరిపోతున్నాయి. చివరికి ఒంటరిగా నది తనదారిన తానూ వెళ్ళిపోతోంది. వెలుగేదో, వెన్నెలేదో ఇక్కడ తెలిసేదెలా... చుక్కలు ఎక్కడున్నాయి వెతికేదెలా... మెల్లగా మెలమెల్లగా నిద్రలోకి జారుకున్నాం. అలసిపోయాం. కలలు కూడా రాలేదు ఈ రాత్రి. ప్రపంచ నగరాలలో ఎక్కువ శాతం నదుల అంచునే నిర్మించబడ్డాయి. లండన్, థేమ్స్ ఇరుప్రక్కలా – పారిస్ సీన్ నది బారునే, వాషింగ్టన్, పోటమిక్ నది ప్రక్కనే, బాంగ్‌కాక్ షావో ప్రాయా నదికి రెండువైపులా నిర్మించబడినవే. ఇవన్నీ నీటియెద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా నిర్మించుకున్న ప్రదేశాలే. మరో ముఖ్య విషయం – సముద్రం నుంచి ఓడలు, నగరం మధ్యలోకి రావటానికి వీలుగా నీటి మార్గం కోసం ఏర్పాటు చేసుకున్నవి. పూర్వం రోజులలో సముద్ర మార్గాన్నే ముఖ్యమైన వ్యాపార రవాణా జరిగేది కదా.

భారతదేశానికి మూడు ప్రక్కలా సముద్రమున్నా నదుల ద్వారా ఓడలు నగరాల మధ్యకు వచ్చే అవకాశం లేదు. ఒక్క గోవాలో మాత్రం మాండోవి, జువారీ నదుల ద్వారా ఈ అవకాశం ఉంది. ఇదంతా ఎందుకంటే షాంగై నగరం ప్రత్యేకతలు తెలిపేందుకే. హువాంగ్ పూ (దీన్నే ఆంగ్లేయులు వాంగ్ పూ అన్నారు) నది – చుట్టూ నిర్మించబడింది. అదీ ఒక రోజులో కాదు ఒక్కరివల్లనో కాదు. 1850 నుంచి 1980 వరకు ఒకరకమైన మార్పులు చోటుచేసుకుంటే తర్వాత 35 ఏళ్లలో కళ్లు చెదిరే నగరం అంత అందంగానూ రూపుదిద్దుకుంది. నది నగరం చుట్టూ తిరుగుతోందా, నది చుట్టూ నగరం కట్టారా అని మనకు అనుక్షణం అనుమానం కలుగుతూనే ఉంటుంది. షాంగై నగరం, గత శతాబ్దంన్నరగా వ్యాపార కూడలి. ఇది, ప్రపంచ సముద్ర వ్యాపారానికి చైనాకు ముఖద్వారం. ఇక్కడే ఇంగ్లీషు వారు టీపొడి కోసం, చైనీయులకు



పేకాటరాయుళ్లు



swfc


నల్లమందు బలవంతాన అంటగట్టే ప్రయత్నం చేస్తే ఓపియం యుద్ధాలు రెండు జరిగాయి. ఇంగ్లీష్‌వారికి టీపొడి కావాలి. వారి దగ్గర తిరిగి ఇవ్వడానికి మరో కమోడిటీ లేదు. అందుకని భారత్, బర్మాల నుంచి నల్లమందు ఓడలలో తెచ్చి బలవంతాన అంటగట్టేవారు. దానికలవాటు పడుతున్న చైనా సైనికులు నిర్వీర్యమౌతుంటే దీనిని Qing Dynasty పాలకులు వ్యతిరేకించారు. అప్పుడు మొదటి ఓపియం వార్ జరిగింది (1839–1842). అందులో అప్పటికే నల్లమందుకు అలవాటుపడిన చైనా సైనికులు ఓడిపోయారు. ఆ విధంగా హాంగ్‌కాంగ్‌ను ఇంగ్లీష్‌వారికి తాత్కాలికంగా ఇవ్వవలసి వచ్చింది. మళ్ళీ రెండవ ఓపియం వార్ (1856–60) జరిగినపుడు పరిస్థితి ఏమీ మారలేదు. అప్పుడూ ఆంగ్లేయులు పైచేయిగా నిలిచారు. హాంగ్‌కాంగ్‌తోపాటు కౌలూన్, న్యూ టెరిటరీస్ (దాదాపు రెండువందల దీవులు) 99 ఏళ్ళకు అద్దెకు ఇవ్వవలసి వచ్చింది. అది 1997లో ముగిసింది. అప్పటివరకు షాంగై అభివృద్ధి నత్తనడకనే సాగింది. చైనా పూర్తిగా షాంగై పాలన చేతిలోకి తీసుకోవటంతో ఆ నగరానికి దశ తిరిగింది. ఇప్పుడు ప్రపంచంలోని అత్యంత సుందర నగరంగా వెలిగిపోతోంది. ఎక్కడా మురికి వీధులు, మురికి వాడలు, మురుగు వాసన మచ్చుకైనా కనపడలేదు. ఇదెలా సాధ్యమైంది? ఆ విషయం చెప్పేముందు షాంగైలో మేము దర్శించిన ముఖ్యమైన ప్రదేశాల గురించి తెలియజేస్తాను.

మొదటిది: షాంగై వరల్డ్ ఫైనాన్షియల్ సెంటర్. 'లూజియా జూయీ' అనే ఫైనాన్షియల్ జోన్ మధ్యలో ఈ 101 అంతస్తుల అద్దాల మేడ రెండు వేల అడుగల ఎత్తుకు పైగా నిలబడి ఉంటుంది.

దాని అద్దాలలో చుట్టూ ఉన్న నగరం తన అందం చూసుకుంటూ ఉంటుంది. టాప్‌లో అబ్జర్వేటరీ, మధ్యలో ఫైవ్‌స్టార్ హోటల్, ఆఫీసులు – షోరూమ్‌లు ఒకటేమిటి అదో ప్రపంచం.

రెండవది: అక్వేరియం. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అక్వేరియంలు చూశాం. కానీ షాంగై అక్వేరియంకు ఏదీ సాటిరాదు. షార్క్‌ల దగ్గర నుంచి జెల్లీఫిష్‌లవరకూ

రంగురంగుల వింతవింతలు అద్దాల వెనక నుంచి మనలను పలకరిస్తుంటాయి. రెండు మూడు గంటలు రోడ్డుకు నాలుగు అంతస్తుల కింద అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయాం.



మూడవది: సమకాలీన ఆర్ట్ మ్యూజియం. ఇందులో పెయింటింగ్స్ ఏమీ ఉండవు. ఇప్పుడు ఆవిష్కరింపబడుతున్న వింతవింత ఎలక్ట్రానిక్ ఆర్ట్ ఫామ్స్, డిజైన్స్ మనలను ఆశ్చర్యపరుస్తాయి.



నాల్గవది: న్యాచురల్ మ్యూజియం. ఇది ఒక నత్తగుల్ల ఆకారంలో రూపకల్పన చేసిన అయిదారు అంతస్తుల మార్వెల్. అందులో ప్రదర్శనకు పెట్టిన ప్రీ హిస్టారికల్ అస్తిపంజరాల పరిమాణం మనల్ని భయపెడుతుంది. ఎన్ని జంతువుల అస్తిపంజరాలు! మేము వెళ్ళిన రోజు మ్యూజియం మొత్తం విద్యార్థులతో నిండిపోయింది. మూడు గంటలు పైగా తిరగాలి అన్నీ చూడాలంటే.



అయిదవది: యుయువాన్ గార్డెన్ – బజార్. ఇది అచ్చంగా చైనా ఆర్కిటెక్చరల్ పగోడా. ఈ చేతి పనుల వింతలతో నిండివున్న మిడివెల్ చైనా భవనం చుట్టూ నీటిలో కలువపూలు తేలుతుంటాయి, తెల్లని హంసలు తిరుగుతుంటాయి. మీరూ చిన్న బోటులో తిరగవచ్చు. లోపలికి వెళ్లే వంకర టింకర బ్రిడ్జి వాక్–వేలు జనంతో క్రిక్కిరిసిపోయి ఉంటాయి.



ఆరవది: మ్యాగ్ లెవీ ట్రైన్. ఫ్రాన్స్ గొప్పగా చెప్పుకునే ఈ మ్యాగ్ లెవీ టెక్నాలజీని చైనావాళ్ళు ఎలా తెచ్చారో మరి! ఈ గాలిలో తేలే రైలు గంటకు

430 కి.మీ. వేగంతో పరుగులు పెడుతుంది. ఫుడాంగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి షాంగై మెట్రో స్టేషన్ వరకూ ఇది గాలిలో ప్రయాణిస్తుంది.

ఏడవది: షాంగై సర్కస్. ఇది ప్రపంచంలోనే ప్రాణాలకు తెగించి చేసే అక్రోబెటిక్ సర్కస్. మనలోని స్కూలు కుర్రాణ్ణి తట్టి లేపే ఈ సర్కస్ ఫీట్‌లు చూసి మనం నోరు తెరచి తెల్లబోవాలి. ముఖ్యంగా 'ఇంటర్ సెక్షన్ ఆఫ్ టైమ్ షో'. టికెట్లు చాలా ఖరీదు. 12 వేలకు పైనే. ఇక్కడితో విశేషాలు ఆపి, షాంగై నగరం గురించి తెలుసుకుందాం.

బండ్:

షాంగై నగరం రూపురేఖలతో ముడిపడి ఉంది 'బండ్.' ఇది హిందూస్థానీ మాటే. మన టాంక్‌బండ్ మాదిరే. ఇది నదికి – నగరానికి హద్దు. ఇది ఎన్ని రూపాంతరాలు చెందిందో సంవత్సరాలతో సహా బొమ్మలు ఇస్తాను చూడండి.

చైనాలో కమ్యూనిజం రాక పూర్వం షాంగై ప్రపంచ వ్యాపారానికి ముఖద్వారం. సౌత్ చైనా సీ నుంచి ఓడలలో వచ్చిన యాత్రికులు, వ్యాపారస్తులు షాంగై కస్టమ్స్ హౌస్ దగ్గర దిగి ఆశ్చర్యపోయేవారు. మనం చైనా వచ్చామా దారితప్పామా అని. షాంగై ఎప్పుడూ ఆధునికంగా ఉండేది. అక్కడ ఒక్క పగోడా కూడా లేదు. అసలు చైనావాళ్ళే కనపడేవారు కారు. వెదురు బొంగులతో, చెక్కముక్కలతో కట్టిన నగరం కాదు షాంగై. పూర్తిగా ప్రపంచ స్థాయిలో వ్యాపారపరంగా కొనసాగుతున్న నగరం. హాంగ్‌కాంగ్ నుంచి వేల టన్నుల



ఇప్పటి బండ్ వైభవం – హయత్ టవర్స్

రాళ్ళు వచ్చాయి. ఇటలీ నుంచి పాలరాతి ఫలకాలు చేరాయి. పునాదుల కోసం వెనీస్‌లోలాగా ఓరిగన్ పైన్ చెట్లు నిలువునా దింపారు. సోమర్‌సెట్ నుంచి కంచు తీసుకువచ్చారు. వెనీస్ నుంచి మొజాయిక్ రూపుదిద్దుకుంది. కస్టమ్స్ హౌస్ పైన పెద్ద గంట, ఇంగ్లండ్ – లౌబరో నుంచి పోతపోసి తెచ్చారు. ఈ బండ్ – 1949 వరకు అక్కడ వ్యాపార సంస్థల లెటర్‌హెడ్ మీద తప్పనిసరిగా ఉండేది. ఇది ఒక ఐకాన్. పోస్ట్‌కార్డుల మీద ముద్రించేవారు. బండ్ స్కైలైన్ బీజింగ్ గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో షాంగై రూంలో గర్వంగా అలంకరించబడి ఉంది. టిబెట్ లాసా పుస్తకాల షాపులలో కూడా బండ్ పోస్టర్లు అమ్ముతారు.

ఇప్పుడు మీరు బండ్ గార్డెన్ దారిలో నడుస్తుంటే, పైనుంచి ఆకాశ హర్మ్యాలు వంగి చూస్తుంటాయి. ట్రాఫిక్ గోల ప్రక్కనుంచే పోతుంటుంది. గ్రిఫిన్ – గరుడ పక్షి సింహం కలిసిన ఒక మాయ జంతువు – ఇంకా ప్రాణాలతో ఉన్నట్లు అనిపిస్తుంది. అంతేకాదు – అంతర్జాతీయ వ్యాపారపు ఆటుపోట్లను, జపాన్ ఆక్రమణను కూడా తట్టుకొని ఈ 'మహాగట్టు' నిలబడింది ఇప్పటికీ. దాని తీరుతెన్నులు 1830 నుంచి ఇప్పటివరకు ఎలా మారిందో చూడండి. ఒక నగరానికి ఒక ఐకాన్ ఉంటుంది. షాంగైకు 'బండ్' ఒక ఐకాన్. అందుకే మేము 'హయత్ ఆన్ ది బండ్' హోటల్‌లో దిగాం. షాంగై క్లబ్‌లో ప్రపంచంలోనే పొడవైన బార్ కౌంటర్ ఇప్పటికీ ఉంది. ఇది టైప్ చేస్తున్న ఆశారాణి ఈ సోదంతా ఎందుకని అడిగింది. 'అమ్మా, ట్రావెలోగ్ అంటే: ఒకటి – ప్రజలు, రెండు – ప్రదేశం, మూడు – సంస్కృతి, నాలుగు – చరిత్ర. ఇవి నాలుగూ తెలియజేయకపోతే పాఠకులకు ట్రైన్ దిగాము, రిక్షా మాట్లాడుకున్నాం, చిల్లర ఇచ్చాం అని చెప్పాల్సి వస్తుంది' అని నిర్వచనం చెప్పాను.

* * *

షాంగై కస్టమ్స్ హౌస్:

ఏ దేశానికైనా సరుకు రవాణా చేయాలి అంటే సుంకం కట్టి తీరాలి. దానినే కస్టమ్స్ అంటాం. షాంగై వ్యాపారమంతా సముద్రపు రవాణామీద ఆధారపడి ఉంది కదా! అందుకే ఇక్కడ కస్టమ్స్ హౌస్ చూడకుండా ఏ వ్యాపారమూ జరగదు. దీని చరిత్ర బొమ్మల్లోనే చూద్దాం.

హాంగ్‌కాంగ్ – షాంగై బ్యాంక్:

షాంగై నగరం వ్యాపారంతో పెనవేసుకుపోయిన ఈ బ్యాంకు ఎన్నో ఆటుపోట్లకు గురై ప్రపంచంలో పెద్ద బ్యాంకుల వరుసలో చేరింది. అంతటి సుదీర్ఘమైన (శతాబ్దన్నర) చరిత్రగలిగిన బ్యాంకు భవనం మనం చూసి తీరవలసిందే. షాంగై చరిత్ర



షాంగై కస్టమ్స్ హౌస్

తెలుసుకున్న తర్వాత షాంగై వీధుల్లో రెండు రోజులు నడిచి, చైనా బజార్లన్నీ తిరగవేశాం. వారి సౌమ్యత, నిజాయితీని అభినందించకుండా ఉండలేం. ఎప్పుడూ మీకు సహాయం చేయటానికి సిద్ధంగా ఉంటారు. ఇరుకు మార్కెట్లు, జనరల్ బజార్లు భయం లేకుండా తిరిగాం. ఎక్కువగా ఆడపిల్లలే చలాకీగా హెయిర్ పిన్నుల దగ్గర్నుంచి ఐఫోన్ల వరకు విరివిగా అమ్ముతున్నారు. హాండ్‌బాగ్‌లు, సూట్‌కేసులు కారు చౌక. నాణ్యమైనవే. రిమోట్ కార్లతోపాటు డ్రోన్‌లు బజార్లో పెట్టి అమ్ముతున్నారు. యువతీ యువకులు ఎంతో చైతన్యవంతంగా వ్యాపారం చేస్తున్నారు. మోసపుచ్చాలనే ఆలోచనకు తావేలేకుండా చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. రెండు రోజుల్లో పెద్ద మూటే కొన్నాం. అంతా కలిపి మూడు నాలుగువందల ఇవాన్లే. మోయలేని బరువు మోసుకుంటూ హోటల్ చేరాం. అవన్నీ సర్దేసరికి అర్ధరాత్రి దాటింది. మర్నాడు బీజింగ్ ప్రయాణం బులెట్ ట్రైన్‌లో. ఆ రాత్రి అద్దాల కిటికీ దగ్గర సోఫా వేసుకుని ఫ్యూమ్స్ ఆఫ్ పాయిజన్‌తో కూర్చుండిపోయాను. రేపు ఈ నదిని, ఈ గ్లాసుని, ఈ కిటికీని, ఈ హోటల్‌ను, ఈ నగరాన్ని వదలి వెళ్ళిపోవాలి. ఒక్కసారి కిందకు దిగి బజార్లోకి వెళ్ళాను. లైట్లలో వెలిగిపోతున్నా నిర్మానుష్యంగా ఉంది, చాలా చలిగా కూడా ఉంది. నది నిద్రకళ్ళతో నడుస్తోంది. ఏమిటి? ఈ నది నిద్రపోదా? ఈ నీరంతా ఎక్కడకు పోతోంది? ఎన్ని తరాలుగా ఈ ప్రవాహం ఎంతమందిని ఈ నేలకు తీసుకు వచ్చింది? ఎందుకు? దానికేమీ పనిలేదా? ఏ స్వార్థమూ లేకుండా ఇంత సేవ ఎందుకు చేస్తుంది? సిద్ధార్థలో నది గుర్తుకు వచ్చింది. వాసుదేవ! 'అవును. నది అన్నీ నేర్పుతుంది' అని అంటాడు. అది నిజమేనని అనిపిస్తోంది... అలా ఎంతోసేపు ఆ చల్లని గ్రనేట్ మీద కూర్చొని, మెల్లగా హోటల్ లాబీకి

వచ్చాను. రిసెప్షన్‌లో అప్పుడు కూడా నవ్వుతూనే హాయ్ చెప్పాడు. మెల్లగా లాబీ దాటి, లిఫ్టులో – కార్డు చూపితేనే అది కదులుతుంది – అలా రూముకు చేరాను. నాగ్ నిద్రపోతున్నారు! అలా ఎంతసేపు కూర్చున్నానో నదిలో నక్షత్రాలను చూస్తుంటే ఒక్కసారిగా నిన్న చూసిన బుద్ధుని ఆలయం గుర్తుకు వచ్చింది. ప్రార్థన చేయటానికి మోకాళ్ళు నొచ్చుకుండా దిండ్లు ఉన్నాయి. ఎవరో నిర్వాణం చెందినట్లున్నారు. అక్కడ పేర్లు రాసి ఉన్నాయి. వారి బంధువులకు, స్నేహితులకు ఆహారం అందిస్తున్నారు.



షాంగై – బండ్
ప్రధాన రూపశిల్పి

జీవన మరణాలు తప్పనిసరి. మతమేదైనా మనుషులు ఎక్కడ ఉన్నా – అంతా నిశ్శబ్దంగా జరిగిపోయింది. ఇప్పుడు, నది కూడా నిద్రపోతోంది. నాకే నిద్ర రావటంలేదు. మర్నాడు పొద్దున్నే బండ్ మీదకు నడకకు వెళ్ళాం. మంచుతెరలు విడిపోలేదు. గులాబీలు తడిగానే ఉన్నాయి. ఓ చైనా యువతి ట్రాలీతో ఓ పెద్దాయనతో బండ్ బెంచ్ మీద కూర్చుంది. మమ్మల్ని చూచి హాయ్ చెప్పింది. అప్పుడే గ్రీసు, ఇటలీ నుంచి యాత్రకు తన తండ్రితోపాటు వెళ్ళి వస్తోంది. ఎయిర్‌పోర్ట్ నుంచి సరాసరి బండ్ మీదకే వచ్చింది. మాతో ఎన్నో కబుర్లు చెప్పింది. ఫోటోలూ దిగాం. 'ఐ లవ్ దిస్ బండ్' అంది.

ఉదయం 9.00 గం॥లకు చెక్‌ఔట్. అయితే ఇంతవరకు నా డెబ్భైవేలు బ్యాంకుకు రాలేదు. హోటల్ మేనేజర్ 'డోంట్ వర్రీ, యు విల్ గెట్ ఇట్' అంటున్నాడు. ఆ నమ్మకంతోనే ఉన్నాం. బులెట్ ట్రైన్ స్టేషన్‌కు (నార్త్) బయలుదేరాలి. సన్నగా వర్షంపడుతోంది. క్యాబ్‌లో కూర్చున్నాం. షాంగై ఆకాశ హర్మ్యాలు వెనక్కు వెళ్ళిపోతున్నాయి. బ్రిడ్జి దాటి, బండ్ దాటి కారు పరుగులు పెడుతుంటే ఈ నాలుగు రోజులకే ఈ నగరం నా నరాల్లోకి చేరిపోయిందా అన్నట్లు దిగులుపుట్టింది. మళ్ళీ రాము కదా అనుకుంటూ కారు వెనక అద్దంలో నుంచి తిరిగి తిరిగి చూశాను. అంతటి నగరం నీటి తుంపరల తెరలలో



నాగ్‌తో తండ్రీ కూతుళ్లు

మరుగునపడిపోతుండగా స్టేషన్‌కు చేరాం. ఏమిటి, ఇది రైల్వేస్టేషనా? మేము దిగిన షాంగై ఎయిర్‌పోర్ట్‌కంటే అధునాతనంగా ఉందే! ఎన్ని ఫ్లాట్‌ఫారాలు? బ్యాగులు స్క్రీనింగ్, సెక్యూరిటీ అంతా మామూలే! అయితే అంతా చకచకా జరిగిపోయింది. ఇక స్టేషన్ ఎక్కడా స్తంభాలు లేకుండా యాభై అడుగుల ఎత్తు సీలింగ్‌తో చాలావరకు ప్రకృతి వెలుగుతోనే ఉంది. జనం ఉన్నా తోపులాట లేదు. అరుపులు, కేకలు అసలే లేవు. అనౌన్స్‌మెంట్ గొడవ లేదు. మాది పన్నెండవ ఫ్లాట్‌ఫారం. అక్కడికి దగ్గరలోనే లాంజ్‌లో కూర్చున్నాం. కొంతసేపు తిరిగాం. మధ్యలో పెద్ద



షాంగై చివరిచూపు

బ్రాండు షోరూంలు ఉన్నాయి. సరిగ్గా పదిన్నర గంటలకు గేటు తీశారు. ఇరవై అడుగులు మెట్లు దిగాం. అంతే – తెల్లగా – బ్లు – రెడ్ లైన్లతో వెలిగిపోతోంది బులెట్ ట్రైన్. ఫస్ట్‌క్లాస్ కారులో మా సీట్లు – రెండు – రెండు మధ్యలో దారి. ట్రైన్ హోస్టెస్ సహాయంతో సర్దుకున్నాం. అయిదు నిమిషాల్లో బీజింగ్ బయలుదేరుతోంది. తలుపులు మూసుకున్నాయి. ఈ రైలు 320 కి.మీ. వేగంతో వెళుతుందా? ఎంత శబ్దం చేస్తుందో, ఎంతగా ఊగిపోతుందో అనుకుంటూ కూర్చున్నాం. బులెట్ ట్రైన్ మెల్లగా బయలుదేరింది. ఖచ్చితంగా 11.00 గం॥లకు – పదమూడు వందల పైగా కి.మీ. ప్రయాణానికి.....




షాంగై హయత్ మిస్టర్ సాంగ్

షాంగై– బీజింగ్ బుల్లెట్ ట్రైన్:



బీజింగ్ సౌత్ రైల్వేస్టేషన్

షాంగై – డాలియన్ రైల్వే స్టేషన్ నుంచి సరిగ్గా 11.00 గం॥లకు నెమ్మదిగా బయలుదేరిన బుల్లెట్ – మెత్తగా, పెద్దగా శబ్దం లేకుండా ఉత్తరానికి పరుగులు పెడుతోంది. అంతలోనే షాంగై పొలిమేరలు దాటి, గంటకు 300 కి.మీ. పైగా వేగంతో దూసుకుపోతోంది. మేము ముందుకే వెళుతున్నాం. అన్ని సీట్లూ ముందువైపుకే ఉన్నాయి. ట్రైన్ హోస్టెస్‌లు వచ్చి స్నాక్స్ – హెర్బల్ డ్రింక్ ఇచ్చారు. వీడియో కెమెరా బయటకు ఫోకస్ చేసి అలాగే ఉంచాను. రెండు మార్గాలు – రెండు వైపులా రక్షణ కుడ్యాలు. అసలు కుదుపు, శబ్దం లేకుండా ఈ ప్రయాణం – ఎదురుగా మరో బుల్లెట్ ఆ గాలి – ఈ గాలి తాకిడికి కొద్దిగా కుదుపు. అంతే. దూరంగా ఏవో ఊళ్లు. మరేవో కాలువలు. ఏవేవో పొలాల్లో పంటలు. కానీ ఎక్కడా మనుషులు మనలాగా పొలాల్లో నడుం వంచి పనిచేయటంలేదు. గొడ్డు గోదా ఏ జంతువూ కనబడటంలేదు. నీళ్లకు కరువు లేదు. అసలు ఈ రైలేమిటి? దీని చరిత్రేమిటి? ఇన్ని దేశాలు తిరిగాను. ఎక్కడా లేదే. యూ రైల్‌లో ప్రయాణం చేశాను – యాంట్రాక్‌లో తిరిగాను. లండన్ అండర్ గ్రౌండ్‌లు – ఓవర్ గ్రౌండ్‌లలో ఎన్నో రోజులు తిరిగాను. న్యూయార్క్ సబ్–వేలో నెలల తరబడి తిరిగాను. ఆ మోతలు భరించలేం. లండన్ అండర్ గ్రౌండ్, న్యూయార్క్ సబ్–వే ప్రయాణంలో తోటి ప్రయాణికులు ఉలకరు, పలకరు. తోలు బెల్టులకు వేళ్లాడుతూ కదులుతున్న శవాలలాగా నాకు కనిపించారు. కానీ వీటన్నిటికీ భిన్నంగా ఇంత వేగంతో (ఎంత వేగమో మానిటర్‌లో కనిపిస్తోంది), ఇంత మెత్తగా ఎక్కడా నేనెక్కిన రైలు ప్రయాణం చేయలేదు. చైనాలో రైలు ప్రయాణం గురించి చెబుతాను వినండి.



బీజింగ్ బులెట్

మీకు తెలుసా? ప్రపంచంలో అన్ని దేశాలలోని హై-స్పీడ్ రైలు రోడ్లన్నీ కలిపినా ఇప్పుడు చైనాలో ఉన్న ఈ హై-స్పీడ్ రైలు బెడ్‌కు సరిపోవు. అమెరికా - కాలిఫోర్నియాలో 500 మైళ్లు హై-స్పీడ్ ట్రైన్ ట్రాక్ పూర్తి చేయటానికి 2029 వరకు వేచి ఉండాలి. కానీ చైనాలో మరో 5 ఏళ్లలో 5 వేల కి.మీ. ట్రాక్ పూర్తవుతుంది. అంటే చైనా పాలకులు ఈ హై-స్పీడ్ రైళ్లు (విమానాలు కాదు) వారికి ముఖ్యమైన ప్రయాణ సాధనమని గుర్తించి, ఎప్పుడో కార్యాచరణకు దిగారు.


ఫస్ట్‌క్లాస్ - 180 డిగ్రీలు తిరిగే సోఫాలు

విమాన ప్రయాణం చాలా ఖరీదు. చాలా ఇంధనం కావాలి. చైనాకు క్రూడ్ ఆయిల్ లేదు. ఆ దిగుమతుల మీద ఆధారపడకుండా హై-స్పీడ్ రైళ్లు ఏర్పాటు చేసుకున్నారు. అన్ని దేశాలూ విమానాలు తయారు చేయవు. అమెరికా నుంచి, ఫ్రాన్స్ నుంచి వేల కోట్లు పోసి కొనాలి. అందుకే మన విమాన సంస్థలు అప్పులపాలై దివాళా తీస్తున్నాయి. కానీ చైనా ఈ సొమ్ము హై-స్పీడ్ రైల్ రోడ్ల కోసం, రైల్ కార్ల కోసం ఖర్చు చేసి ఇప్పుడు అన్ని రూట్లలో బుల్లెట్ ట్రైన్లు నడుపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువమంది సుఖంగా, క్షేమంగా గమ్యం చేరవచ్చు. ఇందులో రెండు రకాలున్నాయి. ఒకటి - జి ట్రైన్. ఇప్పుడు మనం ప్రయాణిస్తున్నది. గంటకు 320 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది.


నేను - నాగ్

రెండవది డి ట్రైన్. ఇది గంటకు 200 కి.మీ. పైన ప్రయాణిస్తుంది. టిక్కెట్ ఖరీదులో పెద్దగా తేడా లేదు. మనకు అనుకూలమైన సమయాన్ని ఎంచుకొని ప్రయాణించటమే. ముఖ్యమైన రూట్లు - షాంగై, బీజింగ్, గుయిరెన్.


బులెట్ ట్రైన్ - ఫస్ట్‌క్లాస్ కారు

ఈ రూట్లలో జి ట్రైన్లు నడుస్తాయి. వీరు పాసింజర్ బోయింగ్ విమానాలు కూడా సొంతంగా ఇప్పుడు తయారు చేసుకుంటున్నారు. మేము బీజింగ్‌లో ఉండగానే సి–90 అనే బోయింగ్ ఎగరటం మొదటిసారిగా చూశాం. చైనా జనాభా అంతా ఉత్తర – దక్షిణాలకు, తూర్పు తీరాలకు వ్యాపించి ఉంది. సెంట్రల్ అంతా ఇండస్ట్రీకి, వెస్ట్రన్ అంతా వ్యవసాయానికి కేటాయించారు. 3 గోర్జియస్ డ్యామ్ ఒక్కటే చాలు వీరికి కరంటు, నీటి అవసరాలకు సరిపోతుంది. మళ్లీ మనం రైలు ప్రయాణానికి వద్దాం. అన్ని హై–స్పీడ్ రైలు కార్లు ఎయిర్‌కాన్లే. అన్ని సీట్లు 180 డిగ్రీలు తిరుగుతాయి. మనం ఎప్పుడూ ముందుకే వెళతామన్నమాట. రెండు ఫస్ట్‌క్లాస్ కార్లు, పది సెకండ్ క్లాస్ కార్లు ఉంటాయి. ఒక ఎగ్జిక్యూటివ్ కారు కూడా ఉంటుంది. అది చాలా ఖరీదు. సీట్లన్నీ నిండిపోతాయి. టికెట్లు కొనటం ఎలా? అన్ని ఆన్‌లైన్లో చేసుకోవచ్చు. రూటు, క్లాసు, కారు, సీటు నెంబర్లతో సహా కార్డుతో చేసుకోవచ్చు. మీకు ఇ–మెయిల్ వస్తుంది. అది చూపిస్తే స్టేషన్లో మీ టికెట్లన్నీ ఒక్కమాట కూడా అడగకుండా ఐ.డి. చూసి ఇచ్చేస్తారు. భాషతో పనిలేదు. మీ ట్రైన్ నెంబరు, బయలుదేరే సమయం, గేట్ నెంబరు, కారు నెంబరు చాలా తేలికగా చూసుకోవచ్చు. సీట్‌లో కూర్చొని మీ బుల్లెట్ ప్రయాణానికి సిద్ధం కావచ్చు. ఇక వెయిటింగ్ హాల్స్, అద్భుతంగా ఉంటాయి. 30–40 గేట్లుంటాయి. ఫాస్ట్‌ఫుడ్, బ్రాండ్ షోరూమ్‌లు చూస్తూ కాలక్షేపం చేయవచ్చు. అరుపులు, కేకలు ఉండవు. బ్లేరింగ్ టి.వి.లు ఉండవు. రోజూ డజన్ పైగా బుల్లెట్ రూట్లలో ఈ రైళ్లు పరుగెడతాయి. షాంగై–బీజింగ్ రైలు గంటకు 320 కి.మీ. వేగంతో పరుగెడుతోంది. ఇంత వేగంగా వెళ్లే రైలు రూటు ఎలా వేస్తారు, ఎన్నాళ్లలో వేస్తారు? ఈ వివరాలు వింటే ఆశ్చర్యమే.


బీజింగ్ సిటీబస్

అన్నీ డబుల్ ట్రాక్‌లే ఉంటాయి. అన్నీ ఎలక్ట్రిక్ ట్రాక్షన్ మార్గాలే. రెండు ప్రక్కలా రక్షణ కుడ్యాలుంటాయని చెప్పాను. తరువాత సిమెంట్ స్లీపర్ బెడ్ వేస్తారు. ఇక పట్టాలు రోజుకు వందల కిలోమీటర్లు వేసుకుంటూ వెళతారు. కేవలం ఒక రైల్ ఇంజన్

మిషన్ – మరో ట్యాంకర్‌లాంటి ట్రాక్టర్‌తో ఒక పదిమంది మాత్రం బోల్టులు బిగించటానికి రెండువైపులా ఉంటారు. అది కూడా హైడ్రాలిక్ మిషన్‌తోనే. టెక్నాలజీ వీళ్లదే, శ్రమా వీళ్లదే.

బీజింగ్:

1320 కి.మీ. పైగా 4.20 గం॥ల మధ్యలో రెండు స్టేషన్లలో ఆగి, బీజింగ్ వచ్చేశాం. బీజింగ్ సౌత్ స్టేషన్‌లో ఆగేవరకు తెలియలేదు. చాలా పెద్ద స్టేషన్. మా ట్రాలీలతో దిగాం. మాకోసం బీజింగ్‌లో ఎవరొస్తారు? అంటే – ఇక్కడి నుంచి హోటల్‌కు క్యాబ్ చూసుకోవాలి. కొంతమంది అనధికార డ్రైవర్లు మీకు క్యాబ్ కావాలా అని వెంటపడ్డారు. మేము నవ్వుతూనే నో చెప్పి, ట్యాక్సీ క్యూలో నిలబడ్డాం. అక్కడ ట్రైనీ పోలీసు ట్యాక్సీలు పిలిచి ఎక్కిస్తున్నాడు. నా దగ్గర మా హోటల్ ఫోటోతో సహా చైనా భాషలో ఉంది. గ్రీన్ ట్రీ హోటల్. అది డ్రైవర్‌కు చూపించి ట్యాక్సీ ఎక్కాం. ఆశ్చర్యం – కేవలం 15 యువాన్లతో హోటల్ చేరాం. అనధికార బ్రోకర్లు 200 యువాన్లు చెప్పారు. హోటల్! ఇది చైనాలో చాలా పెద్ద చైన్ హోటల్. ఈ ప్రాంతంలో ఒకటి. అంటే గ్రీన్ ట్రీ హోటళ్లు చైనా అంతటా ఉన్నాయి. బీజింగ్‌లోనే పది ఉన్నాయి. మరి ఇక్కడే ఎందుకు ఎంచుకున్నాం? ఇది మొదటి రింగ్‌రోడ్ లోపల ఉంది. బీజింగ్ చుట్టూ నాలుగు రింగ్‌రోడ్‌లు (మన ఒ.ఆర్.ఆర్.లాంటివి) ఉన్నాయి. ఆ రింగ్‌ల మధ్యనే నివాస గృహాలు, వ్యాపార కూడళ్లు, లింక్ రోడ్లు ఉన్నాయి. బీజింగ్ వ్యాసార్థం ఎంత ఉండవచ్చు? 75 కి.మీ. పైనే. అంటే వ్యాసం 150 కి.మీ. పైన.


తూర్పు – పడమరలకు, ఉత్తర – దక్షిణాలకు విస్తరించిన ఈ మహానగరానికి నడిబొడ్డు థియానన్‌మన్ స్క్వేర్! ప్రపంచ నగరాలలో ఇంత పెద్ద స్క్వేర్ ఎక్కడా లేదంటే ఆశ్చర్యమైన యథార్థం. మళ్లీ హోటల్ దగ్గరకు వద్దాం. మొదటి రింగ్‌రోడ్ అంటే సిటీ సెంటర్‌కు దగ్గరన్నమాట. రెండవదానికి దగ్గరలో ఎక్కడో ఇండియన్ రెస్టారెంట్ ఉన్నట్లు రివ్యూలో చూశాను. మూడోది చాలా చౌక. అందుకని ఈ హోటల్‌లో



గ్రీన్ ట్రీ హోటల్ జూకింగ్ రోడ్

మకాం! నాలుగంతస్తుల హోటల్ ఇది. ఎదురుగా 8 లైన్ల రోడ్. మళ్లీ సర్వీస్ రోడ్. ఆపైన ఒక సరస్సు. రోడ్ దాటడానికి దగ్గరలో ఫుట్ బ్రిడ్జి. దగ్గరలో బస్టాపు. ఇవన్నీ అనుకూలమైన అంశాలే కదా! రిసెప్షన్‌లో ఒక లావాటి చైనా అమ్మాయి ఉంది. ఒక్క ముక్క ఇంగ్లీష్ రాదు. సరే, మేనేజర్‌ను అడిగాను. మేనేజర్ ఆమె గదిలో నుంచి వచ్చింది. మా రిజర్వేషన్ చూసి వెల్‌కమ్ అని ఇంగ్లీష్‌లో నవ్వింది. నేను రోడ్ వ్యూ రూమ్ కావాలని అడిగాను. 2023 రూమ్ ఇచ్చింది. నాకర్థమైంది ఏమిటంటే – ఈమెకు తప్ప ఈ హోటల్ స్టాఫ్ ఎవ్వరికీ ఇంగ్లీషు రాదు అని. సరే, రూమ్‌కు వెళ్లాలి. కార్డులు తీసుకుని బెల్ బాయ్‌తో బయలుదేరాం. 2వ ఫ్లోర్‌లో లిఫ్టు నుంచి బయటకు వచ్చాం. రెండు ప్రక్కలా చూశాం. కారిడార్లకు అంతం లేదు. అంత పొడవున్నాయి. 5 అడుగుల వెడల్పు, రెండు ప్రక్కలా గదులు. నెంబర్ చూస్తూ కుడిప్రక్క తిరిగాం. ఆ కారిడార్ చివర మళ్లీ కుడిప్రక్కకు 90 డిగ్రీస్ తిరిగాం. అరె బాప్‌రే ఎంత పొడుగో! చివరికి 2023 రూమ్‌కు చేరాం. చక్కని రూమ్ 3 బెడ్లు, ఒకటి క్వీన్ – ఒక సింగిల్, పెద్ద విండో, చిన్న కిచెన్, ఫ్రిజ్, మైక్రోవోవెన్, ఓహ్! బెల్ బాయ్ చేతిలో ఏదో పెట్టి పంపాం. ట్రైన్‌లో స్నాక్స్ తప్ప ఏమీ తినలేదు. ఫ్రెష్ అయి చుట్టుప్రక్కల ఏముందో చూడటానికి బయలుదేరాం. ఇంతకీ ఇక్కడ వారం రోజులు ఉండాలి, అన్నీ తెలుసుకోవాలి కదా!

అప్పటికి సాయంత్రం 5.00 గం॥లు అయింది. కొద్దిగా చలి మొదలైంది. రిసెప్షన్ బయటకు రాగానే ఎడమవైపున ఒక చిన్న గ్యాస్ స్టేషన్ ఉంది. దానికి ఎటాచెడ్‌గా ఒక చిన్న కన్వీనియన్స్ స్టోర్ కూడా ఉంది. అందులో మాకు పనికి వచ్చేవి పెద్దగా లేకపోయినా 3 యువాన్లకు బీరు డబ్బాలున్నాయి. బ్రెడ్, కేక్‌లు



క్వీన్ బెడ్ – సింగిల్ బెడ్ రూమ్ విత్ వ్యూ

వీరు ఎక్కువ తినరనుకుంటా. కానీ చాక్లెట్లున్నాయి. కొన్ని కుకీస్ కూడా. సరే, ఇవన్నీ గుర్తుపెట్టుకున్నాం. ఇంకా కాస్త ముందుకు వెళితే ఎడం ప్రక్కన పెద్ద మార్కెట్ బజార్ ఉంది. ఆ కార్నర్‌లోనే లేక్ వ్యూ హోటల్ కూడా ఉంది. ఆ బజార్లో ఎక్కువగా పెద్ద పళ్ల

దుకాణాలున్నాయి. ఒకటి రెండు చైనీస్ రెస్టారెంట్లు ఉన్నాయి. అయిదారు చిన్న సూపర్ స్టోర్స్ ఉన్నాయి. అన్ని షాపుల్లో అన్నీ దొరుకుతాయి. అతి కష్టం మీద బ్రెడ్ దొరికింది. అది కూడా బన్‌ల లాంటివి. మంచి సీడ్‌లెస్ ద్రాక్ష, అరటిపళ్లు, పీచ్ – అన్ని రకాల పళ్లూ దండిగా కొన్నాం. వెన్న, చీజ్ కూడా లేవు. పాలు అసలే లేవు. ఆ దగ్గరలోనే బస్ టెర్మినల్ ఉంది. అన్నీ డబుల్ డెక్కర్. మన వోల్వోకంటే బాగున్నాయి. అలా చుట్టూ తిరిగాం. మా హోటల్ వెనకాల పెద్ద రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. దూరదూరంగా టవర్స్, మధ్యలో పెద్ద గార్డెన్, పిల్లలు ఆడుకోవటానికి, సైకిల్ తొక్కటానికి విశాలమైన స్థలం, గేట్లన్నీ ఆటోమెటిక్, మనుషుల్ని ఎక్కడా పనికిరాని పనులకు (గేటు తీయడానికి, ఎ.టి.ఎమ్. దగ్గర కాపలాకు) వాడటంలేదు. చిన్నా–పెద్ద కన్వీనియన్స్ స్టోర్స్‌లో బీరు, స్కాచ్, లోకల్ వైన్, అన్నిరకాల సిగరెట్లూ అమ్ముతున్నారు. వీరు సిగరెట్లు విపరీతంగా కాలుస్తున్నారు. కానీ, తాగి తూలేవాళ్లెవరూ మాకు తారసపడలేదు. అలాగే మన లిక్కర్ షాపుల దగ్గర జనం మూగినట్టు మాకు ఎక్కడా కనపడలేదు. రెండు గంటలు పైగా పరిసరాలను పరిచయం చేసుకుంటూ రెండు మూడు కిలోమీటర్లు తిరిగాం. మమ్మల్నెవరూ వింతగా చూడలేదు, పలకరించనూ లేదు. ఎవరి దారిన వారు హడావుడి లేకుండా తమకు కావలసినవి కొనుక్కొని పిల్లాపాపలతో ఇళ్లకు చేరుతున్నారు. దగ్గరలో ఎక్కడా సినిమా హాల్సుగాని, క్లబ్బులుగాని, పబ్బులుగాని జాడ లేదు. ఆ రాత్రి నాగ్ 'ఏవండీ! ఇండియన్ రెస్టారెంట్‌కి వెళదాం' అన్నారు. నా దగ్గర అడ్రస్ జాగ్రత్తగా ఉంది ఫోన్ నెంబర్‌తో సహా. సరే, రిసెప్షన్‌కి మేనేజర్‌ను అడిగాం. దారీతెన్నూ తెలియాలి కదా! ఆమె మీరు వెళ్లలేరు, ట్యాక్సీవాళ్లు కూడా తీసుకువెళ్లేరు, ఆర్డర్ ఇవ్వండి తెస్తారు అంది. అప్పుడు నాగ్ మొహంలో వెలుగు కనిపించింది. సరే, ఆమెనే ఫోన్ చేయమని ఆ రెస్టారెంట్‌లో ఉన్న



చైనాచందం



చైనా టూరిజం ఆఫీసు

ఇండియన్‌ను పట్టుకున్నాం. చివరకు రోటీ, ఫ్రైడ్ రైస్, చికెన్ కర్రీ ఆర్డర్ ఇచ్చాం. ఓ 40 నిమిషాలలో పార్సిల్ తీసుకొని ఓ చైనా కుర్రవాడు మోటర్‌సైకిల్ మీద వచ్చాడు. దాని ఖరీదు 150 యువాన్లు. ఆ రాత్రికి కాస్త తృప్తిగా తిన్నామనిపించి, అలసిపోయి నిద్రపోయాం. ఇంక కలలేమి వస్తాయి!

* * *

బీజింగ్ చరిత్ర విశేషాలపై నేను చాలా హోంవర్క్ చేశాను. ఆ వివరాలన్నీ మీకు చెప్తాను మేము తిరిగిన విశేషాలతో సహా. అయితే మీరు చైనా చరిత్ర చదవకపోతే నేను చెప్పేవన్నీ అతిశయోక్తులనిపిస్తాయి. 5,000 సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, రాజవంశీయులు – మావో లాంగ్ మార్చ్ వీటి గురించి కొంతవరకు పరిచయం చేస్తాను.

వారం రోజుల కాపురానికి ఇల్లు సర్దుకున్నాం – వంటిల్లు కూడా – మైక్రోవోవెన్, కాఫీ మేకర్, ఫ్రిజ్, ప్లేట్లు, గ్లాసులు, నల్ల ద్రాక్ష, తెల్ల యాపిల్స్, బీరు డబ్బాలు, బన్లు, కుకీసు – అన్నీ సర్దాం. బయట చలిగా ఉంది. జీన్స్, జాకెట్, క్యాప్‌లతో సహా రిసెప్షన్‌కు వచ్చి మేనేజర్‌కు కబురు చేశాం. నవ్వుతూ వచ్చింది. ఈ రోజు ప్రోగ్రామ్ చెప్పాం – బొమ్మలతో సహా. తియానన్‌మన్ స్క్వేర్, ఫర్బిడెన్ సిటీ. ఆమె బయటకు వచ్చి, క్యాబ్ పిలిచి, డ్రైవర్‌కు చెప్పి, మమ్మల్ని ఎక్కించి, డోర్ వేసి బై చెప్పింది. 15 నిమిషాలలో స్క్వేర్ దగ్గరలో, దాదాపు ఒకటిన్నర కి.మీ. దూరంలో క్యాబ్ ఆపి మాకు డైరెక్షన్ చూపాడు.


తియానన్‌మన్ స్క్వేర్ – మావో బొమ్మ

అక్కడ నుంచి వంద అడుగుల ఫుట్‌పాత్ మీద నడుచుకుంటూ (అదంతా

ప్రభుత్వ ప్రాంతం), గ్లాస్ విండోస్ చూచుకుంటూ టూరిజం ఆఫీసు వద్ద ఆగాం. అక్కడ బ్రోచర్లు తీసుకొని ఆమెను చైనావాల్ టూర్ గురించి అడిగాం. దాదాపు మనిషికి 900 యువాన్లు అవుతుంది అని చెప్పింది. ఆమెతో ఫోటో కూడా దిగాం. చివరికి స్క్వేర్ చేరాం. అక్కడ డ్యూటీలో ఉన్న 20 ఏళ్ల లోపు సెంట్రీని పలకరించాం. అతను బిగిసి ఉన్నాడు. కళ్లు కూడా తిప్పటంలేదు. అలా 8.00 గం॥లు నిలబడాలి అని విన్నాను. కనీసం ఒక ఫోటో అని అన్నా. నోనో అని కళ్లతోనే చెప్పాడు. లోకల్ టూరిస్టులు ఇప్పుడిప్పుడే చేరుతున్నారు. ఈ సిటీ స్క్వేర్ ప్రపంచంలోనే పెద్దది. పది లక్షల మంది నిలబడి, గుమిగూడటానికి వీలుంది. మొత్తం కాంక్రీటు, బండరాళ్ల సమతలం. ఓ ప్రక్క వ్యవసాయ విప్లవం, మరో ప్రక్క యాంత్రిక విప్లవం తాలూకు రాతిశిల్పాలు నిలబెట్టి ఉన్నాయి. దూరంగా పీపుల్స్ హాల్ కనబడుతుంది. ఆపైన మావో చిత్రం మాత్రం ఉంది. చైనా జెండాలు ఎరుపు మీద పసుపు రంగు నక్షత్రాలు ఎగురుతున్నాయి. ఎక్కడా పోలీసు కనబడలేదు.

ఈ స్క్వేర్ బీజింగ్ ఉత్తర దక్షిణాలకు, తూర్పు పడమరలకు యాక్సిస్ కేంద్ర బిందువు. సిటీ అంతా దీని చుట్టూ నాలుగు రింగురోడ్ల నిర్మాణంతో మధ్యలో జనావాసాల భవనాలతో దాదాపు 2 కోట్ల జనాభాతో నిత్య చైతన్యంతో వెలిగిపోతూ ఉంది. బీజింగ్ సిటీ గురించి తర్వాత చెబుతాను. ఇప్పుడు మనం వెళ్లబోతోంది ఫర్బిడెన్ సిటీ. ఇది యునెస్కో గుర్తించిన చారిత్రక విశేషం.



పీపుల్స్ హాల్


దాదాపు 800 ఏళ్ల క్రితం Qing - Ming రాజవంశీయులు నిర్మించుకొని, నివసించి చైనాను పరిపాలించిన డైనాస్టీల అధికార పీఠం.

షుమారు రెండువందల ఎకరాల విస్తీర్ణంలో 16 లక్షల చదరపు అడుగుల ఆవాస గృహాలు – భవనాలతో వేయికి దగ్గరగా ఉన్న భవనాలు, పదివేల గదులు – ఇవి కాక తీర్చిదిద్దినట్లుండే వనాలు – పూలవనాలు – దారులు – చుట్టూ నీటి కందకం – ఎత్తైన గోడ – చతురస్రాకారంలో పగోడాలతో – సింహాసనాలతో – పడక గదులతో – సేవకుల నివాసాలతో – వంట శాలలతో – నీటి నిలువలకు గుండిగలు, గంగాళాలతో – కాపలాకు రాతి సింహాలతో – డ్రాగన్ బొమ్మలతో – రాజమందిరాలతో – అద్భుతమైన ఇంటీరియర్ విశేషాలతో – ఈ నగరం ఇప్పటికీ నిలబడి, జెండాలు రెపరెపలాడిస్తోంది. ఇవన్నీ కాలినడకన తిరగడానికి మాకు పగలంతా సరిపోయింది. సరిపోయిందా? లేదు. సరిపుచ్చుకున్నాం. దక్షిణ యానన్ నుంచి కందకం దాటి మెరిడియన్ గేటు, యానన్ స్క్వేర్, గోల్డెన్ వాటర్ రివర్, నీటి పెవిలియన్, హాల్ ఆఫ్ సుప్రీమ్ హార్మని, వేయి శిశిరాల పెవిలియన్, హాల్ ఆఫ్ ఎక్సలెన్స్, హాల్ ఆఫ్ మెంటల్ కల్టివేషన్, పూలవాసనల పెవిలియన్, బుద్ధ టవర్, సమ్మర్ ప్యాలెస్, దీర్ఘాయుష్ హాల్, హార్మనీ వనం, అర కిలోమీటరు కారిడార్, గార్డెన్ ఆఫ్ పర్ఫెక్షన్ & బ్రైట్‌నెస్, జింగ్‌షాక్ పార్కు, అయిదు డ్రాగన్ల పెవిలియన్లు – అన్నీ తిరిగి తిరిగి ఉత్తరం ప్రక్కనుంచి కందకం దాటి బయటకు వచ్చాం. అప్పటికి పొద్దు వాలుతోంది. అక్కడ నుంచి కుడి ప్రక్కకు తిరిగాం – ఎడమ ప్రక్కకూ తిరగవచ్చు లెఫ్టిస్టులు. ఫర్బిడెన్ సిటీ కార్నర్ దగ్గర మళ్లీ దక్షిణానికి తిరిగాం. మళ్లీ మొదటికి రావాలి కదా! ఇక నాగ్ కాళ్లు, నేను కళ్లు తేలవేశాం. ఇక నడవలేమని ఒక బ్యాటరీ రిక్షా చైనా పెద్దమనిషిని పిలిచాం. అన్నీ సైగలే. ఎలాగో స్క్వేర్ దగ్గరకు తీసుకువెళ్లమన్నాం. ఆయన



ఫర్బిడెన్ సిటీ


చెప్పినంత, మేమిచ్చినంత. చివరికి దక్షిణం టవర్ దగ్గర దింపి, మెయిన్ రోడ్‌కు రిక్షా రాకూడదని అర్థమయ్యేటట్లు సైగలతో కుంగ్‌ఫూ చేసి చూపించాడు. ఈ ఫర్బిడెన్ సిటీలో మాతో పాటు లోకల్ టూరిస్టులే ఎక్కువున్నారు. అమెరికన్, యూరోప్ ముఖాలు అసలు కనపడలేదు. ఈస్ట్ యూరోపియన్, రష్యన్ టూరిస్టులు పలచగా ఉన్నారు.


వీధిలో వివాహం

ఒక్క ఆఫ్రికన్ కూడా కానరాలేదు. ఆఫ్రికన్స్‌గాని అరబ్ జాతివారుగాని కనపడలేదు. ఇక ఇండియన్లు మేమిద్దరమే.

సరే! అక్కడ దిగి, రెండు మూడు సందులు, ఒక వనం – ఒక బ్రిడ్జి – దాటుకుంటూ అల్లంత దూరంలో స్క్వేర్ కనబడుతుంటే ఆగాం. అక్కడ మాకు పీటర్ కలిశాడు. మీరు కంగారుపడకండి. అతను మా స్నేహితుడేమీ కాదు. టూర్ ఆపరేటర్. చైనీస్ పేర్లు మనకు నోరుతిరగవని ఇంగ్లీష్ పేర్లు పెట్టుకుంటారు. పీటరు, మేరీ, జాని – ఇలా. సరే! పీటర్ చాలా స్నేహపూర్వకంగా ఉన్నాడు. అతనితో మాట్లాడగలం. ఇంగ్లీష్ ముక్కలు విరిచి, అతికిస్తున్నాడు.

సరే! రేపు చైనా వాల్ చూడాలనుకుంటున్నాం అని చెప్పాం. నో ప్రాబ్లం. ఒక్కొక్కరికి నాలుగొందలు అన్నాడు. హోటల్ దగ్గర పికప్, డ్రాప్. ఉదయం 7.30 ని॥లకు. యు పే ఇన్ ది వ్యాన్ అని అతని కార్డు ఇచ్చాడు. అప్పటికి అలసట తీరింది. మర్నాడు ప్రోగ్రాం తేలింది. ఇక హోటల్‌కు పోదామనుకున్నాం. కానీ క్యాబ్ కోసం రెండు కిలోమీటర్లు నడవాలి. ఒ.కె. లెటజ్ హావ్ అవర్ ఈవ్‌నింగ్ వాక్ అని బయలుదేరాం. అప్పుడప్పుడే లైట్లు వెలుగుతున్నాయి. లైట్లంటే మామూలు లైట్లా? బీజింగ్ వైభవం రాత్రి లైట్ల వెలుగులో చూడాలి. లైటు పోస్ట్‌లన్నీ ఇటాలియన్ స్టైల్ క్యాస్ట్ ఐరన్‌లో తీర్చిదిద్దారు. నాకింకా బీజింగ్ టోపోగ్రఫీ అవగాహనకు రాలేదు. అందుకని రిస్క్ చేయదలచుకోలేదు. లేదంటే మెట్రోనో, బస్సో ఎక్కేవాణ్ణి. చివరికి క్యాబ్‌ల దగ్గర చేరాం. కానీ రాత్రైపోయింది. కానీ ఎక్కడా క్యాబ్‌లు కనబడటంలేదు. ప్రైవేట్ క్యాబ్‌లు చాలా



టెంపుల్ ఆఫ్ హెవెన్

ఖరీదు. సరే! మనకు తొందరేముంది? కొంత దూరంలో షాపింగ్ కాంప్లెక్స్ లైట్లు కనబడుతున్నాయి. అటుగా వెళ్లాం. అక్కడ రోడ్లు దాటలేం. దాటాలంటే అండర్ పాస్ ఉంటుంది. అవతల పక్క ఏముంటుందో తెలియదు. చివరికి ఒక క్యాబ్ పట్టుకోగలిగాం. మా హోటల్ బొమ్మ చూపించాం. ఎక్కమన్నాడు. 30 యువాన్లతో హోటల్ చేరాం. అప్పుడే మా నడక అవలేదు. హోటల్ కారిడార్ నడవాలికదా! అలా ఊసురోమంటు 2023 గదికి చేరాం. బీజింగ్ యాత్ర మా మొదటి రోజు ఫలవంతంగా జరిగిందని అనుకోవాలి. దాహానికి బీరుడబ్బాలు, ఆకలికి ద్రాక్షపళ్లు ఉన్నాయి. మర్నాడు పీటర్ 7.30 గం॥లకు కార్ పంపాడు. అప్పటి నుంచి రాత్రి 10.00 గం॥ల వరకు మా యాత్ర ఎంతో ఫలప్రదంగా జరిగింది. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా పైదాకా వెళ్లి వచ్చాం. ఆ వివరాలు తర్వాత చెబుతాను. ప్రస్తుతం బీజింగ్ వైభవం చూద్దాం.

* * *

బీజింగ్‌లో రెండో ఘట్టం – టెంపుల్ ఆఫ్ హెవెన్. ఇది మింగ్ వంశానికి చెందిన యాంగ్లీ చక్రవర్తి 1406 నుంచి 1420 వరకు పరిపాలించి, ఈ టెంపుల్ ఆఫ్ హెవెన్ నిర్మించాడు. పుష్కరకాలం పైనే పట్టింది. ఇక్కడ స్వర్గానికి, భూమికి బలిదానాలిచ్చి పూజలు చేసేవారు. ప్రకృతి శక్తులకు, పంటలు బాగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాజులు, రాణులు వచ్చి పూజా కార్యక్రమం జరిపేవారు. మొదటిలో దీనిని టెంపుల్ ఆఫ్ హెవెన్ అండ్ ఎర్త్ అనేవారు. తర్వాత 15వ శతాబ్దంలో టెంపుల్ ఆఫ్ హెవెన్ అని నామకరణం చేసి టెంపుల్ ఆఫ్ ఎర్త్ బీజింగ్ శివార్లలో నిర్మించారు. అప్పటి నుంచి ఈ టెంపుల్ ఆఫ్ హెవెన్ ఎంతో పవిత్ర స్థలంగా పూజలందుకుంటోంది.

ఈ టెంపుల్ చాలా విశాలమైన ప్రదేశంలో, ప్రకృతివనంలో నిర్మించారు. దాదాపు 90 లక్షల చదరపు అడుగులు ఆవరించి ఉన్న ఈ ప్రదేశం ఎత్తైన స్థూపం మీద స్వర్గ ద్వారాలకు పవిత్ర ప్రవేశ మార్గంగా ప్రశాంతంగా ఉంటుంది. రాజులు, రాణులు ప్రార్థనలు చేయటానికి పూజలు చేయటానికి


అనువుగా విశాలంగా తీర్చిదిద్దారు. ఉత్తరాన వర్తులాకారంగా దక్షిణాన చతురస్రాకారంగా ఉంటుంది. అలా ఎందుకంటే స్వర్గం గోళాకారంలో, భూమి బల్లపరుపుగా ఉంటుందని నమ్మేవారు. టెంపుల్ ఆఫ్ హెవెన్ నిర్మాణ కౌశలం అనితరసాధ్యం అంటారు. ఇలాంటి నిర్మాణం ప్రపంచంలో ఇది ఒక్కటే అని, వాస్తురీత్యా ఇది వజ్రసమానమని, దీని రంగు, రూపు అత్యంత ప్రత్యేకమని యునెస్కో గుర్తించింది.



లామా ఆలయంలో బుద్ధ విగ్రహం

లామా టెంపుల్:

లామా ఆలయం చైనాలో ఉన్న టిబెట్ పసుపు రంగు టోపీ పెట్టుకుని గెలూగ్ సెక్ట్‌కు చెందిన బౌద్ధ దేవాలయం. ఈ బౌద్ధాలయం కేవలం బుద్ధ దేవునికే ప్రసిద్ధి కాదు. ఇది హన్, మంచు, మంగోలియా, టిబెట్ సంస్కృతులకు ఆలవాలం. ఇది వాస్తు నిర్మాణానికి ఎంత ప్రసిద్ధి చెందిందో అంతకంటే ఎక్కువగా ఎంతో పెద్ద బుద్ధుని విగ్రహం అదీ దారు శిల్పం – చెక్కతో చేసిన శిల్పానికి ప్రసిద్ధి. అయిదువందల అర్హంతల పర్వతం, బంగారు ఆలయం వీటన్నింటికీ ప్రసిద్ధి పొందిన ఈ బౌద్ధాలయంలో మూడురోజుల స్నానాల తొట్టి కూడా ఉంది. వేసవిలో కియాలాంగ్ చక్రవర్తి వాడిన పెద్ద టోపీ, ఎన్నో బుద్ధుని విగ్రహాలు, వివిధ భంగిమలలో, చక్కని రూపాలలో ఉన్నాయి. టిబెట్ టాంగ్ కా చిత్రాలు, కుడ్య చిత్రాలు, సూత్రఛాయాలు, బౌద్ధ పరికరాలు, సంగీత వాయిద్యాలు, శిలాశాసనాలు, కలీగ్రఫీ, మరిన్ని చిత్రాలు – రాజ వంశీయులు వాడిన కళాఖండాలు వీటన్నిటితో ఈ లామా టెంపుల్ బీజింగ్‌లో వెలసిన టిబెట్ బౌద్ధ సంస్కృతికి నిలయం. ఆ దగ్గరలోనే హాల్ ఆఫ్ ధర్మచక్రం ఉంది.



మింగ్ సమాధులకు దారి

మీంగ్ టూంబ్‌లు:

ఇవి మన కులీ కుతుబ్ షా సమాధులవంటివి. ఎటొచ్చీ భూమికి



సమాధి ప్రక్కన వారు వాడిన వస్తువులు

నాలుగైదు అంతస్తుల క్రింద అద్భుతమైన పాలరాతి కట్టడంలో విశాలంగా నిర్మించబడింది. ఇక్కడే మింగ్ వంశపు పదమూడు చక్రవర్తుల సమాధులున్నాయి. వారితోపాటు ఇరవైముగ్గురు రాణులు, ఉంపుడుగత్తెలు, బాల్యంలో చనిపోయిన వారసులు శాశ్వత నిద్రలో సమాధి చేయబడ్డారు. వారందరూ వాడిన అపురూపమైన వస్తువులు కూడా భద్రపరిచారు. 80 చ॥కి॥మీ॥ విస్తరించిన ఈ సమాధుల వనం పూర్తవడానికి రెండువందల సంవత్సరాలు పట్టింది. 1409లో యాంగ్లీ పరిపాలనలో మొదలై 1644 వరకు నిర్మాణ కార్యక్రమం జరుగుతూనే ఉంది. చివరికి చాంగ్ జన్ కాలంలో పూర్తయింది. అప్పటికి మింగ్ డైనాస్టీ కూలిపోయింది. ఈ సమాధుల భూగృహం చుట్టూ కొండలు, గుట్టలు ఉన్నాయి. మధ్యలో ఉన్న సమతలంలో పదమూడు నేలమాళిగలు అతిజాగ్రత్తగా నిర్మించారు. శత్రువులు నాశనం చేయడానికి కూడా వీలు లేకుండా అన్నింటికీ అన్ని శిఖరాలు కాపలా ఉన్నాయి. ఒక్క బీజింగ్ నుంచే ఇక్కడికి దారి ఉంది. ఈ సమాధుల వనంలోకి రావడానికి పవిత్రమైన పాలరాతి దారి ఉంది. రెండువైపుల రాతి సింహాల కాపలా ఉంది. నిలువెత్తు పైన్ చెట్లు గొడుగుపడుతున్నాయి. టాంబ్ గేటు, హాల్ ఎమినెట్ ఫేవర్, గేట్ ఆన్ ది త్రెస్ హోల్డ్ ఆఫ్ స్టార్స్ (తారాలోకానికి బంగారు వాకిలి), ఆత్మ విహార్ (సోల్ టవర్) ఇంకా నిధి నిలయం ఉన్నాయి.

ఫిన్స్ గాంగ్ భవనం:

ఈ భవనం నిర్మించిన వనంలో ఇరవైకి పైగా అద్భుతమైన దృశ్యాలున్నాయి. ఇక్కడ ఉత్తర, దక్షిణ సంస్కృతుల సమ్మేళనం చూడవచ్చు. ఈ వనంలో ప్రతి మలుపు కనువిందు కలిగిస్తుంది.

గ్రాండ్ థియేటర్:

చక్రవర్తులు, రాణులు వినోదం కోసం ఏర్పాటు చేసుకున్న ఈ గ్రాండ్ థియేటర్ ఇంటీరియర్ కళ్లు చెదిరే విధంగా ఆశ్చర్యపరుస్తుంది.

పీకింగ్ మాన్:



పీకింగ్ మాన్:

డ్రాగన్ బోన్ అనే చిన్న గుట్టమీద ఈ పీకింగ్ మాన్ తల ఉంది. అక్కడ నుంచి ఆరువందల అడుగుల సొరంగం కూడా ఉంది. ఇక్కడే అయిదు లక్షల సంవత్సరాల క్రితం నివసించిన పీకింగ్ మాన్ అవశేషాలు లభించాయి. ఇతడే మొదటి రెండు కాళ్ల మీద నిలబడి నడిచిన మనిషి అంటారు.

కన్ఫ్యూసియస్ ఆలయం:


ఇది యువాన్ మింగ్ డైనాస్టీల కాలంలో నిర్మించింది. కన్ఫ్యూషియస్ ఫిలాసఫీ చైనా వాళ్ల సొంత తత్త్వశాస్త్రం అని చెప్పవచ్చు.




పీకింగ్ మాన్ సొరంగం

ఇంపీరియల్ కాలేజ్:

ఇది యువాన్ మింగ్ డైనాస్టీల కాలంలో పరిపాలనా పరంగా, విజ్ఞానపరంగా పేరుమోసిన విద్యాలయం. మన ఢిల్లీలో ఉన్న జంతర్ మంతర్‌లాగానే బీజింగ్‌లో ఆరుబయట అబ్జర్వేటరీ ఉంది. 1442లో నిర్మించారు. ఇలా మేము తిరుగుతుంటే మాకు ఒక చేదు అనుభవం ఎదురైంది. ఒక గార్డెన్‌లో చిన్న మార్కెట్ ఉంది. అక్కడే ఒక పెద్ద ఫోటో స్టాల్ కూడా ఉంది. మింగ్, కింగ్ రాజుల కాస్ట్యూమ్‌లు ఉన్నాయి. ఒక ఫోటో ముప్పై యువాన్లు అన్నారు. సరే అని ముచ్చటపడి కాస్ట్యూములు వేసుకొని ఫోజులిచ్చాం. టకటకటకా ఫోటోలు తీశారు. పదిహేను నిమిషాలలో ఇస్తాం టీ తాగండి అన్నారు. ముందుగా పన్నెండు పెద్ద సైజు ఫోటోలు లామినేట్ చేసి ఇచ్చారు. పన్నెండొందల యువాన్లు బిల్ ఇచ్చారు.



కన్ఫ్యూసియస్ ఆలయం



ఇంపీరియల్ కాలేజి

గుండె గుభేలంది. అసలే డబ్బు కరువులో ఉన్నాం (నా డెబ్బైవేలు ఇంతవరకూ లేదు). తినటానికి, తిరగటానికి వెతుక్కుంటున్నాం. ఇప్పుడు ఈ బిల్ ఏమిటి? మళ్లీ నాగ్‌వి పన్నెండు ఫోటోలొచ్చాయి. మళ్లీ పన్నెండొందల యువాన్లు. నాకు ఒళ్లు మండిపోయింది. ఎక్కడ ముప్పై, ఎక్కడ రెండువేల నాలుగొందలు? పేచీకి దిగాను. అసలే డబ్బు లేదు. వాళ్ల దగ్గర కార్డు స్వైపింగ్ లేదు. గట్టిగా కేకలు వేసి ఇరవైనాలుగు ఫోటోలకు వెయ్యి యువాన్లు ఇస్తాను అని చెప్పాను. అంతే. అదీ కార్డ్ స్వైపింగ్ ఐతేనే. వాళ్ల భాష, నా భాష ఘర్షణలో ఏమీ తేలలేదు. నేను తెలుగులోనే అరుస్తున్నాను. వాళ్లు చైనీస్‌లో మాట్లాడుతున్నారు. సౌమ్యంగానే. చివరికి ఒక లేడీ నాతో రావడానికి ఒప్పుకుంది. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో షాపింగ్‌కి. నడిచి నడిచి కాళ్లు పీకుతుంటే నో ప్రాబ్లం నో ప్రాబ్లం అని పళ్లికిలిస్తుంది. నేను తెలుగులో నీకేం తల్లీ నాకు కదా ప్రాబ్లం అన్నాను. చివరికి ఆ సమస్య వదలించుకొని ఇరవైనాలుగు ఫోటోలు తీసుకున్నాను. తర్వాత పావుగంటకు నాగ్ మరో ఎస్కార్ట్‌తో వచ్చారు. ఫోటోలు చూసి చాలా బావున్నాయండీ అని నవ్వబోయారు. అయ్యో, ఆపండి. వాడు చూస్తే ఇంకా డబ్బు అడుగుతాడు అని బయటపడ్డాం.



ఖరీదైన కాస్ట్యూమ్స్ ఫోటో

*

ఇప్పటివరకూ చైనా – బీజింగ్ చారిత్రక విశేషాలు తెలుసుకున్నాం. వర్తమానంలోకి వస్తే గత ముప్పై సంవత్సరాల్లో చైనా అభివృద్ధిని అంచనా వేయటానికి ఒక్కరి వల్ల అయ్యే పని కాదు. అయినా నేను చూసిన ఆధునిక చైనా ముఖచిత్రాన్ని మీకు పరిచయం చేయటానికి ప్రయత్నం చేస్తాను.

ముందుగా బీజింగ్ మహానగరం:

ఇప్పుడు మేము తిరుగుతున్న బీజింగ్ మహానగరాన్ని ఎవరు ఎలా ప్రణాళిక రచించారో తెలియదు; కానీ నగరాన్ని నిర్మించిన తీరు తప్పక 'వహ్వారే' అనిపించక

మానదు. దాదాపు 150 కి.మీ. వ్యాసార్థంతో నాలుగు రింగురోడ్ల వలయాలతో రెండు కోట్ల మందికి ఉండటానికి, తినటానికి వనరులు కల్పించిన తీరుకు మనం ఆశ్చర్యపోవలసిందే. మన దేశంలో ఎక్కడ చూసినా గుంపులు, తోపులాటలు, తొక్కిసలాటలు – రైలు టికెట్టు కొనలేము, సిటీ బస్ ఎక్కలేము. నిలబడటానికి బస్‌స్టాండ్ అనేది ఉండదు. మన ఓర్పుకు జోహార్లు చెప్పుకోవాలి. పోల్చటం నా ఉద్దేశ్యం కాదు కాని మన జీవనసరళికి భిన్నంగా ఉన్నది ఏదైనా మనం తప్పనిసరిగా పరిశీలించాలి కదా.

బీజింగ్ మహానగరపు మార్గాలు ఒక్కోచోట 500 అడుగులు కూడా ఉంటాయి. ఎక్కడికక్కడ ఎవరికీ ఇబ్బంది కలగకుండా వారి ప్రణాళిక, అమలు అద్భుతమనిపిస్తుంది. ఇంత సంపద, ఇంతటి క్రమశిక్షణ, ట్రాఫిక్ కానీయండి – బస్‌లు కానివ్వండి – మెట్రో కానివ్వండి అన్నీ కాలానుగుణంగా ఖచ్చితంగా ఎలా నడుస్తున్నాయి – రెండు కోట్ల జనాభాను తట్టుకునే విధంగా మరో 50 సంవత్సరాలకు సరిపోయే విధంగా ఇవన్నీ ఎలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు? ఎక్కడా చిన్న సిగిరెట్టు పీక కూడా కనపడకుండా ఈ రోడ్లన్నీ ఎవరు శుభ్రం చేస్తున్నారు? ఇలా మాకు మేమే ప్రశ్నలు వేసుకుని సమాధానాలు వెతుక్కుంటూ తిరిగాం. మీకు ఆధునిక బీజింగ్ – చైనా చూపిస్తాను రండి!




నేషనల్ మ్యూజియయం




చాంగ్ ఎవెన్యూ తూర్పు పడమరల కేంద్రం: దీనినే ఫస్ట్ స్ట్రీట్ ఆఫ్ చైనా అంటారు. ఇది తూర్పున టాంగ్ జూ జిల్లా నుంచి మొదలై పడమర షి జంగ్ షాన్ దగ్గరకు చేరుతుంది. ఈ అతి విశాలమైన అత్యంత సుందరమైన అయిదువందల అడుగుల

వెడల్పు, చెట్లతో అద్భుతమైన వీధి దీపాలతో విశాలమైన నడకదార్లతో ఎనిమిది లేన్ల కార్లతో ఎప్పుడు నిత్యకళ్యాణంగా వెలిగిపోతుంటుంది ఈ ఫస్ట్ స్ట్రీట్ ఆఫ్ చైనా.




సి.బి.డి. – రెండు – మూడు రింగురోడ్ల మధ్య నిర్మించబడిన బీజింగ్ సి.బి.డి. అంతర్జాతీయ వ్యాపార కూడలి – ఎన్నో కార్యాలయాలకు నిలయం. ఎగ్జిబిషన్లు, స్టార్ హోటళ్లు, వినోదం – అన్నీ ఇక్కడే జరుగుతుంటాయి. సి.బి.డి. అంటే సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అన్నమాట.



ఇక్కడకు దగ్గర్లోనే **కేబుల్ నెట్‌వర్క్ బిల్డింగ్** ఉంది. వీరికి ఆరు ఛానెళ్లు ఉన్నాయి. ఒకటి అఫిషియేల్ న్యూస్ – రెండు – ఎతికల్ ఛానెల్. అంటే చిన్నపిల్లలకు (స్కూల్‌కు వెళ్లే పిల్లలు) నీతి, నియమాలు చక్కగా నేర్పుతారు. మూడు – ఎంటర్‌టైన్‌మెంట్. నాలుగు – ఇంటర్నేషనల్ చానెల్ (ఇది చైనా ప్రభుత్వం సెన్సార్ చేయకుండా విడుదల చేయదు). అయిదు – సినిమా ఛానెల్ – ఇవన్నీ చైనాలో తయారైన పూర్తి వినోదాత్మకమైన సినిమాలే. ఎక్కువ శాతం ఫోక్‌లోర్ – మితికల్ – హిస్టారికల్ నేపథ్యంలో నిర్మించినవి. ఆరు – ఎడ్యుకేష్నల్ ఛానెల్ – స్పోర్ట్స్. ఇవన్నీ ఇరవైనాలుగు గంటలూ నడిచేవి కావు.


కేబుల్ నెట్‌వర్క్‌తో ఇంటింటికీ ఇచ్చే సర్వీస్. దానికి సంబంధించిన భవనం ఇది. బస్ దిగి మేము ఎండలో పడి ఎంతో దూరం నడిచి ఈ బిల్డింగ్ చుట్టూ తిరిగి తరించాం.



థియేటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్.

నేషనల్ థియేటర్ ఫర్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ – ఈ థియేటర్ అందం బయట నుంచే కొట్టవచ్చినట్లు కనపడి, కట్టిపడేస్తుంది. ఏ నాటకం చూడాలన్నా ఏ ప్రదర్శన చూడాలన్నా ఖరీదు చాలా ఎక్కువ. కనీసం ఇరవై వేలు!

వాంగ్ ఫూ జింగ్ స్ట్రీట్. దీనికి వందేళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి అధునాతన వ్యాపార భవనాలున్న ఫస్ట్ స్ట్రీట్ ఫర్ బీజింగ్ కామర్స్ అని ప్రఖ్యాతి గాంచింది. చాలా పెద్దపెద్ద షోరూంలాంటివి వీధికి ఇరువైపులా తలుపులు తెరిచి వ్యాపారం చేస్తుంటాయి. ఇక్కడ




నేషనల్ లైబ్రరీ ఆఫ్ చైనా

తిరగడానికి బ్యాటరీ ఓపెన్ వ్యానులు నడుపుతుంటారు. అసలు విషయం దీని వెనక వైపు వీధిలో ఉంది. అది మనలాంటి మధ్యతరగతి మానవులకు చేతివృత్తుల



వాంగ్ ఫూ జింగ్ స్ట్రీట్


వారు తయారుచేసిన లెక్కలేనన్ని వస్తువులు సరసమైన ధరలకు బేరం చేసుకుంటూ కొనవచ్చు. ఇది కూడా అద్దంలా శుభ్రంగా ఉంటుంది! ఇక్కడే – చిన్న ఈటింగ్ స్ట్రీట్ ఉంది. తినడానికి ఏమైనా ఉన్నాయా అని చూశాం. పుల్లలకు



తేళ్లు – బ్రతికి ఉన్నవే – గుచ్చి నిలబెట్టారు. అవి డెక్కలు, కొండెలు ఆడిస్తూ చూస్తున్నాయి. మనం అడిగితే వాటిని ఫ్రై చేసి ఇస్తారన్నమాట. అంత సాహసం చేయలేక ప్రక్కనే ఉడకబెడుతున్న స్వీట్ కార్న్ 6 యువాన్లు పెట్టి కొన్ని తిన్నాం. ఇక్కడే మేము స్నేహితులకు ఇవ్వడానికి చక్కని చైనా సావనీర్లు కొన్నాము. అమ్మాయిలు సరసంగా బేరం చెప్తారు. విసుక్కోరు. నవ్వుతూ తమ వస్తువులను మనకు అమ్మటానికి ప్రయత్నిస్తారు. అంటకట్టటానికి కాదు – తమ పనిని ఎంతో ప్రేమిస్తున్నట్లున్నారు. ఆ వీధి అంతా ఇలాంటి దుకాణాలు ఉన్నాయి. చివరిలో ఒక చైనా చిత్రకారుడు కాన్వాస్ మీద ఆయిల్ చిత్రాలు వేసి అమ్ముతున్నాడు. చెంఘిస్ ఖాన్ చిత్రం బేరం చేశాను. ఖరీదు ఎక్కువే. అయినా మోసుకురావటం ఇబ్బంది అని వదిలిపెట్టేశాం.



చైనా మిలీనియమ్ మాన్యుమెంట్ – ఇది పాత కొత్తల మేలు కలయిక.



వాస్తుకళ, వనసంపద, శిల్పకళ – ఫ్రెస్కో – ఇవన్నీ చక్కగా మిళితం చేసి ఒక లాండ్‌మార్క్ భవనం కట్టారు.

సెంట్రల్ రేడియో టవర్ 3వ రింగ్ రోడ్ దగ్గరలో ఉంది. ఇది బీజింగ్‌లో ఒక లాండ్‌మార్క్ – ఇక్కడ రేడియో, టెలివిజన్ – సైట్ సీయింగ్, వినోదం తినుబండారాలు – పానీయాలు అన్నీ చేతికందే రీతిలో ఉంటాయి.



ఫైనాన్షియల్ స్ట్రీట్. అన్ని బ్యాంకులు – చైనా అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ బ్యాంకులు, చైనా మర్చంట్స్ బ్యాంక్ – బ్యాంక్ ఆఫ్ కమ్యూనికేషన్స్ అన్ని ఇక్కడే ఉన్నాయి. డబ్బుల గలగల వినవచ్చు.



దాజలాన్: 580 సంవత్సరాల చరిత్రగల ఈ పాత చైనా టౌన్ అంతా వ్యాపారమే.



కియాన్మెల్ వీధి – లియు లీ చాంగ్ కల్చరల్ వీధి. పాంజియు యువాన్ Antiques. **సిల్క్ స్ట్రీట్** – చైనా సిల్క్ చాలా ప్రసిద్ధి



నిజంగానే చైనా సిల్క్ అంత అద్భుతంగా ఉంటుంది. తప్పనిసరిగా చూడాలి, కొనాలి – మేము ఆ పనే చేశాం.



చైనా సైన్స్ – టెక్నాలజీ మ్యూజియం. నేషనల్ ఎక్వేరియం సెంటర్! ఇది ఒలింపిక్స్



నేషనల్ ఎక్వేరియం సెంటర్

కోసం నిర్మించిన ఈతకొలనుల సముదాయం. వెలుపల ఎంత బాగుందో లోపల అంతకంటే బాగుంటుంది. బీజింగ్ కాపిటల్ ఎయిర్‌పోర్ట్ – బీజింగ్ ఈశాన్యాన 50 కి.మీ. దూరంలో ఉంటుంది. ఇంత పెద్ద ఎయిర్‌పోర్ట్ – చూడటం సాధ్యం కాదు. అందుకని – మన దారిలో మన గేటులో మన ఫ్లైటు డిపార్చర్ దగ్గరకు వెళ్లటమే మంచిది! దీని గురించిన వివరాలు మన తిరుగు ప్రయాణంలో తెలుసుకుందాం.

బీజింగ్‌లో 2008 ఒలింపిక్ క్రీడలు వైభవంగా జరిగాయి / మనం టి.వి.లో చూశాం కదా. ఇక్కడ ప్రధాన క్రీడాస్థలం. నేషనల్ స్టేడియం! ఒక బర్డ్స్ నెస్ట్ ఆకారంలో అద్భుతంగా నిర్మించారు. ఈ స్టేడియం చుట్టూ నడిచి తిరిగాం. నాలుగు అంతస్తుల్ని లోపలి భాగమంతా పరిశీలించాం. చివరికి ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చుని అక్కడ జరిగిన ఈవెంట్స్ అన్నీ చూశాం. ఆశ్చర్యపోకండి – చాలా పెద్ద ఎల్.ఇ.డి. స్క్రీన్ మీద ఇప్పటికీ రోజూ ప్రదర్శిస్తున్నారు. అంత పెద్ద స్టేడియంను ఎంతో శ్రద్ధగా మెయిన్‌టెన్ చేస్తున్నారు. టూరిస్టులు ఎంతమంది వచ్చినా అందులో ఒదిగిపోతారు. దాదాపు 80 వేల మంది కూర్చోవచ్చు.



బర్డ్స్ నెస్ట్ ఒలింపిక్స్ స్టేడియం

దీని చుట్టూ ఒక నగరమే ఉంది. వచ్చిన క్రీడాకారులకు ఉండటానికి ఎపార్ట్‌మెంట్‌లు కట్టి క్రీడలు అయిపోయిన తర్వాత మనలాంటివారికి నెలవారి వాయిదా పద్ధతిలో అమ్మి నివాస గృహాలు చేశారు. అయితే ఎంతో విశాలమైన వనాలు, నీటి కందకాలు, ఇంకా చిన్నచిన్న స్టేడియంలు దీని చుట్టూ ఉన్నాయి. అవన్నీ బ్యాటరీ కారులో తిరిగి చూశాం.

బొటానికల్ గార్డెన్స్ – వీటి అందాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రపంచంలో ఎన్ని రకాల పూలమొక్కలున్నాయో అన్ని ఏరి కోరి తెచ్చి పెంచుతున్నారు. ఇక్కడ యాత్రికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ప్రక్కనే బోటింగ్ సరస్సు ఉంది – శుద్ధమైన నీరు! ఇంకా శుభ్రమైన పడవలతో.



బీజింగ్ వెస్ట్ రైల్వేస్టేషన్

ఫ్రాగ్రెంట్ హిల్స్ (సువాసనల పర్వతాలు). బీజింగ్ పడమర దిక్కులో ఈ కొండలున్నాయి. అటుగా వెళితే మిమ్మల్ని సువాసనలో కమ్మివేస్తాయి. చూస్తే అన్ని రంగుల పూలతో కనువిందు చేస్తాయి. ముఖ్యంగా సెప్టెంబర్ – అక్టోబర్‌లో ఆకాశం నీలంగా, గాలి నిర్మలంగా ఉంటుంది. ఎరుపు రంగులకి మారుతున్న ఈ శిశిరం ఆ కొండల్ని కమ్ముకుని మనల్ని రమ్మని పిలుస్తుంది. అక్కడ గడిపిన క్షణాలు – మన జీవితంలోని శిశిరాన్ని తరిమివేస్తుంటాయి. మళ్లీ మళ్లీ రమ్మని పిలుస్తాయి కొన్ని పార్కుల పండుగలు.


* * *

ఇంతకు పూర్వం పీటర్ సంగతి చెప్పాను. అతను మాట ప్రకారం ఉదయం 7.30 ని॥లకు వాను పంపాడు. అప్పటికే మేము హోటల్ లాబిలో ఎదురు చూస్తున్నాం. తాగటానికి, తినటానికి మా చిన్ని సంచుల్లో నింపుకుని ఇద్దరం వాన్ ఎక్కాం. మరో ఏడుగురు ఉన్నారు. ఇద్దరు తెల్లవాళ్లు – ఇద్దరు జంటలు – అందరినీ పరీక్షగా చూశాను. జంటల్లో ఒక జంట – వయసులో పెద్దవారే. ఉత్సాహంగా ఉన్నారు. ఒక సింగిల్ లేడీ నడిమి వయసు – కాస్త టిప్‌టాప్‌గా ఉంది. బ్లాక్ డ్రెస్ – ముత్యాల హారం – లిప్‌స్టిక్. మిగతావారు 30–40 వయస్సు – మేము ఎక్కిన తర్వాత దారిలో ఒక హోటల్ దగ్గర ఆగి మరో టూరిస్ట్‌ని ఎక్కించుకున్నాడు డ్రైవర్ కమ్ గైడ్. మంచివాడే. ఈ టూరిస్ట్ గుజరాత్ – బొంబాయి బోర్డర్ పెద్దమనిషి. మమ్మల్ని చూసి ఆయన, ఆయన్ను చూసి మేము నవ్వులతో పలకరించుకున్నాం. తర్వాత చెప్పాడు ఇక్కడ నుంచి కాలిఫోర్నియా వెళ్తున్నట్లు.

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా:

అక్కడికి చేరేముందు మేము చాలా దూరం ప్రయాణం చేశాం. పైన చెప్పిన మింగ్ టూంబ్స్ – ఫ్రాగ్రెన్స్ హిల్స్ – బొటానికల్ గార్డెన్స్ అన్నీ చూసుకుంటూ లంచ్ టైమ్‌కు చైనా వాల్ కొండల కిందికి చేరాం. మాకు ఆశ్చర్యం ఏమిటంటే అక్కడ ఫార్మర్స్ రెస్టారెంట్ ఉంది. అందులో మాకు చక్కని

భోజనం రైస్ – చికెన్, చక్కని సూప్ – ఉడకబెట్టిన దుంపలు – బీరు అన్నీ టూర్‌కాస్ట్‌లో కలిపి ఇచ్చారు. మాకు ఎన్నాళ్లైంది చక్కని భోజనం చేసి అని బాగా లాగించాం. చైనా గోడ ఇక్కడి నుంచే ఎక్కాలి. వ్యాన్ ఇక్కడ ఆగిపోతుంది. పైకి చూస్తే చాలా


గ్రేట్ వాల్ ఆఫ్ చైనా

ఎత్తులో కొండ కొనలున్నాయి. 500 అడుగులు స్లోప్ రోడ్ మీద ఎగబాకాం. అక్కడ ఒక రోప్ వే ఉంది. అందులో మరికొంత ఎత్తుకు వెళ్లాం. అక్కడ నుంచి 3, 4 వందల అడుగులు ఎక్కాం. చివరికి గోడ కిందకు చేరాం. అక్కడ చిన్న గార్డెన్ ఉంది. పెద్ద రాయి మీద మెమోరియల్ కూడా ఉంది. అక్కడ అలసట తీర్చుకుని నీళ్లు త్రాగి ఒక్కొక్క మెట్టు అడుగు పైన ఉంది – మోకాళ్ల మీదే. ఎంత ఎత్తుకు ఎక్కామో కూడా ఇప్పుడు గుర్తు రాదు. చివరికి గోడ మీద అడుగుపెట్టాం. ఒక్కసారిగా శ్రమంతా మర్చిపోయాం. ఎందుకు? ఈ గోడ కట్టిన మానవ జాతి మహాకార్యానికి. వారి శ్రమ త్యాగాలు ముందు మన శ్రమ ఎంత? అసలు పోల్చనేకూడదు. అరె! ఏమి గోడ, ఎంత గోడ, దీని చరిత్ర ఏమిటి? అవసరం ఏమిటో తెలుసుకోవాలి కదా!

ఈ గోడ శత్రువుల నుంచి తమ దేశాన్ని అంటే భూభాగాన్ని, ప్రజల్ని కాపాడుకోవడానికి చైనా పాలకులు – ప్రజలు కలిసి అనితరసాధ్యమైన తూర్పు, ఉత్తర పర్వతాల కొనలపైన నిర్మించికున్న రక్షణ కుడ్యం ఇది. తూర్పు సముద్రం దగ్గర నుంచి పడమర చైనా సరిహద్దు వరకు దాదాపు 29 వేల కి.మీ. పొడవైన ఈ గోడ చరిత్ర 2 వేల సంవత్సరాలకు పైగా నిలిచి ఉంది. ఇది చైనా ప్రజల చైతన్యానికి, శ్రమకు, తెలివితేటలకు, దృఢత్వానికి, దేశ సమగ్రతకు చిహ్నం. 202–206 బి.సి.ఇ. కిన్షి హువాంగ్ వంశస్థులు మొదలుపెట్టిన మహా యజ్ఞం. ఇప్పుడున్న గోడ మింగ్ డైనాస్టీ 1368–1644 వరకు నిర్మించినది. 5,500 మైళ్లు లేక 8,850 కి.మీ. మరో లెక్క ప్రకారం 13,171 మైళ్లు లేదా 21,196 కి.మీ.గా తేలింది. గోడ వెడల్పు 16.5 అడుగుల నుంచి 29 అడుగుల వరకు, 67 వాచ్ టవర్స్ – ఈ మొత్తం సముద్ర మట్టానికి 3 వేల అడుగుల



పోలియో స్ట్రికెన్ టూరిస్టులు

పైనే. ఇప్పుడు మేము చూస్తున్న భాగం బీజింగ్ దగ్గరలో ఉత్తరంగా 3 విభాగాలుగా ఉంది. చాలా బాగా కాపాడుకున్నారు. బడాలింగ్ – జూయాంగ్ కనుమ – ముతియాన్యూ – ఈ మూడు భాగాలు 629 కి.మీ. ఉంటుంది. పెద్ద పెద్ద రాళ్లు సున్నంతో అతికించి ఉంటాయి. కాపలాకు బురుజులున్నాయి. గుర్రాలు యథేచ్ఛగా తిరగవచ్చు గోడమీద. ఇదంతా మంగోలియన్ల తాకిడి తట్టుకోవడానికి చైనా ప్రజలు, పాలకులు నిర్మించుకున్న రక్షణ కుడ్యం. చూసి ఆశ్చర్యపోవడం, మనం కూడా ఈ అద్భుతమైన గోడమీద అడుగుపెట్టగలిగాం అని తృప్తి, గర్వంతో ఒళ్లు పులకరించిపోతుంది. అంతకంటే ఆశ్చర్యం ఈ గోడ ఎక్కడానికి పోలియో బాధితుల బృందం కర్రల సాయంతో ఇంత దూరం రావడం. ఆ గోడ నిర్మించినవారికి మా నివాళి సమర్పించుకున్నాం. అక్కడ ఉన్న స్మారకశిల దగ్గర ఫోటోలు దిగాం. 2 గం.లు పైగా ఆ గోడ మీద గడిపాం. చాలా చలిగా ఉంది. ఆ ఎత్తులో జనవరి, ఫిబ్రవరి అయితే మంచులో మునిగిపోయి ఉంటుంది. జాగ్రత్తగా మెట్లు దిగి, కేబుల్ కారులో కొంత దూరం దిగి అర కిలోమీటరు వాలులో నడిచి, చివరికి చీకటి పడుతుండగా వాన్ దగ్గరకు చేరాం.

టీ సెర్మనీ:



మా డ్రైవర్ కమ్ గైడ్ ఒక జేడ్ హస్తకళల కర్మాగారం చూపించాడు. చాలా పెద్దది. ఆ జేడ్ బొమ్మలన్నీ లక్షల్లో ఉన్నాయి. చూసి ఆనందించాం. చివరిగా సిటీలో టీ సెర్మనీ కోసం రెండంతస్తుల భవనం దగ్గర ఆపాడు. ఈ టీ సెర్మనీ ఒక అద్భుత ప్రక్రియ. అక్కడ చైనా బోన్ పాత్రల మాల్ ఉంది. ఎన్నో రకాలు – ఎంత ఖరీదో!

మాకు టీ రకాలు రుచి చూపించిన చైనా సుందరి గురించి ఎంతైనా చెప్పవచ్చు. చక్కని ఇంగ్లీష్ మాట్లాడుతోంది. ముట్టుకుంటే మాసిపోయే చైనా బోన్

టీ జాడీలా ఉంది. ఎన్నో జోక్‌లు వేస్తూ పది రకాల టీలు తాగించింది. ప్రక్కన స్టాల్‌లో మీకు ఇష్టమైన టీ రకం కొనమంది. అలాగే అందమైన కప్పులు, జాడీలు కూడా. ఈ అనుభవాన్ని మర్చిపోలేం. బొమ్మల్లో బిగించి తెచ్చుకున్నాం.

అప్పటికి రాత్రయింది. ఇక డ్రైవర్ డ్రాపింగ్ మొదలుపెట్టాడు. చాలా మర్యాదగా మమ్మల్ని మా హోటల్ పరిసరాలలో దింపాడు. ఓ వంద యువాన్లు సంతోషంగా ఇచ్చాం. గదికి చేరిన తర్వాతగాని కాళ్లు పీకటం మొదలుకాలేదు. కానీ అన్నిటికీ మందులుంటాయి కదా!

* * *

ఇంతవరకూ నా 70 వేలు రాలేదు. డబ్బు కరువులో పడిపోయాం. బీజింగ్‌లో మనకు ఎవరు అప్పు ఇస్తారు? ఆ రాత్రి నాగ్ బాగా అలసిపోయి నిద్రపోతున్నారు. నాకు రేపు ఎలాగా అనే ఆలోచనతో నిద్ర రాలేదు. ఇక షాంగై హోటల్‌కు ఫోన్ చేసి సుఖం లేదు. వాళ్లు చేయవలసింది చేశారు. ఇక బ్యాంకును అడగాలంటే అది కనిపించేది కాదు. మా ఢిల్లీ ఏజెంట్‌కు మెయిల్స్ పెట్టి పెట్టి అలసిపోయాను. చివరకు డబ్బు రాలేదు. జేబులో చిల్లు యువాను కూడా లేదు. ఇక లాభం లేదని ఆ రాత్రి – బీజింగ్‌కి – హైదరాబాద్‌కి 2.30 గం॥లు తేడా – అర్ధరాత్రి ఇద్దరు స్నేహితులను నిద్రలేపి సంగతంతా చెప్పి ఉదయం 10.00 గం॥లకు నా బ్యాంక్‌కు వెళ్లి అన్ని వివరాలు వాట్సాప్‌లో పంపి 3 వేల యువాన్లు తెప్పించుకునే ఏర్పాటు చేసుకున్నాం. మన కార్డు వాడుకోవచ్చు కదా!

ఉదయం లేచి ఇక షాపింగ్ ఎలా చేయాలా అని ఇంటి దగ్గర నుంచి తెచ్చిన లిస్ట్‌తోపాటు మేము చూసిన వింతలు, మనం కొనదగినవి, కొనగలిగినవి ఒక జాబితా తయారు చేసుకున్నాం. ఈ మార్కెట్ ఎక్కడుంటుంది? మళ్లీ మా హోటల్ మేనేజర్‌ను అడిగాం. ఆమె చెప్పిన వివరాల ప్రకారం ఆ పాపులర్ మార్కెట్ – హాంగ్ కియో మార్కెట్ – మాకు దగ్గరలోనే ఉంది. 3 – 4 కి.మీ.లోనే ఉంది. వెళ్లేందుకు క్యాబ్‌ను పిలిచింది. 15 యువాన్లతో అక్కడికి చేరాం. చాలా పెద్ద మార్కెట్ బిల్డింగ్. అన్ని దేశాల టూరిస్టులు ఇక్కడ కనిపించారు. సరైన చోటికే వచ్చాం అనుకున్నాం. అన్నింటిలోకీ అదృష్టం అక్కడ పిజా హట్ ఉండటం. ఇంకా ఏమిటి? చివరి రెండు రోజులు




ఈ ప్రాంతంలోనే బాగా తిరిగాం. డబ్బంతా అయిపోయేవరకు అవసరమైనవి, లేనివి కొన్నాం. సూట్‌కేసులతో రూమ్‌కు చేర్చాం సామాన్లు. బ్యాటరీ రిక్షాలో తిరిగాం, రోడ్లు దాటాం, అండర్ పాస్‌లు చూశాం. సరదాగా అండర్‌గ్రౌండ్ మెట్రోస్టేషన్‌లోకి వెళ్లాం, సిటీ బస్‌లో ఒక మూలనుంచి మరో చివరకు అప్పర్ డెక్‌లో కూర్చుని సిటీ అంతా చూశాం.

రేపు తిరుగు ప్రయాణం. ఈ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లాం. చాలా తిరిగాం. ఇక్కడ సాయంత్రాలు చైనా కుటుంబాలు తమ ఒక్క బిడ్డను తీసుకుని షాపింగ్ చేస్తారు. ఎక్కువగా సీజనల్ పళ్లు కొంటారు. రెస్టారెంట్లలో తినటం తక్కువే. రాత్రి 8.00 గం॥ల వరకు ఇల్లు చేరిపోతారు. అలా తిరిగి తిరిగి మా వీధి ఫుట్‌పాత్ చివర ఉన్న బెంచ్ మీద కూర్చున్నాం. నాకు ఏదో ఒకరకమైన నిర్వేదం కమ్ముకొస్తోంది. "ఏమండీ! మళ్లీ మనమిటు రాము కదా! కానీ ఈ సిటీ, ఈ వీధి, ఈ బెంచి, ఈ కుటుంబాలు, ఈ సైకిళ్లు ఇలాగే ఉంటాయి కదా! ఇవాళ మనకు ఇది వర్తమానం. మరి రేపటికి?" అన్నాను నాగ్‌తో. ఆయనా గంభీరంగా ఉన్నారు. చలిగాలి విసురుతోంది!

తిరుగు ప్రయాణం:

ఈ రోజే మాకు బీజింగ్‌లో చివరి రోజు – ఏ పని పెట్టుకోలేదు. సూట్‌కేసులు రాత్రే సర్దుకున్నాం. బన్ – ద్రాక్ష – కాఫీ బ్రేక్‌ఫాస్ట్ అయిన తర్వాత బయట వాకింగ్‌కు బయలుదేరాం. లేతగా ఎండ పరుచుకుంది. గాలి చల్లగానూ ఉంది. హోటల్ దగ్గర్లో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పైకి వెళ్లాం – క్రింద కార్లు వేగంగా వెళ్లిపోతున్నాయి. బ్రిడ్జి చివరగా వెళ్లాం. అక్కడ కాలువ ప్రవహిస్తోంది. బండ్ మీద బెంచ్‌లున్నాయి. ఒకరిద్దరు బుద్ధిస్ట్ చాంటింగ్ చేస్తున్నారు. నీరు శుద్ధం చేసే యంత్రం నిద్రపోతోంది. నీరు శుభ్రంగానే ఉన్నాయి. ఆ దగ్గర్లో ఏదో రైల్వేస్టేషన్ ఉంది. ఆకాశం నిర్మలంగా – నీలంగా ఉంది. సిటీ పది కిలోమీటర్లు



బీజింగ్ కాపిటల్ ఎయిర్‌పోర్ట్

పైగా కనపడుతోంది ఉత్తరానికి; పిల్లలు సైకిళ్ల మీద బ్రిడ్జి దాటుతున్నారు. బ్రిడ్జి దిగి బంక్ దగ్గరకొచ్చాం – స్టోర్‌లో 3 యువాన్లకు డ్రింకు కొన్నాం. ఎయిర్‌పోర్ట్ పికప్ ముందే ఏర్పాటు చేసుకున్నాం. 12.00 గం॥లు (పగలే). లాబీకి వస్తానన్నాడు. మేము 11.00 గం॥లకు హోటల్‌కి తిరిగి వచ్చాం. రిసెప్షన్‌లో మేనేజర్‌తో చెకవుట్ చెప్పాం. బిల్లులన్నీ ముందే కట్టేశాం కదా! మేనేజర్‌తో ఫోటోలు దిగాం – ఇండియా రమ్మని ఆహ్వానించాం – బీజింగ్ ఎప్పుడూ దాటలేదు అన్నది నవ్వుతూ.


గ్రీన్ ట్రీ హోటల్ మేనేజర్

రూంకి వెళ్లాం. బాగేజి బైటపెట్టాం. కరెంటు పోయింది – కాదు – లిఫ్టు సర్వీసులో ఉంది. పెట్టెలు ఎలా వస్తాయి? 12 గం.లకు హోండా ఎకార్డ్ వచ్చింది. డ్రైవర్ దృఢంగా ఉన్నాడు. అంతలో బ్యాగ్‌లు క్రిందికి తెచ్చారు. అతను డిక్కీలో లోడ్ చేశాడు. ఇద్దరం వెనక సీటులో కూర్చొని ఒకసారి అందరికీ బై చెప్పాం. కుటుంబ సభ్యులను పంపుతున్నట్లు మేనేజర్, రిసెప్షన్, బెల్ బాయ్ అందరూ బయటకు వచ్చి సాగనంపారు.

ఎకార్డ్ సర్వీస్ రోడ్ నుంచి రింగ్ రోడ్‌లో ప్రవేశించింది. ఉత్తరంగా సిటీ మధ్యలోనుంచి సి.సి. టి.వి. టవర్ మీదుగా రెండో రింగ్‌లో ప్రవేశించి ఎయిర్‌పోర్ట్ స్పీడ్ వే ఎక్కింది. బీజింగ్ క్రమంగా వెనక్కు వెళ్లిపోతోంది. సోషల్ ఫారెస్టు – దూరదూరంగా భవనాలు కనపడుతున్నాయి. 80 మైళ్ల వేగంతో పోతోంది. అంతలో ఒక రూడ్ డ్రైవర్ అందర్నీ క్రాస్ చేసుకుంటూ వంద మైళ్ల స్పీడులో వెళ్లిపోయాడు. మా డ్రైవర్ వాడిని శపించాడు. చివరిగా కాపిటల్ ఎయిర్‌పోర్ట్ ఎగ్జిట్ కనపడుతోంది. చైనాలో అన్ని లెఫ్ట్ హాండ్ డ్రైవింగ్ కార్లు. అంతా రోడ్డు కుడిప్రక్కన వెళుతుంటారు (మనం ఎడం ప్రక్కన వెళ్తాం కదా). ఎయిర్‌పోర్ట్ రోడ్‌కు ఎడం ప్రక్కన ఉన్నట్లు ఎగ్జిట్లు


ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై
కె.ఎన్.ఆర్.

చూపిస్తున్నాయి. ఎక్కడో ఒక ఫ్లైవోవర్ మీదుగా స్పీడ్ వే దాటాము. వి.ఐ.పి. ఏరియా ఎడం ప్రక్కగా కనపడుతోంది. కుడి ప్రక్కగా ఎయిర్‌పోర్ట్ డ్రైవేలో ప్రవేశించాం. ఓ ప్రక్కగా ఆపాడు. అది ఇంటర్నేషనల్ టెర్మినల్ – అని చూపించి లగేజ్ దింపాడు. 20 యువాన్లు ఇచ్చాను. హాయిగా నవ్వాడు 'హ్యాపీ జర్నీ' అంటూ.

అక్కడ డ్రైవే దాటాం, గీతల మీద. ఒక్కసారి కాపిటల్ ఎయిర్‌పోర్ట్ లోపలికి అడుగుపెట్టాం. దాని పరిమాణం మమ్మల్ని మింగివేసింది. థాయ్ చెక్ ఇన్ కౌంటర్‌లు పెద్దగా కష్టపడకుండానే కనిపించాయి. రెండు గంటలకు చెక్ ఇన్ – ఇంకా సమయం ఉంది – చుట్టూ తిరిగి వచ్చాం. ఎయిర్‌పోర్ట్ ఏ దేశంలోనైనా పెద్ద వ్యాపారం – అంటే డబ్బుమయం. దీనికి కమ్యూనిజం, సోషలిజం, ప్రజాస్వామ్యం తేడాలేమీ లేవు. సిద్ధాంతాలు అడ్డురావు. అమెరికాలో, యూరోప్‌లో, చైనాలో ఏమాత్రం వ్యత్యాసాలు ఉండవు. ఒకరకంగా వాళ్లకంటే వీళ్లే సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పగలు ఒక్క లైటు కూడా వేయకుండా అంత పెద్ద టెర్మినల్‌ను బయటి వెలుగుతో అలంకరించారు. పైనుంచి నక్షత్రాలు వేలాడుతున్నాయా అనే భ్రమ కలిగించేలాగా అద్దాలు అమరిచారు. చల్లని గాలులు ఎటునుంచి వస్తున్నాయో కూడా తెలియకుండా డిజైన్ చేశారు. మొత్తం అద్దంలా తీర్చిదిద్దారు. ఇంతవరకూ 50 పైగా అంతర్జాతీయ విమానాశ్రయాల నుంచి ప్రయాణం చేశాను. ఈ అనుభవం ప్రత్యేకం. చెక్ ఇన్ అయిన తర్వాత కిందికి దిగి ఆటోమెటిక్ రైలు ఎక్కాలి. గేటులన్నీ వరుసగా ఉంటాయి. చివరిగా ఇంటర్నేషనల్ గేట్లున్నాయి. అక్కడ దిగి ఇమ్మిగ్రేషన్ కౌంటర్ దగ్గరకు వెళ్లి – అదో చిరాకు – సీరియస్‌గా పాస్‌పోర్టులు చూస్తారు. మంచినీళ్ల సీసా కూడా తీసుకువెళ్లనివ్వరు. మేము కొన్న డబ్బాలు పెద్ద డబ్బాలో పడవేశాము. అదీ దాటి గేట్ల దగ్గరకు వచ్చాం. సమయం మూడైంది. అయిదు గంటలకు మా థాయ్ ఫ్లైట్. రెండు గంటల కాలం అక్కడ బ్రాండ్ దుకాణాలు చూస్తూ తోటి ప్రయాణికులను గమనిస్తూ అద్దాలలోంచి వాలుతున్న, ఎగురుతున్న విమానాలను చూస్తూ, ఫోటోలు తీస్తూ గడిపేశాం. ఇక్కడ కొందామంటే అన్నీ ఖరీదే. అయిదింటికే చెక్ ఇన్ అయిపోయింది. మాకోసం వచ్చిన ఎయిర్ బస్ కనపడుతోంది. గేటు తీసిన తర్వాత తీరుబడిగా విమానంలోకి వెళ్లాం. చేతిలో చిన్న బ్యాగులు తప్ప నాలుగు సూట్‌కేసులూ చెక్ ఇన్ చేశాం. అయిదింటికే

మొత్తం గాలిలో ప్రయాణం 10 వేల మైళ్లు. నేల మీద 2 వేల కి.మీ. పైనే. నడక హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు. రెండు వారాల్లో మన పద్ధతిలో రెండేసార్లు భోజనం. ఎక్కడా తుమ్ము కూడా రాలేదు. తలనొప్పికి మాత్ర కూడా వాడలేదు. ఫోటోలుగాని, వీడియోలుగాని 50 జి.బి.కి పైనే తీశాం.

టాక్సీయింగ్ మొదలైంది. అరగంట పైగా ఎయిర్‌పోర్ట్ ఈ చివరి నుంచి ఆ చివరకు నడిచింది. తీరా మెయిన్ రన్‌వే దగ్గర చాలా పెద్ద క్యూ ఉంది. ఆ విధంగా ఆలస్యంగా గాలిలోకి లేచిన థాయ్ విమానం బాంకాక్ వైపు ప్రయాణిస్తోంది. అరగంటలో డ్రింకులు, భోజనాలు వచ్చాయి. అవీ అయిన తర్వాత స్టీవర్డ్ వచ్చింది. మా పేర్లు అడిగింది. చెప్పిన తర్వాత మీ హ్యాండ్‌బాగ్‌లు తీసుకోమంది. 'ఏమిటి కొంపదీసి దింపేస్తుందా ఏమిటి?' ఫ్లైట్ మొత్తంలో ఇండియన్స్ మేమిద్దరమే ఉన్నాం. చాలా మర్యాదగా తీసుకువెళ్లి బిజినెస్ క్లాస్‌లో కూర్చోబెట్టింది. రిలాక్స్ అని మీకు డ్రింక్ కావాలా అని అడిగింది. ఏమిటీ మర్యాద నాగ్! మనమేమైనా నిషిద్ధ వస్తువులు తెస్తున్నామా అని అడిగాను. ఆయన నవ్వి ఊరుకున్నారు. తర్వాత సంగతి ఇప్పుడెందుకు? షివాజ్ అన్నాను. మా ఇద్దరికీ రెండు గ్లాసులలో షివాజ్ తెచ్చింది. అయిదు గంటల ప్రయాణంలో గంట అయిపోయింది. ఇంకా నాలుగు గంటలు. బాంకాక్‌లో ప్లేన్ మారాలి. అక్కడి నుంచి హైదరాబాద్ మూడు గంటలలోపు ప్రయాణం. ఒక గంట నిద్రపోయాం. చీకటి పడిపోయింది. ఏదో థాయ్ సంగీతం వింటూ గడిపాను. ఓ ముప్పావుగంట ఆలస్యంగా సువర్ణభూమి చేరాం. మా హైదరాబాద్ విమానం వెళ్లిపోయి ఉండాలి. ఎందుకంటే దాని రాకా దీని పోకా మధ్యలో గంట మాత్రమే ఉంది. ఇప్పటికే 45 నిమిషాల ఆలస్యం. ఇంకా మేము దిగాలి, బ్యాగులు రావాలి – ఆ ఫ్లైట్ ఎక్కేందుకు. ఇలా మథనపడుతుండగా మమ్మల్ని డోర్ దగ్గరకు ఎస్కార్ట్ చేసి తెరవగానే ఒక మేల్ ఎస్కార్ట్‌కు అప్పగించింది. అతను 'మిస్టర్ కుమార్! కమ్ విత్ మి' అని పరిగెత్తాడు. వాట్ హాపెండ్? 'వుయ్ హోల్డ్ యువర్ ఫ్లైట్ ఫర్ హైదరాబాద్' అన్నాడు. ఆరి దేవుడా! అందుకా ఈ మర్యాదలు అనుకున్నాను రొప్పుతూ. అక్కడి నుంచి కింద వ్యాన్ ఎక్కించాడు. వాన్ ఒక టెర్మినల్‌కు వెళ్లింది. అక్కడ పైకెక్కించాడు. అరకిలో మీటరు పరిగెత్తించాడు. ఇంకో గేట్ దగ్గర సెక్యూరిటీ చెక్ అన్నాడు. అదీ అయింది. మళ్లీ కిందకు దింపాడు. ఇంకో వాన్ ఎక్కించి

ఒక లావు సెక్యూరిటీ అమ్మాయికి అప్పగించాడు. అప్పుడుగాని వెనక్కు తిరిగి చూడలేదు నాగ్ ఎక్కడా అని. ఆయనతో ఒక లేడీ కూడా ఉంది. వాళ్లిద్దరూ కూడా వచ్చి వాన్ ఎక్కారు. ఈ వాన్‌లో చాలా దూరాన ఉన్న హైదరాబాద్ ఫ్లైట్ దగ్గరికి చేరవేశారు. 'గో గో గో... అదే మీ ఫ్లైట్' అంది.

వాన్ దిగి, విమానంలోకి మెట్లెక్కి ఒగురుస్తూ మాకోసం ఎదురుచూస్తున్న థాయ్ ఆర్చిడ్‌ను చూసి కొంత సేదదీరాం. మేము లోపలికి రాగానే ఆమె తలుపు మూసింది. నేను బిజినెస్ క్లాస్ వైపు తిరగబోయాను. 'ఓ.. సారీ ఇట్స్ ఫుల్' అంది. తరువాత మా సీట్లు చూపించి కూర్చోబెట్టింది. అంతే! ఫ్లైటు కదిలింది. దాదాపు గంట ఆలస్యంగ. ఓ పావుగంట తర్వాత నాకు అనుమానం వచ్చింది. మా బ్యాగ్‌లు ప్లేన్ మారి ఉంటాయా లేకపోతే బాంకాక్‌లోనే ఉండిపోతాయా? అరగంట గడిచింది. విమానంలో గోల ఎక్కువగా ఉంది. అప్పుడు అర్థమైంది. మేము హైదరాబాద్ వెళుతున్నాం అని. తోటి ప్రయాణికులు ఒకరిద్దరు థాయ్ ఎయిర్ హోస్టెస్‌ను చూసి కామెంట్ చేసి నవ్వుతుంటే వెకిలిగా అనిపించింది. నాగ్ 'నా ఫోన్ బాంకాక్ సెక్యూరిటీలో మరిచిపోయాను హడావుడిలో' అన్నారు? అందులో ఉన్న ఫోటోలు అన్ని పోయినట్లే అవన్నీ నాకు సంబంధించినవి – ఆయన ఫోటోలు నేను, నా ఫోటోలు ఆయనా తీసేవాళ్లం!! హైదరాబాద్ చేరాం. బ్యాగేజీ బెల్టు దగ్గర అనుమానంగానే నిలబడ్డాం. అనుకున్నట్లుగానే ఒక బ్యాగ్ రాలేదు. దాని కోసం రెండు గంటలు ఎదురు చూశాం. బెల్టు ఆగిపోయింది, సూపర్‌వైజర్‌ను అడిగితే ఎదురుగా ఉన్న ఆఫీసులో కంప్లైంట్ ఇవ్వమన్నాడు. కంప్లైంట్ రిజిస్టర్ చేసి పన్నెండు గంటలకు వచ్చినవాళ్లం నాలుగు గంటలకు బయటకు రావడానికి సిద్ధపడ్డాం. అయితే ఇంకా పని ఉంది. డబ్బులన్నీ పోగుచేసి, కస్టమ్స్ ఫ్రీ దుకాణాలు చూడాలి కదా! అదీ అయ్యేసరికి 5.00 గం॥లు అయింది. ట్రాలీలు తోసుకుంటూ కిందికి చేరేసరికి తూర్పు వెలుగు కూడా వచ్చింది. ఈ విధంగా మా చైనా యాత్ర దిగ్విజయంగా ముగిసింది. మిస్సయిన బ్యాగు మర్నాడు తెచ్చారు. మరి నా డెబ్బైవేలు?

చెప్పండి ఇది సాహస యాత్రేనా?

బెట్రండ్ రస్సెల్ చైనా యాత్ర

ఇంతవరకూ మీరు చదివిన 'మా చైనా సాహస యాత్ర' ముగించినా చెప్పవలసిన విశేషాలు చాలానే మిగిలి ఉన్నాయి. అందులో ముఖ్యంగా నేను కలిసిన చైనా కాలేజీ విద్యార్థులు, అందులోనూ విదేశాలకు పై చదువుల కోసం ప్రయత్నించే విద్యార్థినీ విద్యార్థులు మీరు చూసిన చైనా కేబుల్ (బీజింగ్) నెట్‌వర్క్ భవనం ఉన్న ప్రదేశానికి దక్షిణంగా, ఇక్కడ రోడ్డు వెడల్పు 500 అడుగుల పైనే ఉంటుంది, రెండు అధునాతనమైన 20 అంతస్తుల భవనాలున్నాయి. పరిసరాలు శుభ్రంగా ఎంతో చైతన్యవంతంగా కనిపిస్తున్నాయి. కారణం అక్కడ ఇంటర్నేషనల్ స్టడీ సెంటర్ల సమూహం ఉండడమే. 20 ఏండ్ల యువతీ యువకులు ఒకటో రెండో, పుస్తకాలు పట్టుకుని ఆ రెండు భవనాల పరిసరాల్లో ఎంతో ఆహ్లాదకరంగా, హడావుడిగా తిరుగుతున్నారు. సహజంగానే మాకు వారితో మాట్లాడాలనిపించి అక్కడ ఉన్న రాతి బెంచి మీద కూర్చున్నాం (మనకు తేలికగా అర్థం కావడానికి అది అమీర్‌పేట్, మైత్రీవనం అనుకుందాం) ఒక అమ్మాయిని ఒక అబ్బాయిని (కొంచెం సమయం పట్టింది – దేనికైనా ఓర్పు కావాలి కదా) ఎంచుకుని పలకరించాం. మా బెంచ్‌మీదకు ఆహ్వానించాం. వారితో ఆంగ్లంలో మాట్లాడడానికి ఏమీ ఇబ్బంది కలగలేదు. పైగా చాలా స్పష్టంగా చక్కటి ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. నాకైతే బీజింగ్‌లో నన్ను ఎవరో తెలుగులో పేరుపెట్టి పిలుస్తున్న అనుభూతి కలిగింది. మేము సేకరించిన విషయం ఏమిటంటే ఈ రెండు భవనాల్లో ఫారిన్ స్టడీస్‌కి కోచింగ్ ఇస్తారు. ఏ దేశం కావాలంటే ఆ దేశం వెళ్లడానికి అన్ని ఏర్పాట్లుచేస్తారు. ఏ భాష అవసరమైతే ఆ భాష నేర్పుతారు. అందుకు సొమ్ములు ఎక్కువ భాగం విశ్వవిద్యాలయాలే ఏర్పాటు చేస్తాయి. అంతా ప్రతిభ ప్రాతిపదికపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అక్కడ ఆయా దేశంలో పై చదువు పూర్తి కాగానే అందరూ ఖచ్చితంగా తిరిగి వస్తారు. ఇదంతా ఎందుకు చెప్పటం? ఒక కారణం ఉంది. నేను ఈ మధ్య



మీడియా సెంటర్ ఎదురుగా ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ భవనాలు (బీజింగ్)

మళ్ళీ చదివిన బెట్రండ్ రస్సెల్ ఆటోబయోగ్రఫీ (1914–44)లో – ఆయన చైనా యాత్ర గురించి విపులంగా ఉంది. అది సరిగ్గా ఇప్పటికి, మా యాత్రకు ముందు వంద సంవత్సరాల క్రిందట జరిగిన – చైనా విశ్వవిద్యాలయాల, అధ్యాపకుల, విద్యార్థుల ముచ్చట్లు కొన్ని చెప్తాను.

బెట్రెండ్ రస్సెల్ అప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు, ఎందరో అభిమానులు మరెందరో శత్రువులు కలిగి ఉన్న 'ఫిలాసఫర్'. ఈ పదం ఇలాగే వాడదాం. వేదాంతి, తత్త్వవేత్త అనేవి పూర్తి అర్థాన్ని ఇవ్వవేమో అని నా సందేహం! అలా ప్రపంచప్రఖ్యాత ఫిలాసఫర్ మొదటి ప్రపంచ యుద్ధాన్ని పూర్తిగా వ్యతిరేకించి మిలిటరీ సర్వీస్‌లో చేరనందుకు జైలుకు వెళ్లి యుద్ధం పూర్తయిన తర్వాత విడుదలై రష్యా 'బోల్షివిక్' విప్లవాన్ని విశ్లేషిస్తూ, విమర్శిస్తూ ఒక గ్రంథం రాశారు. ఆ సమయంలోనే 'పీకింగ్' (ఇప్పటి బీజింగ్) విశ్వవిద్యాలయంవారు రస్సెల్‌ను చైనా రమ్మని ఆహ్వానం పంపారు. వారితోపాటు షాంగై మరికొన్ని విద్యాసంస్థలు కూడా ఆహ్వానించాయి. అయితే రస్సెల్ మహాశయునికి ఒక సంశయం కలిగింది. ఇది నిజమేనా? లేక ఏమైనా ప్రాక్టికల్ జోకా? అని! అందుకని 'షిప్' ఛార్జీలు, ఇద్దరికి (రెండోవారెవరో తర్వాత చెప్తాను) ముందుగానే కట్టి రశీదు పంపమన్నారు. వారు సంతోషంగా 125 పౌండ్లు కట్టి ఆయనకు టికెట్లు ఏర్పాటుచేశారు! ఇంకా అప్పటికి విమాన సర్వీసులు మొదలుకాలేదు. సప్త సముద్రాలు పడవల మీద, నావల మీద దాటవలసిందే. ఈ బోటులు కూడా తరచూ ఉండవు కదా. అలా ఆయన చైనా ప్రయాణం ఖాయమయింది.

ఇద్దరు ప్రయాణికులు అన్నాం కదా! ఆయనతోపాటు ఆయనకు 'కాబోయే' రెండో భార్య 'డోరీ బ్లాక్' కూడా ప్రయాణమయింది! అప్పటికి మొదటి భార్యకు ఇంకా విడాకులు ఇవ్వలేదు. ఆమె ఇవ్వనా, వద్దా అని ఆలోచిస్తూ ఆర్నెల్లు గడపింది. చివరకు విడాకులకు కాగితాలు కోర్టుకు సమర్పించి రస్సెల్ చైనా యాత్రకు బయలుదేరారన్నమాట! ఈయన సిద్ధమైనా బోటు సిద్ధం కాలేదు. అందులో ఎలుక చచ్చిందని ప్లేగు నివారణ మందులు మూడు వారాలు చల్లాలని ఆ ప్రయాణం మూడు వారాలు ముందుకు జరిగింది. ఈ మూడు వారాలు రస్సెల్ – డోరా జంట పారిస్ చేరి స్నేహితులను కలవటానికి

ప్రదేశాలు తిరగటానికి ఉపయోగించుకున్నారు. కాబోయే భార్యకు ఫ్రాక్‌లు, నైట్ గౌన్లు కొన్నాడు. ఈ మూడు వారాల్లో వారి మధ్య ఉన్న సంశయాత్మక దూరం తగ్గిపోయింది.

రస్సెల్, బోల్షివిజమ్ గురించి రాస్తున్న పుస్తకం గురించి బాగానే చర్చలు జరిగాయి. దాన్ని వ్యతిరేకించటమంటే రియాక్షనరీ అనిపించుకోవటమే – ఈ అనుభవం రస్సెల్‌కి మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో దేశభక్తిని గురించి ఆయన అభిప్రాయాలు చెప్పినప్పుడు కూడా జరిగింది. ఏమైనా 'ఎంత కాలమని మన నోరు కట్టేసుకుంటాం' అంటాడు! ఆ రాత్రి డోరా నిద్రపోతుంటే బాల్కనీలో కూర్చుని నక్షత్రాలను చూస్తూ ఆలోచిస్తుంటాడు – తన ఉనికి – ఈ నక్షత్రాలతో ఎంతో సామరస్యంగా ఉందని అనుభూతి చెందుతాడు. కొంతసేపు ప్రకృతితో మమేకమవుతాడు. కాసియోపియోతో (డబ్ల్యు ఆకారంలో ఉండే నక్షత్ర మండలం) సంభాషించినట్లు ఊహించుకుని సేదతీరుతాడు. అతని మనసులోని సందేహాలన్నీ గాలికెగిరిపోతాయి. చైనా యాత్ర కోసం ఇంకా బోటు బయలుదేరక పూర్వమే తన పుస్తకాన్ని పూర్తి చేస్తాడు!

బోటు మార్సిలెస్ నుంచి బయలుదేరాలి – బాగా వేడిగా ఉంది. ఒకనాటి రాత్రి డోరాతో వాగ్వాదం జరిగింది. తనకి రష్యా అంటే పడదని డోరాకి మంట! 'మనం ఇలా కలసిరావటం చాలా పొరపాటయింది! ఇప్పుడు సముద్రంలో దూకటమే నాకు మిగిలింది' అంటాడు. ఇదంతా బయట వేడి ప్రభావం అని సరిపుచ్చుకుంటారు!

ఈ ప్రయాణం అయిదారు వారాలు పడుతుంది. అంతకాలం కలిసి ప్రయాణం చేస్తే తోటి ప్రయాణికులంతా పరిచయమయిపోతారు కదా! ఫ్రెంచ్‌వారంతా మంచి 'పొజిషన్'లో ఉన్న అధికారులు – ఇంగ్లీషు ప్రయాణీకులు – రబ్బర్ ప్లాంటేషన్, వ్యాపారాలు నడిపేవారు. అంటే వారిలో వారికే చాలా అంతరం ఉందన్నమాట! రోజూ ఏదో గొడవే. మధ్యలో రస్సెల్ మీడియేటర్! ఒక రోజు ఇంగ్లీషు



షాంగై బండ్ – 1920

ప్రయాణీకులు రస్సెల్‌ను రష్యా గురించి మాట్లాడమన్నారు. వారి మూడ్‌నుబట్టి ఈయన అనుకూలమైన మాటలే చెప్పారు. దానితో పెద్ద గొడవే జరిగింది. అది మనసులో పెట్టుకొని ఇంగ్లీషు పెద్ద మనుషులు పీకింగ్ టెలిగ్రాం పంపారు. ఈ రస్సెల్ మహాశయుని మీ దేశంలో కాలుపెట్టనీయకండి అని.

* * *

చివరికి షాంగై రేవులో పడవ దిగుతారు. వీరి కోసం ఎవరూ ఆహ్వానం చెప్పటానికి రాలేదు (మాకే నయం! మా కోసం ఛెంగిస్ ఖాన్ చెల్లెలు వచ్చింది కదా!). రస్సెల్‌కు మొదటి అనుమానం బలపడింది. ఇది ప్రాక్టికల్ జోక్ అని. అయినా ఇంత ఖరీదైన జోక్ కోసం ఎందుకు డబ్బు దండగ పెట్టుకుంటారు. ఇలా ఆలోచిస్తుండగానే ఆహ్వాన సంఘం (అంతా చైనావారే) అక్కడికి చేరుకుంటుంది. బోటు వచ్చే సమయం సరిగ్గా తెలియజేయకపోవటమే కారణం. వారు ఎంతో ఆదరంగా ఆహ్వానించి చైనీస్ హోటల్‌కి తీసుకెళ్ళారు. ముందుగా రస్సెల్‌కి ముఖ్యమైన సమస్య డోరా ఎవరో చెప్పటం. వాళ్లు ఇద్దరికీ వేరువేరు గదులు? నో - నో - కలిసే ఉంటాం. అయితే మిస్ బ్లాక్ అని రిజిస్టర్‌లో రాయాలి. అలాగే పిలవాలి. అంతే అంటాడు.


పురాతన పగోడ

మర్నాడు చైనా పేపర్లు ఈ వార్త రాసేశాయి. అదీ ఒకందుకు మంచిదే అయింది. తర్వాత ఇక ఈ సమస్య చెప్పుకోవలసిన అవసరం రాలేదు! ఆయన యాత్ర చివరి రోజు వరకూ ఆమెను 'మిస్ బ్లాక్' అని సంబోధిస్తూనే ఉన్నారు.

షాంగైలో వంద సంవత్సరాల క్రితం రస్సెల్ మొన్న మేమున్న బండ్ దగ్గర్లోనే హోటల్‌లో ఉన్నారు! మోటారు కార్లకంటే మనిషి తొక్కే రిక్షాలే ఎక్కువున్నాయి. మేము కారుల్లో తిరిగాం, పాపం ఆయన రిక్షాలో తిరిగాడు. రోజూ ఆయన కోసం అమెరికన్లు, జపాన్‌వాళ్లు, కొరియన్లు, ఐరోపావాళ్లు ఎందరో వచ్చి కలుస్తుండేవారు. డిన్నర్ తర్వాత ఉపన్యాసాలు, లంచ్ తర్వాత చర్చలు సాగుతుండేవి. చైనావాళ్ల ఇంగ్లీష్ ఎంతో ధారాళంగా, స్పష్టంగా ఉందంటారు రస్సెల్. సమయానికి తగిన హాస్యచతురత వాళ్ల ప్రత్యేకత అంటారు.

"..... that a civilized Chinese is most Civilized person in the world..." అని వక్కాణించాడు! షాంగై చుట్టుప్రక్కల రస్సెల్ (ఇప్పుడు మేము తిరిగిన ప్రదేశాలే) వెస్టర్న్ లేక్ ప్రాంతాలన్నీ తిరిగి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడవుతాడు. ఇటలీకంటే బాగుందంటాడు.

చాంగ్ షాలో ఉండగా చంద్ర గ్రహణం వస్తుంది. చైనావాళ్లు పెద్ద గంటలు మోగిస్తూ రాత్రంతా తిరుగుతారు. చంద్రుణ్ణి ఒక దేవతా శునకం మింగేస్తుంది అని దాన్ని బెదరగొట్టటానికి! అప్పుడే అక్కడ గవర్నర్ వీరి గౌరవార్థం చాలా షడ్రసోపేతమైన డిన్నర్ ఇస్తారు. చివరిలో "మీరేమీ అనుకోవద్దు – ఇంత సాధారణంగా ఈ భోజనం ఉన్నందుకు – మా ప్రజలు ఎలా జీవిస్తున్నారో మీకు తెలియాలికదా!" అని తన దర్పం ప్రదర్శిస్తాడు. రస్సెల్ షాంగే విశ్వవిద్యాలయం చుట్టుప్రక్కల విద్యాసంస్థలు అన్ని దర్శించి ఉపన్యాసాలిస్తాడు. అక్కడి ప్రొఫెసర్లు ఎంతో దీక్షతో విద్యార్థుల బాగు కోసం జీతాలు సరిగా రాకపోయినా కేవలం పిల్లల మీద ప్రేమతో తమ వృత్తిమీద భక్తితో ఎంతగా తపిస్తున్నారో చూసి మురిసిపోతాడు. ఇలాంటి 'డెడికేషన్' ఎక్కడా చూడలేదని రాస్తాడు.

* * *

విద్యాలయాలకి జీతాలివ్వటానికి సొమ్ము ఎందుకు చేరటం లేదు. ప్రావిన్స్ గవర్నర్లు ఆ సొమ్ముని మిగతా అవసరాలకు వాడేస్తున్నారు. అంటే విద్యకు, ఆ వ్యవస్థకు తొందరేముందిలే అని! మన ఇప్పటి విశ్వవిద్యాలయాల పరిస్థితి భిన్నంగా ఉందా? అసలు అధ్యాపకులే లేరంటారు – ఉన్నవారికి లక్షల్లో జీతాలిస్తున్నారు – వారు చెప్పినా చెప్పకపోయినా – విద్యార్థులు విన్నా వినకపోయినా, ఇది మన విద్య! చైనాలో మతం ఏమిటి? అసలు ఉందా? చాలా చిత్రంగా ఉంటుంది. మీరు బుద్ధుని ఆలయానికి వెళితే (అవి



పీకింగ్ – 1920

తప్ప వేరే ఆలయాలు లేవు) సిగరెట్ ఇస్తారు. చాలా ఆనందంగా కనిపిస్తారు. అసలు వీరికి మతం పట్ల విశ్వాసం ఉందా అనే అనుమానం కూడా కలుగుతుంది. పురోహితుల భవనాలు, ఇళ్లు చాలా అందంగా ఉంటాయి. ప్రకృతిలో మమేకమై చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. కొన్ని పెద్ద బంగళాలలో అందవికారమైన ఇంగ్లీష్ ఫర్నిచర్ కూడా ఉండవచ్చు అంటాడు రస్సెల్. వెస్టర్న్ లేక్ మధ్యలో పండితుల కోసం 800 సం.ల క్రితం నిర్మించిన కట్టడం చూస్తే ఆశ్చర్యపోవలసిందే. ఈ దేశంలో స్కాలర్లకు ఇంతటి గౌరవం ఉండేదా అని, ఆశ్చర్యపోతాడు.

అక్కడి విద్యార్థులు, అధ్యాపకులు రస్సెల్‌తో మాకు సోషల్ రివల్యేషనరీ ఫిలాసఫర్ కావాలి, అనార్కిజం కావాలి. అందుకని మాకు ఖచ్చితంగా అనార్కిజం, సోషల్ ఫిలాసఫీ గురించి తెలియజెప్పండి. దానికి మీరే సమర్థులు. మా దృష్టిలో మీరు రెండవ కన్ఫ్యూషియస్ అనేవారు రసెల్‌తో. ఆయన ప్రసంగించేటప్పుడు అక్కడి విద్యార్థులు, దప్పికగొన్న జీవుల్లా నోళ్లు తెరచి చెప్పినదంతా ఆకళింపు చేసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఆరాటపడేవారు. మీరు చెప్పిన క్రియేషన్ వితౌట్ పొసెషన్ గురించి కూడా వివరించండి అని రసెల్‌ను ఒత్తిడి చేసేవారు. దీనినే ఇప్పుడు 'సస్టైన్‌బుల్ డెవలప్‌మెంట్' అంటున్నారు.

* * *

రస్సెల్‌ను ఆహ్వానించిన చైనా స్నేహితులు వీరిద్దరినీ వారి పురాతన సంస్కృతికి చిహ్నాలయిన ఎన్నో కట్టడాలను చూపించారు. రస్సెల్ 'ఇవన్నీ ఇటలీకంటే పురాతనమైనవి – అంతకంటే అద్భుతంగా ఉన్నాయి' అంటాడు. అన్ని నగరాల్లో విద్యావిషయక సమావేశాలు ఏర్పరిచారు. అన్నిచోట్ల ఈ ఫిలాసఫర్‌తో ఉపన్యాసాలు ఇప్పించారు. వారు నేర్చుకోవాలని – బయట ప్రపంచంలో కలవాలని ఎంత ఉత్సాహపడుతున్నారో అని ఆశ్చర్యపోతాడు. వీరినా మనం మన అహంకారంతో చిన్న చూపు చూశాము. ఎగతాళి చేశాము – అని విచారిస్తాడు. చాంగ్ షా లో ఎంతో ఉండమని బలవంతం చేస్తారు. ఒక వారం రోజులైనా – కాని రస్సెల్ ఇరవయినాలుగ్గంటలే ఉంటారు.



పీకింగ్ గేట్

నాలుగు ఉపన్యాసాలు – రెండు చర్చిల్లో పాల్గొంటాడు. అక్కడున్న మిషనరీలు రస్సెల్ ఒకచోట, డోరా మరోచోట ఉండటానికి ఏర్పాట్లు చేస్తే (వారికి పెళ్లి కాలేదు కదా) రస్సెల్ ససేమిరా అని నిరాకరిస్తాడు. చైనావాళ్ల హోటల్‌లోనే ఉంటారు. నల్లులు మంచం మీద కవాతు చేస్తుంటే ఇద్దరూ చూస్తుంటారు!

* * *

అక్కడి నుంచి పీకింగ్ చేరుకుంటారు – పది రోజుల తర్వాత స్నానం చేశామంటాడు. పీకింగ్‌లో మూడు నెలలుంటారు. వీరి కోసం ఒక చక్కని ఇల్లు – వంట కుర్రవాడు, రిక్షా కుర్రవాడు – ఇంగ్లీషు వచ్చిన ఇంట్లో కుర్రవాణ్ణి ఏర్పాటుచేస్తారు. ఎంతో ఆనందంగా గడిచిన పీకింగ్ రోజులు – చలికాలం రావటంతో ఇబ్బందులపాలవుతారు.

పీకింగ్ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలు – డిన్నర్ తర్వాత లెక్చర్లు – కారులో పీకింగ్ పరిసరాల ప్రయాణాలు – అన్నీ మంచి అనుభవాలే. ఇక్కడ ఇంగ్లీషువారు తక్కువ. కొద్దిగా జర్మన్లు – జపాన్‌వారు ఉన్నారు (యుద్ధ ప్రభావం).

చైనావారి హాస్యచతురత చాలా మర్మగర్భంగా ఉంటుందని ఉదాహరణలిస్తాడు. ఒకసారి పీకింగ్ నుంచి మోటారు కారులో ఇద్దరు వ్యాపారస్తులు రస్సెల్‌ను ఒక పురాతన పగోడాను చూడటానికి చాలాదూరం తీసుకెళ్లారు. రెండు గంటల ప్రయాణం తర్వాత సగం కూలిపోయిన పగోడా చాలా హుందాగా నిలబడి ఉంది. రస్సెల్ మెలిచుట్టు మెట్లు ఎక్కి చూశాడు. వెనక వీళ్లిద్దరూ రాకుండా క్రిందే ఉండిపోయారు. ఆయన దిగి వచ్చిన తర్వాత కిందనే ఉండిపోయారా? అని అడిగారు. ఈ పగోడా ఇప్పటికి వెయ్యి సంవత్సరాల నాటిది. సగం కూలిపోయింది. మిగతాది ఏ క్షణంలోనైనా కూలవచ్చు. మేము ఇలా చర్చించుకుంటుండగా మీరు పైకి వెళ్లారు. మేము క్రిందే ఉండాలని – ఒకవేళ అది కూలిపోయి ప్రపంచ ప్రఖ్యాతి ఫిలాసఫర్ మరణిస్తే ప్రత్యక్ష సాక్షులు లేకపోతే లోటు అని నిర్ణయించుకున్నాం – అదీ వారి హాస్యం – నిజానికి వేడికి – వారి లావు శరీరాలతో ఎక్కలేక పాట్లు!

వాళ్ల బట్టలు కుట్టిపెట్టడానికి ఒకావిడ వచ్చేది. సాయంత్రం చాలా లావుగా ఉండేది. పగలు సన్నగా ఉండేది. చలికి వేసుకున్న బట్టలు అన్నీ తీసివేస్తే అలా బక్కగా కనిపించేదన్నమాట.

రస్సెల్‌కి ఒక తర్జుమా స్నేహితుడుండేవాడు. అతని పేరు కేయాస్! 'ఒకసారి నేను ఒక వ్యాసం రాశాను' '....The Causes of present chaos....' అని. దానికి అతను వెంటనే 'I suppose the causes of present Chaos are the previous Chaos..' టక్కున అంటాడు. "ఈ కేయాస్ నాకు చాలా మంచి స్నేహితుడయ్యాడు. అతను ఒక చైనా అమ్మాయిని ప్రేమించాడు. కానీ పెళ్లికి చాలా అడ్డంకులున్నాయి. అందులో చాలావరకు నేను పెళ్లి పెద్దగా ఉండి అడ్డంకులు తొలగించి చివరికి వాళ్ల పెళ్లికి మార్గం సుగమం చేశాను. నేను ఇంగ్లండు వెళ్లిన తర్వాత భార్యతో రెండు సార్లు వచ్చి నన్ను కలిశాడు కేయాస్" అని గుర్తు చేసుకుంటాడు.

"అడ్వాన్స్‌డ్ స్టూడెంట్స్‌కి ఎన్నో పాఠాలు చెప్పాను. వాళ్లంతా బోల్ష్‌విక్‌లు, ఒక్కొక్కరు రష్యా జారుకుంటున్నారు. అందులో చక్రవర్తి మేనల్లుడు మాత్రం వెళ్లలేదు. వీళ్లందరూ చాలా తెలివైనవాళ్లు. ప్రపంచాన్ని తెలుసుకోవాలనే ఉత్సాహం ఉన్నవాళ్లు. వాళ్లందరూ చిన్ననాడే ఎవరో ఒక పాతకాలపు చైనా అమ్మాయికి నిశ్చితార్థం జరిగినవారే చిన్నతనంలో – ఇప్పుడు నైతికంగా ఎంతో మథనపడుతున్నారు. వారికి ఆధునికంగా చదువుకున్న అమ్మాయిలు కావాలి – అదే వారి సంఘర్షణ! అంటాడు. కొత్త పాతలకు చాలా పెద్ద అగాథం ఉంది. డోరా వెళ్లి వాళ్లందరికీ సలహా ఇచ్చింది. ఆడపిల్లల నార్మన్ స్కూల్‌కి వెళ్లి పాఠాలు చెప్పేది. వాళ్లు బాగా కలుపుగోలుగా ఉండేవారు. మేము పార్టీలు ఇచ్చేవాళ్లం! అమ్మాయిలు ఒక గదిలో నుంచి బయటకు వచ్చేవారు కాదు. మేము నచ్చచెప్పి తీసుకువస్తే మగపిల్లల్తో ఇట్టే కలిసిపోయేవారు. సంప్రదాయాన్ని ఎంతో గౌరవించేవారు. ఆధునికంగా ఆలోచించేవారు. ఇది ఇంగ్లండ్‌లో ఎంతవరకూ సాధ్యం?

* * *

నార్మల్ యూనివర్శిటీ ఆఫ్ పీకింగ్! చాలా ప్రత్యేకమైన విశ్వవిద్యాలయం! ఇక్కడ రస్సెల్ ఎన్నో లెక్చర్లిచ్చారు. ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్‌లు ఇద్దరూ చైనాను విద్యపరంగా ఆధునికంగా మార్చాలని ఎంతో కృషిచేస్తున్నారు. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ తన మనస్ఫూర్తిగా ఆదర్శవాది – అలాంటి నీతిపరుణ్ణి ఇంతవరకు చూడలేదు. వీరికి వచ్చే బడ్జెట్ అంతా గవర్నర్లు తినేసేవారు. కేవలం విద్య

మీద గౌరవంతో – విద్యార్థుల మీద ప్రేమతో వీరు పాఠాలు చెప్పేవారు. వారి జీవితాలను తీర్చిదిద్దేవారు. విద్యార్థులు జ్ఞానం కోసం, నేర్చుకునేందుకు తహతహలాడేవారు. వాళ్లు కూడా తమ దేశం కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండేవారు. త్వరలో ఏదో జరగబోతోంది అని ఒక మెలకువతో కలలు కనేవారు. వేల సంవత్సరాల నుంచి నిద్రావస్థలో ఉన్న ఈ పెద్ద దేశాన్ని, ఇంత జనాభాని ఆధునిక మార్గాన నడపాలని వాళ్లంతా కంకణం కట్టుకున్నట్లు కనిపించేవారు. నాలాంటివారి నుంచి మార్గనిర్దేశం కోరుకునేవారు – అని రస్సెల్ అంటారు. కానీ మా ఇంగ్లీషు మేధావులు ఇదేమీ చూసేవారు కాదు – వారికి లౌకిక విషయాలు పట్టవు. పగలు పోలో ఆడతారు, సాయంత్రాలు క్లబ్బులకు చేరతారు. ఎవరెట్లాపోయినా వారికి పట్టదు. స్థానికులంటే వారికి గౌరవం లేదు.

"చైనా – చైనాగానే ఉంటుంది – అది మారదు" అనేవారు ఎందుకు ఈ సగం ఎదిగిన మేధావులని వింటావు' అని ఎద్దేవా చేసేవారు. చివరికి ఆ సగం ఎదిగిన మేధావులే ఈ దేశాన్ని జయించింది – ఇంగ్లీషు వారిని తరిమికొట్టారు అని సంతోషిస్తాడు. (ఇప్పుడు అక్కడ నాలుగు ఇంగ్లీషు ముఖాలు కనపడవు, నాలుగు ఇంగ్లీషు ముక్కలుగాని వినపడవు..." నేను కూడా రాశాను) నా ఉపన్యాసాలు చాలావరకు ఇంగ్లీషు వారి ప్రాణాలు కాపాడాయి. ఎందుకంటే – ఇంగ్లీషువారంతా చెడ్డవారు కాదు – చైనావారు (నన్ను చూపి) వారి ప్రాణాలకు ముప్పు తేకుండా వదిలారని ఇక్కడ పుకార్లున్నాయి! అని నవ్వుకుంటాడు.

పీకింగ్‌లోనే వేసవి వెళ్లిపోయింది. చలికాలం మొదలైంది. ఇక్కడ చలి చాలా ఎక్కువ. నా చైనా స్నేహితులు, నన్ను డోరాను మోటారు కారులో చాలా దూరం తీసుకుపోయారు ఒక రోజు. ఒక చెరువు ప్రక్కన పురాతనమైన పగోడా ఉంది. అక్కడ మాకు చాలా చక్కని టీ ఇచ్చారు. నాతో వచ్చిన స్నేహితులు "ఎక్కువ తాగకండి, డిన్నర్ చేయలేరు" అన్నారు. అలాగే జరిగింది. తర్వాత మూడు నెలల వరకు నాకు భోజనమే లేదు. ఆ రాత్రి బాగా



నార్మల్ యూనివర్శిటీ



రాక్‌ఫెల్లర్ మెడిసిన్ : నర్సులు (పీకింగ్)

ఆలస్యమైంది. మా మోటారు కారు టైర్ పంచరైంది. పంచర్ వేసేసరికి బ్యాటరీ దిగిపోయింది. చివరికి అందరం చిన్నగట్టు మీదకు కారు తోసుకువెళ్లి అక్కడి నుంచి క్రిందకు పరిగెత్తిస్తే స్టార్ట్ అయింది. చాలా ఆలస్యమవటంతో పీకింగ్ తలుపులు మూసేశారు. అక్కడి నుంచి లోపలకు ఫోన్ చేసి గేట్లు తెరిపించేసరికి గంట పైనే జరిగిపోయింది. ఆ తర్వాత నెల రోజుల వరకు ఏమి జరిగిందో నాకు గుర్తు లేదు. ఆ చలికాలం నాకు డబుల్ నిమోనియా వచ్చింది. డెలీరియంలో ఉన్నాను. డాక్టర్ ఈ రోజే ఆఖరి రోజు అని చెప్పేవారని డోరా చెప్పింది. చివరికి జర్మన్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చాలా అనుభవంగల నర్సు నాకు సేవలందించింది. ఆమె పూర్తిగా క్రిస్టియన్ నమ్మకాలతో ఉండేది. ఆమె నమ్మకాలకంటే ఆమె అనుభవమే నాకు ఎక్కువ ఉపయోగపడింది.

డబుల్ నిమోనియా, గుండె జబ్బు, కిడ్నీల జబ్బు, డీసెంట్రీ, ఫెబిటిస్ ఇవన్నీ నన్ను చుట్టుముట్టాయి. అయితే నాకు తగ్గేసరికి వీటి చెడు ప్రభావం నా పైన ఏమీ పడలేదు అని సంతోషిస్తాడు మన ఫిలాసఫర్. ఆ సమయంలోనే డోరా నెల తప్పినట్లు చెప్పిందని ఎంతో ఆనందిస్తాడు కూడా. ఇక్కడ రస్సెల్ ఎంతో ముఖ్యమైన విషయం చెబుతాడు. నన్ను నేను నిరాశావాదిగా ఊహించుకున్నాను, ఈ జీవితానికి విలువేముంది, జీవించి ఉండి సాధించేదేముందని ఎక్కువగా అనుకునేవాణ్ణి. కానీ ఈ నిమోనియా మొదలైన జబ్బులు వచ్చి నేను మంచం మీద బాధపడుతూ తర్వాత కోలుకుంటున్నప్పుడే జీవితం మీద ప్రేమ కలిగింది. ఈ విషయంలో నేను ఎంత పొరపాటుగా ఆలోచించాను అని పునరాలోచనలో పడతాడు. పీకింగ్‌లో వర్షాలు చాలా తక్కువ. నేను ఆస్పత్రి బెడ్ మీద ఉండగా రోజూ వర్షం పడింది. కిటికీలో నుంచి మట్టి వాసన వచ్చేది. ఎంత మధురంగా ఉంది! ఆ కిటికీ ప్రక్కనే అకేసియా చెట్టు ఉండేది. అప్పుడే మొగ్గ వేసి పువ్వులు పూస్తోంది. ఎంత సువాసనగా ఉంది ఈ పరిమళం! పూలు ఎంత అందంగా విరుస్తున్నాయి! అనుకుని ఆనందించేవాడు. అలాగే ఉదయ కిరణాలు కిటికీ నుంచి పడుతుంటే

కొత్త ప్రాణం నాలోకి వచ్చినట్లుండేది. గాలి ఈల వేస్తుంటే సంగీతం వినిపించేది అంటాడు. అప్పుడే గుర్తించాను. నా లోలోపల జీవితం మీద ఆశ ఉంది అని. ఇది అందరికీ తెలిసిన విషయమే! బహుశా నేనే గుర్తించలేకపోయానేమోనని ఆనందంగా విచారిస్తాడు మన ఫిలాసఫర్. తర్వాత నా చైనా స్నేహితులు వచ్చి చెప్పేవారు – డాక్టర్లు చెప్పేవారు – రోజూ – నేను తెల్లవారేసరికి చనిపోతాను అని. అప్పుడే వారు తీర్మానించారు – నేను చనిపోగానే పీకింగ్ పరిసరాలలో ఖననం చేసి, అక్కడే నా కోసం ఒక గుడి కడదామని నిర్ణయించారని. అలా నన్ను – దేవుడంటే నమ్మకం లేనివాణ్ణి దేవుణ్ణి చేయడానికి వారు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఆ అదృష్టం నాకు లేకుండా పోయిందే అని విచారించాడు.


నేను ఎక్కువగా విమర్శించిన రాక్ ఫెల్లర్ ఫౌండేషన్‌వారు వాక్సిన్ ఇచ్చి నన్ను ప్రాణంతో నిలిపారు అని తెల్లబోతాడు. సోవియట్ డిప్లమాటిక్ మిషన్‌వారు ఎంతో దయతో ఆయనకు షాంపైన్ పంపేవారు – ఈ జబ్బుకు అదే మందు అని. అంతేకాదు, ఆయన్ను, డోరాను తీసుకొని మోటారు కారులో అన్నిచోట్లకు తిప్పేవారు. వాళ్లు ఎంత విప్లవకారులో కారు డ్రైవింగ్‌లో అంత డేర్ డెవిల్స్. మీకు పీకింగ్‌లో ఉన్న జపాన్ జర్నలిస్టుల గురించి చెప్పలేదు. నేను జబ్బుగా మంచంమీద పడి ఉన్నప్పుడు, వారు రోజూ వచ్చి డోరాను ఇబ్బంది పెట్టేవారు – ఫిలాసఫర్‌తో ఇంటర్వ్యూ, ఫోటోలు కావాలని. డోరా చాలా మర్యాదగా వారిని పంపించివేసేది. చివరికి వారు ఒక రోజున నేను చనిపోయినట్లు జపాన్ పేపర్లో ప్రకటించారు. అది ముందు అమెరికా తర్వాత యూరోపు, ఇంగ్లాండు చివరికి రష్యామీదుగా చైనా చేరింది. అంతా గగ్గోలు పుట్టించారు. లండన్ నుంచి చాలామంది అబిట్యురీ ప్రకటించారు పేపర్లలో. ఒక మిష్‌నరీ "... Missionaries may be pardoned for heaving sigh of relief at the news of Mr. Betrend Russle's death..." అని ప్రకటించారు. అవే మిషనరీస్ తర్వాత రస్సెల్ బ్రతికి ఉన్నందుకు మళ్ళీ నిట్టూర్చి ఉంటారు. ఇవన్నీ పీకింగ్‌లో ఉన్న రస్సెల్స్‌కు తెలియదు. ఆయన సోదరుడు టెలిగ్రాం ఇస్తాడు – నువ్వు ఇంకా బ్రతికి ఉన్నావా అని.

* * *



బెర్ట్రెండ్ రస్సెల్ – డోరా బ్లాక్

ఇదంతా ఎందుకు చెప్పానంటే – చైనా గురించి ఇంగ్లండ్ చేసే దుష్ప్రచారం – వారి అజ్ఞానంతోనే. ప్రపంచాన్నంతా ఇబ్బంది పెట్టిన ఆంగ్లేయులు చైనాను ఏమీ చేయలేకపోయారు. దానికి కారణం వారి 5,000 సంవత్సరాల సంస్కృతి, నైతికత, డైనాస్టియన్ పరిపాలనా కౌశలం. చివరికి కమ్యూనిస్టు కన్ఫ్యూమరిజం – ఇవాళ ప్రపంచ అగ్రదేశాలకు ధీటుగా నిలబెట్టిందంటే ప్రజలే కారణం. ప్రజల నుంచే ప్రభుత్వాలు వస్తాయి. రస్సెల్ తిరిగిన చైనాలోనే మేమూ తిరిగాం. ఆ చైనా ప్రజల వారసుల వారసులతోనే మేమూ ఆనందంగా గడిపాం. అయితే మేము అదృష్టవంతులం. ఇప్పటి చైనా అభివృద్ధి ఫలాలను ఆస్వాదించాం. ఇంగ్లండ్ తిరిగివచ్చే ముందు జపాన్ వెళ్లారు కాబోయే దంపతులు. రాబర్ట్ యంగ్ ఆహ్వానంపై (కియోటో). రాబర్ట్ యంగ్ జపాన్ క్రానికల్ అనే పత్రిక నడుపుతున్నాడు. చాలా పెద్ద మనిషి, ఇంగ్లీషు పెద్దమనిషి! ఒక విషయం చెప్పి ముగిస్తాను. మేము కోటో రేవులో దిగేటప్పుడు అక్కడ జర్నలిస్టులు చాలా తొక్కిసలాట చేశారు. నేను బ్రతికి ఉండటం – కాబోయే భార్యతో రావటం –




టెంపుల్ ఆఫ్ హెవెన్

యుద్ధానికి వ్యతిరేకించటం – వారికి కొరుకుడు పడలేదు. నాకు చాలా ఆందోళన కలిగింది. ఈ తొడ తొక్కిడిలో డోరాకు ఎక్కడ ప్రమాదం కలిగి 'నా బిడ్డ' ప్రాణాలు పోగొట్టుకుంటుందోనని. ఆ ఆందోళన ఆవేశంగా మారి కోపంగా వాళ్లందరి మీదా గట్టిగా అరిచాను. ఇవన్నీ ఫోటోలు తీసి మర్నాడు పేపర్లలో వేశారు వారు. 'కోపంతో అరుస్తున్న రస్సెల్' అని శీర్షిక కూడా పెట్టారు. ఆ ఫోటో చూసిన తర్వాత నాకు ఒక



స్వర్గద్వారాలు

అవగాహన వచ్చింది. ఆదిమానవుడు తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఎన్ని సాహసాలు, ఎన్ని త్యాగాలు చేశాడో అని. నాలోనూ ఒక ఆది మానవుడు ఉన్నాడు. నా బిడ్డను కాపాడుకోవడానికి – లేకపోతే నేను ఆ విధంగా అరవగలనా! అని అంటాడు మన ప్రపంచ ప్రఖ్యాత ఫిలాసఫర్. నిజమే కదా మరి!



బెర్ట్రెండ్ రస్సెల్

* * *

చైనా, జపాన్ యాత్రల నుంచి ఇంగ్లండ్ తిరిగివచ్చిన తర్వాత డోరాను పెళ్లి చేసుకుంటాడు (అప్పటికి విడాకుల పత్రం వస్తుంది). రాజుగారి పురోహితుడే వీరికీ పురోహితుడు. రస్సెల్‌ను – దేవుడు మీద నమ్మకం లేని రస్సెల్‌ను దేవుని మీద ప్రమాణం చేయించి పెళ్లి చేశాడు – అంతేకాదు – పెళ్లి కాకముందు డోరాతో అనైతిక లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు ఒప్పించాడు (కన్ఫెషన్).

నవంబర్ – 16న నా మొదటి బిడ్డ జాన్ ఉదయించాడు. అప్పటినుంచి నా కుటుంబమే చాలా సంవత్సరాల వరకు నా ప్రపంచం అయిపోయింది అంటాడు ఒక సామాన్యునిలా మన ప్రపంచ ప్రఖ్యాత ఫిలాసఫర్!!

చైనా భాష నాభి – నాసిక శబ్ద ప్రధానం. వారి వాక్కు నాభి దగ్గర మొదలై గొంతు, నాసిక ద్వారా ప్రపంచానికి అందుతుంది. ముఖ్యంగా పశ్చిమ దేశాల నామవాచకాలు వారికి కొరుకుడు పడవు, పలకలేరు కూడా. అవే పేర్లకు చైనా భాషలో తక్కువ అక్షరాలతో మరో శబ్దరూపం ఇచ్చి పలికుతారు. బెట్రెండ్ రస్సెల్ పలకటం వారికి అసాధ్యం. అందుకనే ఆయనను లువో సు, లువో సు అని పిలిచేవారు అలాగే రాసేవారు కూడా. ('అశ్వినికుమార్' అనిపించాలని చాలా ప్రయత్నం చేశాను – హోటల్ మేనేజర్‌తో – ససేమిరా! యా..జూ అని మాత్రమే అంది). 'మేము ఆదివారాలు పని చేసేవారం. సోమవారం సెలవు తీసుకొని టెంపుల్ ఆఫ్ హెవన్‌కు వెళ్లి రోజంతా గడిపేవాళ్లం. అక్కడ ప్రశాంత వాతావరణం ఈ దేశపు తాత్విక ఆత్మను ప్రతిబింబించేది. మాకు శాంతిని సమకూర్చేది' అంటాడు రస్సెల్. వందేళ్ల తర్వాత ఇదే టెంపుల్ ఆఫ్ హెవెన్‌లో మేము రోజంతా గడిపాం. ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. పక్షుల కిలకిలలు, పిల్లల కేరింతలు, గాలిపటాలు – ఇలా రోజంతా ఆటవిడుపే. జీవితమంతా పండగే. అది ఒక అద్భుతమైన తాత్విక అనుభవం.

ఎందుకీ పయనం?

నా దగ్గరకు, చాలామంది, పరిచయం ఉన్నవారు లేనివారు వస్తుంటారు– ఏదయినా "టూర్ అరేంజ్ చెయ్యండి. ఒక వారం రోజులు పది రోజులు అలా తిరిగివస్తాం" అంటూ!

దేశంలో, విదేశాలలో యాత్రలకు వెళ్లేందుకు ఉవిళ్లూరుతుంటారు. ఒకసారి వెళ్ళి వచ్చిన వారు, మళ్లీ వెళ్లాలని కోరుకుంటారు.

మనం ఎందుకిలా ప్రయాణం చేస్తుంటాం? పరదేశాలు, పరాయి ప్రజలు పరిస్థితులను చూడాలని వేడుకపడతాం? చాలామందిని అదే అడిగాను, నన్ను నేను ప్రశ్నించుకున్నాను! ఏమయినా సమాధానాలు దొరుకుతాయా?

మన ప్రతి ప్రయాణం – 'మన' నుంచి మనం దూరంగా వెళ్లిపోదామనే... మళ్లీ మనం పరుగులెత్తేది – మనల్ని 'మనం' కలుసుకోవటానికి తెలుసుకోవటానికే! కనులతో పాటు మన హృదయాలను తెరచుకుని – ప్రసార మాధ్యమాలు తెలపగలిగే విషయాల కంటే ఎక్కువగా 'చూడాలనే' తపనతో ప్రయాణిస్తాం. మనతో పాటు – మన అజ్ఞానాన్ని – జ్ఞానాన్ని ప్రకృతి వనరులు పరుచుకున్న ప్రపంచపు నలుమూలలకు తీసుకుపోవాలని తాపత్రయపడతాం.

పరుగెత్తే కాలాన్ని ఆపాలని, తిరిగి తిరిగి, చిలిపి చిన్నారులవ్వాలని, మన నుంచి మనం దూరమై, తర్వాత మెల్లమెల్లగా మనమేమిటో తెలుసుకోవాలని ప్రతి క్షణాన్ని ఆనందించాలని – ప్రదేశాల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతాం!

ఆటవిడుపు:

ఒక గమ్యంలేని సువిశాల అనంత ఏకాంతంలోనికి, ఏ బంధాలులేని ఆటవిడుపు మైదానంలోనికి పరుగులెత్తి – ఉరకలెత్తి అలసిపోవాలని ఆరాటపడతాం – ఎక్కడికి – ఎందుకీ ప్రయాణం? కొద్దిగా ఆగి – కొంచెం ఆలోచిద్దామా?

ఏ యాత్రలోనైనా – ఒక గొప్ప సుఖం – సంతోషం – మన బరువు బాధ్యతల్ని – నమ్మకాల్ని – అపనమ్మకాలను ఇంటి దగ్గర వదిలివేసి, మనకు 'తెలుసు' అనుకున్న దానిని వింతగా – భిన్నంగా చూడ ప్రయత్నించటం!

ఇప్పుడే మనకి ప్రయాణపు (యాత్రలోని) సర్వస్వాతంత్ర్యత మనల్ని బొంగరంలా త్రిప్పి– తలక్రిందులు చేసి – మనం క్షుణ్ణంగా ఎరిగిన విషయాలను, సరికొత్తగా దర్శింపచేస్తుంది. మొట్టమొదటిసారిగా మన్‌హాటన్‌లో అడుగుపెట్టినపుడు నాకెదురైన అనుభవం ఇటువంటిదే–

మొట్టమొదటిగా మనం గుర్తించేది – ఈ యాత్రల్లో మనం సర్వసాధారణమూ – ప్రాపంచికమూ అనుకున్న విషయాలన్ని – అవి ప్రాదేశికమూ – ప్రాంతీయమూ అయి కూర్చోవటం! లూయివిల్లిలో యాభై సంవత్సరాల సంసార జీవితాన్ని నిరాఘాటంగా సాగించిన దంపతులను ఊరేగింపు పండగ జరుపుతున్నారు. మనకిది మామూలు విషయమే కదా!

అంతేకాదు – మనం ఇంటి దగ్గర – మన దేశంలో – మన ప్రదేశంలో సర్వసాధారణమనుకుంటున్న ఎన్నో విషయాలు ఆ దూరదేశంలో – లేక మారుమూల ప్రదేశంలో వారికి సాంఘిక – రాజకీయ సంఘర్షణలుగా, చావు బ్రతుకుల సందిగ్ధ సమస్యలుగా మన ముందు నిలబడతాయి!

ఆఫ్రికాలో, అజర్ బైజాన్‌లో మత రాజకీయాలు, పాలస్తీనా – ఇజ్రాయిల్ నిత్య ఘర్షణలు ఇందుకు తార్కాణం.

అంతేకాదు – మనకెప్పుడో మరుగునపడిపోయిన వార్తా శీర్షకలు – ఒక 'కొత్త' దేశంలో కొత్తగా చదివి ఉక్కిరిబిక్కిరి అవుతాం. ఈ వ్యత్యాసం ఎక్కువగా ధనిక పేద దేశాల సరిహద్దులు దాటినప్పుడు మీకు ఒక యాత్రా విశేషంగా అనిపిస్తుంది.

ఇంకా మనం 'ఇంటర్‌నెట్' వగైరా భ్రమలన్నీ – సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ప్రదేశాలను – ప్రజలను చూసినకొలది, మనమేర్పరచుకున్న అగమ్యత, పరధ్యానం, మార్మిక భావనలన్ని పటాపంచలైపోతాయి.

మన యాత్రల ద్వారా – అక్కడి ప్రజలతో కలయిక పర్యవసానం పరస్పరం– పరంపరాగత విషయాలు, సంస్కృతీ చిహ్నాలు – పారంపర్య దుస్తులు – సంగీతం, అక్కడివారికి – సరికొత్త అనుభూతినివ్వడమే కాకుండా ఓ క్రొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంటాయి.

కదిలే వార్తలు:

ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే – మనతోపాటు మన జీవన విలువలు – నమ్మకాలు, మన దేశపు తాజావార్తలు మోసుకుపోతుంటాం. అంటే – మనం ఒకరకంగా 'లైవ్' టివిగా, కదులుతున్న వార్తా పత్రికల్లా వ్యవహరిస్తాం. ప్రపంచంలోని ఎన్నో మారుమూల దేశాల్లో పూర్తిగా స్వాతంత్ర్యపు కిరణాలు ప్రసరించని చీకటి దేశాల్లో – మనలాంటి వారే మనలాంటి యాత్రికులే వారికి – ప్రపంచాన్ని తెరిచే చిన్న చిన్న కిటికీలు!

అంటే – మన ప్రయాణాల ద్వారా ఒక రకంగా మనం కనే కలల్ని ఎగుమతి చేస్తుంటాం – అక్కడి వారి స్వప్నాలను ఇటుగా దిగుమతి చేస్తుంటాం– ఎంతో సున్నితంగా స్నేహపూర్వకంగానే "ఏమిటి, మీ పెద్దలే మీ పెళ్ళి నిర్ణయిస్తారా?" అని ఆశ్చర్యపోతుంటారు.

ఇప్పటికే మీకు అర్థమయివుంటుంది. ఇప్పటి యాత్రలు, కొత్త ప్రదేశాలను దర్శించటంలో ఎంత ప్రాముఖ్యత ఉందో – అంతకు మించి కొత్త కోణంలో – అక్కడి జనజీవనసరళిని – వారి విశ్వాసాలను, స్వప్నాలను భయాలను పరిశోధించటంలో ఎక్కువ అవకాశం అవసరం ఉందని, మనం కలిసిన వారికి మనమెంత కొత్తగా – వింతగా అపురూపంగా పరిచయమవుతామో, అలాగే ఒకసారి మీరు ఇంటికి చేరేసరికి, మీకు బాగా పరిచయంలో ఉన్న మీ సొంత ప్రదేశాలు, పరివారం, మీ సుదూర మిత్రుని ఆశ్చర్యంలో నుంచి కనపడతారు కూడా; నాకు ఇన్ని యాత్రల తర్వాత ఇప్పుడు ఎవ్వరిమీదా కోపం రావడం లేదు!

మీ విహారయాత్రలు, మళ్లీ మిమ్మల్ని, మీ పరిసరాల్ని మీకు సరికొత్తగా పరిచయం చేస్తాయి – ఒక కొత్త వెలుగుతో నింపుతాయి.

అంటే – మన యాత్రలు – రెండు విధాలుగా మనకు ప్రయోజనకారిగా ఉంటాయి.

ఒకటి, మామూలుగా మనం పట్టించుకోని ప్రదేశాలు, విలువలు, ముఖ్య విషయాలు అన్ని మన ముందుకు వస్తాయి.

రెండు, అదే సమయంలో – మనలో నిద్రాణమై – అంతగా గమనించని కోణాలెన్నో వెలుగుచూస్తాయి. ఈ ప్రయాణాలు తప్పనిసరిగా మనలో సుప్తమైన

– అవ్యక్తమైన మానసిక దశలను స్పృశిస్తాయి. నిద్రలేపుతాయి. ఒక ప్రదేశంలో– సహారా ఎడారిగాని, చెట్లులేని ఐస్‌లాండ్ గాని దర్శించినపుడు – మన మానసిక స్థితి ఒక్కసారిగా అంతర్ముఖమై మనలోని ఒంటరితనాన్ని, ఏకాకిస్థితిని ఒక్కసారిగా ముందుకు తెస్తుంది! యాత్రికులుగా మనం ఒక క్రొత్త దేశం వెళ్తే – మనం ఎంత స్వేచ్ఛగా ఉంటాం! మన కులం, మతం, జాతి, ఎవ్వరికీ పట్టదుకదా; అలాగే మనకు ఒక పేరుగాని, ఒక 'టాగ్' గాని ఉండాల్సి అవసరం రాదు కదా – మనల్ని ఎవ్వరూ 'గుర్తించ'నపుడు – మనం దేన్ని గురించి 'జాగ్రత్త' తీసుకోవాలి?

అనంతవాదులు:

అందుకని – ఒక్కసారిగా, మనముందు మనం నిలబడతాం – మనం ఏమిటో చూసుకోవాల్సిన అవసరం, అవకాశం వస్తుంది. ఇందుకు మనకు వుండే రోజువారీ వత్తిడులు లేకపోవడం కూడా ఒక కారణం!

దూరదేశాల్లో – మనకు ఎక్కువసేపు నిద్రపట్టక – రాత్రిళ్ళు మెలకువగా ఉంటాం. అందుకే కనులు తెరచుకుని సీలింగ్ వంక చూస్తూ... ఆశ్చర్యపోతుంటాం– ఏమిటి క్రొత్తగా ప్రేమలో పడినట్లు నిన్న – రేపు గురించి ఆలోచన లేకుండా, ఆకాస్సేపు ఆ క్షణంలో జీవిస్తాం.

మనల్ని మనం విశ్లేషించుకుంటూ విలువైన సమయాన్ని గడిపేందుకు అవకాశం దొరుకుతుంది! మన మనసులోని మర్మాలన్నీ మన కనులముందు కదులుతాయి. సరిగ్గా ఇప్పుడే – ఎక్కడ బయలుదేరాం? ఎక్కడ ఉన్నాం – ఎక్కడకు వెళ్తున్నాం. అన్నీ ఒక మిస్టరీలా కలగలసిపోతాయి! అనంతవాదులుగా మారిపోతాం!

మనకు 'తెలియకుండా' మనం ఎంతదూరం వెళ్లగలం? కుదరదు కదా! అది జరిగే పనికాదు కదా!

ఇందులో ఒక ప్రమాదం పొంచి ఉంది కూడా. అన్ని రకాల స్వేచ్ఛలకు ఉన్నట్లుగానే – కాని ఇక్కడ ఉన్న ఒక గొప్ప అవకాశం – మనం మళ్లీ 'జన్మించటం!' అంటే – చిన్ననాటి కాలానికి, ఇంకా విశాలమైన ఆలోచనలోనికి అంతర్ముఖులై ఒక రకమైన మానసిక స్థితిలోకి వెళ్లగలగటం కాలాన్ని ఒక్క క్షణం – ఆపగలగటం!

తెలియని భయం:

ఇంకా మన చుట్టూ ఎన్నో పరిచయం లేని పరిసరాలను చూసి – చిన్న పిల్లల్లా ఆశ్చర్యపోవటం! మాటలు రాని, భాష తెలియని చిన్నారుల్లా కలిసిన వారితో మాట్లాడగలగటం! మనల్ని మనం తెలియపరచుకోవటం – ప్రయాణం మనల్ని తెలియని ప్రదేశాలకు తీసుకుపోతుంది – మనకు ఏమి తెలియదో కనువిప్పు కలిగిస్తుంది. ఒక తెల్లకాగితంలా మనం ఉంటాం – ఒక 'బయోడేటా' ఎవరూ రాయరు– 'నువ్వు' ఫలానా అని ఎవరూ 'ఫిక్స్' చెయ్యరు – అందుకని ఒక కొత్త స్వేచ్ఛ కొత్త స్వరూపం సంతరింప చేసుకుంటాం.

మన 'అనన్యతను' ప్రక్కనపెట్టి ఒక్క కొత్త మూసలోని మీకు మరింత దగ్గరగా ఉండే – మీలోకి చూడగలుగుతారు! మీరు తీసుకువెళ్లే రెండు మూడు బట్టలతో తేలికగా 'సింపుల్'గా ఏదో 'సాహసా'నికి సిద్ధంగా కదులుతుంటారు!

బ్రాంక్స్‌లో నాకంటే అడుగు ఎత్తుండి కనీసం వంద కిలోల బరువున్న ఒక హిస్పానిక్‌లేడీ "హే, డిడ్ యూ స్టార్ట్ యువర్ ఎడ్వంచర్...." అంటూ నవ్వింది.

ఇక్కడే ఆల్‌బర్ట్ కామూ అన్న మాటలు గుర్తుకు వస్తాయి. "తెలియని 'భయంలోనే' ప్రయాణానికి విలువ పెరుగుతుంది!" 'ప్రతి ప్రయాణంలోని నిగూఢమైన భయమే దాని విలువను పెంచుతుంది...'

పరిసరాల నుంచి – పరిస్థితుల ప్రభావం నుంచి విముక్తులవటమే కాకుండా, మన అవసరాలన్ని అస్తవ్యస్తమైపోతుంటాయి. కారణం మన అలవాట్లన్ని అర్థం లేని ముసుగులేనని అర్థమవుతుంది.

మనకు ప్రొద్దున్నే కాఫీ అలవాటుంటే, అదే మన ప్రయాణాలలో దొరకకపోతే కొంపలంటుకు పోవు.

మనకు జరిగే అవమానాలను పెద్దగా పట్టించుకోము. ఎడిసన్‌కి దారి – రూట్ అడిగితే ఒక రెడ్‌నెక్ "ఏమిటి. బ్రైడ్ కోసం వెళ్తున్నావా" అంటూ ఎగతాళి చేశాడు.

ఒక సిగ్నల్ లైట్ దగ్గర ప్రొద్దున్నే – ఒక తెల్లజాతివాడు మా కారు విండ్‌స్క్రీన్ మీద కోపంగా కాఫీ పోసిపోయాడు – మేము అరక్షణం ఆలస్యం చేశామని!

అందుకని మనం ఏదో 'తెలుసు'కోవాలని – దేనికో సమాధానం దొరుకుతుందని పరుగులెత్తం! కాని మనకు ఎదురయ్యేది – ఒక కఠోరసత్యం – అరే ఇది ఇలా జరుగుతుందా? దీనిలో ఎంతవరకూ న్యాయం ఉంది?' అన్న ప్రశ్నలే మోసుకువస్తుంటాము. ఇక్కడ, మనం రాత్రిళ్లు ఏ భయమూ లేకుండా వీధులన్నీ తిరుగుతుంటాము. సర్వసాధారణంగా అదే న్యూయార్కులో చీకటిపడితే– అంతా భయమే – రోడ్లన్నీ కర్ఫ్యూ పెట్టినట్లే. థాయిలాండ్‌లో ఫిలిప్పిన్స్‌లో ఎందరో యువతులు తమ కుటుంబాలను పోషించటానికి వళ్లమ్ముకోవటానికి వెనకాడరని ఒక 'నగ్న' సత్యాన్ని గుర్తించేసరికి బాధ, ఆశ్చర్యం కలుగుతుంది.

ఇంకా కొన్ని ప్రదేశాలలో మన ప్రయాణం ఒక డిటెక్టివ్ క్రైం కథలాసాగినా ఆశ్చర్యపోనవసరం లేదు – ఎటొచ్చి – ఆ కథకు ఒక ముగింపు ఉండదు!

అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో నాతో పాటు వచ్చిన ఒక స్నేహితుడు ఇమ్మిగ్రేషన్‌లో మాయమైపోయినపుడు నాకంతా అయోమయం క్రైం కథలా అన్పించింది.

అలాగే హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో, నా మిత్రుడు తెచ్చిన, మనం రోజూ తినే 'గన్‌పౌడర్' చూసి కస్టమ్స్ వాళ్లు 'స్నిఫ్ డాగ్స్'తో అతనికి చెమటలు పోయించారు.

ప్రేమకథ:

ఒక నెల రోజులు ఐరోపా, అమెరికా అంతా తిరిగి తిరిగి ఇంటికి చేరిన తర్వాత – ఎన్ని రాత్రులు నిద్రలేకుండా పడివున్నాను? చూసినవి గుర్తు చేసుకుంటూ, తీసిన ఫొటోలు మళ్లీ మళ్లీ చూసుకుంటూ – రాసుకున్న నోట్సులు తిరిగి తిరిగి చదువుకుంటూ కలసిన వాళ్లను నాకు సహాయం చేసిన వాళ్లను – తోసివేసిన వాళ్లను, పగటి రెస్టారెంట్లను – నైట్ క్లబ్‌లను, మహోద్ధృత నయాగరా హోరును, నెవెడా ఎడారి నిశ్శబ్దాన్ని, అలాస్కా నిర్జీవ హిమశీతల మృత్యు సామీప్యాన్ని, ఆస్ట్రియాలోని ఆత్మహత్యల ఆల్ఫ్స్ పర్వతాలను, సబ్‌వే రైలు శబ్దాలు – జెట్ విమానాల నిశ్శబ్ద వేగాలు – ఎన్ని ఎన్ని నన్నలా – క్రొత్త ప్రేమికునిలా – నిద్ర లేకుండా పడవేసినాయి. ఇంత పునరుజ్జీవన శక్తి ఈ ప్రయాణాలకు ఎలా వస్తున్నది? ఒక రకంగా ప్రతి విదేశయాత్ర – ఒక ప్రేమ వ్యవహారమే అనిపిస్తుంది!

ఏం మాట్లాడాలో తెలియదు! ఎక్కడికి, ఎలా వెళ్లాలో అగమ్యంగా వుంటుంది. వెళ్లిన కొలదీ – లోతుగా పాతుకుపోతుంటాము. ఎవరిని ప్రేమిస్తున్నామో తెలియక, ఎలా తెలియజేయాలో భాషరాక – ఒక తీయని భయం! ఒక మాయని ఆశ్చర్యం – ఈ విదేశ యాత్రలన్ని – అద్భుతమైన ప్రేమకథలే అనిపిస్తుంది. ఇంకా మనం కలలుకని – కళ్లలో తారలు నింపుకుని వెళ్లే ప్రదేశాలు హాలీవుడ్ లాంటివి. మన కలల్ని ఎగతాళి చేస్తూ తళుకుతారలన్ని జలతారు తోరణాలని తెలియజేస్తూ – నమ్మశక్యం గాని మాయాజాలమని మన కళ్లు తెరిపిస్తాయి. కాని ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అవే మనకు మళ్లీ కలల్లా, కలల తీరాల్లా అనిపిస్తుంటాయి. మనం కలల్ని నమ్మటానికి కలల్లో నడవటానికి ఇష్టపడతాం కదా! మనం ఇంటి దగ్గర ఎంత నిరాశ నిస్పృహలతో ఉన్నా – ఒక క్రొత్త ప్రదేశానికి, విదేశానికి వెళ్లగానే ఎనలేని చైతన్యం – అంతులేని 'ఆశా' వేశం మనల్ని చుట్టుముడతాయి. ఒక్కక్షణం ఖాళీగా ఉండనివ్వవు – అంటే మన కదలికలోనే కలల దర్పణం, ప్రయాణంలోనే అంతులేని 'ఆనందం' దాగి ఉన్నాయా? ఇంటి దగ్గర ఉండే స్తబ్ధతలో నుంచి దూరంగా జరిగిపోవటమే ఒక చైతన్యం! ప్రపంచపుటంచులు చూడటం, దిగంతాల – తీరాలను తాకడం – ప్రయాణం కాదు. ఒక రకంగా "ఎండ్ ఆఫ్ ది ఎర్త్" ఎక్కడ ఉంటుంది? మళ్లీ నిన్ను నువ్వు చేరటంలోనే కదా!

ప్రపంచమంతా – ఒక అపరిచితునిగా, పరదేశస్తుడుగా 'అన్యుడు'గా (సంస్కృతిపరంగా) ఆయా ప్రజల మధ్య తిరిగి – వారి అలవాట్లను, తినుబండారాలను రుచి చూసి, ఒక్కసారిగా 'ఇంటికి' తిరిగివస్తే ఉండే అలసట, ఆనందం, 'స్వీయ'దనం మనల్ని ఎంతో ఆశావాదులుగా మార్చివేస్తుంది.

కదలిక ఆంతరికం:

అసలు కదలిక అనేది మనకు ఉయ్యాల రోజుల నుంచే మొదలయ్యిందేమో? అలాగే ప్రతికదలిక అంతరికమే అనిపిస్తుంది – ఒక పుస్తకం చదివినపుడు – ఒక సినిమా చూసినపుడు – ఒక క్రొత్త పరిచయం ఏర్పడినపుడు, ఈ కదలిక ఫీలవుతాం. మనకు తెలుస్తుంటుంది. ఒక మంచి నవల చదివితే – అది ఒక యాత్ర! ఇది మరింత లోతుగా పరిశీలించితే… మన ప్రతి ప్రయాణం – ఒక అపురూపమైన యాత్ర. మనం తిరిగి దర్శించిన ప్రదేశాల ప్రత్యేకతను –

మనలోని మారుమూల కోణాలతో నింపుకుని మనం సంపూర్ణులయ్యేందుకు దోహదపడతాయి. మనం దర్శించిన వాటితో మన ఊహాపోహలను రంగరించి, ఒక నూతన సత్యాన్ని సృష్టించుకోవటమనేది ఒక అసాధారణ ప్రక్రియ! మనం బయట ప్రపంచంలో మనకు కనిపించే సత్యాలు – మనలో నుంచి – వెలికితీయగలగాలి. మన హృదయాలలోనే మనం బయట వెదికేవెన్నో వున్నాయి. సుందర నందన వనాలు, ఎల్లలులేని ఎడారులు, చీకటి కీకారణ్యాలు, మంచుకొండల అంచులు, అన్నీ మన మనసు మారుమూలల్లో దాగి వున్నాయి. అంటే – మనం ఎక్కడకు వెళ్లినా మనము, మన ఇంట్లో మనవాళ్లు, మనలోనే ఉంటారు కదా. అలాగే – మనం వెళ్లాలనుకున్న స్థల, ప్రదేశాలను మనతో మోసుకుపోవాలి – ఎన్నో ప్రముఖమైన సుదూర తీరాలు, మరెన్నో సువిశాల ప్రదేశాలు, తరచూ మన ప్రక్కన నిదురపోతున్న వ్యక్తిలోనే ఉండవచ్చు!

హృషీకేష్, బదరీనాథ్‌లో మంచులాంటి గంగలో స్నానం చేసి అక్కడ ఆలయ ప్రాంగణంలో నిద్రపోయే సాధువులను చూస్తే అదే అన్పించింది!

జాగృతి:

ఇప్పుడు ప్రయాణాలు, యాత్రలు, బాహిరికమూ, ఆంతరికమూ కూడా, మనల్ని చైతన్యంతో నింపేవిగా, జాగరూకుని చేసేవిగా ఉంటాయి! ఒక తెలియని విషయాన్ని తెలుసుకోవటంలో ఒక విజ్ఞత ఉంది. అది బుద్ధి కుశలతను పెంచుతుంది. దురభిమానాన్ని రూపుమాపుతుంది; హాస్యప్రియత్వాన్ని పెంచి పోషిస్తుంది.

జర్మనీలో 'నడివేసవి'లో ఒక మిట్టమధ్యాహ్నం నడి రోడ్‌లో నడుస్తూ గడగడ వణుకుతుంటే, 'ఇది సమ్మర్, ఎంజాయ్' అంటూ సలహా ఇచ్చాడు ఓ పెద్దాయన.

ముస్సోరీలో కారులో నుంచి కాలు కింద పెడితే – కసుక్కున కరిచింది చలి! "ఇవాళ చాలా తక్కువ, దిగండి" తొందర పెట్టాడు డ్రైవర్!

అంటే "Open eyes"తో ఉండాలి – అని, బౌద్ధబిక్షువులు ఎప్పుడూ తిరుగుతుంటారు – అంటే జాగరూకులై, ప్రపంచాన్ని దర్శిస్తూ, తమనితాము తెలుసుకుంటూ... గీతాచార్యుడు అన్నట్లు – మనిషి "ఎప్పుడూ జాగరూకుడై" వుండాలి!

మనం ముందు అనుకున్నట్లు 'ట్రావెల్' – ప్రేమలాంటిదే అయితే, దానికి కారణం మనల్ని నిద్రపోనివ్వకుండా, ఒక విచిత్ర మానసిక స్థితిలో ఉంచటమే! ఆ స్థితిలో మనం వింటాం, చూస్తాం, తెలిసిన విషయం అని దేనినీ అశ్రద్ధ చెయ్యం, ఉపేక్షించం! ఇంకా – మార్పుకు సిద్ధంగా ఉంటాం! అందుకనే – ఎన్నో యాత్రలు, మంచి ప్రేమకథల్లానే అలా సాగుతూనే వుంటాయి!

సత్యాసత్యాల నిరంతర సమ్మేళనం,
ఊహాపోహల అపూర్వ సంగమం,
మన జీవన యానం!

*



ఎందరో...

నా యీ ఎన్నో యాత్రలలో, నాకు ఆతిథ్యమిచ్చి, ఆదరించిన మిత్రులు, గూడె రమేష్‌గారు, డాక్టర్ ఇన్నయ్యగారు, డాక్టర్ నవీన్, శ్రీ హేమంత్, కోమలగారు, రాజు, కిమ్, వీరందరికీ ఎంతో ఎంతో ఋణపడి వున్నాను. మా అబ్బాయిలు అనీల్, అనుపమ్ నన్ను మినియాపోలిసి, పిట్స్‌బర్గ్, ఫిలడెల్ఫియా, న్యూ ఆర్లియన్స్, జాక్సన్, అలబామా ఎన్నో వందల మైళ్లు కార్లో తిప్పిన రమేష్‌గారు, శాన్ ఫ్రాన్సిస్కోలో ఓక్‌లాండ్‌లో – వాసిరెడ్డి రమేష్, విజయగార్ల ఆప్యాయత, జయలక్ష్మి గారి దోశెలు మరువలేనివి! చికాగోలో ప్రత్యేకంగా హోటల్ పెట్టి, బెంజ్‌కారు ఉంచి రోజూ రోడ్లన్నీ తిప్పిన శ్రీనివాస్ అమాయక ప్రేమ – ఎప్పుడూ నాతోనే ఉంటుంది!

అట్లాంటాలో నెలల తరబడి నాకు ఆతిథ్యమిచ్చిన శ్యామల, సాగర్, రమేష్‌గార్లు, శశిరెడ్డి ఆప్యాయత, లక్ష్మిగారి భోజనం మధురమైనవి. ప్రత్యేకంగా నాకోసం వెస్ట్ వర్జీనియా నుంచి మేరీలాండ్ వచ్చి నాతో ఒక పూట గడిపిన డా. రావెళ్ల రమేష్ ప్రసాద్ గారు, లూయీ వెల్లిలో డాక్టర్ ఖాన్‌గారు, అగస్టాలో మోహన్ దంపతులు, న్యూజెర్సీలో అట్లూరి రాఘవేంద్రరావు, సీతగార్లు, లక్ష్మి, రామారావుగార్ల ఆదరణ ఇంకా ఎందరో, ఎందరో, అందరికీ కృతజ్ఞతాభి వందనాలు!

నన్ను ఐరోపా అంతా తన ప్రక్కన కూర్చోపెట్టుకుని రూట్ మాప్ ఇచ్చి, "హే, కొమర్ ' నాకు దారి చూపించు" అని బెంజి బస్‌లో ఎన్నో అద్భుతమైన నగరాలు చూపించిన 'లుక్' ఆప్యాయత, మరచిపోలేనిది (ఈయన ఇంగ్లీషు పాఠాలు చెప్పే బెల్జియం దేశస్థుడు. దేశాలు చూడాలని బస్‌డ్రైవర్‌గా మారాడు! మత్స్యకారుల కుటుంబం!).

షాంగైలో హోటల్ హైయత్ రిసెప్షన్‌లో మిస్టర్ సాంగ్ సహాయం ఎంతో విలువైనది – బీజింగ్‌లో గ్రీన్ ట్రీ హోటల్ మేనేజర్ వారం రోజులూ చేసిన సేవ జీవితాంతం నిలిచిపోయేది. రకరకాల టీలు రుచి చూపించిన లతాంగిని ఎలా మరచిపోతాను?

'చైనా వెళ్దాం' అనగానే మారుమాటాడకుండా నాకు అండగానిలిచి నాతో కష్టాలన్నీ భరించి, మధురమైన మరపురాని 15 దివారాత్రులు నాతో నడిచి,

బుల్లెట్ ట్రెయినెక్కి చైనా గోడ చేరటానికి శ్రమించి, 'మనం చరిత్రలో మిగిలిపోతాం' అని సంతోషించి, ఏ విషయంలోనూ నాతో విభేదించని నాగ్ (కాంద్రేగుల) సహకారాన్ని ఏ విధంగా ప్రశంసించాలి – ఈ రోజు ఆయన భౌతికంగా లేకపోయినా నాకు నిత్యమూ కనిపిస్తూ తోడున్నట్లే ఉంటుంది.

ఇక ప్రస్తుతానికి వస్తే ఈ పుస్తకం రూపుదాల్చటానికి శ్రమించిన ఆశారాణి, అక్షరదోషాలను ఏరిపారేసిన కరుణ, బావగారూ బాగున్నారా అంటూ నోరారా పలుకరించే కృపాకరుడు, ముఖచిత్రాన్ని మలిచి నా విసుగును భరించిన షాన్ జీ, సంవత్సరం క్రిందట అమెరికా – లండన్, రష్యా, షెంజెన్ వీసాలకు సమయం, సొమ్ము తగలేసుకున్న – నాతోపాటు – అందెశ్రీ పిచ్చికి – వందనాలు సమర్పించాలి.

నన్నెప్పుడూ ప్రోత్సహించే మిత్రులు శ్రీ ఆంజనేయరెడ్డి, శ్రీ బాపన్నగార్లకు పుష్పాంజలులు.

– అశ్వినీకుమార్



అశ్వినీకుమార్

సమర్పణ

పెట్టె సర్ది – బొట్టుపెట్టి,

'క్షేమంగా వెళ్లిరా!' అని మాత్రమే అనే నా అర్ధాంగి జయంతి, నా ప్రయాణ ప్రయాసలన్నీ ఆమెకే. బహుమతులు ఏమి తెచ్చానో – ఆమె ఏమి తీసుకుందో!

ఈ పుస్తక పుటలు గులాబి రేకుల్లా ఆమె శిరస్సునలంకరించాలి.

స్నేహానికి కోటీశ్వరుడు – శ్రీ నర్రా కోటయ్య – 31వ పుస్తకంగా దీనిని గుర్తుపెట్టుకొని చేయూతనిచ్చారు – శ్రీ కోడూరు పుల్లారెడ్డి – ఈయన మనసంతా తీయని తేనె – 'ఇదిగో! ఎన్ని తిప్పలు పడుతున్నావో తెలుసు' అని వేలందించిన బహుభాషా కోవిదుడు – నా స్నేహితుడు కె.పి.ఆర్.కి కైమోడ్పులు.

ఎందుకో – ఎప్పుడో ఈ దూరతీరాలలో చదివి, రచనతోపాటు రచయిత మనస్సును పట్టుకోగలిగిన డా. భాగవతుల హేమలత ప్రశంసాపత్రం ఈ పుస్తకానికి శిరోలంకారం.

నన్ను ఎల్లప్పుడూ గారవించే ప్రొ. వెంకటేష్, ప్రొ. పార్థసారథి, ప్రొ. సత్యనారాయణ – వారి ప్రశిష్యులు సాందీప – ఎందరో మహానుభావులు – అందరికీ వందనాలు.

ఈ పుస్తక పుష్పాన్ని వారి కరపద్మాలలో భక్తిశ్రద్ధలతో సమర్పించాలి.



"పరుగెత్తే కాలాన్ని ఆపాలని, తిరిగి తిరిగి చిలిపి చిన్నారులవ్వాలని,
మననుంచి మనం దూరమై తర్వాత మెలమెల్లగా మనమేమిటో
తెలుసుకోవాలని, ప్రతి క్షణాన్ని ఆనందించాలని, ప్రదేశాల
ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతాం!..."

"....గమ్యంలేని సువిశాల అనంత ఏకాంతంలోనికి,
ఏ బంధాలు లేని ఆటవిడుపు మైదానంలోనికి పరుగులెత్తి,
ఉరకలెత్తి అలసిపోవాలని ఆరాటపడతాం !
ఎక్కడికి, ఎందుకీ ప్రయాణం?...."



TRAVEL AROUND

I haven't been everywhere.
but it's on my list.

My favorite thing is to go where I've never been

Travel while you're young and able.
Don't worry about money.
Just make it work.
Once a year, go someplace you've never been before.



